అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శనివారం 05-04-2025

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 11 | సంచిక : 94 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50



సమగ్ర విద్యావిధానం

రూపొందించండి

క్షేత్రస్థాయి పరిస్థితులకు అద్దంపట్టేలా ఉండాలి

ఎంత వ్యయమైనా వెనుకాడం

జీవన నైపుణ్యాలను పెంపొందించాలి

భాష, విషయ పరిజ్ఞానం రెండూ ప్రధానమే : విద్యా కమిషన్ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మెరుగైన విద్యా వ్యవస్థ రూపకల్పనకు సమగ్ర విధాన పత్రాన్ని రూపొందించాలని విద్యాకమిషన్‌ను ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఉత్తమ విద్యా వ్యవస్థ ఏర్పాటుకు ఎంత వ్యయమైనా వెనుకాడబోమని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి పరిస్థితులకు అద్దం పట్టేలా విధానపత్రం ఉండాలనీ, అదే సమయంలో అది ఆచరణకు దూరంగా ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ప్రస్తుత విద్యా వ్యవస్థలో లోపాలు తీసుకురావల్సిన సంస్కరణలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నదని చెప్పారు. ఉపాధ్యాయుల నియామకం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు, పుస్తకాలు, యూనిఫారాల పంపిణీతోపాటు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ళు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీల నిర్మాణం గురించి వివరించారు. ప్రాథమిక దశలో అందే విద్యతోనే పునాది బలపడుతుందని అన్నారు. ప్రాథమిక విద్యను బలోపేతం చేస్తే ఉన్నత చదువుల్లో... 13లో



సమానత్వమే..

డీలిమిటేషన్‌పై సీపీఐ(ఎం) డిమాండ్

న్యాయ సమ్మతం



'ఒకే దేశం ఒకే ఎన్నిక' ప్రజాస్వామ్య విరుద్ధం

ఎన్నికల కమిషన్ స్వతంత్రతను కాపాడాలి

జనగణనతో పాటే కులగణన జరగాలి

కేరళ వామపక్ష ప్రభుత్వానికి అండగా నిలవాలి : తీర్మానాలను మీడియాకు వివరించిన సలీం

నియోజకవర్గాల పునర్విభజన (డీ లిమిటేషన్) ప్రక్రియ సమానత్వ ప్రాతిపదికన న్యాయసమ్మతంగా (ఈక్విటబుల్ అండ్ జస్ట్) ఉండాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. ఈ మేరకు సీతారాంఏచూరి నగర్ (మదురై)లో జరుగుతున్న ఆ పార్టీ 24వ అఖిల భారత మహాసభలో తీర్మానం చేసింది. ఫెడరల్ వ్యవస్థ సూత్రాలను కచ్చితంగా పాటిస్తూ, దేశభక్తి, ఐక్యత, సమగ్రతను నిలబట్టే విధంగా ఆ ప్రక్రియ సాగాలని మహాసభ తీర్మానాలను మీడియాకు వివరించిన సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం.డీ సలీమ్ అన్నారు. దీనితో పాటు రాజకీయ తీర్మాన ముసాయిదాపై మహాసభలో చర్చలు జరుగుతున్న తీరును ఆయన వివరించారు. ప్రత్యామ్నాయ విధానాలను అమలు చేస్తూ, అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న కేరళలోని వామపక్ష ప్రజాతంత్ర ప్రభుత్వంపై కేంద్ర బీజేపీ ప్రభుత్వం చేస్తున్న దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. మహాసభ మూడవ రోజైన శుక్రవారం ఐదు తీర్మానాలను చర్చించి ఆమోదించినట్టు ఆయన చెప్పారు. ఆ తీర్మానాల్లోని అంశాలను వివరించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన జవాబిచ్చారు.

సీతారాంఏచూరి నగర్ (మదురై)నుంచి నవతెలంగాణ ప్రతినిధి

'పార్లమెంట్‌లో ఏ రాష్ట్రానికైనా ప్రాతినిధ్యం తగ్గించే విధంగా జరిపే పునర్విభజన ప్రక్రియను సీపీఐ(ఎం) తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. కీలకమైన విషయంలో రాజకీయ పార్టీలతో , రాష్ట్ర ప్రభుత్వంతో విస్తృతంగా సంప్రదింపులు జరపాలి. డీలిమిటేషన్ విధానమూ అనుచితంగా ఉండకూడదు. జనాభా నియంత్రణ విజయవం తంగా అమలు చేసిన రాష్ట్రాల ప్రయోజనాలను తప్పకుండా రక్షించాలి. పార్లమెంటు ప్రాతినిధ్యాన్ని విస్తరించేందుకు సీట్ల సంఖ్యను నిష్పత్తి ప్రకారం పెంచాలి. అయితే, రాష్ట్రాల మధ్య ప్రస్తుత ప్రాతినిధ్య నిష్పత్తి యథాతథంగా ఉండేలా చూడాలి.' అని సీపీఐ(ఎం) డిమాండ్ చేసినట్టు సలీం చెప్పారు. రాష్ట్రాల్లో ఉన్న వివిధ వర్గాల స్థానాల నిష్పత్తులను కచ్చితంగా పాటించాలని, అన్ని రాష్ట్రాలతో సమగ్రంగా సంప్రదింపులు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఏకాభిప్రాయం రానిపక్షంలో స్థానాల పెంపుదలపై ప్రస్తుతం ఉన్న పరిమితిని కొనసాగించాలని తద్వారా ఫెడరల్ సూత్రాలకు భంగం కలగకుండా చూడాలని అన్నారు. 'భారతదేశంలో గతంలో 1952, 1963, 1973 సంవత్సరాల్లో డీ లిమిటేషన్ ప్రక్రియలు జరిగాయి. అయితే, 1976 స్థిరీకరణ తరువాత, జనాభా ఆధారంగా ప్రాతినిధ్య పంపిణీపై వ్యతిరేకతల కారణంగా తదుపరి మార్పులు వాయిదా పడ్డాయి. 2001 జనగణన తరువాత కూడా ఈ స్థితి కొనసాగింది, ముఖ్యంగా దక్షిణ రాష్ట్రాలు తాము చక్కగా జనాభా నియంత్రణ చర్యలు చేపట్టినందున ప్రాతినిధ్యం తగ్గిపోతుం దనే భయంతో తీవ్రంగా వ్యతిరేకించాయి.' అని... 13లో

గాజాపై మారణహోమాన్ని

ఆపాలి

3లో..

శాశ్వత కాల్పుల విరమణకు సీపీఐ(ఎం) డిమాండ్

వక్ఫ్ సవరణ చట్టం ఆమోదాన్ని

ఖండించండి

ఉపసంహరణకు డిమాండ్ చేయండి : సీపీఐ(ఎం) అఖిలభారత మహాసభ పిలుపు 3లో..

సాంస్కృతిక కార్యక్రమాలు

అదరహో...

ముఖ్య అతిథులుగా విచ్చేసిన సినీ దర్శకులు సముద్రఖని, వెట్రిమారన్ 14లో.

కంచ గచ్చిబౌలి భూములపై

వివాదరహిత నివేదిక

డిప్యూటీ సీఎం భట్టితో సీఎస్ భేటీ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి శుక్రవారం భేటీ అయ్యారు. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల్లో ప్రభుత్వం చేపట్టిన చెట్ల తొలగింపు పనులతో పాటు ఆ భూమిలో చెట్ల సంరక్షణ మినహా అన్నిరకాల కార్యకలాపాలను తక్షణం నిలిపేయాలని సుప్రీంకోర్టు గురువారం ఆదేశించిన సంగతి తెలిసిందే. మూడు రోజుల్లోనే 100 ఎకరాల్లో చెట్లను కొట్టేయడంపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈనెల 16 లోపు పూర్తి నివేదిక ఇవ్వాలని సీఎస్‌ను సుప్రీం కోరిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే సీఎస్ భట్టితో భేటీ... 13లో

పార్లమెంట్ ఆవరణలో

ప్రతిపక్షాల నిరసన

వక్ఫ్ సవరణ చట్టం..

ట్రంప్ టారిఫ్‌లపై ఆందోళన

ముగిసిన బడ్జెట్ సమావేశాలు

ఉభయ సభల్లో 16 బిల్లులు ఆమోదం



2లో..



అన్నదాతకు అండగా ఉంటాం

నష్టపోయిన పంట పొలాలను పరిశీలించిన మంత్రి సీతక్క

తడిసిన ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

నష్టాన్ని అంచనా వేసి నివేదిక అందించాలని అధికారులకు ఆదేశం

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు ఫోన్ చేసి నష్టం గురించి వివరణ

నవతెలంగాణ -ములుగు/గోవిందరావుపేట

ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని అమృతండా, లక్ష్మీపూర్, కర్లపల్లి, చంద్రుతండా గ్రామాల్లో కురిసిన అకాల వడగండ్ల వర్షం వల్ల నష్టపోయిన పంట పొలాలను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాలడుగు వెంకటకృష్ణతో కలిసి ... 13లో

రాజాసింగ్ వైల్డ్‌ఫైర్

టేబుల్ తూడ్చేటోళ్లకూ పదవులా? అంటూ ఆగ్రహం

మేకప్‌మెన్ అంటూ కిషన్‌రెడ్డిపై ఇన్‌డైరెక్ట్ అటాక్

మీ అయ్యలొచ్చినా నా శోభాయాత్రను అడ్డుకోలేరంటూ వ్యాఖ్యలు

సీనియర్ నేతలే దొరకలేదా?

గౌతంరావుకు ఎమ్మెల్సీ సీటివ్వడంపై అభ్యంతరం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీ అసంతృప్త ఎమ్మెల్యే రాజాసింగ్ ఆ పార్టీ రాష్ట్ర అగ్ర నేతల తీరుపై వైల్డ్ ఫైర్ అయ్యారు. "వెళ్లిపొమ్మంటే వెళ్లిపోతాం..బలమేంటో చూపిస్తాం.. పార్టీ అధ్యక్షులు రబ్బర్ స్టాంపులు.. బీజేపీ బీసీ ద్రోహి పార్టీగా, రెడ్ల పార్టీగా మారింది.." అంటూ ఇటీవల కాలంలో వరుసగా బాంబుల్లా మాటల తూటాల్ని పేల్చుతున్న రాజాసింగ్ తాజాగా కిషన్‌రెడ్డిపై ఇన్‌డైరెక్ట్‌గా ఎటాక్ చేశారు. హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా గౌతంరావును ప్రకటించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 'మీకు గులాంగిరి చేసేటోళ్లకు పోస్టులు, టికెట్లు. మిగతావాళ్లు మీ గులాంగిరి చేయరు కదా? అందుకోసం వాళ్లను పక్కనపెడుతున్నారు. అన్ని పోస్టులు మీ పార్లమెంట్ మెంబర్స్‌కే ఇస్తే మిగతా పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని కార్యకర్తలు, సీనియర్లు కనబడట్లేదా?' అంటూ ఒకింత ఆగ్రహం వ్యక్తం చేస్తూనే ప్రశ్నలవర్షం కురిపించారు. 'ఆ బీజేపీలో ఉన్న పెద్ద అధికారి మేకప్‌మెన్ ఆఫీస్ టేబుల్ ఎవరు సాఫ్ చేస్తే వాళ్లకి పెద్ద పెద్ద పోస్టులు..పెద్దపెద్ద టికెట్లు' అంటూ కిషన్‌రెడ్డినుద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు మీడియా ప్రతినిధులకు వ్యాట్సాప్ ద్వారా సందేశం పంపారు. 'పార్టీలో నీ మనిషి..నా మనిషి అని ఇంకా ఎన్ని సంవత్సరాలు ఈ తమాషా' అని నిలదీశారు. హైదరాబాద్ స్థానిక సంస్థల అభ్యర్థిగా పోటీ చేసేందుకు పార్టీలో సీనియర్ నేతలే లేరా? గౌతంరావుకు టికెట్ ఇవ్వాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. పార్టీలో గౌతంరావు అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసే విషయంపై తనతోపాటు సీనియర్ నేతలను సంప్రదించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలో సీనియర్లకు తగిన గౌరవం దక్కట్లేదని ఎత్తిచూపారు. 'శ్రీరామ నవమి శోభాయాత్ర నేనెందుకు తీస్తా? తెలుసా? అందరి హిందువులు ఒకటి కావాలి. రామరాజ్యం కావాలి అనే ఉద్దేశంతో తెలంగాణలో నేను శ్రీరామనవమి శోభాయత్రను ఎన్ని కేసులు ... 6లో


ముగిసిన ఎమ్మెల్సీ

నామినేషన్ ప్రక్రియ

హైదరాబాద్ ఎమ్మెల్సీ స్థానానికి

బీజేపీ, ఎంఐఎం అభ్యర్థుల నామినేషన్లు

పోటీకి కాంగ్రెస్, బీఆర్ఎస్ దూరం



వివరాలు 13లో..

తగ్గేదేలే...!

అమెరికాతో చైనా ఢీ అంటే ఢీ

34 శాతం టారిఫ్‌లు విధింపు

ఏకపక్ష బెదిరింపులపై ఆగ్రహం



బీజింగ్ : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధిస్తున్న టారిఫ్‌లతో ప్రపంచ దేశాలు వణికిపోతుంటే.. చైనా మాత్రం అంతే స్థాయి టారీఫ్‌లతో యుఎస్‌కు సవాల్ విసిరింది. అమెరికాపై బదులుగా టారిఫ్‌లు విధించడానికి అనేక దేశాలు భయపడుతోన్న వేళ చైనా మాత్రం ధీటైన నిర్ణయం తీసుకుని.. ట్రంప్‌నకు ప్రతి సవాల్‌ను విసిరింది. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై 34 శాతం టారిఫ్‌లను విధిస్తున్నట్లు చైనా శుక్రవారం ప్రకటించింది. అన్ని వస్తువులపై ఈ సుంకాలు వర్తిస్తాయని ది స్టేట్ కౌన్సిల్ ఆఫ్ టారిఫ్ కమిషన్ చైనా స్పష్టం చేసింది. టారిఫ్‌లు విధిస్తూనే మరోవైపు ఘాటైన సవాల్, హెచ్చరికలను జారీ చేసింది. "చైనాలోని టారిఫ్ చట్టం, కస్టమ్స్ చట్టం, విదేశీ వ్యాపార చట్టం, అంతర్జాతీయ వాణిజ్య నిబంధనల ప్రకారం స్టేట్ కౌన్సిల్ ఆమోదంతో అమెరికా నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై ఏప్రిల్ 10 నుంచి అదనపు సుంకాలు విధిస్తున్నాం" అని ది స్టేట్ కౌన్సిల్ ఆఫ్ టారిఫ్ కమిషన్ వెల్లడించింది. అమెరికాపై సుంకాలు విధించడాన్ని చైనా సమర్థించుకుంది. ప్రస్తుతం ప్రపంచ పెద్దన్నగా ఉన్న అమెరికా అనుసరిస్తున్న ఈ విధానం అంతర్జాతీయ వాణిజ్య నియమాలకు అనుగుణంగా లేదని ఆందోళన వ్యక్తం చేసింది. ట్రంప్ చర్యలు తమ దేశ చట్టబద్ధమైన హక్కులు, ప్రయోజనాలను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని విమర్శించింది. అమెరికా అవలంభిస్తున్న ఏకపక్ష బెదిరింపు పద్ధతిని చైనా సహించబోదని స్పష్టం చేసింది. అమెరికా ఏకపక్షంగా ఆర్థిక బెదిరింపులకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రస్తుతం అమెరికా నుంచి దిగుమతులపై ఉన్న పన్నులకు అదనంగా ఈ టారిఫ్‌లు కూడా విధించనుంది. ఇప్పటికే అమల్లో ఉన్న పన్ను, ఇతర మినహాయింపు పాలసీలు కూడా కొనసాగనున్నాయి. మార్గం మధ్యలో ఉన్న సరకులు మే 13లోపు చేరుకొంటే.. వాటికి మాత్రం మినహాయింపు లభించనుందని తెలిపింది. తాజా ప్రతీకార చర్యల్లో చైనా అమెరికాకు చెందిన 11 డ్రోన్ తయారీ సంస్థల పేర్లను నమ్మదగని జాబితాలోకి చేర్చింది. అలాగే 16 అమెరికా కంపెనీలపై ఎగుమతి నియంత్రణలను ప్రకటించింది. ట్రంప్ 34 శాతం అదనపు సుంకాలను విధించడంపై చైనా ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. తాము తగిన విధంగా ప్రతిస్పందిస్తామని హెచ్చరించింది. చైనా నుంచి అమెరికాకు ప్రతీ ఏడాది సుమారు 438 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.37 లక్షల కోట్లు) వస్తువులు ఎగుమతి అవుతుంటాయి. అమెరికా నుంచి చైనా దిగుమతి చేసుకొనే వస్తువుల విలువ 143.5 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.12 లక్షల కోట్లు)గా ఉంది. 2024లో అమెరికా-చైనాల ద్వైపాక్షిక వాణిజ్యం విలువ 582.4 బిలియన్ డాలర్లుగా ఉంది."చైనా సహా పలు దేశాలపై అమెరికా పరస్పర సుంకాలను విధించింది. ఇది ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు పూర్తిగా విరుద్ధం. నిబంధనల ఆధారంగా పనిచేసే బహుళపక్ష వాణిజ్య వ్యవస్థను పట్టించుకోలేదు. మా ప్రయోజనాలను రక్షించుకొనేందుకు స్పందించే హక్కు మాకుంది" అని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి పేర్కొన్నారు. ఇప్పటికే టారిఫ్‌లపై అమెరికాతో తమ అధికారులు చర్చలు జరుపుతున్నారని చైనా తెలిపింది. ఇది ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలకు దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ప్రభావం అమెరికా ప్రజల జీవితాలను అతలాకుతలం చేస్తుందని అభిప్రాయపడుతున్నారు.

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్‌గా

సీతా దయాకర్‌రెడ్డి

మరో ఆరుగురికి చోటు



నవతెలంగాణబ్యూరో -హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్‌గా సీతాదయాకర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సభ్యులుగా కంచర్ల వందనగౌడ్, బి. అపర్ణ, మర్రిపల్లి చందన, గోగుల సరిత, ప్రేమలతా అగర్వాల్, బి.వచన్‌కుమార్ ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా సీతా దయాకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు.

అమెరికా వాహనాలపై 25శాతం సుంకాలు

కెనడా నిర్ణయం



ఒట్టావా : అమెరికాపై తాము కూడా 25శాతం పరస్పర సుంకాలు విధిస్తున్నామని కెనడా ప్రధాని మార్క్ కార్నే ప్రకటించారు. కెనడా-అమెరికా-మెక్సికో ఒప్పందం (సీయూఎస్ఎంఎ) పరిధిలోకి రాని, అమెరికా నుంచి దిగుమతయ్యే అన్ని వాహనాలపై ఈ సుంకాలు వుంటాయని తెలిపారు. దీనివల్ల మెక్సికో ప్రభావితం కాదన్నారు.

రెండో రోజూ యూఎస్ మార్కెట్లు కుదేలు

ప్రారంభంలోనే మూడు శాతం పతనం

వాషింగ్టన్ : ట్రంప్ వాణిజ్య నిర్ణయాలు అమెరికా మార్కెట్లకు ప్రతికూలంగా మారాయి. వరుసగా రెండో రోజూ అక్కడి స్టాక్స్ కుప్పకూలాయి. శుక్రవారం ప్రారంభంలోనే అమ్మకాల వెల్లువ చోటు చేసుకుంది. డోజోన్స్ 1,061 పాయింట్లు లేదా 2.62 శాతం నష్టంతో 39,484.65 పతనాన్ని చవి చూడగా.. ఎస్అండ్‌పీ 500 సూచీ 163.84 పాయింట్లు లేదా 3.04 శాతం క్షీణతతో 5,232.75 వద్ద నమోదయ్యింది. అదే బాటలో నాస్‌డాక్ 563.20 పాయింట్లు లేదా 3.40 శాతం నష్టంతో 15,987.41 ట్రేడింగ్ అయ్యింది.

మార్కెట్లకు సుంకాల సెగ

సెన్సెక్స్ 900 పాయింట్ల పతనం

రూ.9.5 లక్షల కోట్ల సంపద ఆవిరి

ఫార్మా షేర్లపైనా పిడుగు 13లో.

పెండింగ్ బిల్లులు చెల్లించండి

- డిప్యూటీ సీఎం భట్టికి ఉద్యోగ సంఘాల నేతల వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు జేఏసీ చైర్మెన్ వి.లచ్చిరెడ్డి నేతృత్వంలోని బృందం శుక్రవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందించింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను వారు భట్టికి వివరించారు. జేఏసీ వినతిపై సానుకూలంగా స్పందించిన డిప్యూటీ సీఎం ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామనీ, త్వరలోనే పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేస్తామని హామీనిచ్చారు. భట్టిని కలిసిన వారిలో డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ కె.రామకృష్ణ, టీజీటీఏ రాష్ట్ర అధ్యక్షులు రాములు, ప్రధాన కార్యదర్శి రమేష్ పాక తదితరులు ఉన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- పీడీకి టీజీశాక్స్ జేఏసీ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ (టీజీశాక్స్) ఎంప్లాయీస్ జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం జేఏసీ నాయకులు ఆర్.సుజిత్ గాంధీ, టి.శివప్రసాద్, బి,రమణారెడ్డి టీజీశాక్స్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. చట్టబద్ధమైన ఈఎస్ఐ, ఈపీఎఫ్, హెచ్ఆర్ పాలసీ వంటి బెనిఫిట్స్ లేకుండా గత 25 సంవత్సరాలుగా అంకితభావంతో హెచ్ఐవీ, ఎయిడ్స్ రోగులకు ఉద్యోగులు సేవలందించారని గుర్తుచేశారు. అలాంటి ఉద్యోగులకు నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (నాకో) నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగులకు కాంట్రాక్టు సర్వీస్ అగ్రిమెంట్ బాండ్స్ పేరుతో ఏడాదిలో ఒక రోజుకు బదులుగా రెండు రోజులు విరామం ఇవ్వడం సరికాదని సూచించారు. మారుమూల ప్రాంతాల్లో సేవలందిస్తున్న ఉద్యోగులకు 2025 ఏప్రిల్ 2 నుంచి 2026 మార్చి 30 వరకు రెన్యూవల్ చేయడం నాకో నిబంధనలకు విరుద్ధమని తెలిపారు. నాకో నిబంధనల మేరకు 2026 మార్చి 31 వరకు ఇవ్వాలని కోరారు. టీజీశాక్స్ చరిత్రలో ఎప్పుడు లేని విధంగా మార్చి నెలలో ఒక రోజు జీతాన్ని కోత విధించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు.

25 సంవత్సరాల సర్వీసును కాలరాస్తూ ఏప్రిల్ 2న కొత్తగా జాయిన్ అయినట్టుగా అపాయింట్ మెంట్ లెటర్లు ఇస్తూ, అధికారులకు ఇష్టమైన షరతులు పెట్టి బాండ్లు ఇవ్వాలని ఉద్యోగులపై తీవ్రస్థాయిలో ఒత్తిడిని తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల పనితనం వల్లే దేశంలో 31వ స్థానం నుంచి 17 స్థానానికి వచ్చిందని గుర్తుచేశారు. ఈ విషయాలన్ని సీఎంకు, వైద్యారోగ్యశాఖ మంత్రి, ప్రిన్సిపల్ సెక్రెటరీ పరిధిలో ఉన్నందున దీనిపై ఒత్తిడి తేవొద్దని కోరారు. కొత్త సర్వీస్ అగ్రిమెంట్ బాండ్లను ఉపసంహరించుకోవాలనీ, పాత బాండ్లను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ఆ బాండ్లలో పాత జాయినింగ్ తేదీని పేర్కొనాలని సూచించారు. కోత విధించిన ఒక రోజు జీతాన్ని వెంటనే చెల్లించాలని పేర్కొన్నారు.

సెక్యూరిటీ గార్డులకు వేతనాలొచ్చాయ్..

- నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ పంజాగుట్ట నిమ్స్ హాస్పిటల్‌లో పని చేస్తున్న సెక్యూరిటీ గార్డులకు ఎట్టకేలకు వేతనాలు వచ్చాయి. రెండ్రోజుల కిందట ఓపీడీఎస్-ఎస్ ఏజెన్సీతో చర్చలు పరిపిన నిమ్స్ యాజమాన్యం.. వేతనాలు వచ్చేలా కృషి చేసింది. ఈనెల 2న 'సెక్యూరిటీ గార్డుల వేతన వెతలు' అనే శీర్షికతో 'నవతెలంగాణ' దినపత్రికలో కథనం ప్రచురితమైంది. స్పందించిన నిమ్స్ యాజమాన్యం సంబంధిత ఏజెన్సీతో మాట్లాడి వేతనాలు మంజూరయ్యేలా చేసింది. మూడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని గత నెలలో సెక్యూరిటీ గార్డులు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆస్పత్రి ప్రాంగణంలో నిరసన తెలిపిన విషయం తెలిసిందే.

పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్షాల నిరసన

వక్ఫ్ సవరణ చట్టం ..ట్రంప్ టారిఫ్‌లపై ఆందోళన

ముగిసిన బడ్జెట్ సమావేశాలు

ఉభయ సభల్లో 16 బిల్లులు ఆమోదం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల చివరిరోజున ప్రతిపక్షాలు ఆవరణలో నిరసనలు తెలిపారు.వక్ఫ్ సవరణ చట్టం ..ట్రంప్ టారిఫ్‌లపై మోడీ సర్కార్ పెదవి విప్పకపోవటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభను నిరవధికంగా వాయిదా వేసినట్టు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించటంతో. సమావేశాలు ముగిశాయి. జనవరి 31 నుంచి శుక్రవారం వరకు జరిగిన సమావేశాల్లో వక్ఫ్(సవరణ) బిల్లు-2025తో మొత్తం 16 బిల్లులను ఆమోదించినట్టు తెలిపారు. లోక్‌సభలో 10 బిల్లులు ప్రవేశపెట్టారు. శుక్రవారం ఉదయం సభ ప్రారంభమైన వెంటనే ప్రజాస్వామ్యంపై సోనియా చేసిన వ్యాఖ్యలకు గానూ క్షమాపణ చెప్పాలని అధికారపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు.

గందరగోళ పరిస్థితులు తలెత్తిన నేపథ్యంలో తొలుత సభను 12 గంటల వరకు వాయిదా వేశారు. అనంతరం తిరిగి ప్రారంభమైన వెంటనే స్పీకర్ ఓం బిర్లా బడ్జెట్ సమావేశాల ముగింపు ప్రసంగాన్ని చదివి వినిపించారు. సభను నిరవధికంగా వాయిదా వేసినట్టు చెప్పారు. ఈ సమావేశాల్లో సభ ఉత్పాదకత 118 శాతం కంటే ఎక్కువగా ఉందన్నారు. స్పీకర్ ప్రసంగ సమయంలోనూ ప్రతిపక్షనేతలు ఆందోళన కొనసాగించారు.

ప్రతిపక్షనేత రాహుల్ గాంధీని సభలో మాట్లాడనివ్వకుండా వివక్ష చూపించారంటూ నినాదాలు చేశారు. ఎలాంటి చర్చ చేపట్టకుండానే బలవంతంగా వక్ఫ్ బిల్లుకు ఆమోదం తెలిపారని విమర్శించారు. వివిధ శాఖలకు సంబంధించిన గ్రాంట్లు, ఆర్థిక బిల్లుకు కూడా లోక్‌సభ ఆమోదం తెలిపిన నేపథ్యంలో బడ్జెట్ ప్రక్రియ ముగిసినట్టు సభాపతి ప్రకటించారు. మరోవైపు రాష్ట్రపతి పాలనలో ఉన్న మణిపూర్ రాష్ట్రానికి సంబంధించిన బడ్జెట్ కూడా క్లియర్ అయినట్టు తెలిపారు.

రాజ్యసభలో 119శాతం ఉత్పాదకత

లోక్‌సభ వాయిదా పడిన కొద్దిసేపటికే రాజ్యసభను కూడా నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు చైర్మెన్ జగదీప్ ధన్కర్ ప్రకటించారు. వక్ఫ్ (సవరణ) బిల్లుతో పాటు పలు కీలకాంశాలపై చర్చించినట్టు ఆయన తెలిపారు. సభ ఉత్పాదకత 119 శాతంగా ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు. 49 ప్రయివేట్ మెంబర్స్ బిల్లులను ప్రవేశపెట్టారు. ఏప్రిల్ 3న (గురువారం) ఉదయం 11గంటల నుంచి వేకువజామున 4.02 వరకు సభను నిర్వహించామని, రాజ్యసభ చరిత్రలోనే ఇంత సుదీర్ఘ సమయం సభనడవడం ఇదే తొలిసారి అని ఆయన అన్నారు. ఇది దేశ ప్రజలకు గొప్ప సందేశాన్ని పంచుతుందన్న ఆయన.. పార్లమెంట్‌పై ప్రజలకు నమ్మకాన్ని పెంచుతుందని చెప్పారు.

ఆమోదం పొందిన బిల్లులు

1. రైల్వేస్ (సవరణ) బిల్లు
2. చమురు క్షేత్రాల (నియంత్రణ అండ్ అభివృద్ధి) సవరణ బిల్లు
3. అప్రోప్రియేషన్ (నెంబర్ 2) బిల్లు
4. అప్రోప్రియేషన్ బిల్లు
5. మణిపూర్ కేటాయింపు (ఓటుపై ఖాతా) బిల్లు
6. మణిపూర్ కేటాయింపు బిల్లు
7. విపత్తు నిర్వహణ (సవరణ) బిల్లు
8. బాయిలర్స్ బిల్లు
9. బ్యాంకింగ్ చట్టాలు (సవరణ) బిల్లు
10. అప్రోప్రియేషన్ బిల్లు (నెంబర్ 3)
11. ఆర్థిక బిల్లు
12. "త్రిభువన్" సహకారి విశ్వవిద్యాలయ బిల్లు
13. ఇమ్మిగ్రేషన్ అండ్ విదేశీయుల బిల్లు
14. వక్ఫ్ (సవరణ) బిల్లు
15. ముస్సల్మాన్ వక్ఫ్ (రద్దు) బిల్లు
16. విమాన వస్తువులపై ప్రయోజనాల రక్షణ బిల్లు

ఎప్‌సెట్‌కు 2.91 లక్షల దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ (ఎంసెట్)కు 2,91,965 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. ఈ మేరకు ఎప్‌సెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్, కో కన్వీనర్ విజయ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంజినీరింగ్ విభాగానికి 2,10,567 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 81,172 మంది, రెండింటికీ 226 మంది కలిపి మొత్తం 2,91,965 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని వివరించారు. ఆలస్య రుసుం లేకుండా దరఖాస్తుల సమర్పణ గడువు ముగిసిందని తెలిపారు. ఆలస్య రుసుంతో ఈనెల 24 వరకు దరఖాస్తులను సమర్పించొచ్చని సూచిం చారు. ఈనెల 29 నుంచి వచ్చేనెల ఐదో తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఎప్‌సెట్ రాత పరీక్షలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈనెల 29,30 తేదీల్లో ఎప్‌సెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం పరీక్షలు, వచ్చేనెల రెండు నుంచి ఐదో తేదీ వరకు ఇంజినీరింగ్ విభాగం పరీక్షలు జరుగుతాయని వివరించారు. ఇతర వివరాల కోసం https://eapcet.tgche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి పెరుగనున్న ఎండలు

మూడు డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం

శుక్రవారం రాత్రి 10 గంటల వరకు 36 ప్రాంతాల్లో వర్షం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఎండలు శనివారం నుంచి క్రమంగా పెరిగే అవకాశముంది. రాష్ట్రంలో వచ్చే మూడు రోజుల పాటు పొడివాతావరణం ఏర్పడే సూచనలున్నాయనీ, పగటిపూట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీల మేర అధికంగా నమోదయ్యే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న ప్రకటించారు. శని, ఆది వారాల్లో ఆదిలాబాద్, కొమ్రంభీమ్, మహబూబ్‌నగర్, జగిత్యాల, కరీంనగర్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్నసిరిసిల్ల జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల నుంచి 44 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశముంది. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు రాష్ట్రంలో 36 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. వరంగల్ జిల్లా నెక్కొండలో అత్యధికంగా 3.35 సెంటీమీటర్ల వర్షం కురిసింది.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ చెల్లించండి

రాష్ట్రవ్యాప్తంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో నిరసనలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్‌ను తక్షణం చెల్లించాలని టీజీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) డిమాండ్ చేసింది. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోలు, యూనిట్ల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. దశాబ్దాలపాటు సంస్థకు సేవలు అందిస్తే, ఉద్యోగ విరమణ తర్వాత ఇవ్వాల్సిన బెనిఫిట్స్ కూడా ఇవ్వకపోవడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. హైదరాబాద్ బస్‌భవన్ దగ్గర జరిగిన నిరసన కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు, ప్రచార కార్యదర్శి రవీందర్‌రెడ్డి, కార్యదర్శి జీఆర్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఏపీ రావు నాయకత్వం వహించారు. మహబూబ్‌నగర్‌లో ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు, వరంగల్ రీజియన్‌లో ఎల్లయ్య, సీహెచ్ రాంచందర్, ఆదిలాబాద్‌లో ఉపాధ్యక్షులు ఎమ్‌బీ రావు, కరీంనగర్‌లో మల్లయ్య, శ్రీనివాస్, ఖమ్మంలో రీజియన్ కార్యదర్శి సుధాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏవీ లూ తదితరులు నాయకత్వం వహించారు.



బస్‌భవన్‌లో వినతిపత్రం అందచేస్తున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు

ధర్నా అనంతరం హైదరాబాద్ బస్‌భవన్‌లో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఓఎస్డీ భానుప్రసాద్‌కు వినతిపత్రం ఇచ్చారు. దాని ప్రతిని ఎఫ్ఏ అండ్ సీఏఓ కు అందచేశారు. అన్ని డిపోల్లోనూ డిపో మేనేజర్లకుఉ వినతిపత్రాలు అందచేశారు. నిరసనలు, ధర్నాల్లో ఆర్టీసీ కార్మికులతో పాటు రిటైర్డ్ ఉద్యోగులు కూడా భారీ సంఖ్యలో పాల్గొన్నారు. వారి డిమాండ్లు నెరవేర్చాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. టీజీఎస్‌ఆర్టీసీ రిటైర్డ్ కార్మికులకు 2017 పీఆర్సీ బకాయిలు తక్షణం చెల్లించాలనీ, 2022 ఏప్రిల్ నుంచి రావల్సిన టెర్మినల్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ ఇవ్వాలనీ, రిటైర్డ్ ఉద్యోగి, స్పౌజ్‌ను సూపర్ లగ్జరీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అనుమతించాలని కోరారు. పని చేసిన కాలంలో చాలీచాలని జీతంతో సంస్థ అభివృద్ధి కోసం అంకిత భావంలో పని చేశామని గుర్తుచేసుకున్నారు.

ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వ పెన్షన్ స్కీం లేదనీ, కేవలం పీఎఫ్‌లో అంతర్భాగంగా ఉన్న ఈపీఎస్ స్కీం ద్వారా నామమాత్రపు పెన్షన్ మాత్రమే పొందుతున్నారని చెప్పారు. ఆర్టీసి కార్మికుడు రిటైరైన తర్వాత ఆర్టీసీ యాజమాన్యం నుంచి అదనంగా వచ్చే ఆదాయాలు ఏమీ లేవనీ, ఉద్యోగంలో ఉన్నప్పుడు తమ జీతంలో నుంచి పొదుపు చేసుకున్న సొమ్ము మాత్రమే ఉంటుందనీ, దాన్ని కూడా సకాలంలో ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్లు కూడా చెల్లించట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రాట్యుటీ సొమ్ము కోసం కూడా ఎదురుచూడాల్సి వస్తున్నదని ఆవేదన చెందారు.

డిగ్రీలో బకెట్ విధానం రద్దు

అన్ని వర్సిటీల్లో కామన్ అకడమిక్ క్యాలెండర్

ఏటా ఏప్రిల్ 30 నాటికి పరీక్షలు నిర్వహించాలి

జూన్ 16 నుంచి డిగ్రీ తరగతులు ప్రారంభం

సిలబస్‌లో 20 శాతం ఏఐ ఉండేలా చర్యలు :

వీసీల సమావేశంలో ఉన్నత విద్యామండలి నిర్ణయం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల పరిధిలో డిగ్రీ విద్యకు సంబంధించి కామన్ అకడమిక్ క్యాలెండర్‌ను అమలు చేయాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న బకెట్ విధానాన్ని రద్దు చేయనున్నట్టు ప్రకటించింది. అందుకు వీసీలు అంగీకరించారని తెలిపింది. అటానమస్ కాలేజీలను పరిశీలించి మార్గదర్శకాలను రూపొందిస్తామని స్పష్టం చేసింది. ఏటా ఏప్రిల్ 30 నాటికి పరీక్షల నిర్వహణను పూర్తి చేయాలని కోరింది. జూన్ 16 నుంచి డిగ్రీ తరగతులను ప్రారంభించాలని అకడమిక్ క్యాలెండర్‌ను రూపొందించింది. శుక్రవారం హైదరాబాద్‌లో ఉన్నత విద్యామండలి చైర్మెన్ వి బాలకిష్టారెడ్డి అధ్యక్షతన విశ్వవిద్యాలయాల ఉపకులపతులు (వీసీ) సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఒక ప్రకటన విడుదల చేశారు. డిగ్రీ సిలబస్‌ను మార్పు చేస్తున్నామని వివరించారు. సిలబస్‌లో 20 శాతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సైబర్ సెక్యూరిటీ, ఫిన్‌టెక్, పరిశోధనకు సంబంధించిన అంశాలుంటాయని తెలిపారు. మారిన సిలబస్ వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమల్లోకి వస్తుందని వివరించారు. విద్యార్థులే కేంద్రంగా డిగ్రీ విద్యలో సంస్కరణలను తెస్తున్నామని పేర్కొన్నారు. అభ్యసనా సామర్థ్యాన్ని పెంచడం, సిబ్బంది అభివృద్ధి కోసం కార్యక్రమాలను రూపొందించి డిజిటల్ మాధ్యమంలో అందించాలని తెలిపారు. అందుకోసం టీశాట్‌తో ఒప్పందం కుదుర్చుకున్నామని పేర్కొన్నారు. కంటిన్యూయస్ అసెస్‌మెంట్ ప్యాటర్న్ (సీఏపీ)ని వంద మార్కులతో అమలు చేస్తామని వివరించారు. అందులో ప్రాజెక్టు వర్క్, అసైన్‌మెంట్లకు 25 మార్కులు, మిడ్‌టర్మ్‌కు 25 మార్కులు, చివరి సెమిస్టర్‌కు 50 మార్కుల చొప్పున కేటాయిస్తామని తెలిపారు. డిగ్రీ కాలేజీల అనుబంధ గుర్తింపు ప్రక్రియలోనూ మార్పులు తేవాలని నిర్ణయించామని పేర్కొన్నారు. డిగ్రీ, వృత్తి విద్యా, లా కాలేజీల గుర్తింపు కోసం నిర్దిష్టమైన గడువును విధిస్తామని తెలిపారు. గుర్తింపు ఇచ్చే ముందు అనుమతి ఉన్న సీట్ల సంఖ్యను పరిశీలించాలని పేర్కొన్నారు. అనుమతి ఉన్న సీట్ల సంఖ్యకు, ప్రవేశాలకు మధ్య తేడా ఉందని తెలిపారు. డిగ్రీలో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి కోర్సు కన్వర్షన్ మార్గదర్శకాలను రూపొందించామని వివరించారు. పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే సీపీగెట్ బాధ్యతను ఓయూకు అప్పగించామని తెలిపారు. ఇంటర్ ఫలితాలు విడుదలైన వెంటనే దోస్త్ ప్రవేశాల నోటిఫికేషన్‌ను విడుదల చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్లు ఈటిక్యాల పురుషోత్తం, ఎస్‌కే మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, వీసీలు కుమార్ మొలుగారం, కె ప్రతాప్‌రెడ్డి, టి యాదగిరిరావు, ఖాజా అల్తాఫ్ హుస్సేన్, జీఎన్ శ్రీనివాస్, ఉమేష్ కుమార్, సూర్య ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.



పెజాసామ్యం...!



ఎన్నికల సమయంలో ఓటు వేయటంతో ప్రజాస్వామ్య పరిరక్షణలో తమ బాధ్యత, కర్తవ్యం ముగిసిందని చాలామంది ఓటర్లు భావిస్తారు. చాంతాడంత క్యూలో నిలబడి, పోలింగ్ బూత్‌లో ఓటు వేసి, ఎన్నికల కమిషన్ బయట ఏర్పాటు చేసిన బాక్స్‌లో నిలబడి, చూపుడు వేలుపై ఉన్న సిరా చుక్కని చూపిస్తూ, ఫొటో దిగుతారు. ఎన్నికల కమిషన్ కూడా ఓటు హక్కు గురించి, పోలింగ్ తేదీన ఓటు వేయాల్సిన బాధ్యత గురించి పౌరులకు ఆ సమయంలో పదే పదే గుర్తు చేస్తుంది. ప్రకటనలు ఇస్తుంది. ఓటు వేయటం, ఎన్నికలు ముగియటంతో ఓటరు 'దేవుడి' అవతారం ముగుస్తుంది.

ఓటు ప్రజాస్వామానికి గుర్తు అనటంలో ఏమాత్రం సందేహం లేదు. రాజ్యాంగం ఇచ్చిన హక్కును తప్పక వినియోగించుకోవాల్సిందే. కానీ, విచిత్రం ఏమిటంటే ఎన్నికైన ప్రభుత్వాలు ఓటరు తన ప్రజాస్వామ్య హక్కులన్నీ ఓటు వేయడంతో తమకు పూర్తిగా దఖలు పరచాడని అనుకుంటుంది. అలాగే అనుకోమని ప్రజలకు కూడా చెప్తుంది. మళ్లీ ఎన్నికల దాకా పరిపాలన తమ ఇష్టానుసారం అంటుంది. "అలగాజనానికి" హక్కులేందన్నట్టుగా ప్రవర్తిస్తుంది. ఎన్నికల సమయంలో పార్టీలకు దేవుళ్ళుగా కనపడిన ఓటర్లు, ప్రభుత్వం ఏర్పరచిన తర్వాత ఆ పార్టీలకే బడా వ్యాపారవేత్తలు, బహుళ జాతి కంపెనీల సీఈఓలు దేవుళ్ళుగా కనబడతారు. నైవేద్యాలన్నీ వారికే.

అయితే, ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటరు ఒంటరిగాను, సామూహికంగా కూడా పోరాడుతాడు. ట్రేడ్ యూనియన్లు, రైతు సంఘాలు, వ్యవసాయ కూలీ సంఘాలు, యువజన విద్యార్థి మహిళా సంఘాలు, దళిత సంఘాలు- ఇటువంటి సంఘాలన్నీ తమ రంగాలకు, వృత్తులకు, సమాజాలకు సంబంధించిన సమస్యలపై పోరాడతాయి. ప్రజాస్వామ్యంలో భాగంగా ఆ పోరాటాలు ఉంటాయి.


ఇటువంటి ప్రజాస్వామిక ఆలోచనలు లేకపోయినట్టయితే హెచ్‌సీయూ, విద్యార్థులు 400 ఎకరాల అటవీ పరిరక్షణ కోసం లాఠీ దెబ్బలు, అరెస్టులు ఎదిరించి ఈ పోరాటం చేసేవారు కాదు.

ఆ 400 ఎకరాల భూమి 'మాది' అని రేవంత్ రెడ్డి ప్రభుత్వం అంటున్నది. కష్టపడి కోర్టులో పోరాడి తెచ్చుకున్నామంటున్నది. ప్రభుత్వంలో ఉండి, 'మాది' అనే మాటకు అర్థం ఏమిటి? ప్రభుత్వమూ, ప్రజలూ వేరు వేరు అని చెబుతున్నారా? ఆ భూమిపై నున్న చెట్లు, పుట్టలు తొలగించి, రాళ్ల రప్పలు చదును చేసి, మూగ జీవాలను తరిమేసి, నున్నటి తారు రోడ్లు పరచి, రూపాయికి పైసా వంతున అమ్మి, విద్యుత్, ఇతర చార్జీలలో వందలకోట్ల రాయితీలు ఇచ్చి, కోట్ల రూపాయలు బ్యాంకు ఖాతాలలో మూలుగుతున్న బడా బడా ఐటి కంపెనీలకు బంగారు పళ్లెంలో పెట్టి స్వాగతం పలుకుతుందిట ఈ ప్రభుత్వం. దీన్ని అభివద్ధి అనాలట. అందరూ రేవంత్‌కు జేజేలు పలకాలట.

రామోజీ భూమిని ఆక్రమించి పేదలు అటు వెళ్లకుండా అడ్డు గోడ కడితే రేవంత్‌గారి హైడ్రా ఏమి చేసింది. పేద కుటుంబాలకు ఇండ్లు ఇస్తామని ఊరించే ప్రభుత్వం, ఎక్కడైనా ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకుంటే, ఆ గుడిసెలు పీకివేయటానికి పోలీసులతో లాఠీచార్జీ, దౌర్జన్యం, కేసులు పెట్టని సందర్భం ఒక్కటైనా ఉందా?

అభివృద్ధి పేరిట ఆరు లేక ఎనిమిది లైన్ల రహదారులు నిర్మించారు. ఔటర్ రింగ్ రోడ్డు వేశారు. ఇంకా ఎన్నో ప్రాజెక్టులు కట్టారు. వీటిల్లో పేద ప్రజలు పోగొట్టుకున్న భూమి వాటా ఎంత, ఆ సాములు ఇచ్చిన వాటా ఎంత? జరిగిన అభివద్ధిలో ఎవరు ఎక్కువ లాభం పొందారు?

ప్రజలు ఊరికే ఉద్యమాల్లోకి దిగరు. మొదట ప్రభుత్వానికి విన్నవిస్తారు. సభలు సమావేశాలు పెట్టి ప్రభుత్వ దృష్టిలో పడేటట్టు కృషిచేస్తారు. తమ అసమ్మతిని ప్రభుత్వానికి తెలపటానికి రకరకాల మార్గాలు ఎంచుకుంటారు. కానీ, రేవంత్ రెడ్డి ప్రభుత్వం సహా ప్రభుత్వాలు చేస్తున్నది ఏమిటి? గత పదేండ్లుగా బీఆర్ఎస్ నడిచిన దారిలోనే ఈ ప్రభుత్వం నడుస్తున్నది. ఆరు హామీలతో పాటు ఏడో హామీగా ప్రజాస్వామిక పాలన ఇచ్చారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు వెళ్ళినప్పుడు అక్కడి వామపక్ష కార్యకర్తలను- ఇంకెవరిని కాదు, కేవలం వామపక్ష కార్యకర్తలను మాత్రమే- రోజంతా గృహ నిర్బంధంలో పెడుతున్నారు. ఇది ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు చేయాల్సిన పనేనా?



ప్రజాస్వామ్యం అంటే అసమ్మతి ఉంటుంది. అసమ్మతిని వినటం ప్రజా ప్రభుత్వాల బాధ్యత. అది వదిలేస్తే మనకు మిగిలేది నియంతృత్వమే. నియంతృత్వానికి విరుగుడుగా అరాచకం పుడుతుంది. దానిని ఎవరూ ఆశించరు.

భారత రాజ్యాంగం ముందు పీఠికలో సామాజిక, రాజకీయ, ఆర్థిక న్యాయం, ఆలోచనా స్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛ, మత విశ్వాస స్వేచ్ఛ అందరికీ అందుబాటులో ఉండాలని, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యాంగ ఉంచాలనే లక్ష్యాలను అందులో చెప్పుకున్నాం. ఈ రాజ్యాంగాన్ని మనకు మనమే సమర్పించినట్టుగా వ్రాసుకున్నాం. అంటే ఈ లక్ష్యాల కోసం పనిచేయటం తప్పు ఎలా అవుతుంది? ఇప్పుడు జరుగుతున్న ప్రజా ఉద్యమాలను అణిచే హక్కు ఈ ప్రభుత్వాలకు ఎవరిచ్చారు? కోట్లకొలది ప్రజా సంపదను బడా వ్యాపారవేత్తలకు కట్టపెడితే రాజ్యాంగంలోని సామ్యవాద లక్ష్యం ఎలా నెరవేరుతుంది. ప్రజలు పాల్గొనే ప్రతి ఉద్యమం మీద పోలీసులను ప్రయోగిస్తే, బలప్రయోగంతో అణచివేస్తే అది ప్రజాస్వామ్య దేశమౌతుందా?

ఓటు వేయటం మాత్రమే ప్రజాస్వామ్యం అని ప్రభుత్వమంటే ప్రజలు అంగీకరించాలా? ఈ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పోకడలుచూస్తే సంఘాలు నిర్మించటం, ప్రజలను సమీకరించటం ఉద్యమాలు చేయటం ప్రజాస్వామిక హక్కని ప్రతిఒక్కరూ తెలియజేయాల్సిన అవసరముందని అనిపించటం లేదా?

\- కర్లపాలెం

శాంతి అంటే గొంతునొక్కడమా?

• మా భూములపైనే వారి కన్ను • కార్పొరేట్లకు కట్టబెడుతున్నారు



యువత కదులుతోంది : సీపీఐ(ఎం) జమ్ముకాశ్మీర్ రాష్ట్ర కార్యదర్శి అబ్బాస్

'జమ్మూ కాశ్మీర్‌లో శాంతి నెలకొల్పామని ప్రధానమంత్రి మోడీ, హోంమంత్రి అమిత్‌షాలతో పాటు బీజేపీ నేతలు చెబుతున్నారు. కానీ జరిగింది వేరు. ఇప్పుడు అక్కడ మౌనం రాజ్యమేలుతోంది. ప్రజలు తమ సమస్యలు చెప్పుకోవడానికి కూడా అవకాశం లేదు. ప్రజలు ఎన్నుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి ఎటువంటి అధికారాలు లేవు. తహసీల్దార్‌ను కూడా లెఫ్టినెంట్ జనరలే బదిలీ చేస్తారు. సమస్యల కోసం ఎవరైనా గళం విప్పితే రకరకాల ముద్రలు వేసి జైలులో వేస్తారు. అనేక రకాలుగా శిక్షిస్తారు. శాంతి అంటే ఇలా ప్రజల గొంతు నొక్కడమా? ఎటువంటి శబ్దం లేకుండా చేయడమా? 'అని జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర సీపీఐ(ఎం) కార్యదర్శి అబ్బాస్ అన్నారు. 45 సంవత్సరాలకే ఆయన రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. మదురైలో జరుగుతున్న సీపీఐ(ఎం) అఖిలభారత మహాసభకు ప్రతినిధిగా వచ్చిన అబ్బాస్ నవతెలంగాణతో మాట్లాడుతూ జమ్మూకాశ్మీర్‌లో చోటుచేసుకుంటున్న వివిధ పరిణామాలను వివరించారు. ఇంటర్వ్యూ వివరాలు క్లుప్తంగా :

సీతారాం ఏచూరి నగర్ నుంచి
నవతెలంగాణ ప్రతినిధి

చిన్న వయసులోనే రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నిక య్యారు కదా? ఆ బాధ్యతను ఎలా భావిస్తున్నారు?

కామ్రేడ్ తరిగామి నేతృత్వంలో మేమంతా ఎదిగాం. ఒక గొడుగులాగా ఆయన మాకు నీడను ఇచ్చారు. కష్టాలను ఎదుర్కోవడం నేర్పించారు. సమర్థవంతమైన, పోరాట స్ఫూర్తిని చూపగల నాయకులు ఎందరో ఇప్పుడు రాష్ట్రంలో తయారయ్యారు. ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకుపోవడానికి వారంతా సిద్ధమవుతున్నారు. ఆ క్రమంలోనే రాష్ట్ర కార్యదర్శిగా నేను ఎన్నికయ్యాను. తరిగామి వంటి నేత చూసిన బాధ్యతలను అదే స్థాయిలో కొనసాగించడం కొంచెం కష్టమే! కానీ, పార్టీ సహాయ, సహకారాలతో కొత్త తరం బాధ్యతలను నేర్చుకుంటోంది. ఎదుగుతోంది. పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తుంది.

జమ్మూకాశ్మీర్‌లో ప్రస్తుతం పార్టీ పరిస్థితి ఎలా ఉంది?

అక్కడ ఉన్న ప్రత్యేక పరిస్థితి గురించి మీకు తెలుసు. పార్టీకి కొన్ని ప్రాంతాల్లో స్థిరమైన బలం ఉంది. తరిగామిని ఓడించడానికి హిందూత్వ బీజేపీ శక్తులు, అంతే మతోన్మాదాన్ని చూపే ముస్లిం ఉగ్రవాద శక్తులతో చేతులు కలిపాయి. అయినా, ప్రజలు సీపీఐ(ఎం)వైపే మొగ్గుచూపి తరిగామిని భారీ మెజార్టీతో గెలిపించారు. మరో, రెండు మూడు స్థానాల్లో కూడా పార్టీకి ప్రజల గణనీయమైన మద్దతు ఉంది. అయితే, బీజేపీని ఓడించాలన్న లక్ష్యంలో భాగంగా ఒక్క స్థానానికే పరిమితమై పోటీ చేసి గెలిచాం. పార్టీ ప్రభావం క్రమంగా రెండు రాష్ట్రాల్లోని ఇతర ప్రాంతాలకు విస్తరిస్తోంది. తీవ్ర నిర్బంధ పరిస్థితులు ఉన్నప్పటికి వాటిని అధిగమిస్తున్నాం. ప్రజలు మాతో కలిసి వస్తున్నారు. మేం చెప్పే విషయాలను వింటున్నారు. ఆందోళనలకు కదులుతున్నారు.

ఆర్టికల్ 370 రద్దు తరువాత ప్రజల స్పందన ఎలా ఉంది?

370వ అధికరణాన్ని రద్దు చేసే సమయంలో ప్రజలకు ఎన్నో అంశాలను బీజేపీ నాయకులు చెప్పారు. కొంతమందిని మభ్య పెట్టగలిగారు కూడా. కానీ, జమ్మూకాశ్మీర్‌ను రెండు భాగాలు చెయ్యడం మెజార్టీ ప్రజల హృదయాలను గాయపరిచింది. 5.50 లక్షల ఉద్యోగాలు వస్తాయని వారు ప్రజలకు చెప్పారు. కానీ, 4వేల ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేశారు, 35ఎ రద్దు వంటివి కూడా ప్రభావం చూపుతున్నాయి. ప్రస్తుతం ప్రజలు వాస్తవాలు తెలుసుకుంటున్నారు.

బీజేపీ వ్యూహాలు ఎలా ఉన్నాయి?

బీజేపీ చాలా పకడ్బందీగా వ్యూహాలు పన్నుతోంది. మిగిలిన రాష్ట్రాల్లో మాదిరే మత ప్రాతిపదిక ప్రజలను విభజించడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ప్రజలను ఒకరికి మరొకరిని శత్రువులుగా చూపిస్తూ పరస్పరం మోహరింపచేయడానికి ప్రయత్నాలు చేస్తోంది. జమ్మూ ప్రజలకు కాశ్మీరీయులను శత్రువులుగా చూపుతోంది. కాశ్మీర్‌లో కూడా మెజార్టీ, మైనార్టీ ప్రజల మధ్య చిచ్చు పెడుతోంది. 370 రద్దు, రాష్ట్ర విభజన కూడా ఈ వ్యూహంలో భాగమే. అయితే, రాష్ట్ర ప్రజలు ఆ ప్రయత్నాలను తిప్పికొడుతున్నారు,. ఐక్యంగానే ఉంటున్నారు. అయితే, కొన్ని ముస్లిం మతవాద సంస్థలు కూడా ఇదే పనిచేస్తున్నాయి. కొన్ని సమయాల్లో బీజేపీతో చేతులు కలపడానికి కూడా వారు సిద్ధమవుతున్నారు. ఈ పరిస్థితిని ప్రజలు గమనిస్తున్నారు.

ఆర్టికల్ 370 రద్దుతో భూముల విలువ పెరిగి పరిశ్రమలు వస్తాయని మోడీ ప్రభుత్వం చెప్పింది కదా... ఏం జరుగుతోంది?

మోడీ, అమిత్‌షాలు ఆ మాటలు చెప్పినప్పుడు కొందరు నమ్మారు. కానీ ఇప్పుడు 'ఎవరి భూములు... ఎవరి చేతుల్లోకి వెళుతున్నాయి అన్న విషయం చర్చకు వచ్చింది. అప్పుడు భూములకు విలువ తక్కువగా ఉండి ఉండవచ్చు. కానీ, స్థానికుల చేతుల్లోనే భూమి ఉండింది. ఇప్పుడు ఆ భూమికి రెక్కలు వస్తున్నాయి. ఇటీవల శ్రీలంక క్రికెటర్ ఒకరికి పెద్ద మొత్తంలో భూములు కేటాయించారు. ఈ జాబితాలో అనేక విద్యాసంస్థలు క్యూలో ఉన్నాయి. అదానీ, అంబానీలకు కూడా భూములు కట్టబెట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

విద్య, వైద్య రంగాల్లో పరిస్థితులు ఎలా ఉన్నాయి?

కీలకమైన ఈ రెండు రంగాల్లోనూ పరిస్థితి అధ్వానంగా ఉంది. ఈ రంగాలకు సంబంధించిన 40 శాతం ఉద్యోగాలను ప్రభుత్వం భర్తీ చేయడం లేదు. పారా మెడికల్ స్టాఫ్ లేరు. ప్రజలు ప్రయివేటు సంస్థలను ఆశ్రయించాల్సివస్తోంది. ఇది వారికి తీవ్ర భారంగా మారుతోంది.



జమ్మూ, కాశ్మీర్‌లో సీపీఐ(ఎం) భవిష్యత్ ఏమిటి?

మేం అనేక అంశాలను తీసుకుని పనిచేస్తున్నాం. స్థానిక సమస్యలతో పాటు, 370 రద్దు, రాష్ట్రాల పునరేకీకరణ వంటి అంశాలకోసం పోరాడుతున్నాం. యువత పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవుతోంది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో యువత ఆసక్తితో రంగంలోకి దిగింది. అందువల్ల భవిష్యత్‌పై పూర్తి ఆశాభావంతో ఉన్నాం.

'వక్ఫ్ సవరణ చట్టం' ఆమోదాన్ని ఖండించండి

ఉపసంహరణకు డిమాండ్ చేయండి : సీపీఐ(ఎం) అఖిలభారత మహాసభ



సీతారాం ఏచూరి నగర్ నుంచి నవతెలంగాణ ప్రతినిధి

వక్ఫ్ సవరణ చట్టాన్ని పార్లమెంటు ఆమోదించడాన్ని తీవ్రంగా ఖండించాలని సీపీఐ(ఎం) పిలుపునిచ్చింది. మదురైలో జరుగుతున్న సీపీఐ(ఎం) అఖిలభారత మహాసభలో ఈ మేరకు తీర్మానాన్ని ప్రతిపాదించింది. 'పార్లమెంట్ ఆమోదించిన 'వక్ఫ్ సవరణ చట్టం'ను సీపీఐ(ఎం) తీవ్రంగా ఖండిస్తోంది. దేశ వ్యాప్తంగా ఉన్న సెక్యులర్ సంస్థలు, ప్రజానీకం ముక్తకంఠంతో ఈ చర్యను ఖండించాలని తీర్మానంలో పేర్కొంది. ఈ చర్య విబేధాలను పెంచుతోందని, దేశపు సెక్యులర్ తత్వానికి చేటు చేస్తుందని తెలిపింది. ఇంతకు ముందు ఉన్న వక్ఫ్ చట్టం, వక్ఫ్ ఆస్తుల సక్రమ పరిపాలన, ఆక్రమణల నుంచి రక్షణతో పాటు ముస్లిం సమాజ ప్రయోజనాలకు నిధులను వినియోగించడాన్ని నిర్ధారించింది. అయితే, కొత్త వక్ఫ్ సవరణ చట్టం అనేక అసంబద్ధ విధానాలను కలిగి ఉంది. బీజేపీ ప్రభుత్వం మంద బలంతో ఈ చట్టాన్ని పార్లమెంట్ ద్వారా ముందుకు తీసుకెళుతోంది. తద్వారా రాజ్యాంగంలో హామీ ఇచ్చిన అల్పసంఖ్యాక హక్కులను అడ్డుకుంటూ, హిందూత్వ ఎజెండాను మరింత ప్రోత్సహించడమే లక్ష్యంగా పెట్టుకుంది.' అని తీర్మానంలో సీపీఐ(ఎం) పేర్కొంది. 'తాజా సవరణలతో రాష్ట్ర వక్ఫ్ బోర్డులు రద్దు చేయడం, వాటి అధికారాలను కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోకి బదిలీ చేయడం, తద్వారా కేంద్రీకరణను ప్రోత్సహిం చడం వంటి చర్యలకు పాల్పడ్డారని ఇది ఫెడరలిజానికి విరుద్ధమని పేర్కొంది. అదే విధంగా శతాబ్దాలుగా అమలు పర్చబడిన ఇస్లామిక్ సంస్థలు రాజ్యాంగ రక్షణ పొందుతున్నప్పటికీ, కొత్త చట్టంలో ఆ పరిస్థితి లేదని, అక్రమంగా జప్తు లేదా ధ్వంసం చేయబడిన ఆస్తుల పునరుద్ధరణ లేదా పరిహారానికి ఎటువంటి విధానాన్ని ప్రస్తావించలేదని తీర్మానంలో తెలిపింది. వక్ఫ్ ఆస్తుల హేతుబద్ధత పై సందేహం కలిగించగలిగేలా చట్టం ఉందని, అల్పసంఖ్యాక ప్రజలపై వేధింపులను పెంచి, సాముప్రదాయక ఉద్రిక్తతలను మరింతగా ప్రేరేపిస్తుందని తీర్మానంలో వివరించింది. ఈ సవరణతో ఆస్తుల వివాదాలను కోర్టుల్లోనే పరిష్కరించుకోవాల్సి వస్తుందని, అధికారిక నోటిఫికేషన్ ద్వారా వక్ఫ్ ఆస్తులను నిర్ధారించాల్సిన విధానానికి భిన్నంగా అనిశ్చితమైన ఒరల్ డిక్లరేషన్ విధానం మరింత గందరగోళానికి దారి తీస్తుందని వివరించింది. తక్షణమే వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. ఈ సవరణల కారణంగా, దేశంలోని ఎక్కువ వక్ఫ్ ఆస్తులు ప్రభుత్వ ఆక్రమణకు గురవుతాయని, ఉత్తర్ ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ వంటి ఎక్కువ వక్ఫ్ ఆస్తులను కలిగిన రాష్ట్రాల్లోని ఆస్తులే లక్ష్యంగా మారుతాయని తీర్మానంలో తెలిపింది.

'సర్వే కమిషనర్ నుంచి కేంద్ర ప్రభుత్వం నియామకం చేసిన అధికారికి వక్ఫ్ ఆస్తులను నిర్ణయించుకునే అధికారాన్ని బదిలీ చేయడం ద్వారా, ప్రభుత్వం ప్రార్థనా స్థలాలు, విద్యా సంస్థలు, ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు, వృత్తి కేంద్రాలను ఆక్రమించుకుని, వక్ఫ్ ఆస్తులపై నియంత్రణను పెంచుకోవాలని చూస్తోంది. వక్ఫ్ ట్రిబ్యునల్ యొక్క అధికారాలను తొలగించడం వల్ల, వక్ఫ్ బోర్డు కూడా ఏ విధమైన న్యాయ సహాయం అందించలేకపోతుంది.' అని తీర్మానంలో పేర్కొంది. 'ఈ సవరణల ద్వారా, కేంద్ర ప్రభుత్వం ముస్లింల హక్కులపై దాడిచేసే తన విధానాన్ని కొనసాగిస్తోంది. ఇది సిటిజన్‌షిప్ అమెండ్మెంట్ యాక్ట్ (సీఏఏ)తో పోల్చదగినది' అని తెలిపింది. 'దేశంలోని సెక్యులర్, ప్రజాస్వామ్య నిర్మాణాన్ని కాపాడేందుకు అభ్యుదయ శక్తులు ఏకం కావాలని, వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేయాలని తీర్మానంలో పిలుపునిచ్చింది.



వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదంపై ఆగ్రహజ్వాల

కోల్‌కతా, అహ్మదాబాద్, చెన్నై సహ పలు నగరాల్లో నిరసనల హోరు

న్యూఢిల్లీ: పార్లమెంట్ ఆమోదించిన వివాదాస్పద వక్ఫ్‌సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ నిరసనలు హోరెత్తాయి. కోల్‌కతా, చెన్నై, అహ్మదా బాద్ వంటి పలు నగరాల్లో శుక్రవారం ప్రార్థనలు ముగిసిన అనంతరం ముస్లింలు ఆందోళనలు చేపట్టారు. ఆందోళనలో భాగంగా పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో వేలాది మంది ముస్లింలు జాతీయ జెండాను చేబూని రోడ్డెక్కారు. 'వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తున్నాం' అనే ప్లకార్డులను ప్రదర్శించారు. 'జాయింట్ ఫోరమ్ ఫర్ వక్ఫ్ ప్రొటెక్షన్' ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టారు. అహ్మదాబాద్ లో శాంతియుతంగా నిరసన చేపడుతున్న ముస్లిం లపై పోలీసులు విరుచుకుపడ్డారు. రోడ్డుపై కూర్చున్న వారిని బలవంతంగా తరుముతున్న దృశ్యాలు స్థానిక మీడియాలో వైరల్‌గా మారాయి. చెన్నైలోనూ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నటుడు విజయ్ పార్టీ తమిళగ వెట్రి కజగం (టీవీకే) రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపు నిచ్చిన సంగతి తెలిసిందే. చెన్నైతో పాటు ముఖ్య పట్ట ణాలైన కోయంబత్తూర్, తిరుచిరా పల్లిలో టీవీకే కార్యకర్తలు నిరసనలు చేపట్టారు. 'వక్ఫ్‌బిల్లును వ్యతిరేకించండి', 'ముస్లింల హక్కులను హరించ వద్దు'అంటూ నినాదాలతో హోరెత్తిం చారు. ఈ బిల్లు ప్రజాస్వామ్య వ్యతిరేకమని విజయ్ పేర్కొన్నారు. దీనిని ఆమోదించడం దేశ లౌకిక పునాదిపై దాడిగా అభివర్ణించారు. హైదరాబాద్ లోని పాతబస్తీతో సహ పలుచోట్ల ముస్లింలు శుక్రవారం నమాజ్ అనంతరం వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ నిరసనలు చేశారు. సున్నిత ప్రాంతాల్లో పోలీసు బలగాలను మోహరించారు.



గోమతి, తమిళనాడు



మమత



సర్బనీ సర్కార్, వెస్ట్‌బెంగాల్



సీపీఐ(ఎం) అఖిల భారత మహాసభ చర్చల్లో వక్తలు



టి.ఎన్.సీమ, కేరళ



మోనాలీసా దాస్, వెస్ట్‌బెంగాల్

గాజాపై మారణహోమాన్ని ఆపాలి

శాశ్వత కాల్పుల విరమణకు సీపీఐ(ఎం) డిమాండ్

సీతారాం ఏచూరి నగర్ నుంచి
నవతెలంగాణ ప్రతినిధి

గాజాపై ఇజ్రాయిల్ చేస్తున్న మారణహోమాన్ని తక్షణం ఆపాలని అఖిల భారత మహాసభలో చేసిన తీర్మానంలో సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. తక్షణమే శాశ్వత కాల్పుల విరమణ చేయాలని కోరింది. ఈ తీర్మానాన్ని పొలిట్ బ్యూరో సభ్యులు ఎంఎ బేబి ప్రవేశపెట్టగా, మరో పొలిట్ బ్యూరో సభ్యులు జి. రామకృష్ణన్ బలపర్చారు. ఈ సందర్భంగా ఇజ్రాయిల్, అమెరికా వ్యతిరేక నినాదాలతో సభా ప్రాంగణం మారు మ్రోగింది. ఏకగ్రీవంగా ఆమోదించిన ఈ తీర్మానంలో '2023 అక్టోబర్ 7న హమాస్ దాడికి ప్రతిస్పందనగా ఇజ్రాయిల్ పాలస్తీనా గాజాపై అంతర్యుద్ధానికి సమానమైన తీవ్రస్థాయి దాడులను ప్రారంభించిందని, వీటిలో ఇప్పటి వరకు 50,021 మందికి పైగా పాలస్తీనీయులు మరణించగా, వేలాది మంది గాయపడ్డారని సీపీఐ(ఎం) తెలిపింది. 'మొదటి దశ కాల్పుల విరమణ ముగిసిన వెంటనే ఇజ్రాయిల్ తన దాడులను పున్ణప్రారంభించింది. అప్పటి నుంచి గాజాకు ఆహారం, నీరు, ఇంధనం, వైద్య సహాయంతో పాటు ఇతర మౌలిక వనరులను నిలిపివేసింది. ఇది గాజాలో ఆకలి బాధితులను పెంచింది. ఆస్పత్రులు, సహాయ బందాలు, ఐక్యరాజ్యసమితి శరణార్థ శిబిరాలు, పాఠశాలలు, మసీదులు, చర్చిలు, చివరకు సహాయ బృందాలపై కూడా దాడులు జరిగాయి. గాజాలో సురక్షిత ప్రాంతమంటూ లేకుండా పోయింది. ఇజ్రాయిల్ దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన వారిలో 60 శాతం మంది మహిళలు, చిన్నారులే ఉన్నారు. జర్నలిస్టులు, ఐక్యరాజ్యసమితి సహాయ ఉద్యోగులు కూడా దాడులకు లక్ష్యంగా మారారు. పంటల్ని నాశనం చేశారు. ఈ దాడులన్నీ ఇజ్రాయిల్ ప్రభుత్వపు జెనోసైడ్ స్వభావాన్ని స్పష్టంగా వెల్లడిస్తున్నాయి.' అని తీర్మానంలో సీపీఐ(ఎం) పేర్కొంది. 'అంతర్జాతీయ న్యాయస్థానం దీన్ని పరిగణనలోకి తీసుకుని, ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, ఇతర నేతలపై అరెస్ట్ వారెంట్లు జారీ చేసింది. అయినా, పశ్చిమ తీరంలో పాలస్తీనా భూమిని ఆక్రమించి, జ్యూవిష్ జనావాసాలను స్థాపించేందుకు ప్రోత్సహిస్తోంది. ఈ విధంగా, పశ్చిమ తీరంలోని పాలస్తీనా భూభాగాన్ని క్రమంగా తమకు అనుసంధానించేందుకు ఇజ్రాయిల్ యత్నిస్తోంది. ఇవన్నీ పాలస్తీనీయులను తమ స్వస్థలాల నుంచి తరిమికొట్టి "గ్రేటర్ ఇజ్రాయిల్" ఎజెండాను అమలు చేయడంలో భాగమే' అని సీపీఐ(ఎం) వివరించింది.

'అమెరికా ఇతర పాశ్చాత్య దేశాలు గాజాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులకు మద్దతు ఇవ్వడమే కాకుండా, ఆయుధాలు అందించి, అంతర్జాతీయ వేదికలపై అది తప్పు చేయలేదన్న రీతిలో మాట్లాడుతున్నాయి. గాజాను పర్యాటక కేంద్రంగా మారుస్తామన్న ట్రంప్ ప్రకటన పాలస్తీనీయులను తరిమికొట్టాలన్న ఇజ్రాయిల్ లక్ష్యాలకు అనుకూలంగా ఉంది. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం భారత దేశం ఎంతో కాలంగా పాలస్తీనా పట్ల అనుసరిస్తున్న వైఖరికి భిన్నమైన వైఖరిని తీసుకుంది.

పాలస్తీనా ప్రజలతో నిలబడి, ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా చర్యలు కోరాల్సిన సమయంలో, దానికి భిన్నంగా ఇజ్రాయిల్ వైపు ఉంటోంది. ఫలితంగా, ఐక్యరాజ్య సమితిలో తక్షణ కాల్పుల విరమణ కోరుతూ ప్రతిపాదించిన తీర్మానాలపై భారత్ మొదటిసారిగా వ్యతిరేకంగా లేదా తటస్థంగా ఓటు వేసింది. దీని వలన అభివద్ధి చెందుతున్న దేశాల్లో భారత్ విశ్వసనీయత కోల్పోయింది. ఇప్పుడు భారత్‌ను అమెరికా , ఇజ్రాయిల్ మిత్రదేశంగా చూస్తున్నారు.' అని సీపీఐ(ఎం) వివరించింది.

'గాజాలో తక్షణ కాల్పుల విరమణను ప్రకటించాలి. ఇజ్రాయిల్‌ను దూర్త దేశంగా ప్రకటించి దానిపై చర్యలు తీసుకోవాలి.' అని డిమాండ్ చేసింది. పాలస్తీనా పట్ల మద్దతు ఇచ్చే విధానాన్ని బీజేపీ ప్రభుత్వం తిరిగి అమలు చేయాలని కోరింది. ఈ ప్రాంతంలో శాశ్వత శాంతికి సాధ్యమయ్యే మార్గం 1967కు ముందున్న సరిహద్దులతో, ఈస్టు జెరూసలేమ్‌ను రాజధానిగా కలిగి ఉన్న పాలస్తీనా దేశాన్ని స్థాపించడమే అని తెలిపింది. తమ స్వస్థలాన్ని తిరిగి పొందేందుకు పోరాడుతున్న పాలస్తీనా ప్రజలకు మద్దతుగా నిలవాలని ప్రజానీకానికి సీపీఐ(ఎం)పిలుపునిచ్చింది.



సంపాదకీయం

ట్రంప్ పన్నులతో "రక్తస్రావం"!

కొన్ని సందర్భాల్లో రోగుల అంతర్గత అవయవాలు చిట్లిపోయి రక్తస్రావం జరుగుతుంది. అది పరిస్థితి తీవ్రతకు చిహ్నం. అమెరికా అధినేత డోనాల్డ్ ట్రంప్ దూకుడుగా ప్రారంభించిన సుంకాల దాడితో ప్రపంచానికి ముఖ్యంగా అమెరికాకు అలాంటి ముప్పే పొంచి ఉందని జెపి మోర్గాన్ బ్యాంక్ ప్రధాన ఆర్థికవేత్త బ్రూస్ కాస్‌మాన్ హెచ్చరించాడు. దేర్ విల్ బి బ్లడ్ (రక్తస్రావం జరగొచ్చు) అనే శీర్షికతో తమ ఖాతాదార్లకు వెల్లడించిన విశ్లేషణ ప్రపంచ వార్తగా నిలిచింది. ట్రంప్ దెబ్బకు ఎస్ అండ్ పి 500 సూచికలో కంపెనీల వాటాల ధరలు ఒక్క రోజే 2.4లక్షల కోట్ల డాలర్ల మేర పతనమయ్యాయి. ప్రపంచం మాంద్యంలోకి దిగజారే ముప్పు 40 నుంచి 60శాతానికి పెరిగినట్లు జెపి మోర్గాన్ హెచ్చరించింది. ఏప్రిల్ రెండవ తేదీని అమెరికా విముక్తి దినంగా ట్రంప్ చెబితే అది ప్రపంచానికి దుర్దినంగా మారింది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత తొలిసారిగా అమెరికా గృహస్తులు పెద్ద మొత్తంలో కాఫీ దగ్గర నుంచి కార్ల వరకు భారాలు మోయనున్నారని కాస్‌మాన్ చెప్పాడు. అమెరికా విధానాలలో ఎలాంటి మార్పులు లేకపోతే మాంద్యం ఈ ఏడాది ప్రపంచవ్యాపితం కావచ్చున్నాడు. చర్యకు ప్రతి చర్య ప్రకృతి ధర్మం. ట్రంప్ బాణాల దెబ్బలు తిన్నవారు ప్రతి శస్త్రాలను సంధించకమానరు. వాటి పర్యవసానాలు అమెరికా, కేవలం పెంగ్విన్ పక్షులు మాత్రమే ఉండే అంటార్కిటా ప్రాంతంతో సహా యావత్ ప్రపంచం మీద ఉంటాయని విశ్లేషణలు వెలువడ్డాయి. మనతో సహా అనేక దేశాల స్టాక్ మార్కెట్లు కుదేలయ్యాయి.

> గత కొన్నేండ్లుగా ప్రపంచ ఆర్థిక మౌలిక అంశాలు బలహీనంగా ఉన్నాయి.గోరుచుట్టు మీద రోకటి పోటులా తగిలిన ట్రంప్ పన్నులు దేనికి దారితీస్తాయో తెలియని అయోమయానికి కారణం అవుతున్నాయి. 'ప్రధాని మోడీ మంచి వాడే..భారతే చెడ్డది' అన్న ట్రంప్‌ను ఆత్మగౌరవం గల భారతీయులెవరూ సహించకూడదు. అసహ్యకర (డర్టీ) పదిహేను దేశాలు అంటూ మీడియాలో వర్ణిస్తున్నా మౌనమే. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నా ట్రంప్ పన్నుల బాదుడు మనకు మేలు చేసేవా హానికరమా? అన్నది ఏదో ఒకటి చెప్పకుండా 140 కోట్ల జనాభాకు తాను జవాబుదారీ అని నరేంద్రమోడీ ఎలా చెప్పుకోగలరు?

దిగిన తర్వాత గానీ చెరువు లోతు తెలియదు, ఇల్లలకగానే పండుగ కాదు అన్నట్లుగా పన్నుల పెంపుదల ప్రకటన చేయగానే అంతా అయిపోయినట్లు భావించనవసరం లేదు. కెనడా మీద విధించిన భారాలను అంగీకరించేది లేదని నలుగురు అధికారపక్ష సెనెటర్లతో సహా ప్రతిపక్షం పెట్టిన తీర్మానాన్ని అమెరికా సెనెట్ ఆమోదించింది. తనకున్న అధికారాలతో దాన్ని తోసిరాజనవచ్చు. కానీ ట్రంప్‌కు సెగ తగిలిన కారణంగానే పన్నుల గురించి చర్చించటానికి తాను సిద్ధంగా ఉన్నట్లు ప్రకటన చేయక తప్పలేదు. అయితే ఆయన సలహాదారులు మాత్రం అబ్బే అలాంటిదేం, ప్రకటించిన పన్ను మొత్తాలు బేరసారాలాడేందుకు కాదని వెంటనే వివరణ ఇచ్చారు.తొత్తు ఇజ్రాయిల్‌తో సహా వంద దేశాల మీద తొడగొట్టిన ట్రంప్ అమెరికాను ఒక విధంగా ఒంటరిపాటు చేశాడనే చెప్పాలి.బలవంతుడైన సర్పము చలిచీమల చేత చిక్కి చచ్చినట్లు, గడ్డిపోచలతో మదగజాన్ని బంధించినట్లు యావత్ దేశాలు తలచుకొంటే ట్రంప్ దిగిరాక తప్పదు. అయితే పరస్పరం విధించుకొనే పన్నులు సామాన్యులను బికారులను చేస్తాయి తప్ప పాలకవర్గాల ప్రతినిధులుగా ఉన్న కార్పొరేట్లకు జరిగే నష్టమేమీ ఉండదు.ట్రంప్ విధించిన పన్నులతో ప్రతి ఏటా అమెరికా ప్రభుత్వానికి 600 బిలియన్ డాలర్ల మేర అదనపు రాబడి వస్తుందని అంచనా. దాన్ని మరో విధంగా చెప్పాలంటే అంత మొత్తంలో నామమాత్రంగా దిగుమతిదారులు, అత్యధిక భాగం వినియోగదారులే భరిస్తారు. అప్పుడు అధికారంలో ఉన్నవారికి సెగ తగులుతుంది. అందుకే ఒక దశవరకు వచ్చిన తర్వాత ట్రంప్ వెనక్కు తగ్గవచ్చునే అభిప్రాయాలూ వెల్లడౌతున్నాయి, తెగేదాకా లాగితే ఆ పెద్దమనిషి పదవికే ఎసరు వస్తుంది.



కొత్త పన్నులతో అమెరికాలో ద్రవ్యోల్బణం 3 నుంచి 3.5శాతానికి పెరుగుతుందని అంచనా. జెపి మోర్గాన్, గోల్డ్‌మాన్ శాచస్, మూడీస్, తదితర సంస్థల విశ్లేషకులు ఎటు తిప్పి ఎటుచెప్పినా వాణిజ్య యుద్ధం ఒక విషవలయం వంటిది. ద్రవ్యోల్బణం పెరిగితే, ధరలు హెచ్చి వినియోగదారుల విశ్వాసం, కొనుగోలు శక్తి తగ్గుతుంది. అది వృద్ధిరేటు మీద ప్రతికూల ప్రభావం చూపుతుంది. నిరుద్యోగ పెరుగుదలకు దారితీస్తుంది. దశాబ్దాల తరబడి సాగుతున్న వాణిజ్య వివాదాలు ఒక కొలిక్కి రాలేదు. గత కొన్నేండ్లుగా ప్రపంచ ఆర్థిక మౌలిక అంశాలు బలహీనంగా ఉన్నాయి.గోరుచుట్టు మీద రోకటి పోటులా తగిలిన ట్రంప్ పన్నులు దేనికి దారితీస్తాయో తెలియని అయోమయానికి కారణం అవుతున్నాయి. 'ప్రధాని మోడీ మంచి వాడే..భారతే చెడ్డది' అన్న ట్రంప్‌ను ఆత్మగౌరవం గల భారతీయులెవరూ సహించకూడదు. అసహ్యకర (డర్టీ) పదిహేను దేశాలు అంటూ మీడియాలో వర్ణిస్తున్నా మౌనమే. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నా ట్రంప్ పన్నుల బాదుడు మనకు మేలు చేసేవా హానికరమా? అన్నది ఏదో ఒకటి చెప్పకుండా 140 కోట్ల జనాభాకు తాను జవాబుదారీ అని నరేంద్రమోడీ ఎలా చెప్పుకోగలరు?


ప్రాణాలు పోసే ప్రకృతిని
ఊపిరాడకుండా చేసి
ప్లాస్టిక్ కవర్లలో మూటకట్టకండి

పూస్తున్న పూలను దోచేస్తున్నది
తోటమాలేనని మాకూ తెలుసు

ఎవరి వాటాలు
ఎంతెంతో తేల్చుకొని ఊరేగండి
కారుతున్న కన్నీటిచుక్కలను
ఓ దగ్గర కుప్పజేసి
మా నమ్మకాల్ని తగలెట్టేస్తాం

ముత్యపు చిప్పలో
అన్నీ ముత్యాలే ఉండవని
మరోసారి రుజువయింది

మీ గురించే మాట్లాడుతున్నది..



పండ్లనిచ్చే చెట్లను నరికే
కసాయి గొడ్డలి కరుకుతనం
కంటిముందు సాక్ష్యంగా
నిలబడింది

ఇరుకుతనపు గుండెల్లోని
విషవాయువుల
ప్రకంపనాలే కదా
బుల్డోజర్లయి బయటికొచ్చింది


నింగి, నేల, ఇప్పుడు
మీ గురించే
మాట్లాడుతున్నాయి

నెమలి కళ్లల్లోంచి జారిపడ్డ
కన్నీటిచుక్కల్లో మీ ప్రతిబింబాలే
కనబడుతున్నాయి

చితికిన గుండెలమీద
ఆకుపచ్చని అడవుల మీద
ఉక్కుపాదం మోపటం గొప్ప
కాదు
తప్పిపోయిన జింకపిల్లను
తల్లి దగ్గరకు చేర్చటమే గొప్ప

- డా.తండ హరీష్,
8978439551

చరిత్ర నుండి నేర్వడమా? గతంపై ప్రతీకారమా?



రామ్ పునియానీ

1992లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కూటమి బాబ్రీ మసీదును కూల్చిన నాటి నుండి చరిత్ర, సామాజిక స్థలంపై ఆధిపత్యం చెలాయించడం ప్రారంభమైంది. రాజులు, వారి మతం ద్వారా చరిత్రను చూసే ఒక నిర్దిష్టమైన వైఖరిని సామాజిక లోకజ్ఞానంపై రుద్దుతున్నారు. ఇది కూడా ఎంపిక చేసిన విధంగానే జరుగుతోంది.

ఇంకొక అడుగు ముందుకు వేసి మతోన్మాద శక్తులు, చరిత్రను జాతీయవాదంతో ముడిపెడుతున్నాయి. ఆసక్తికరంగా, రాజ్యాల యుగం చరిత్రను జాతీయవాదంతో ముడిపెడుతున్నారు. జాతి రాజ్యం ఒక ఆధునిక దృగ్విషయమని, భారతదేశం అనే భావన వలస శక్తుల వ్యతిరేక పోరాటానికి సమాంతరంగా ఉద్భవించిందన్న వాస్తవాల్ని మర్చిపోతున్నారు.

ముస్లిం పాలకులకు వ్యతిరేకంగా పోరాడిన హిందూ రాజులను, మతోన్మాద శక్తులు నేడు దేశభక్తులుగా, గొప్ప జాతీయవాదులుగా, ఈ జాతి పుణ్యపురుషులుగా చిత్రీకరిస్తున్నాయి. మహాత్మా గాంధీ గుండెల్లోకి మూడు బుల్లెట్లు దించిన నాథూరామ్ గాడ్సే, తన సాక్ష్యంపై ఆధారపడి రాసిన "మే ఇట్ ప్లీజ్ యువర్ ఆనర్" అనే రచనలో గాంధీ గురించి వ్యాఖ్యానిస్తూ, ఛత్రపతి శివాజీ మహారాజ్ లేక రాణా ప్రతాప్ ల "జాతీయవాదానికి" భిన్నంగా ఆయన (గాంధీ) ఒక "మరుగుజ్జు" అని అన్నాడు.

నేడు, గాడ్సే భావజాలానికి చెందిన వారు మరింత తీవ్రంగా అదే విషయాన్ని పునరుద్ఘాటిస్తున్నారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ ఇటీవలే, చారిత్రాత్మక ఆక్రమణదారుల్ని స్తుతిస్తున్న వారిపై పదునైన దాడిని ప్రారంభించాడు. దాన్ని 'నూతన భారత దేశం' ఏ మాత్రం సహించని రాజద్రోహ చర్యగా పేర్కొన్నాడు. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్ జిల్లాలో మొగల్ పాలకుడు అయిన ఔరంగజేబు సమాధిని తొలగించాలనే డిమాండ్లు చేస్తున్న సందర్భంలో ఈ ఫైర్ బ్రాండ్ బీజేపీ నాయకుని వ్యాఖ్యలు చోటు చేసుకున్నాయి.

ఇదే రీతిలో ఆరెస్సెస్ సర్ కార్యావాహ్ (ప్రధాన కార్యదర్శి) దత్తాత్రేయ్ హొసబాలె, "భారత జాతికి వ్యతిరేకంగా ఉన్న వ్యక్తిని ఆరాధించడం సరైనదేనా అని ప్రశ్నించాడు. గంగా, జమున సంస్కృతి (హిందూ, ఇస్లామిక్ సాంస్కృతిక అంశాల కలయిక)ని సమర్థించే వారు, అలాంటి ఆలోచనకు ప్రారంభకుడైన ఔరంగజేబు అన్నయ్య దారా షికోను ఆరాధించాలనే ఆలోచన ఎందుకు చేయలేదని" ప్రశ్నించాడు.

ఇదంతా ఔరంగజేబును ఒక దురాక్రమణదారునిగా, క్రూరమైన వ్యక్తిగా చూపించే ఉద్దేశ్యంతో చెపుతున్నారు. ఈ మొత్తం ప్రకటనను విడమర్చి చూద్దాం.

దురాక్రమణదారులు ఎవరు? ఔరంగజేబు దురాక్రమణదారుడా? వాస్తవం ఏమిటంటే, ఔరంగజేబు తన సామ్రాజ్యాన్ని తన తండ్రి షాజహాన్ నుండి వారసత్వంగా పొందాడు. ఆ రాజవంశం, అప్పుడు కాబూల్‌లో పాలన చేస్తున్న బాబర్‌తో ప్రారంభమయ్యింది. ఢిల్లీ పాలకుడైన ఇబ్రహీం లోడీని ఓడించేందుకు రావాలని రణ సంఘ బాబర్‌కు ఉత్తరం పంపాడు. దాంతో, బాబర్ ఢిల్లీ సామ్రాజ్యాన్ని పాలించడానికి రణ సంఘ, ఇబ్రహీం లోడీతో పోరాటానికి దిగాడు. బాబర్ కంటే ముందే వాయువ్యం నుండి దండెత్తి వచ్చిన గ్రీకులు, కుషాణులు, హూణులు, శకులు ఇక్కడి ప్రజల్లో భాగమయ్యారు. ఇక్కడికి వచ్చిన వారిలో మొఘలులు మాత్రమే పాలకులు కాదు, స్థానిక రాజుల్ని ఓడించిన తర్వాత ఖిల్జీలు, గులాంలు, ఘజనీలు కూడా వచ్చారు. ఢిల్లీ నుండి పాలించబడిన దేశం, ప్రస్తుత భారత దేశం రూపంలో అప్పుడక్కడ లేదు. రాజులు, అధికారం, సంపద కోసం ఒకరితో ఒకరు పోట్లాడుకున్నారు. తూర్పున ఉన్న శకులు, హూణులు, కుషాణులు, అహోంలు లాంటి భిన్న ప్రజల పరస్పర కలయిక ఇక్కడ ప్రబలంగా ఉన్న బహు మత సిద్ధాంతాల, తాత్వికతల సమకాలీకరణను సృష్టించింది.



> జాతీయవాదం కోసం యుద్ధం జరగలేదు, అది ముస్సబ్ (అధికార హోదా లేక స్థానం) కోసం జరిగిన యుద్ధం. ఒకవేళ హిందూ జాతీయవాదులు, ముస్లింలకు వ్యతిరేకంగా పోరాడిన వారిని దేశానికి చెందిన మహాపురుషులుగా చూపించాలనుకుంటే, చరిత్ర మరింత సంక్లిష్టమవుతుంది. అది రాజులకు, రాజులకు మధ్య జరిగిన యుద్ధమే తప్ప హిందువులకు, ముస్లింలకు మధ్య జరిగిన యుద్ధం కాదు. అంటే, ముస్లిం రాజులంతా క్రూరమైన వారు, హిందూ రాజులు శాంతి దూతలు అని కూడా కాదు. కళింగ యుద్ధంలో అశోకుడు అపకీర్తి పాలయ్యాడు. చాళుక్యునితో చోళ రాజుల యుద్ధాన్ని అనేక విషయాలకు ఉదాహరణగా చెప్పవచ్చు. ఎందుకంటే, చోళుల సైన్యం, ఓడిపోయిన చాళుక్య రాజు సేనా నాయకుడైన సముద్రరాజు తలను నరికి, అతని కూతురు ముక్కును కోసివేసింది.

భారత జాతికి మహాపురుషుడు ఎవరు? యోగీ, గాడ్సేలు శివాజీ, రాణా ప్రతాప్‌లను మహాపురుషులుగా చూపుతున్నారు. శివాజీకి తన పాలనా విభాగంలో చాలామంది ముస్లిం సేనా నాయకులు, అధికార్లు ఉండేవారు. రాజా జైసింగ్ నేతృత్వంలోని ఔరంగజేబు సైన్యానికి వ్యతిరేకంగా ఆయన పోరాటం చేశాడు. రాణాప్రతాప్ హల్దీఘాటి ధైర్యసాహసాలు ప్రశంసించదగినవి. అయితే, అవి భారత జాతీయవాదం కోసం చేసిన పోరాటాన్ని సూచిస్తాయా? ఆయనకు 3000 మంది సైనికులు ఉన్నారు. వారిలో 1000 మంది హకీం ఖాన్ సూరే నేతృత్వంలోని పఠాన్లు. మరోవైపు అక్బర్‌కు మాన్‌సింగ్ సైన్యాధ్యక్షుడిగా పనిచేశాడు.

జాతీయవాదం కోసం యుద్ధం జరగలేదు, అది ముస్సబ్ (అధికార హోదా లేక స్థానం) కోసం జరిగిన యుద్ధం. ఒకవేళ హిందూ జాతీయవాదులు, ముస్లింలకు వ్యతిరేకంగా పోరాడిన వారిని దేశానికి చెందిన మహాపురుషులుగా చూపించాలనుకుంటే, చరిత్ర మరింత సంక్లిష్టమవుతుంది. అది రాజులకు, రాజులకు మధ్య జరిగిన యుద్ధమే తప్ప హిందువులకు, ముస్లింలకు మధ్య జరిగిన యుద్ధం కాదు. అంటే, ముస్లిం రాజులంతా క్రూరమైన వారు, హిందూ రాజులు శాంతి దూతలు అని కూడా కాదు. కళింగ యుద్ధంలో అశోకుడు అపకీర్తి పాలయ్యాడు. చాళుక్యునితో చోళ రాజుల యుద్ధాన్ని అనేక విషయాలకు ఉదాహరణగా చెప్పవచ్చు. ఎందుకంటే, చోళుల సైన్యం, ఓడిపోయిన చాళుక్య రాజు సేనా నాయకుడైన సముద్రరాజు తలను నరికి, అతని కూతురు ముక్కును కోసివేసింది.

రాజకీయంగా ప్రయోజనాలు పొందడానికి ఔరంగజేబును ఒక రాక్షసునిగా చిత్రీకరిస్తున్నారు. హింస, ఆవు మాంసం, లవ్ జీహాద్, ల్యాండ్ జీహాద్ వంటి సమస్యల వల్ల బెదిరింపులకు గురవుతూ, నిర్బంధానికి గురవుతున్న ముస్లింలలో ఒక వర్గం వారు ఔరంగజేబులో కొంత ఆత్మగౌరవాన్ని కనుగొనే ప్రయత్నం చేస్తున్నారు.

చరిత్ర గురించి మాట్లాడుకుంటే, దాన్ని వ్యక్తీకరించడానికి అనేక మార్గాలుంటాయి. హిందూ మతోన్మాదులు కుల, వర్ణ శ్రేణీగత వ్యవస్థల క్రూరత్వాలను, గతంలో మహిళలపై అణిచివేతను దాచి పెట్టాలని అనుకుంటున్నారు కాబట్టి, వారు రాజుల గురించి చాలా ఎక్కువ విషయాలను అతిగా ప్రదర్శిస్తున్నారు. బీ.ఆర్.అంబేద్కర్, భారతదేశ చరిత్రను బౌద్ధ మతం, బ్రాహ్మణ మతానికి మధ్య జరిగిన యుద్ధంగా చెపుతాడు. ఆయన చెప్పే మాట ప్రకారం, బౌద్ధ మతం, బ్రాహ్మణ మత కుల, వర్ణ విలువలకు వ్యతిరేకంగా ఒక విప్లవంగా ఉద్భవించింది. ఇది, భారతదేశంలో బౌద్ధమతం వ్యాప్తిని ఒక ప్రధాన మతంగా మార్చింది.

ఆగ్నేయాసియాలో అశోకుడు బౌద్ధమతాన్ని వ్యాప్తి చేసిన తర్వాత అది ఒక ప్రపంచ మతంగా కూడా మారింది. అంబేద్కర్ చెప్పే దాని ప్రకారం, ఈ విప్లవం తర్వాత పుష్యామిత్ర షుంగ్ నాయకత్వంలో ఒక వ్యతిరేక విప్లవం జరిగింది. పుష్యామిత్ర, బౌద్ధులను భౌతికంగా తుడిచిపెట్టాడు. అంబేద్కర్ తిరిగి తీసుకొని వచ్చేంతవరకు బౌద్ధ మతం భారతదేశంలో కనపడకుండా పోయింది.

నేడు భారతదేశంలో దళితులు, మహిళలపై జరుగుతున్న అకృత్యాలు మనకు కనపిస్తున్న వాస్తవాలు. వలస పాలనలోని సామాజిక సంస్కరణలు, అభద్రతలను (నేటికీ నేడు ఏదో ఒక రూపంలో కొనసాగుతున్నప్పటికీ) నీరుగార్చేలా చేశాయి. సంఘ సంస్కర్త రాజా రామ్మోహన్ రాయ్ భారతదేశానికి ఒక గొప్ప మహా పురుషుడు కాదా? కుల వ్యవస్థకు వ్యతిరేకంగా జ్యోతీరావ్ పూలే, అంబేద్కర్‌లు చేసిన పోరాటాల గురించి ఏమిటి? వారు భారత దేశపు మహాపురుషులు కాదా?

భగత్‌సింగ్, అష్ఫఖుల్లా ఖాన్ లాంటి వారి జాతిని ఎక్కడ ఉంచుతారు మీరు? ఇంకా భారతదేశ జ్ఞాపకాలలో సువర్ణాక్షరాలతో చెక్కబడిన గాంధీ, మౌలానా ఆజాద్, సర్దార్ పటేల్, నెహ్రూ, సుభాష్ చంద్రబోస్ లాంటి వారి పేర్లను ఎక్కడ ఉంచుతారు?

> నేడు భారతదేశంలో దళితులు, మహిళలపై జరుగుతున్న అకృత్యాలు మనకు కనపిస్తున్న వాస్తవాలు. వలస పాలనలోని సామాజిక సంస్కరణలు, అభద్రతలను (నేటికీ నేడు ఏదో ఒక రూపంలో కొనసాగుతున్నప్పటికీ) నీరుగార్చేలా చేశాయి. సంఘ సంస్కర్త రాజా రామ్మోహన్ రాయ్ భారతదేశానికి ఒక గొప్ప మహా పురుషుడు కాదా? కుల వ్యవస్థకు వ్యతిరేకంగా జ్యోతీరావ్ పూలే, అంబేద్కర్‌లు చేసిన పోరాటాల గురించి ఏమిటి? వారు భారత దేశపు మహాపురుషులు కాదా? భగత్‌సింగ్, అష్ఫఖుల్లా ఖాన్ లాంటి వారి జాతిని ఎక్కడ ఉంచుతారు మీరు? ఇంకా భారతదేశ జ్ఞాపకాలలో సువర్ణాక్షరాలతో చెక్కబడిన గాంధీ, మౌలానా ఆజాద్, సర్దార్ పటేల్, నెహ్రూ, సుభాష్ చంద్రబోస్ లాంటి వారి పేర్లను ఎక్కడ ఉంచుతారు?


ముస్లిం రాజుల క్రూరత్వానికి అత్యధిక ప్రాముఖ్యత ఇవ్వడం వల్ల హిందూ మత రాజ్య ప్రాజెక్టు కు రెండు ప్రయోజనాలు చేకూరుతాయి. ఒకవైపు అది మతపరమైన మైనార్టీలను లక్ష్యంగా చేసుకుంటుంది. మరొకవైపు మరీ ముఖ్యంగా సమాజంలోని బలహీన వర్గాలకు వ్యతిరేకంగా బ్రాహ్మణ మత వ్యవస్థ (హిందూ జాతీయవాదానికి పునాది) క్రూరత్వాలను అది దాచి పెడుతుంది.

ప్రధానమంత్రి దగ్గర నుంచి మహారాష్ట్ర ముఖ్యమంత్రి వరకు అందరూ 'ఛావా' సినిమాను ప్రశంసించారు. ఇప్పుడు ముఖ్యమంత్రి నాగ్‌పూర్‌లో మత ఉద్రిక్తతలకు అదే కారణమని నిందారోపణలు చేస్తున్నాడు. గతంలో దళితులు, మహిళలకు వ్యతిరేకంగా జరిగిన దారుణాలను చూపించే సినిమాలను ఇలాంటి పెద్దమనుషులు ప్రోత్సహిస్తారా? వాస్తవానికి దివంగత బీజేపీ నాయకురాలు విజయ రాజే సింధియా 'సతి' (భర్త చితిపై భార్యను దహనం చేయడం)ని సమర్థించిన విషయాన్ని ఒకసారి గుర్తుచేసుకోండి. ప్రస్తుతం యోగీ, ఫడ్నవిస్, హొసబలేలు మతతత్వ కార్డును పూర్తిస్థాయిలో వినియోగించుకుంటున్నారు.

("న్యూస్‌క్లిక్" సౌజన్యంతో)

అనువాదం: బోడపట్ల రవీందర్, 9848412451

పెద్దన్న ద్వారా గండ్రగొడ్డలికి పదును!




జి. తిరుపతయ్య
9951300016

అమెరికా ట్రేడ్‌వార్ కేవలం వాణిజ్యానికి మాత్రమే పరిమితం కావట్లేదు. తాము ఇష్టారీతిన పన్నులు విధించడం వారి అంతర్గత అంశం. తమ ఆదేశాల ప్రకారమే ఇతర దేశాలూ పన్నులు విధించాలన్నది ఆధిపత్యానికి సంకేతం. అంతటితో ఆగక తమ అదుపాజ్ఞల్లో ఇతర దేశాల ఆర్థిక విధానాలుండాలనడం దుర్మార్గం, క్షమించరానిది కూడా. ఈ కోవలో భారతదేశ అంతరంగిక వ్యాపారాల్లోనూ పెద్ద కుదుపు వచ్చే ప్రమాదం పొంచిఉన్నది. ఈరోజు అమెరికా ట్రేడ్ రిప్రజెంటేటివ్స్ (యూ.ఎస్.టి.ఆర్) అనబడే విదేశీ వ్యాపారాల విధానాలను మానిటర్ చేసే ఒక అమెరికా ఏజెన్సీ భారతదేశంలోని ప్రభుత్వ రంగ సంస్థ ఎల్ఐసి ఆఫ్ ఇండియా గురించి అర్థతకు మించిన వాదనే చేసింది. "ఎల్ఐసి ఆఫ్ ఇండియాకు ప్రభుత్వ గ్యారెంటీ ఉండడం వలన ప్రజలు ప్రయివేటు సంస్థలతో పోల్చిచూసి ఎల్ఐసి ఆఫ్ ఇండియాను ఎంచుకుంటున్నారు, ఇది స్వేచ్ఛా మార్కెట్లో పూర్తిగా వ్యతిరేకమైనటువంటి విధానం" అంటూ సాక్షాత్తు అమెరికన్ ప్రెసిడెంట్ ప్రయివేటు కార్యాలయం ఓవల్ ఆఫీస్ నుండి ప్రకటన వెలువడింది. నిజానికి ఇది ఇతర దేశాల అంతరంగిక అంశాలలో తలదూర్చడం. ఒకరకంగా చెప్పాలంటే భారత సార్వభౌమత్వాన్ని ప్రశ్నించడమే! దీనిపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాల్సింది. కానీ, అలా జరగలేదు. కానీ ఎల్ఐసి ఆఫ్ ఇండియా మాత్రం వెంటనే స్పందించి, ఎల్ఐసి ఆఫ్ ఇండియాపై ప్రజలు ఉంచుతున్న నమ్మకానికి, ప్రభుత్వ గ్యారంటీకి ఎలాంటి సంబంధం లేదని నిక్కచ్చిగా తేల్చి చెప్పిడంతో పాటు ప్రజా ప్రయోజనార్థం పత్రికా ప్రకటన విడుదల చేసింది. అమెరికా ఏజెన్సీ నుండి బయటపడిన ఇలాంటి అభిప్రాయం ప్రయివేటీకరణ వెనుక ఉన్న అసలు రహస్యాన్ని బయటపెట్టింది. భారతదేశంలో లైఫ్ ఇన్సూరెన్స్ సెక్టార్లో పనిచేస్తున్న 25 ప్రయివేటు కంపెనీల్లో మూడు మాత్రమే 26శాతం పెట్టుబడితో అమెరికాకు చెందిన కంపెనీలు పని చేస్తున్నాయి. అయితే వెలువడిన ఈ అభిప్రాయం కేవలం అమెరికా కంపెనీల ప్రయోజనాల కోసం మాత్రమే కాదు, మూకుమ్మడిగా ప్రయివేటు కంపెనీల, విదేశీ పెట్టుబడిదారుల దాడిగా భావించాల్సిందే.

1991లో నూతన ఆర్థిక విధానాల తలంటు పోసినప్పుడు, భారతదేశంలో ఇన్సూరెన్స్ సెక్టార్ ఏకస్వామ్యంగా ప్రభుత్వ ఆధీనంలో కాకుండా ప్రయివేటు సంస్థలకు కూడా అవకాశం ఇవ్వాలని మొదటిగా కోరారు; ఆ తర్వాత ప్రయివేటు సంస్థల్లో విదేశీ భాగస్వాములకు కూడా అవకాశం ఉండాలి అని రెండో ప్రతిపాదన చేశారు; విదేశీ భాగస్వాములకు కనీసం 26శాతం ఉండాలని కోరుకున్నారు; ఆ తర్వాత 26శాతం సరిపోదు 49 శాతం కావాలన్నారు, ఆ తర్వాత 74శాతం...ఆ కోరికలన్నీ తీర్చబడ్డాయి. ఆ తర్వాత 100శాతం. ఇలా ప్రయివేటు విదేశీ భాగ స్వాముల పెట్టుబడిని 100 శాతానికి పెంచుకోవడానికి అన్ని రకాల మార్గాలను సుగమం చేసుకున్నారు. అయినప్పటికీ దాహం తీరక ఇప్పుడు "విదేశీ పెట్టుబడి శాతాన్ని పెంచడం కాదు, మీ దేశంలో ప్రభుత్వ రంగంలో పని చేస్తున్నటువంటి మీ సంస్థ పూర్తిగా నాశనం కావాలి, అలా నాశనమైనప్పుడే మా ప్రయివేటు సంస్థలు పెరగడానికి అవకాశం ఉంటుంది" అనే దుర్మార్గమైన ఆలోచనని ఎక్కు పెట్టారు! టెలికాం రంగంలోకి ప్రయివేటు పార్టనర్లను అనుమతిస్తూ సాగిన క్రమం చూస్తే, బిఎస్ఎన్ఎల్ నిర్వీర్యం చేయడం కోసం దానికి 3జి,4జి, 5జి నెట్‌వర్క్ ఇవ్వకుండా బిఎస్ఎన్ఎల్ టవర్లను ప్రయివేటు కంపెనీలకు ధారాదత్తం చేస్తూ పూర్తిగా నష్ట పరిచారు. ప్రభుత్వ ఆధీనంలో ఏకస్వామ్యంగా ఉన్న సంస్థను పక్కనపెట్టి పోటీతత్వం ద్వారా అనేక కంపెనీలు ఉండాలని కోరుతున్నామని చెప్పి, ఈరోజు కేవలం రెండు కంపెనీల చేతిలో మాత్రమే భారత టెలికం వ్యవస్థ నడుస్తున్నది. ఇదే బాటలో భారత విమానరంగంలో ఎయిర్ ఇండియాకున్న ఏకస్వామ్యాన్ని ఓడించడం కోసం పోటీతత్వాన్ని సృష్టించి, క్రమేపి ఆ పోటీతత్వాన్ని తగ్గించి నేడు ఇండిగో, టాటాఎయిర్ సర్వీసెస్ మాత్రమే శాసిస్తున్నాయి. ఆ కోవలోకి ఇన్సురెన్సు, బ్యాంకింగ్ రంగాలను తేవాలనే ప్రయత్నాలను ప్రభుత్వాలే ప్రోత్సహిస్తుండటం బాధాకరం.

ఎల్ఐసి ఆఫ్ ఇండియా అప్రతిహత ప్రయాణం

1956లో ఎల్ఐసి ఆఫ్ ఇండియా జాతీయాకరించబడినప్పుడు కేంద్ర ప్రభుత్వం ఐదు కోట్ల పెట్టుబడి మాత్రమే పెట్టింది. 245 కంపెనీలను కలిపి జాతీయకరణ చేస్తూ వందశాతం వాటాను కేంద్ర ప్రభుత్వం తన పేరున చేసుకున్నది. ఏదైనా ఒక కంపెనీ వందశాతం యాజమాన్యం పొందిన తర్వాత సహజంగానే ఆ కంపెనీ చేసే లావాదేవీలన్నింటికీ యజమాని గ్యారెంటీ ఉంటాడన్న నిబంధన అత్యంత సహజమైనది. ఉదాహరణకు టాటా ఏఐజి కంపెనీ జరిపే లావాదేవీలకు యాజమాన్యమైన టాటా ఏఐజి గ్యారెంటీ కాక ఇంకెవరుంటారు? అందులో భాగంగా సెక్షన్ 37 ప్రకారం ప్రభుత్వ సావరిన్ గ్యారంటీ ఎల్ఐసికి ఉన్నది. 1956లో రూ.185 కోట్ల నికర ఆస్తులతో ఏర్పడిన ఎల్ఐసి ఆఫ్ ఇండియాలో భారత ప్రభుత్వము ఏనాడు కూడా ఒక్క రూపాయి కూడా పెట్టుబడి పెట్టలేదు. సరి కదా, ప్రతి ఏటా వేల కోట్ల రూపాయలను డివిడెంట్ రూపంలో తీసుకుంటూనే ఉన్నది. ఇప్పుడు 55 లక్షల కోట్ల రూపాయల ఆస్తులు కలిగిన భారతదేశ ఏకైక ప్రభుత్వ రంగ సంస్థగా రికార్డుకెక్కింది. ప్రస్తుతం 30 కోట్ల పాలసీదారులు ఎల్ఐసి సర్వీస్ పొందుతుండగా, ఇంతవరకు కోట్లకొలది పాలసీదారులకు డెత్ క్లెయిములు, మెచ్యూరిటీ క్లెయిములు చెల్లించింది. ఈ చెల్లింపుల కోసం ఏనాడు కూడా కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించిన సందర్భంగా లేదు. సంస్థ జాతీయాకరణ చేయబడినప్పటి నుండి ఇప్పటివరకు ప్రతి ఏటా పాలసీదారులకు బోనస్ చెల్లిస్తూనే మిగులును నమోదు చేస్తున్నది. ఇప్పుడు కూడా పాలసీదారులకు చెల్లించవలసిన లైఫ్ ఫండ్ కన్నా ఎల్ఐసి దగ్గర ఉన్న ఆస్తులు చాలా ఎక్కువ. ఐఆర్‌డిఏఆఇ బిల్లు పాస్ అయినప్పుడు ప్రతి ఇన్సూరెన్స్ సంస్థ సాల్వన్సి మార్జిన్ (బాధ్యతలను నెరవేర్చగల ఆర్థిక శక్తి) పాలసీదారులకు చెల్లించవలసిన మొత్తాల కన్నా ఒకటిన్నర రెట్లు ఉండాలని కోరినప్పుడు ప్రభుత్వ రంగ సంస్థ అయినప్పటికీ కూడా ఆ సాల్వెన్సీ మార్జిన్ విధానాన్ని పాటిస్తూ ఒకటిన్నర రెట్లు పాటించింది. ఈరోజు ఎల్ఐసి సాల్వెన్సీ మార్జిన్ ఎల్ఐసి 2.11గా ఉన్నది. విదేశీ భాగస్వాములతో ప్రయివేటు రంగంలో ప్రవేశించిన కంపెనీలు ఒకటిన్నర రెట్ల సాల్వెన్సీ మార్జిన్ కూడా పాటించడానికి ఇబ్బంది పడుతున్నాయి.



ఎల్ఐసిపై అమెరికా కంపెనీల అక్కసు

ఇక పాలసీదారులు ఎల్ఐసి వెంట ఎందుకు నడుస్తున్నారు? ప్రయివేట్ కంపెనీలతో పోలిస్తే, ఎల్ఐసి ని ఎందుకు ఎంచుకుంటున్నారంటే సంస్థ పుట్టినప్పటి నుండి ఇప్పటివరకు డెత్ క్లెయిములు చెల్లించడంలో 99 శాతానికి పైబడి రికార్డు నమోదు చేస్తుండగా ప్రయివేటు కంపెనీలేవి ఈ 25 ఏళ్ల కాలంలో దరిదాపున కూడా నిలవలేక పోతున్నాయి. బోనస్ చెల్లించడంలో, పాలసీల రేట్లు నిర్ణయించడంలో ఎల్ఐసి ఆఫ్ ఇండియా అత్యంత చౌకగా ఉందని గణాంకాలు చెబుతున్నాయి. అన్నింటిని మించి క్లెయిముల చెల్లింపులో పూర్తిగా పారదర్శకత పాటిస్తూ, ఎలాంటి పైరవీలకి అవకాశం లేకుండా చూస్తూ, అత్యంత నీతి నియమాలతో వ్యాపార లావాదేవీలను కొనసాగిస్తుంది కాబట్టి సహజంగానే ప్రజలు ఎల్ఐసిని తమ ప్రాధాన్యతగా పెంచుకోవడంలో అర్థముంది. ఈ దేశంలో పనిచేస్తున్న ప్రయివేటు సంస్థలు, వివిధ దేశాల ప్రయివేటు సంస్థలు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దూకుడుని వినియోగించుకోవాలనే దురుద్దేశంతో అమెరికా నుండి ఎల్ఐసి పై అక్కసు వెళ్లగక్కే ప్రయత్నం చేశారు. విదేశీ వాణిజ్య విధానాలను సైతం తమ అదుపాజ్ఞల్లో ఉంచుకోవాలనుకునే అమెరికాకు ఇదే అదు నుగా భావించి ఈ ప్రయత్నానికి దిగింది. దీన్ని దీటుగా ఎదుర్కొని రాజకీయ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. దురదృష్ట వశాత్తు నేటి పాలన అమెరికా అడుగులకు మడుగులొత్తేలా ఉన్నది. స్వదేశీ అనేది ఒక నినాదం కాకూడదు, అది దేశీయ కంపెనీలను ధారాదత్తం కాకుండా చూసుకునే బాధ్యతై ఉండాలి. అయితే ఈ రకమైన దాడులను ఎదుర్కోవడానికి రాజకీయాలకన్నా కార్మిక సంఘాలే ప్రధాన పాత్ర ఇప్పటివరకు పోషిస్తూ వచ్చాయి. ఇక ముందు కూడా ఆ ప్రయత్నాలు జరగాల్సిందే. ■

> 1991లో నూతన ఆర్థిక విధానాల తలంటు పోసినప్పుడు, భారతదేశంలో ఇన్సూరెన్స్ సెక్టార్ ఏకస్వామ్యంగా ప్రభుత్వ ఆధీనంలో కాకుండా ప్రయివేటు సంస్థలకు కూడా అవకాశం ఇవ్వాలని మొదటిగా కోరారు; ఆ తర్వాత ప్రయివేటు సంస్థల్లో విదేశీ భాగస్వాములకు కూడా అవకాశం ఉండాలి అని రెండో ప్రతిపాదన చేశారు; విదేశీ భాగస్వాములకు కనీసం 26శాతం ఉండాలని కోరుకున్నారు; ఆ తర్వాత 26శాతం సరిపోదు 49 శాతం కావాలన్నారు, ఆ తర్వాత 74శాతం...ఆ కోరికలన్నీ తీర్చబడ్డాయి. ఆ తర్వాత 100శాతం. ఇలా ప్రయివేటు విదేశీ భాగ స్వాముల పెట్టుబడిని 100 శాతానికి పెంచుకోవడానికి అన్ని రకాల మార్గాలను సుగమం చేసుకున్నారు. అయినప్పటికీ దాహం తీరక ఇప్పుడు "విదేశీ పెట్టుబడి శాతాన్ని పెంచడం కాదు, మీ దేశంలో ప్రభుత్వ రంగంలో పని చేస్తున్నటువంటి మీ సంస్థ పూర్తిగా నాశనం కావాలి, అలా నాశనమైనప్పుడే మా ప్రయివేటు సంస్థలు పెరగడానికి అవకాశం ఉంటుంది" అనే దుర్మార్గమైన ఆలోచనని ఎక్కు పెట్టారు!

లక్నో సూపర్ విక్టరీ

లక్నో సూపర్ జెయింట్స్ సొంతగడ్డపై తొలి విజయం సాధించింది. ముంబయి ఇండియన్స్‌పై 12 పరుగుల తేడాతో సూపర్ విక్టరీ నమోదు చేసింది. ఛేదనలో సూర్యకుమార్ యాదవ్ (67), నమన్ ధిర్ (46) మెరిసినా ఐదుసార్లు చాంపియన్‌కు భంగపాటు తప్పలేదు. ఓపెనర్లు మిచెల్ మార్ష్ (60), ఎడెన్ మార్‌క్రామ్ (53) అర్థ సెంచరీలతో లక్నో తొలుత 203 పరుగుల భారీ స్కోరు చేసింది. లక్నోకు ఇది రెండో విజయం కాగా, ముంబయికి ఇది మూడో పరాజయం.

ఛేదనలో ముంబయి తడబాటు
లక్నో 203/8, ముంబయి 191/5




నవతెలంగాణ-లక్నో

లక్నో సూపర్‌జెయింట్స్ గెలుపు బాట పట్టింది. ఆదివారం జరిగిన ఐపీఎల్18 లీగ్ మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్‌పై 12 పరుగుల తేడాతో గెలుపొందింది. 204 పరుగుల ఛేదనలో ముంబయి ఇండియన్స్ తేలిపోయింది. సూర్యకుమార్ యాదవ్ (67, 43 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్), నమన్ ధిర్ (46, 24 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధనాధన్ ఇన్నింగ్స్‌లతో మెరిసినా.. తిలక్ వర్మ (25, 23 బంతుల్లో 2 ఫోర్లు), హార్దిక్ పాండ్య (28 నాటౌట్, 16 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) ఆశించిన వేగంతో పరుగులు చేయలేదు. 20 ఓవర్లలో 5 వికెట్లకు 191 పరుగులే చేసిన ముంబయి ఇండియన్స్ సీజన్లో మూడో పరాజయం మూటగట్టుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్‌జెయింట్స్‌కు ఓపెనర్ మిచెల్ మార్ష్ (60, 31 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఎడెన్ మార్‌క్రామ్ (53, 38 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్థ సెంచరీలతో భారీ స్కోరు అందించారు. కెప్టెన్ రిషబ్ పంత్ (2) పేలవ ఫామ్ కొనసాగించగా.. నికోలస్ పూరన్ (12) నిరాశపరిచాడు. ఆయుశ్ బదాని (30, 19 బంతుల్లో 4 ఫోర్లు), డెవిడ్ మిల్లర్ (27, 14 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) ఆఖర్లో రాణించారు. ముంబయి ఇండియన్స్ పేసర్ హార్దిక్ పాండ్య (5/36) ఐపీఎల్ కెరీర్‌లో తొలి ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. ఐపీఎల్‌లో ఐదు వికెట్లు పడగొట్టిన తొలి కెప్టెన్‌గా హార్దిక్ రికార్డు నెలకొల్పాడు.

సూర్యకుమార్ మెరిసినా..

ఓపెనర్లు విల్ జాక్స్ (5), రియాన్ రికెల్టన్ (10) విఫలమైనా.. ఛేదనలో సూర్యకుమార్ యాదవ్ (67) అర్థ సెంచరీతో మెరవటంతో ముంబయి ఇండియన్స్ టార్గెట్ దిశగా సాగింది. నమన్ ధిర్ (46) సైతం మెరుపు ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. ఈ ఇద్దరు క్రీజులో ఉండగా ముంబయి ఇండియన్స్ గెలుపు లాంఛనమే అనిపించింది. కానీ సూర్యకుమార్ నిష్క్రమణతో కథ మారింది. ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన యువ బ్యాటర్ తిలక్ వర్మ (25) దూకుడు ఆడేందుకు ఇబ్బంది పడ్డాడు. 23 బంతుల్లో రెండు ఫోర్లతో 23 పరుగులే చేసిన తిలక్ వర్మ..సొంత జట్టును నిరాశపరిచాడు. డెత్ ఓవర్లలో బౌండరీలు అవసరమైన వేళ సైతం తిలక్ సింగిల్స్‌కే పరిమితం అయ్యాడు. చివరి 12 బంతుల్లో 29 పరుగులు అవసరమైన వేళ బంతి అందుకున్న శార్దుల్ ఠాకూర్.. 19వ ఓవర్లో ఏడు పరుగులే ఇచ్చాడు. ఇక్కడే మ్యాచ్ లక్నో వైపు మొగ్గింది. దూకుడుగా ఆడటంలో తేలిపోయిన తిలక్ వర్మను ముంబయి రిటైర్డ్ ఔట్‌గా వెనక్కి పిలిచినా.. ఫలితంలో మార్పు లేదు. ఆఖరు ఓవర్లో 22 పరుగులు అవసరం కాగా.. హార్దిక్ పాండ్య (28 నాటౌట్) తొలి బంతిని సిక్సర్‌గా మలిచి, తర్వాత తేలిపోయారు. చివరి రెండు ఓవర్లలో శార్దుల్, అవేశ్ ఖాన్ అద్భుత బౌలింగ్ ప్రదర్శన లక్నో సూపర్‌జెయింట్స్‌ను విజేతగా నిలిపింది.



టీ20 ఫార్మాట్‌లో బ్యాటింగ్ విధ్వంసానికి సరికొత్త నిర్వచనం రచించిన జట్టు సన్‌రైజర్స్ హైదరాబాద్. ధనాధన్ దంచికొట్టుడులో ఇప్పుడు ప్రతి జట్టు ఆరెంజ్ ఆర్మీ బాటలో నడిచేందుకు సిద్ధమవుతుంది!. ఐపీఎల్18లో బలమైన బ్యాటింగ్ లైనప్ నిరాశపరచగా.. బౌలింగ్‌లో ఏమాత్రం పస లేకుండా పోయింది. సీజన్లో హ్యాట్రిక్ ఓటమి చూసిన సన్‌రైజర్స్ బౌలింగ్ మారకుంటే.. రానున్న మ్యాచుల్లో ఫలితంలో మార్పు కష్టమే!.

ఈ బౌలింగ్‌తో కష్టమే!

పసలేని సన్‌రైజర్స్ బౌలింగ్
కనిపించని పేస్, స్పిన్ మ్యాజిక్

నవతెలంగాణ క్రీడావిభాగం

రాజస్థాన్ రాయల్స్‌పై 286 పరుగుల రికార్డు స్కోరు బాదిన సన్‌రైజర్స్ హైదరాబాద్ గత సీజన్ జోరు కొనసాగించింది. కానీ ఆ తర్వాత వరుసగా మూడు మ్యాచుల్లో దారుణ పరాజయాలు చవిచూసింది. లక్నో సూపర్‌జెయింట్స్, ఢిల్లీ క్యాపిటల్స్, కోల్‌కత నైట్‌రైడర్స్‌లు సన్‌రైజర్స్‌పై అలవోక విజయాలు సాధించాయి. నాలుగు మ్యాచుల్లో ఒక్క విజయమే సాధించిన సన్‌రైజర్స్ పాయింట్ల పట్టికలో పదో స్థానానికి పడిపోయింది. సన్‌రైజర్స్ ఓటమిలో బ్యాటర్ల వైఫల్యం సుస్పష్టం. కానీ బౌలర్లు అంతకంటే దారుణంగా విఫలం అయ్యారు. కోల్‌కత నైట్‌రైడర్స్ 15 ఓవర్లలో 122/4తో ఉండగా.. సన్‌రైజర్స్ టార్గెట్ 170-180 మధ్య ఉండేలా కనిపించింది. కానీ ఆఖరు ఐదు ఓవర్లలో 78 పరుగులు సమర్పించిన బౌలర్లు ఛేదించాల్సిన లక్ష్యాన్ని 201 పరుగులు చేశారు. అంతిమంగా, బ్యాటర్లపై ఇది ఒత్తిడికి కారణమై ఛేదనలో సన్‌రైజర్స్ పతనమైంది. ఆదివారం ఉప్పల్ స్టేడియంలో గుజరాత్ టైటాన్స్‌తో సన్‌రైజర్స్ తలపడనుంది. టైటాన్స్‌తో మ్యాచ్‌లోనైనా బౌలింగ్ పదును మెరుగైతే.. సీజన్లో రెండో విజయం ఆశించవచ్చు.

అందరిదీ ఒకే కథ

సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్లలో ఒకరు మెరుగ్గా, మకొకరు దారుణంగా రాణిస్తున్నారని చెప్పడానికి లేదు. పేసర్లు, స్పిన్నర్లు అందరూ సమిష్టిగా దారుణ ప్రదర్శన కనబరుస్తున్నారు. వికెట్ల వేటలో, ఎకానమీలో, సగటులో ఉత్తమ బౌలర్ల జాబితాలో సన్‌రైజర్స్ ఆటగాళ్లు కనిపించరు. కెప్టెన్ పాట్ కమిన్స్ నాలుగు మ్యాచుల్లో 13 ఓవర్లు వేసినా 3 వికెట్లే



తీసుకున్నాడు. 12.30 ఎకానమీ, 53.33 సగటుతో 78 బంతుల్లో 160 పరుగులు ఇచ్చాడు. మహ్మద్ షమి నాలుగు మ్యాచుల్లో 13 ఓవర్లు వేయగా.. 78 బంతుల్లో 130 పరుగులు ఇచ్చాడు. ఎకానమీ 10.00, సగటు 43.33. ఆసీస్ స్పిన్నర్ ఆడం జంపా రెండు మ్యాచుల్లో 8 ఓవర్లు సంధించాడు. 48 బంతుల్లో 94 పరుగులు ఇచ్చిన జంపా.. 11.75 ఎకానమీ, 47.00 సగటు నమోదు చేశాడు. ఓవర్‌కు పది కంటే తక్కువ పరుగులు ఇచ్చింది ఇద్దరు మాత్రమే. పేసర్ హర్షల్ పటేల్ 78 బంతుల్లో 122 పరుగులిచ్చాడు. సగటు 30.50 కాగా, ఎకానమీ 9.38. పార్ట్‌టైమ్ స్పిన్నర్ అభిషేక్ శర్మ 42 బంతుల్లో 64 పరుగులు ఇచ్చాడు. ఎకానమీ 9.14. జీషన్ అన్సారీ (9.57), సిమ్రన్ జీత్ సింగ్ (13.44) సైతం ధారాళంగా పరుగులు ఇస్తున్నారు.

అతడి లోటు స్పష్టం

సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు బౌలింగ్ టీమ్‌గా మంచి పేరుండేది. స్వల్ప స్కోర్లను సైతం కాపాడుకునే అద్భుతమైన బౌలర్లు సన్‌రైజర్స్ శిబిరంలో ఉండేవారు. పవర్‌ప్లేలో నిలకడగా వికెట్లు పడగొట్టే పేసర్ భువనేశ్వర్ కుమార్ ఈ సీజన్‌లో సన్‌రైజర్స్‌కు ఆడటం లేదు. రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌కు ఆడుతున్న భువనేశ్వర్ ఆ జట్టు బౌలింగ్‌ను బలోపేతం చేశాడు. ఈ సీజన్లో అత్యుత్తమ ఎకానమీలో భువనేశ్వర్ టాప్-3లో ఉన్నాడు. కుల్దీప్ 5.25, మొయిన్ అలీ 5.75 ఎకానమీ నమోదు చేయగా.. భువీ 6.14 ఎకానమీతో స్వింగ్ సత్తా చూపిస్తున్నాడు. ఈ ఏడాది సన్‌రైజర్స్‌కు కొత్త బంతితో బ్రేక్ అందించే పేసర్ కరువయ్యాడు. తొలి నాలుగు మ్యాచుల్లో సన్‌రైజర్స్ ప్రత్యర్థి బౌలర్లకు 36 వికెట్లు కోల్పోయింది. ఇందులో రెండు సార్లు ఆలౌట్ అయ్యారు. ఇదే సమయంలో నాలుగు మ్యాచుల్లో మన బౌలర్లు ప్రత్యర్థి శిబిరంలో 20 వికెట్లు మాత్రమే పడగొట్టారు. రాయల్స్ 242 పరుగులు చేయగా.. లక్నో 16.1 ఓవర్లలోనే 193 పరుగులు కొట్టింది. ఢిల్లీ సైతం 16 ఓవర్లలో 166 పరుగులు చేసింది. ఏ మ్యాచ్‌లోనూ ప్రత్యర్థి బ్యాటర్లను సన్‌రైజర్స్ బౌలర్లు ఇబ్బంది పెట్టలేకపోయారు. ఈ పరిస్థితిలో మార్పు వస్తేనే.. మ్యాచ్ ఫలితంలో మార్పు ఆశించవచ్చు. హ్యాట్రిక్ పరాజయాల నైరాశ్యంలో ఉన్న సన్‌రైజర్స్ హైదరాబాద్.. తర్వాతి రెండు మ్యాచులను సొంతగడ్డపై ఆడనుండటం శుభ పరిణామం. ఉప్పల్ స్టేడియంలో, సొంత అభిమానుల నడుమ పుంజుకునేందుకు అవకాశాలు మెరుగ్గా ఉంటాయి. గుజరాత్ టైటాన్స్‌తో ఆదివారం తలపడనున్న సన్‌రైజర్స్.. ఏప్రిల్ 12న పంజాబ్ కింగ్స్‌తో ఢీకొట్టనుంది. ఈ రెండు మ్యాచుల్లో నెగ్గితేనే సన్‌రైజర్స్ మళ్లీ జోరందుకోగలదు.

కెప్టెన్‌గా ధోని?

ఢిల్లీతో మ్యాచ్‌కు సారథ్య పగ్గాలు!



చెన్నై : మహేంద్రసింగ్ ధోని మళ్లీ చెన్నై సూపర్ కింగ్స్ సారథ్య పగ్గాలు అందుకోనున్నాడు!. శనివారం చెపాక్ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌కు సూపర్‌కింగ్స్ రెగ్యులర్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ అందుబాటులో ఉండే అవకాశం లేదు. ఎల్బో గాయానికి గురైన రుతురాజ్ గైక్వాడ్ వంద శాతం ఫిట్‌నెస్ సాధించలేదు. దీంతో అతడి స్థానంలో ఎం.ఎస్ ధోని తాత్కాలిక కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టనున్నాడు. ఈ విషయాన్ని సూపర్‌కింగ్స్ బ్యాటింగ్ కోచ్ మైక్ హస్సీ మీడియా సమావేశంలో వెల్లడించాడు. 'రుతురాజ్ గైక్వాడ్ ఫిట్‌నెస్ సాధిస్తాడని ఆశిస్తున్నాం. నెట్స్‌లో సాధన చేస్తాడని అనుకుంటున్నాం. గైక్వాడ్ గాయానికి ఇంకా వాపు ఉంది. కానీ రోజు రోజుకు మెరుగవుతున్నాడు. క్యాపిటల్స్‌తో మ్యాచ్‌కు అందుబాటులో ఉంటాడని భావిస్తున్నాం. రుతురాజ్ దూరమైనా... కెప్టెన్సీ గురించి పెద్దగా ఆలోచన లేదు. రుతురాజ్, ఫ్లెమింగ్‌లకు ఓ ఆలోచన ఉంది. మా యువ వికెట్ కీపర్‌కు సారథ్యంలో అనుభవం ఉంది. అతడు కెప్టెన్సీ చేయగలడు' అని మైక్ హస్సీ ఎం.ఎస్ ధోని కెప్టెన్సీపై అభిమానులకు కిక్కిచ్చే వార్తను అందించాడు. రుతురాజ్ గైక్వాడ్ స్థానం కోసం ఆంధ్ర యువ క్రికెటర్ షేక్ రషీద్ పోటీపడుతున్నాడు.

బుమ్రా రాక ఆలస్యం!

మరో రెండు మ్యాచులకు అనుమానమే



బెంగళూర్ : ముంబయి ఇండియన్స్ స్టార్ పేసర్ జశ్‌ప్రీత్ బుమ్రా ఐపీఎల్18లో అడుగు పెట్టేందుకు మరింత సమయం పట్టనుంది. గాయంతో చాంపియన్స్ ట్రోఫీ సహా ఐపీఎల్‌లో తొలి దశ మ్యాచులకు దూరమైన జశ్‌ప్రీత్ బుమ్రా ప్రస్తుతం బెంగళూర్‌లోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఫిట్‌నెస్ కసరత్తులు చేస్తున్నాడు. ప్రాక్టీస్ సెషన్‌లో బుమ్రా వర్క్ లోడ్‌ను పెంచినా, సౌకర్యవంతంగా బౌలింగ్ చేస్తున్నట్టు సమాచారం. త్వరలోనే బుమ్రాకు తుది రౌండ్ ఫిట్‌నెస్ పరీక్ష నిర్వహించే అవకాశం కనిపిస్తోంది. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నుంచి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లభిస్తేనే ఐపీఎల్‌లో ఆడేందుకు లైన్ క్లియర్ కానుంది. జూన్ 28 నుంచి ఇంగ్లాండ్‌తో భారత్ ఐదు టెస్టుల సిరీస్ ఆరంభం కానుండటంతో బుమ్రా ఫిట్‌నెస్‌పై బీసీసీఐ జాగ్రత్త పడుతోంది. బుమ్రా గైర్హాజరీలో యువ ఆటగాళ్లు సత్యనారాయణరాజు, విగ్నేష్ పుతుర్, అశ్వని కుమార్‌లకు ముంబయి ఇండియన్స్ అవకాశాలు కల్పించింది. ఐపీఎల్‌లో తొలి నుంచి (2013) ముంబయి ఇండియన్స్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న బుమ్రా.. ఏప్రిల్ 7న ముంబయిలో జరుగనున్న మ్యాచ్‌కు సైతం అందుబాటులో ఉండే అవకాశం లేదు. ముంబయి ఇండియన్స్ లీగ్ దశ చివరి ఏడు మ్యాచులకు పేస్ దళపతి అందుబాటులో ఉండనున్నట్టు సమాచారం.

నవచిత్రం


సమ్మర్ స్పెషల్‌గా రిలీజ్



నవీన్ చంద్ర

హీరో నవీన్ చంద్ర నటించిన బైలింగ్వల్ థ్రిల్లర్ 'లెవెన్'. గతంలో సుందర్ సి వద్ద 'కలకలప్పు 2', 'వంద రాజవతాన్ వరువేన్', 'యాక్షన్' వంటి చిత్రాలకు అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేసిన లోకేశ్ అజ్ల్స్ దర్శకత్వం వహించారు.
ఏఆర్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై అజ్మల్ ఖాన్, రేయా హరి నిర్మించారు. విమర్శకుల ప్రశంసలు పొందిన 'సిలా నేరంగలిల్ సిలా మణిధర్గల్, సెంబి' చిత్రాల విజయం తర్వాత ఈ నిర్మాతలు నిర్మిస్తున్న మూడవ చిత్రమిది.
అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ వేసవి కానుకగా మే 16న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేస్తున్నట్లు మేకర్స్ అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు.
రిలీజ్ డేట్ పోస్టర్ ఒక ఇంటెన్స్ కథనాన్ని ప్రజెంట్ చేస్తోంది. నవీన్ చంద్ర, శశాంక్, ఆడుకలం నరేన్ పోలీసులుగా, ముసుగు ధరించిన వ్యక్తిగా ఇంటెన్స్ ఎక్స్‌ప్రెషన్ చాలా క్యురియాసిటీని పెంచుతోంది. 'సిలా నేరంగలిల్ సిలా మణిధర్గల్'లో నటించిన రేయా హరి ఇందులో కథానాయికగా నటించింది. అభిరామి, రవివర్మ, కిరీటి దామరాజు తదితర తారాగణం కీలక పాత్రల్లో నటించింది. ఈ చిత్రానికి డి.ఇమ్మాన్ సంగీతం అందించగా, కార్తీక్ అశోకన్ సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు. శ్రీకాంత్ ఎన్.బి.ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు.

బ్యూటీఫుల్ మెలోడీ
'ఒక్కసారిగా..'



ఇంద్రా రామ్, పాయల్ రాధాకృష్ణ

డైరెక్టర్ త్రినాథరావు నక్కిన క్రైమ్-కామెడీ డ్రామా 'చౌర్య పాఠం' సినిమాతో నిర్మాణ రంగంలోకి అడుగు పెడుతున్నారు. ఇంద్రా రామ్‌ను హీరోగా, 'కార్తికేయ -2' వంటి చిత్రానికి చందూ మొండేటి వద్ద అసోసియేట్ డైరెక్టర్‌గా పని చేసిన నిఖిల్ గొల్లమారిని దర్శకునిగా పరిచయం చేస్తున్నారు.
నక్కిన నెరేటివ్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ మూవీకి వి చూడామణి సహ నిర్మాత. ఈ చిత్ర టీజర్ థ్రిల్లింగ్ క్రైమ్, డార్క్ హ్యూమర్ బ్లెండ్‌తో ఇప్పటికే బజ్ క్రియేట్ చేసింది.
హీరో నాగ చైతన్య లాంచ్ చేసిన ప్రమోషనల్ సాంగ్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. అలాగే 'ఆడ పిశాచం..' సాంగ్ వైరల్ అయ్యింది. శుక్రవారం హీరో వరుణ్ తేజ్ ఈ సినిమా నుంచి 'ఒక్కసారిగా' సాంగ్‌ను లాంచ్ చేశారు.
దావ్‌జాండ్ ఈ సాంగ్‌ని లవ్లీ మెలోడీగా కంపోజ్ చేశారు. అనురాగ్ కులకర్ణి సాంగ్‌ని పాడిన విధానం మరింత ఆకట్టుకుంది. కృష్ణ కాంత్ రాసిన లిరిక్స్ బ్యూటీఫుల్‌గా ఉన్నాయి. ఈ సాంగ్‌లో లీడ్ పెయిర్ కెమిస్ట్రీ ఆకట్టుకుంది. ఈ సాంగ్ ఇన్‌స్టంట్ హిట్ గా నిలిచింది. ఈ చిత్రంలో పాయల్ రాధాకృష్ణ కథానాయికగా నటిస్తుండగా, రాజీవ్ కనకాల, మస్త్ అలీ ముఖ్యమైన కీలక పాత్రలను పోషిస్తున్నారు. సినిమాటోగ్రాఫర్ కార్తీక్ ఘట్టమనేని ఈ చిత్రానికి కథ రాశారు. అలాగే ఆయన సినిమాటోగ్రఫీ కూడా అందిస్తున్నారు. ఈ సినిమా ఈనెల 18న థియేటర్లలోకి రాబోతోంది.

మరిన్ని మంచి సినిమాలతో అలరిస్తా..



సంపూర్ణేష్ బాబు

"హృదయ కాలేయం' సినిమాతో బర్నింగ్ స్టార్‌గా ప్రేక్షకుల అభిమానం పొందారు సంపూర్ణేష్ బాబు. దర్శకుడు సాయి రాజేశ్ రూపొందించిన ఈ సినిమా 11 ఏళ్ల కిందట రిలీజై, సూపర్ హిట్ అందుకుంది.
ఈ సినిమా 11వ యానివర్సరీ సందర్భంగా హీరో సంపూర్ణేష్ బాబు మీడియాతో మాట్లాడుతూ,'నరసింహా చారిగా చిన్న పల్లెటూరి నుంచి వచ్చిన నన్ను 'హృదయకాలేయం' సినిమాతో సంపూర్ణేష్ బాబుగా మార్చారు దర్శక, నిర్మాత సాయి రాజేష్. ఆ సినిమా రిలీజ్ టైమ్‌లో దర్శకులు రాజమౌళి చేసిన ట్వీట్ వల్ల నాకు ఎంతో గుర్తింపు దక్కింది. ఎప్పుడు కలిసినా సంపూ ఎలా ఉన్నావు ఆయన పలకరిస్తారు. ఆయన సినిమాలో అవకాశం వస్తే అంతకంటే కావాల్సింది ఏముంది?, అలాగే సందీప్ కిషన్, మారుతి, తమ్మారెడ్డి భరద్వాజ ఎంతో సపోర్ట్ చేశారు. 11 ఏళ్లయినా ఇప్పటికీ ఈ సినిమా గురించి ప్రేక్షకులు మాట్లాడుకోవడం సంతోషంగా ఉంది. ఈ 11 ఏళ్లలో హీరోగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా పలు చిత్రాల్లో నటించాను. 'సోదరా' మూవీతో ఈ నెల 25న మీ ముందుకు రాబోతున్నాను. అలాగే మరో రెండు సినిమాలు రిలీజ్‌కు ఉన్నాయి. నా సంపాదనలో కొంత ఛారిటీకి ఇవ్వడం ఎంతో సంతృప్తిని కలిగిస్తోంది. ఎలాంటి పాత్రల్ని పోషించడానికైనా సిద్ధంగా ఉన్నా. త్వరలో మరిన్ని మంచి మూవీస్‌తో ప్రేక్షకులను అలరిస్తాను' అని చెప్పారు.

'శిల్పి ఎవరో..'తో పాటల సదండి షురూ



కేతిక శర్మ, శ్రీవిష్ణు, ఇవానా

గీతా ఆర్ట్స్ బ్యానర్‌లో హీరో శ్రీ విష్ణు నటిస్తున్న చిత్రం '#సింగిల్'. కార్తీక్ రాజు దర్శకుడు. అల్లు అరవింద్ సమర్పణలో కళ్యా ఫిల్మ్స్‌తో కలిసి ఈ చిత్రాన్ని విద్యా కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరి నిర్మిస్తున్నారు. వేసవిలో విడుదల కానున్న ఈ చిత్రం నుంచి మేకర్స్ ఫస్ట్ సింగిల్ 'శిల్పి ఎవరో..' రిలీజ్ చేయడంతో మ్యూజిక్ ప్రమోషన్స్‌ని స్టార్ట్ చేశారు.
విశాల్ చంద్ర శేఖర్ సంగీత దర్శకుడిగా తన వెర్సటాలిటీని ప్రజెంట్ చేసే ఒక సోల్‌ఫుల్ రొమాంటిక్ మెలోడీని కంపోజ్ చేశారు. శ్రీమణి రాసిన సాహిత్యం, హీరో శ్రీ విష్ణు తన జీవితంలోని ఇద్దరు స్పెషల్ అమ్మాయిలు కేతిక శర్మ, ఇవానా అందం పట్ల ప్రశంసలను కురిపిస్తూ పాడే ఈ పాట ఆకర్షణను పెంచుతుంది. యాజిన్ నిజార్ సోల్‌ఫుల్ వోకల్స్‌తో సాంగ్‌ని అద్భుతంగా అలపించారు. బ్యూటీఫుల్ విజువల్స్‌తో ఈ సాంగ్‌లో శ్రీ విష్ణు క్యారెక్టర్ చార్మ్ అద్భుతంగా ఉంది. ఈ సినిమా మే 9న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది అని చిత్రయూనిట్ తెలిపింది.
వెన్నెల కిషోర్ కీలక పాత్రలో నటిస్తున్న ఈచిత్రానికి సమర్పణ: అల్లు అరవింద్, రచన, దర్శకత్వం: కార్తీక్ రాజు, నిర్మాతలు: విద్యా కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరి, సంగీతం: విశాల్ చంద్ర శేఖర్, డిఓపి: ఆర్ వెల్‌రాజ్, ఎడిటర్: ప్రవీణ్ కెఎల్, డైలాగ్స్: భాను భోగవరపు, నందు సవిరిగాన, ఆర్ట్: చంద్రికా గొర్రెపాటి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అజయ్ గద్దె.

ప్రముఖ దర్శకుడు మనోజ్‌కుమార్ కన్నుమూత



మనోజ్ కుమార్

మనోజ్‌కుమార్.. ఈ పేరు వినగానే స్ఫూర్తి కలిగించే ఎన్నో దేశభక్తి చిత్రాలు గుర్తొస్తాయి. అంతేకాదు ఎన్నో విభిన్న పాత్రల్ని పోషించిన 'భరత్‌కుమార్' కూడా గుర్తొస్తారు.
అలాగే బాలీవుడ్ బాక్సాఫీస్‌ని షేక్ చేసిన సంచలన దర్శకుడిగానూ మదిలో మెదులు తారు. నటుడిగా, దర్శకుడిగా, రచయితగా, ఎడిటర్‌గా, ప్రజానాయకుడిగా అటు ప్రేక్షకులు, ఇటు ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసిన ఘనత మనోజ్‌కుమార్ సొంతం.
గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయన ముంబయిలోని ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచారు.
తమ అభిమాన నటుడు, దర్శకుడు ఇకలేరనే వార్తను ఆయన అభిమానులను, బాలీవుడ్‌ని శోకసంద్రంలో ముంచెత్తింది.

- భారతీయ సినీ చరిత్రలో తనకంటూ ఓ ప్రత్యేకతను సొంతం చేసుకున్న మనోజ్‌కుమార్ అసలు పేరు హరికిషన్ గిరి గోస్వామి. చిన్నప్పట్నుంచే సినిమాలంటే మక్కువ. బ్యాచ్‌లర్ ఆఫ్ ఆర్ట్స్‌లో పట్టా తీసుకుని సినిమాల్లో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు.
- 1957లో రూపొందిన 'ఫ్యాషన్' చిత్రంతో తొలిసారి వెండితెరపై కనిపించారు. 1961లో తెరకెక్కిన 'కాంచ్ కి గుడియా' చిత్రంతో హీరోగా ప్రేక్షకులకు పరిచయం అయ్యారు. 1962లో విజయ్ భట్ తెరకెక్కించిన 'హరియాలీ ఔర్ రస్తా' కమర్షియల్‌గా భారీ విజయాన్ని సొంతం చేసుకుని, ఆయనకు బాలీవుడ్‌లో మంచి గుర్తింపు తీసుకొచ్చింది. 'షాదీ', 'డా.విద్య', 'గృహస్తి' సినిమాలు సైతం బాక్సాఫీస్ వద్ద భారీ సక్సెస్‌ని సాధించి, కాసుల వర్షం కురిపించాయి. వీటి తర్వాత రాజ్ కౌశల్ రూపొందించిన మిస్టరీ థ్రిల్లర్ 'వో కౌన్ థీ?' ఎవర్‌గ్రీన్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది.
- 1961 నుంచి 1981 వరకు మనోజ్‌కుమార్ భారీ విజయాల్ని సొంతం చేసుకుని, బాలీవుడ్‌లో ఓ ఊపు ఊపారు. ఈ దశలో ఆయన నటించిన తొలి దేశభక్తి చిత్రం 'షహీద్' విడుదలై, దేశ వ్యాప్తంగా సంచలన విజయం సాధించింది. స్వాతంత్ర్య సమర యోధుడు భగత్‌సింగ్ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందిన ఈ సినిమా అబాలగోపాలాన్ని విశేషంగా అలరించింది. అలాగే రొమాంటిక్ డ్రామా 'హిమాలయ్ కి గోద్ మే', 'దో బదన్', 'సావన్ కీ ఘట' వంటి చిత్రాలు సైతం భారీ విజయాల్ని కైవసం చేసుకున్నాయి.
- 1965లో ఇండో-పాక్ యుద్ధం జరుగుతున్న తరుణంలో అప్పటి ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి కోరిక మేరకు 'జై జవాన్ - జై కిసాన్' నినాదాన్ని మనోజ్‌కుమార్ దర్శకుడిగా మారి 'ఉపకార్' చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ చిత్రం సంచలన విజయం సాధించింది. అలాగే ఇందులోని 'మేరీ దేశ్‌కి ధర్తి..' పాట అప్పటికీ ఇప్పటికీ మారుమోగుతూనే ఉంది. ఈ సినిమా ఆ యేడాది జాతీయ ఉత్తమ ద్వితీయ చిత్రంగా జాతీయ అవార్డును దక్కించుకుంది. అలాగే ఉత్తమ నూతన దర్శకుడిగా మనోజ్‌కుమార్ ఫిల్మ్ ఫేర్ అవార్డుని సొంతం చేసుకున్నారు.
- 'ఉపకార్', 'పూరబ్ ఔర్ పశ్చిమ్', 'షోర్', 'రోటీ కపడా ఔర్ మకాన్', 'క్రాంతి', 'క్లర్క్', 'జై హింద్' వంటి తదితర చిత్రాలకు ఆయన దర్శకత్వం వహించారు. వీటిల్లో శశికపూర్, అమితాబ్ బచ్చన్, జీనత్ అమన్, మౌసమీ ఛటర్జీ వంటి హేమాహేమీలతో ఆయన తెరకెక్కించిన 'రోటీ కపడా ఔర్ మకాన్' బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. తన తనయుడు కునాల్ గోస్వామితో ఆయన 1999లో రూపొందించిన చిత్రం 'జై హింద్'. ఇదే ఆయన చివరి చిత్రం కూడా.
- దేశభక్తి చిత్రాలకు కేరాఫ్‌గా నిలిచి, భరత్‌కుమార్‌గా పేరొందిన మనోజ్‌కుమార్‌ను 1992లో కేంద్రప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మక పద్మశ్రీ పురస్కారంతో గౌరవించింది. భారతీయ సినిమాకి ఆయన చేసిన సేవలను గుర్తించిన జాతీయ చలన చిత్ర పురస్కారాల జ్యూరీ 2015 సంవత్సరానికి దాదా సాహెబ్ ఫాల్కే అవార్డుతో సముచితంగా సత్కరించింది. యావత్ భారతదేశం గర్వించ దగిన నటుడిగా, దర్శకుడిగా.. వెండితెరపై తనదైన ముద్ర వేసిన మనోజ్‌కుమార్ మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రధాని మోడీతోపాటు పలువురు సినీ ప్రముఖులు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు.

వినోదం + సందేశం



ఈ మధ్య కాలంలో హృదయానికి హత్తుకునే సాహిత్యంతో, మనసును తాకే స్వరాలతో, మైమరిపించే నేపథ్యగానంతో వచ్చే పాటలు చాలా అరుదుగా ఉంటున్నాయి. సరిగ్గా ఇలాంటి ఓ బ్యూటీఫుల్ అండ్ హార్ట్‌టచ్చింగ్ సాంగ్ ఒకటి 'ఒక బృందావనం' నుంచి విడుదలైంది.
'పసి పసి తనమే...ఎలా.. పరుగులు తీసే ఏరులా..' అంటే సాగే ఈ పాటకు చంద్రబోస్ సాహిత్యాన్ని అందించారు. చిన్మయ శ్రీపాద ఆలపించిన ఈ పాటకు సన్ని, సాకేత్ స్వరాలను అందించారు. నూతన నటీనటులు బాలు, షిన్నోవాలతో పాటు శుభలేఖ శుధాకర్, అన్నపూర్ణమ్మ, శివాజీ రాజా, రూప లక్ష్మి, సాన్విత, కళ్యాణి రాజు, మహేంద్ర, డి.డి. శ్రీనివాస్ తదితరులు ఈ చిత్రంలో నటించారు. బొత్స సత్య దర్శకత్వంలో కిషోర్ తాటికొండ, వెంకట్ రేగట్టే, ప్రహ్లాద్ బొమ్మినేని, మనోజ్ ఇందుపూరు ఈ చిత్రాన్ని నిర్మించారు.
ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ, 'అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే లక్ష్యంతో ఓ వైవిధ్యమైన కాన్సెప్ట్‌తో రాబోతున్న చిత్రమిది. తాజాగా విడుదల చేసిన ఈ పాట ఎంతో హాయిగా కొనసాగుతూ థియేటర్‌లో ప్రేక్షకులకు కూడా మంచి అనుభూతినిస్తుంది. ఈ చిత్రంలో వినోదంతో పాటు మంచి అర్థవంతమైన సందేశాన్ని కూడా జోడించాం. నిర్మాణానంతర పనులు జరుపుకుంటున్న మా చిత్రం ఆడియోను ఆదిత్య మ్యూజిక్ ద్వారా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. త్వరలోనే ట్రైలర్‌ను మీ ముందుకు తీసుకొస్తాం' అని తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

- మిల్లు ఎదుట ధర్నాకు దిగిన రైతులు
- కొనుగోళ్లు నిలిపేసిన మిల్లర్లు.. బారులు తీరిన ట్రాక్టర్లు
- అందుబాటులో లేని అధికారులు



నవతెలంగాణ-వేములపల్లి

ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతూ రైతులు శుక్రవారం నల్లగొండ జిల్లా వేముల మండలంలోని మహాతేజ రైస్ మిల్లు వద్ద ధర్నాకు దిగారు. మండలంలోని శెట్టిపాలెం సమీపంలో సుమారు 18 మిల్లులు ఉన్నాయి. ట్రాక్టర్లు కిరాయికి కట్టుకుని ధాన్యాన్ని తీసుకొచ్చిన రైతులు మిల్లులు మూతబడి ఉండటంతో ఆందోళనకు గురయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మిల్లుల ఎదుట ధాన్యం ట్రాక్టర్లు బారులు తీరాయి. మిల్లు యాజమాన్యాన్ని ధాన్యం కొనుగోలు చేయాలని అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని రైతులు వాపోయారు. ఉదయం నుంచి తాగడానికి నీరు, తినడానికి తిండి లేక.. అధికారులెవరూ స్పందించకపోవడంతో ఆగ్రహించిన రైతులు సాయంత్రం 6 గంటల సమయంలో మహాతేజ మిల్లు ఎదుట ధాన్యం ట్రాక్టర్లతో ధర్నాకు దిగారు. తమ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సుమారు గంటసేపు ధర్నా నిర్వహించడంతో అద్దంకి- నార్కట్‌పల్లి రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. వెంటనే ఎస్ఐ డి.వెంకటేశ్వర్లు, సీఐ పిఎస్‌డి.ప్రసాద్ అక్కడికి చేరుకొని అన్ని మిల్లుల్లో కొనుగోలు చేపిస్తామని, మద్దతు ధర ఇప్పిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. పోలీసులు ఆయా మిల్లులకు ట్రాక్టర్లను తరలించి సమస్యను పరిష్కరించడంతో రైతులు శాంతించారు.

దేవునూర్ సాంఘిక సంక్షేమ వసతి గృహ విద్యార్థి అదృశ్యం



- వార్డెన్ నిర్లక్ష్యమే కారణం

నవతెలంగాణ-వట్‌పల్లి

సాంఘిక సంక్షేమ వసతి గృహంలో విద్యార్థి అదృశ్యమైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని దేవునూర్ సాంఘిక సంక్షేమ వసతి గృహంలో 60 మంది విద్యార్థుల వరకు ఉన్నారు. రేగోడు మండల్ పెద్ద తండాకు చెందిన మేఘవత్ లక్ష్మి-మెగావత్ రవి దంపతుల కుమారుడు మేఘవత్ కుమార్‌ను 2021లో ఆరో తరగతిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అడ్మిషన్ తీసుకొని వసతి గృహంలో ఉంచారు. మూడేండ్లుగా అక్కడే ఉంటూ విద్యను అభ్యసిస్తున్నాడు. కాగా, గత నెల 21న తెల్లవారుజామున ఐదు గంటల ప్రాంతంలో వసతి గృహం నుంచి బయటకు వెళ్లిన కుమార్ తిరిగిరాలేదు. తన తోటి స్నేహితులతో పాఠశాల సమయానికి వస్తానని చెప్పినా సాయంత్రం ఎదురుచూసిన స్నేహితులు అతను రాకపోవడంతో ఇన్‌చార్జి వార్డెన్ రాజారెడ్డికి తెలిపారు. కాగా, మనూర్ సాంఘిక సంక్షేమ వసతి గృహానికి వార్డెనయిన రాజిరెడ్డిని దేవునూర్ వసతి గృహానికి ఇన్‌చార్జి వార్డెనుగా బాధ్యతలు అప్పగించారు. రెండు రోజులకు ఒకసారి వసతి గహానికి వస్తుంటాడు. దాంతో హాస్టల్ వాచ్‌మెన్‌కు విద్యార్థుల బాగోగుల బాధ్యతను వార్డెన్ అప్పగించాడు. వార్డెన్‌కు విద్యార్థి అదృశ్యం గురించి చెప్పడంతో విషయాన్ని విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. దాంతో బంధుమిత్రులు, తెలిసిన వారి ఇండ్ల వద్ద వెతికినా విద్యార్థి ఆచూకీ తెలియకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. జోగిపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్, ఇన్‌చార్జి ఎస్ఐ సుధాకర్ వసతి గృహానికి చేరుకొని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అయితే విద్యార్థి ఇంతకుముందు కూడా ఒకసారి ఇలాగే హాస్టల్ నుంచి వెళ్లిపోయి పటాన్‌చెరు ప్రాంతంలోని రెస్టారెంట్‌లో కూలి పనిచేసి మళ్లీ వచ్చాడని తెలిపారు. వసతి గృహంలోని విద్యార్థుల వద్ద కుమార్ కొన్ని డబ్బులు అప్పుగా తీసుకోవడంతో వాటిని చెల్లించేందుకు పనికోసం మళ్లీ అదే ప్రాంతానికి వెళ్లి ఉండొచ్చని అను మానం వ్యక్తం చేస్తున్నారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు విద్యార్థి అదృశ్య మైనట్టు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టనున్నట్టు సీఐ అనిల్ కుమార్ తెలిపారు.

రాయపర్తి ఎస్‌బీఐ బ్యాంకుకు తాళం



- నిరసన తెలిపిన బంగారం తాకట్టుదారులు
- ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన నిరసన
- తాకట్టు బంగారం ఇవ్వకుంటే ఆత్మహత్యలు చేసుకుంటాం: బాధితులు
- ప్రజల నమ్మకాలను కోల్పోతున్న ఎస్‌బీఐ బ్యాంకర్లు

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకులో గతేడాది నవంబర్ 29వ తేదీన భారీ చోరీ జరిగింది. ఈచోరీలో 497 ప్యాకెట్ల బంగారాన్ని (19 కేజీలు) దుండగులు దోచుకెళ్లారు. నెలలు గడుస్తున్నప్పటికీ బంగారం తాకట్టు పెట్టిన వారికి బ్యాంకర్లు తేదీలు మారుస్తూ బ్యాంకు చుట్టూ తిప్పించుకుంటున్నారు. దాంతో అసహనం వ్యక్తం చేసిన బంగారం తాకట్టుదారులు శుక్రవారం బ్యాంకు ఉద్యోగస్తులను బయటకు పంపించి ఉదయం 11:30 గంటలకు బ్యాంకుకు తాళం వేశారు. తమ బంగారం ఇవ్వాలంటూ బ్యాంకు ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. అందులో కొందరు మహిళలు బంగారం ఇవ్వకుంటే బ్యాంకు ముందు ఆత్మహత్య చేసుకుంటామని కన్నీరు మున్నీరుగా విలపించారు. ఆడపిల్లల పెండ్లిళ్ల కోసం, వ్యవసాయ పెట్టుబడి, వ్యాపార అవసరాల కోసం ప్రభుత్వ బ్యాంకులో(ఎస్‌బీఐ) బంగారం తాకట్టు పెడితే బకాసురులు మింగేసి తమను అరిగోస పెడుతున్నారని బాధను వ్యక్తం చేశారు. పోలీసులతో తమను కొట్టించినా ఇక్కడి నుంచి కదిలేదే లేదని బాధిత మహిళలు ఖరాకండిగా తెగేసి చెప్పారు. బ్యాంకు బంగారానికి తగిన డబ్బులు ఇస్తారో? లేక ఇవ్వకుండా పోలీసు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేసి ఎగ్గొడతారోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు మేనేజర్, రీజినల్ ఆఫీసర్ సోమవారం నాటికి బంగారం తాకట్టు పెట్టిన ప్రతి ఒక్కరికీ లాభసాటిగా నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో సాయంత్రం ఐదు గంటలకు బాధితులు బ్యాంకుకు వేసిన తాళం తీశారు. ఇచ్చిన గడువు రోజు బ్యాంకర్లు మాట నిలబెట్టుకోకుంటే పెద్ద ఎత్తున నిరసన చేపడతామని బాధితులు హెచ్చరించారు.

రాజాసింగ్ వైల్డ్‌ఫైర్

(మొదటిపేజీ తరువాయి)

నమోదుచేసినా భయపడకుండా నేను తీస్తున్నాను. నా శ్రీరామనవమి శోభాయాత్రలో రామభక్తులు తక్కువ రావాలనే ఉద్దేశంతో అంబర్‌పేట నుంచి ఇంకొక శోభాయాత్ర తీస్తున్నది గౌతంరావే. దాని గురించే ఆయనకు టికెట్ ఇచ్చారు. మీరు కాదు మీ అయ్యలొచ్చి ప్రయత్నం చేసినా నా దగ్గరకు వచ్చే రామభక్తులను మీరు ఆపలేరు' అంటూ హెచ్చరికలు పంపారు.

నిమ్స్ ఆస్పత్రి పై నుంచి దూకిన రోగి సహాయకుడు..

- పరిస్థితి విషమించి మృతి




నవతెలంగాణ - బంజారాహిల్స్

హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో ఓ రోగి సహాయకుడు అత్యవసర విభాగం భవనం రెండో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు యత్నించాడు. అయితే అతని తలకు బలమైన గాయం కావడంతో ప్రస్తుతం ఐసీయూలో వైద్యులు చికిత్సనందించారు. అయినా ఫలితం లేకపోయింది. వివరాల్లోకి వెళ్తే.. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి చెందిన పోషం హనుమండ్ల అనారోగ్యంతో ఉండటంతో అతన్ని ఇద్దరు కుమారులు గురువారం హైదారాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. రెండో కుమారుడు నారాయణ మద్యానికి బానిసయ్యాడని తెలిసింది. ఈ క్రమంలో శుక్రవారం ఉన్నట్టుండి ఒక్కసారిగా నిమ్స్ అత్యవసర విభాగం రెండో అంతస్తు నుంచి కిందకు దూకాడు. ఈ ప్రమాదంలో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. వైద్య సిబ్బంది అతనికి ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స అందించినా ఫలితం లేక మృతిచెందాడు. ఆస్పత్రి చుట్టూ తిరగలేక.. ఆత్మహత్య చేసుకున్నట్టు అతని సోదరుడు తెలిపాడు.

ఫార్మా రైతుల భూములపైకి వెళ్లొద్దు

రైతు పోరాటాలకు సీపీఐ(ఎం) మద్దతు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఫార్మాసిటీ రైతుల భూములపైకి వెళ్లొద్దని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. రైతు పోరాటాలకు ఆ పార్టీ మద్దతును ప్రకటించింది. ఈ మేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని మేడిపల్లి తదితర గ్రామాల్లోని దాదాపు 800 మంది రైతులు రెండు వేల ఎకరాల భూమిని ఫార్మాసిటీకి ఇవ్వబోమంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించారని తెలిపారు. కోర్టు కూడా రైతులకు అనుకూలంగానే తీర్పునిచ్చిందని గుర్తు చేశారు. అయినా గురువారం వందలాది మంది పోలీసులు, రెవెన్యూ అధికారులు ఈ భూముల్లోకి ప్రవేశించి బలవంతంగా కంచె వేశారని పేర్కొన్నారు. దాన్ని అడ్డుకున్న రైతులను అరెస్టు చేశారని తెలిపారు. రైతులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఫార్మాసిటీ కోసం భూమి కోల్పోయిన రైతులను కూడా రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా మోసం చేసిందని విమర్శించారు. రైతుల సమస్యలను పరిష్కరించకుండా, వారితో చర్చించలేదని తెలిపారు. కోట్ల రూపాయల విలువ చేసే ఈ భూములకు ఎకరాకు కేవలం రూ.ఎనిమిది లక్షల నుంచి రూ.16 లక్షలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నదని విమర్శిం చారు. ఈ భూములను రైతుల నుంచి లాక్కుని కార్పొరేట్ సంస్థలకు అప్పగించే పనికి ప్రభుత్వం పూనుకున్నదని పేర్కొన్నారు. ఎకరాకు 120 గజాల ఇంటి స్థలాన్ని ఇస్తామంటూ నమ్మించి కేవలం పట్టాలిచ్చి, నేటికీ స్థలాలను చూపించలేదని వివరించారు. పరిహారం పెంచాలనీ, ఇంటి స్థలాలను వెంటనే చూపాలని బాధితులు ఆందోళనలు చేస్తున్నారని తెలిపారు. ఫార్మాసిటీని రద్దుచేసి, సేకరించిన భూములను కూడా తిరిగి రైతులకే ఇస్తామంటూ రేవంత్‌రెడ్డి హామీనిచ్చారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు ఆ భూములను మళ్లీ లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. అయినా ఈ భూములను గుంజుకోవడానికి రికార్డుల్లో రైతుల పేర్లు లేకుండా చేసి, వారికి ఎలాంటి రాయితీలు రాకుండా, భూములను అమ్ముకో కుండా ఇబ్బందులకు గురిచేస్తున్నదని తెలిపారు. రైతుల పట్ల ప్రభుత్వం ఇదే పద్ధతిలో నియంతృత్వ ధోరణికి పూనుకుంటే రైతుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

కళాత్మక పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

గోల్డ్ మెడల్ సాధించిన ఏదులాబాద్ విద్యార్థులు : టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ కార్యదర్శి అలగు వర్షిణి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ముంబాయి మహానగరానికి చెందిన డ్రీం ఫ్యామిలి అనే ఒక కళారంగ సంస్థ నిర్వహించిన కళలకు సంబంధించి పోటీల్లో ఏదులాబాద్ గురుకుల విద్యార్థులు గోల్డ్‌మెడల్ సాధించటం హర్షణీయమని టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ కార్యదర్శి అలగు వర్షిణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న వివిధ కళలను , నైపుణ్యాన్ని వెలికితీసేందుకు పలు రకాల పోటీలను నిర్వహించి విశేష ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సహకరంగా పలు అవార్డులను ఆ సంస్థ అందిస్తోందని తెలిపారు. పోటీల్లో దేశవ్యాప్తంగా మొత్తం 271 మంది విద్యార్థులు పాల్గొన్నారనీ, ఇందులో 29 మంది రాష్టం నుండి ఒక్క ఏదులాబాద్ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబర్చి అవార్డులను కైవసం చేసుకున్నారని పేర్కొన్నారు.

ఉద్యోగాలు...స్వయం ఉపాధి

యువతరానికి ఇందిరమ్మ రాజ్యంలో భరోసా

యాదాద్రి నిర్వాసిత కుటుంబాల్లో 112 మందికి సర్కారు కొలువులు

ఆర్థికశాఖలో మరో 51 మందికి...

నియామక పత్రాలు అందించిన డిప్యూటీ సీఎం భట్టి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఇందిరమ్మ రాజ్యంలో యువతరానికి ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగాలతో పాటు భారీ ఎత్తున స్వయం ఉపాధి అవకాశాలను కూడా అందిస్తున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కేవలం ఏడాదికాలంలో 59వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామనీ, రూ.9వేల కోట్ల బడ్జెట్ కేటాయింపులతో రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా లబ్దిదారులకు సబ్సిడీ రుణాలు మంజూరు చేసి, వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. దీనికోసం పక్కా ప్రణాళికలు రూపొందించామనీ, దరఖాస్తు దాఖలు మొదలు, రుణం మంజూరు, గ్రౌండింగ్ వరకు ప్రభుత్వం అన్ని విధాలుగా యువతరానికి అండగా నిలుస్తుందని వివరించారు. హైదరాబాద్ సైబర్ గార్డెన్‌లో మంగళవారం టీజీజెన్‌కోకు చెందిన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్వాసితులు 112 మంది, ఆర్థిక శాఖలో 51 మందికి డివిజినల్ అక్కౌంట్స్ ఆఫీసర్స్ ఉద్యోగ నియామకపత్రాలను ఆయన అందించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ గత ప్రభుత్వం యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణాన్ని గాలికి వదిలేసిందనీ, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే పర్యావరణ అనుమతులు, ప్రజాభిప్రాయ సేకరణ పూర్తిచేసి, నిర్మాణాలను పూర్తిచేశామన్నారు.

ఈ సందర్భంగా ఈ ప్లాంట్ కోసం భూములు ఇచ్చిన కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని వాగ్దానం ఇచ్చామనీ, ఆ మేరకు ఇప్పుడు వారికి ఉద్యోగ నియామక పత్రాలు ఇస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రం వస్తే ఉద్యోగాలు వస్తాయనీ, ఆర్థికంగా కుటుంబాలను నిలబెట్టుకోవచ్చనీ, ఆత్మగౌరవంతో బతకొచ్చని స్వరాష్ట్రం కోసం పోరాడిన నిరుద్యోగ యువతీ యువకుల ఆశల నిజం చేయడానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.రాజీవ్ యువ వికాసంపై గత ప్రభుత్వం మాదిరి ప్రకటనలు చేసి వదిలేయబోమనీ, దీనికోసం ప్రత్యేక కేలండర్‌ను ప్రకటించామని వివరించారు. ప్రయివేటు రంగంలో లక్షల మంది యువతీ యువకులకు ఉద్యోగాలు కల్పించేందుకు హైదరాబాద్ నగరంలో ఐటీ సెక్టర్, నాలెడ్జి వ్యవస్థలను ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నదని తెలిపారు. ప్రగతి నిరోధకులు కుట్రల్లో యువతరం చిక్కుకోవద్దని హెచ్చరించారు.

ఏసీబీకి చిక్కిన గుమ్మడిదల నీటిపారుదల శాఖ ఏఈ

నాలా ఎన్‌ఓసీ కోసం రూ. లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడ్డ వైనం



నవతెలంగాణ-పటాన్‌చెరు

నాలా ఎన్‌ఓసీ కోసం లక్ష రూపాయలు లంచం తీసుకుంటూ నీటిపారుదల శాఖ ఏఈ ఏసీబీకి దొరికిపోయాడు. పక్కాగా ప్లాన్ వేసి రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులు ఆయన్ను పట్టుకున్నారు. సిటీ రేంజ్ 2 ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నీటిపారుదల శాఖ సబ్ డివిజన్ కార్యాలయంలో గుమ్మడిదల ఏఈగా రవి కిషోర్ విధులు నిర్వహిస్తున్నాడు. అయితే గుమ్మడిదలకు చెందిన ఓ వ్యక్తి తన భూమిలో ప్రహరీ గోడ నిర్మించగా.. ఏఈ రవి కిషోర్ అక్కడకు వెళ్లి నాలా ఉందని, నాలాకు సంబంధించి ఇరిగేషన్ నుంచి ఎన్‌ఓసీ తీసుకోవాలని, లేదంటే కూల్చివేస్తామని హెచ్చరించారు. ఎన్‌ఓసీ మంజూరు కోసం రూ.10 లక్షలు డిమాండ్ చేయగా రూ.7 లక్షలకు ఇద్దరి మధ్యన ఒప్పందం కుదిరింది. ఆ డబ్బుల కోసం ఏఈ తీవ్ర ఇబ్బందులు పెట్టడంతో బాధితుడు గతనెల 28న ఏసీబీ అధికారులను కలిసి తన గోడును వెల్లబోసుకున్నాడు. దాంతో ఏఈ రవి కిషోర్‌కు లక్ష రూపాయల డబ్బులిచ్చేలా ఏసీబీ అధికారులు ప్లాన్ చేశారు. శుక్రవారం ఉదయం పటాన్‌చెరు పట్టణంలోని నీటిపారుదల శాఖ కార్యాలయానికి బాధితుడు డబ్బులు ఇచ్చేందుకు రాగా ఏఈ రవికిషోర్ తన కారు డ్యాష్ బోర్డులో పెట్టాలని చెప్పాడు. కొద్దిసేపటికీ ఏఈ తన కారులోకి వెళ్లి డబ్బులు సరి చూసుకొని వస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పటాన్‌చెరు నీటిపారుదల శాఖ డీఈ రామస్వామి, ఎస్సీని సైతం కార్యాలయానికి రమ్మని చెప్పామన్నారు. ఇందులో ఎవరెవరి ప్రమేయం ఉంది.. తదితర అంశాలపై పూర్తి స్థాయి విచారణ చేపడుతున్నట్టు ఏసీబీ డీఎస్పీ వెల్లడించారు. ఏఈ రవికిషోర్‌ను పూర్తిస్థాయిలో విచారించిన తర్వాత ఏసీబీ కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించనున్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠా గుట్టురట్టు

నిజామాబాద్, ఆర్మూర్‌లో పలువురి అరెస్టు

ఈజీ మనీ కోసం పెడదారులు పడొద్దు : సీపీ



నవతెలంగాణ-కంఠేశ్వర్

ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహారాష్ట్ర కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తూ స్థానికంగా ఉన్న పలువురు యువకులను ఏజెంట్లుగా, సబ్ ఏజెంట్లుగా నియమించుకుంటూ బెట్టింగ్ దందాకు పాల్పడుతుండటంతో పోలీసులు పలువురుని అరెస్టు చేయగా.. మరికొంత మంది పరారీలో ఉన్నారు. నిజామాబాద్, ఆర్మూర్‌లో పలువురిని అరెస్టు చేసినట్టు నిజామాబాద్ సీపీ సాయిచైతన్య తెలిపారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్ కమిషనరేట్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ నగరంలోని ఐదో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న భారతీరాణి కాలనీలో ఆన్ లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ అంజయ్య, ఐదో టౌన్ ఎస్ఐలు గంగాధర్, లక్ష్మయ్య సిబ్బందితో కలిసి దాడి చేశారు. తన ఇంటి వద్దే సెల్ ఫోన్‌లో బెట్టింగ్ నిర్వహిస్తున్న షేక్ ముజీబ్ అహ్మద్ (ఏ1)తోపాటు షేక్ నదీం(ఏ3), షేక్ జునైద్ (ఏ4), షేక్ రెహన్ (ఏ5)ను అదుపులోకి తీసుకున్నారు. సాలూరాకు చెందిన షకీల్ (ఏ2), నిజామాబాద్ ఆటోనగర్‌కు చెందిన షేక్ నజీబ్ (ఏ6), మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు చెందిన సచిన్(ఏ7), ఆరెంజ్ ట్రావెల్స్‌లో పనిచేసే నిజామాబాద్‌కు చెందిన రమేశ్ (ఏ8) పరారీలో ఉన్నారు. అలాగే, ఆర్మూర్‌లో ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, సీఐ సత్యనారాయణ, ఎస్ఐ మహేశ్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి బెట్టింగ్ ఆడుతున్న గట్టడి వడ్డ గౌతమ్ (ఏ1), దయాల్ సునీల్ (ఏ2), జాజు రంజిత్(ఏ3)ని అరెస్టు చేశారు. గట్టడి శ్రీకాంత్ (ఏ4)తోపాటు హర్యానాకు చెందిన విపుల్ మంగ్(ఏ5), మహారాష్ట్రకు చెందిన బంటు పలాస్ (ఏ6), బబ్లూ ఠాకూర్ (ఏ7), వినాయక్(ఏ8) పరారీలో ఉన్నారు. నిజామాబాద్, ఆర్మూర్‌లో పట్టుబడిన వారిని పోలీసులు విచారించగా బెట్టింగ్ మూలాలు మహారాష్ట్రలో ఉన్నట్టు తేలింది. అక్కడి వారే స్థానికులను ఏజెంట్లుగా, సబ్ ఏజెంట్లుగా నియమించుకుని యువతను బెట్టింగ్ ఊబిలోకి దింపుతున్నారని, ఇప్పటి వరకు 1200 మంది యువత యూజర్ ఐడీలు, పాస్ వర్డ్లు పొందినట్టు తెలిసింది.

వరంగల్ జిల్లా కోర్టులో బాంబు కలకలం



నవతెలంగాణ-నయీంనగర్

వరంగల్ జిల్లా కోర్టులో బాంబు ఉందని గుర్తు తెలియని వ్యక్తి నుంచి వచ్చిన మెయిల్‌తో కోర్టు ప్రాంగణంలో శుక్రవారం ఉదయం కలకలం రేగింది. వివరాల్లోకి వెళితే.. హనుమకొండ, వరంగల్ జిల్లా కోర్టు జడ్జికి శుక్రవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఒక మెయిల్ వచ్చింది. కోర్టు నిర్వహణ సమయంలో దాన్ని చూసిన జిల్లా జడ్జీలు ఒక్కసారిగా షాకయ్యారు. కోర్టులో బాంబు ఉందనేది ఆ మెయిల్ సారాంశం కాగా జిల్లా జడ్జీలు వెంటనే విషయాన్ని వరంగల్ కమిషనరేట్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. కమిషనరేట్ పోలీస్ ఉన్నతాధికారుల నుంచి సమాచారం అందుకున్న బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు వరంగల్ జిల్లా కోర్టు సముదాయానికి చేరుకొని.. మధ్యాహ్నం 12 గంటల నుంచి దాదాపు రెండు గంటల పాటు కోర్టు ఆవరణలో అణువణువునా తనిఖీలు చేపట్టారు. ప్రధానంగా జిల్లా కోర్టు సముదాయంలోని 10 కోర్ట్స్ కాంప్లెక్స్‌లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఆ కాంప్లెక్స్‌లో మొత్తం మూడు ఫ్లోర్లు ఉండగా ప్రతి ఫ్లోర్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. జడ్జీల ఛాంబర్లతో పాటు కోర్టు హాళ్లలో తనిఖీలు చేపట్టారు. అక్కడ బాంబులేమీ లేవని, అది ఒక బెదిరింపు మెయిల్ మాత్రమేనని గుర్తించారు. బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 11న నిర్వహించనుండగా శుక్రవారం నామినేషన్ల ప్రక్రియ ఉండటం, ఇంతలోనే బాంబు బెదిరింపు మెయిల్ రావడం, ఆ తర్వాత బాంబ్ స్క్వాడ్ సిబ్బంది రంగంలోకి దిగి తనిఖీలు చేపట్టడంతో ఒక్కసారిగా అక్కడ ఏం జరుగుతోందో తెలియక చాలామంది అయోమయానికి గురయ్యారు. చివరికి అక్కడ బాంబులేమీ లేవని నిర్ధారించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

మా స్పీచ్, హియరింగ్ సంస్థపై చర్యలు తీసుకోవాలి : ఎన్‌పీఆర్‌డీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆర్‌సీఐ అనుమతి లేకుండానే ఆర్‌సీఈ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్న మా స్పీచ్, హియరింగ్ సంస్థపై చర్యలు తీసుకోవాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం వాట్సాప్‌ద్వారా వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టరుకు పిర్యాదు చేసినట్టు ఎన్‌పీఆర్‌డీ గౌరవాధ్యక్షులు టి వరమ్మ, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె వెంకట్, ఎం అడివయ్య, కోశాధికారి ఆర్ వెంకటేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ ఆటిజం దినోత్సవం సందర్భంగా సీఆర్ఈ ప్రోగ్రామ్‌ను శనివారం మా, ఈఎన్‌టీ హాస్పిటల్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్టు పోస్టర్స్ ద్వారా ప్రచారం చేశారని తెలిపారు. ఆర్‌సీఐ అనుమతి లేకుండా సీఆర్ఈ ప్రోగ్రామ్ నిర్వహించడం చట్ట రీత్యా నేరమని పేర్కొన్నారు. 2016 ఆర్‌పీడీ చట్టం నిర్దేశించిన నిబంధనలను ఉల్లంగించారని తెలిపారు. సీఆర్ఈ పాయింట్స్ కోసం హాజరయ్యే అభ్యర్థులు ప్రతి ఒక్కరు రూ. 1250 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ప్రకటించారు. కానీ ఇప్పటి వరకు ఆర్‌సీఐ నుండి ఎలాంటి అనుమతి రాలేదని తెలిపారు.దాని అనుమతి వచ్చిన తరువాతనే సీఆర్ఈ ప్రోగ్రామ్ నిర్వహణ కోసం ముందుకు వెళ్ళాలని విజ్ఞప్తి చేశారు.

వక్ఫ్ సవరణ చట్టం 2024కు నిరసనగా ఆందోళనలు

ఆవాజ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వక్ఫ్ సవరణ చట్టం-2024ను పార్లమెంటు ఆమోదించడాన్ని ఆవాజ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఖండించింది. మతాల మధ్య విభజన పెంచి, దేశ లౌకిక స్వభావాన్నీ, మత సామరస్యాన్ని దెబ్బతీసే ఈ చట్టానికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చింది.ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రొఫెసరు మహమ్మద్ అన్సారీ, ఎండీ అబ్బాస్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 1995 వక్ఫ్ చట్టం వక్ఫ్ ఆస్తులను రక్షించి, మతపరమైన, ధార్మిక ప్రయోజనాల కోసం వినియోగించడాన్నీ, సరైన పద్ధతిలో నిర్వహించడానికి చట్టపరంగా నియంత్రించే మార్గదర్శకాలను అందించిందనీ, వాటి దుర్వినియోగం, అనధికార విక్రయాలను, దురాక్రమణలను నిరోధించిందని తెలిపారు. సవరించిన చట్టంలో గణనీయమైన మార్పులను చేశారని పేర్కొన్నారు. ఇది మునుపటి చట్టంలో నిర్దేశించిన పునాది సూత్రాలను దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సవరణ ద్వారా బీజేపీ ప్రభుత్వం ప్రజలను మత ప్రాతిపదికన విభజించడమే లక్ష్యంగా తన హిందుత్వ ఎజెండాను ముందుకు తెస్తోందని పేర్కొన్నారు. ముస్లింలు విస్తృతంగా భూకబ్జా చేసేందుకు వక్ఫ్ చట్టాన్ని ఉపయోగించారని పదే పదే తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శించారు. ముస్లిమేతరులకు వక్ఫ్ ఆస్తుల నిర్వాహణలో స్థానం కల్పించేలా చట్టంలో సవరణలు చేశారని తెలిపారు. ముస్లింలు తమ మతాన్ని ఆచరించడానికి రాజ్యాంగం కల్పించిన హక్కులపై దాడేనని పేర్కొన్నారు. ఎవరైనా తన ఆస్తి వక్ఫ్ చేయాలంటే కనీసం ఐదేండ్ల పాటు మతాన్ని అనుసరిస్తున్నట్టు రుజువు చేయగల ముస్లిం మాత్రమే అనే నిబంధన తప్పనిసరి చేయడం ద్వారా వారిపై వేధింపులకు మార్గాన్ని తెరిచిందని పేర్కొన్నారు. ఈ నిబంధనను అడ్డుపెట్టుకుని ఎవరు తమ ఆస్తులను వక్ఫ్ చేయకుండా నిరోధించవచ్చని తెలిపారు. చాలా మంది ముస్లిమేతరులు కూడా మసీదుల నిర్మాణానికి సహకరిస్తారనీ, సోదరభావానికి, సౌభ్రాతృత్వానికి ఇది ప్రతీకనీ, సవరించిన చట్టం ప్రకారం ఇకపై ఇది సాధ్యం కాదని తెలిపారు.



సూరారంలో హైడ్రా కూల్చివేతలు

అడ్డుకోబోయిన గ్రామస్తుల అరెస్ట్

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలోని సూరారం గ్రామంలో ఓ ప్రహరీని హైడ్రా అధికారులు కూల్చివేశారు. గురువారం ఉదయం అధికారులు పోలీసు సిబ్బందితో కలిసి అక్కడికెళ్లి సర్వే నం.16/28లోని భూమిలో నిర్మించిన ప్రహరీని కూల్చారు. అడ్డుకోబోయిన పలువురు గ్రామస్తులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వారాల వినోద్, శేషు, శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. సూరారంలో పట్టా కలిగిన తమ భూముల్లోకి హైడ్రా అధికారులు వచ్చి కూల్చివేతలు చేపట్టారని వాపోయారు. వారాల రాజేశ్వర్‌రావు అనే పేరుపై ఉన్న భూమిని ప్రభుత్వ భూమిగా చూపిస్తూ.. అందులో నిర్మించిన ప్రహరీని కూల్చివేశారని, కనీస సమాచారం లేకుండా ఎందుకు కూలుస్తున్నారని అడిగితే పోలీస్ స్టేషన్‌కు తరలించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస అవగాహన లేకుండా హైడ్రా అధికారులు కూల్చివేతలు చేయడం ఏంటని ప్రశ్నించారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని న్యాయస్థానానికి వెళ్తామన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌ది ఫెవికాల్ బంధం

మొన్న డీలిమిటేషన్..నేడు వక్ఫ్‌బోర్డు పేరుతో ఒక్కటి

మజ్లిస్‌ను గెలిపించేందుకు పోటీకి దూరం : బండి సంజయ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కు రాజకీయాలకు పాల్పడుతున్నాయనీ, ఆ రెండు పార్టీల మధ్య ఉన్న పెవికాల్ బంధం బట్టబయలైందని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. శుక్రవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. డీలిమిటేషన్ పేరుతో ఆ రెండు పార్టీలు ఒక్కటై త్వరలో హైదరాబాద్‌లో బహిరంగ సభ పెట్టబోతున్న విషయాన్ని గుర్తుచేశారు. వక్ఫ్‌బోర్డు బిల్లుకు వ్యతిరేకంగానూ ఓటేశాయని తెలిపారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ రెండు పార్టీలూ ఎంఐఎంకు మద్దతిస్తున్నాయని విమర్శించారు. కాళేశ్వరం, విద్యుత్ కొనుగోళ్లు, ధరణి పేరిట అవినీతి కేసుల సంగతి అటకెక్కినట్టేనని పేర్కొన్నారు. ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించడంవల్ల గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీసీలు పోటీ చేయాల్సిన 30 చోట్ల మజ్లిస్ పోటీ చేసి గెలిచిందని తెలిపారు. ఇప్పుడు బీసీ జాబితా ముసుగులో ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించడంవల్ల విద్య, ఉద్యోగాల్లో బీసీలకు తీరని అన్యాయం జరుగబోతున్నదని వాపోయారు.

సన్న బియ్యం పంపిణీలో తేడా జరిగితే కఠిన చర్యలు

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సన్న బియ్యం పంపిణీలో తేడా జరిగితే కఠిన చర్యలు తప్పవని పౌరసరఫరాలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన సీఎస్ శాంతికుమారితో కలిసి కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సన్న బియ్యం పంపిణీపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తున్నదనీ, 80 శాతం మంది పేదలు లబ్ది పొందనున్నట్టు తెలిపారు. శ్రీరామనవమి రోజున భద్రాచలంలో ఓ లబ్ధిదారుడి ఇంట్లో సీఎం భోజనం చేయనున్నట్టు తెలిపారు. పంపిణీలో అవకతవకలకు ఆస్కారం ఉండొద్దనీ, తేడాలొస్తే చర్యలుంటాయన్నారు. రేషన్ దుకాణాలను సందర్శించాలని ప్రజా ప్రతినిధులను కోరారు. రేషన్ షాపులకు సన్న బియ్యం రవాణా ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రవాణా కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించి సన్న బియ్యం రవాణాపై కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కిలో బియ్యానికి రూ.40కి పైగా వెచ్చించి సరఫరా చేసిన దొడ్డు బియ్యాన్ని 70 నుంచి 80 శాతం మంది తినకపోయే వారనీ, ఆ బియ్యం రీసైక్లింగ్ ద్వారా కోళ్లఫారాలకు, ఇతర అవసరాలకు తరలి వెళ్లేందని గుర్తుచేశారు. మొత్తం రూ. 13 వేల కోట్లు ఖర్చు చేసి 30 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని రేషన్ కార్డుదారులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నామనీ, ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా చూడాలని కలెక్టర్లను కోరారు. ఈ సందర్భంగా సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, సన్న బియ్యం పంపిణీ కారణంగా రేషన్ షాపుల వద్ద ఒకేసారి డిమాండ్ పెరిగి పోతున్నందున బియ్యం రవాణా వేగవంతం చేయాలని, రేషన్ షాపుల వద్ద అవసరమైన మేర బియ్యం అందుబాటులో పెట్టాలని అన్నారు. పేదల ఇంటికి సన్న బియ్యం సరఫరా అతి గొప్ప విజయమని అభిప్రా యపడ్డారు. నూతన రేషన్ కార్డుల దరఖాస్తుల స్క్రూటిని వేగవంతం చేయాలని ఆదేశించారు.

గ్రూప్- 1లో విజయం సాధించిన కృతికకు అభినందనలు



నవతెలంగాణ-బడంగ్ పేట్

ఇటీవల వెలువడిన గ్రూప్-1 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 5వ ర్యాంకును బాలాపూర్ మండల జిల్లెలగూడ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ, మాజీ కార్పొరేటర్ సిద్దాల లావణ్య బీరప్ప దంపతుల కుమార్తె కృతిక సాధించారు. ఈ మేరకు శుక్రవారం కృతికను బడంగ్ పేట్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ దండు గణేష్ ముది రాజ్,మాజీ కార్పొరేటర్ ఎర్ర మహేశ్వరి జైహింద్ లు ఆమె నివాసంలో కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి, ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

స్వామి వారి కల్యాణానికి రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం



నవతెలంగాణ - చంపాపేట్

ఈ నెల 6న శ్రీ రామ నవమి సందర్భంగా కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయంలో నిర్వహించనున్న శ్రీ సీతారాముల వారి కల్యాణ మహెూత్సవ ఆహ్వాన పత్రి కను ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డికి శుక్రవారం కర్మన్ ఘాట్ హనుమాన్ దేవస్థానం ఈఓ లావణ్య అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ధర్మకర్త మధుసాగర్, ఆలయ అధికారి వెంకటయ్య, అర్చకులు సంతోష్, ముత్యాల శర్మ, పవన్ తదితరులు పాల్గొన్నారు.



మధుయాష్కీ గౌడ్‌కు రాజకీయ అవగాహన లేదు

ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి

నవతెలంగాణ-ఎల్బీనగర్

మధు యాష్కీ గౌడ్ రాజకీయ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఎల్బీనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సంవత్సర కాలంలో మధుయాష్కీ గౌడ్ ఎన్ని నిధులు తీసుకొచ్చి ఎల్బీనగర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారో తెలపాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్ కింద మధు యాష్కీ గౌడ్ తీసుకొచ్చిన నిధులను బహిర్గతం చేస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. ఎల్బీనగర్ నియోజకవర్గం లో మధు యాష్కీ గౌడ్ అభివృద్ధి పనులను ప్రారంభించకుండా అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆరోపించారు. ఆక్సిజన్ పార్కు, బీఎన్ రెడ్డి నగర్ లో పార్క్ ప్రారంభించకుండా మధుయాష్కీ గౌడ్ 15 నెలల నుండి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ అక్రమ కలయిక ఎల్బీనగర్ లో మొదలైందని ఆరోపించారు.కార్పొరేటర్లకు తన పిఏ అభివృద్ధి పనుల ప్రారంభ సమాచారం అందించిన కార్పొరేటర్స్ రాకుండా లేనిపోని ఆరోపణ చేస్తున్నారని అన్నారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీల నుండి నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేస్తున్నట్టు పేర్కొన్నారు. కార్పొరేటర్స్ కు అభివృద్ధి పనుల సమాచారం ఇచ్చి ఆహ్వానిస్తే.. తామే నిధులు తెచ్చినట్లు కార్పొరేటర్స్ ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. ఎల్బీనగర్ నియోజకవర్గం అభివృద్ధి కోసం నిధులు తీసుకొచ్చిన చరిత్ర తనదేనని, తేదీతో సహా అభివృద్ధి పనుల వివరాలను బహిర్గతం చేస్తానని పేర్కొన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం లో రహదారులు, ఫ్లై ఓవర్లను అభివృద్ధి చేసిన ఘనత తనకే దక్కుతుందని చెప్పారు. మధుయాష్కీ గౌడ్ నిజామా బాద్ నుండి ఎల్బీనగర్ కు వలస వచ్చినట్లు తెలిపారు. నిజామా బాద్ రజలు తిరస్కరిస్తే ఎల్బీనగర్ కు వలస వచ్చి పోటీ చేసిన విషయం అందరికీ తెలుసని అన్నారు. మధుయాష్కీ గౌడ్ వాడుతున్న భాష సరిగా లేదని హితవు పలికారు. ఎల్బీనగర్ లో పోటీ చేసిన మధు యాష్కీ గౌడ్ కు మూడో స్థానం కు ప్రజలు తీర్పు ఇచ్చిన సంగతి మర్చిపోవద్దని గుర్తు చేశారు.

కాంగ్రెస్ పార్టీ నుండి పట్టుపట్టి ఎల్బీనగర్ నియోజకవర్గం టికెట్ తెచ్చుకొని పోటీ చేసి మూడో స్థానము రావడంతో రాహుల్ గాంధీ చివాట్లు పెట్టిన సంగతి అందరికీ తెలుసని గుర్తు చేశారు. సంస్కారమంతమైన భాష మాట్లాడి ప్రజల మన్నలు పొందాలని హితవు పలికారు. 1986లో కార్పొరేటర్ గా, 1985లో డిగ్రీ చేస్తూ స్కూటర్ పై వెళ్లేవాడిని ఎమ్మెల్యే ఈ సందర్భంగా గుర్తు చేశారు. 1987లో అమెరికాకు పోయిన తాను ప్రజాసేవ కోసం తిరిగి వచ్చి ఎమ్మెల్యేగా పోటీ చేసి మూడుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించినట్లు తెలిపారు. రెండుసార్లు కార్పొరేటర్లుగా ఎన్నికైన విషయం ప్రజలందరికీ తెలుసు అన్నారు. 2004లో నిజామాబాద్ నుండి మధుయాష్కీ గౌడ్ కాంగ్రెస్ నుండి టికెట్టు డబ్బులు ఇచ్చి తెచ్చుకున్న సంగతి ప్రజల అందరికీ తెలుసు అని అన్నారు. తన రాజకీయ జీవితంలో ఎక్కడ కూడా అక్రమంగా సంపాదించలేదని తెలిపారు. వెంచర్లు ,కాంట్రాక్టర్లు ,అపార్ట్మెంట్ల వద్ద నుండి ఒక రూపాయి కూడా తీసుకోని చరిత్ర తనదని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. అందుకే ప్రజలు తనకు ఎమ్మెల్యేగా మూడు సార్లు అవకాశం ఇచ్చారని గుర్తు చేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని ప్రజలు వివేకవంతులని కొనియాడారు. ఇకనుండి తప్పుడు మాటలు మాట్లాడితే తాను ఊరుకోబోనని హెచ్చరించారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో టూరిస్ట్ నాయకుడు మధుయాష్కీ గౌడ్ అని ఎద్దేవా చేశారు. మంత్రి వస్తే స్వాగతిస్తానని తెలిపారు. మంత్రి పేరు చెప్పి అభివృద్ధి పనులను ప్రారంభించకుండా అడ్డుకోవడాన్ని తాను సహించబోనని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సాగర్ రెడ్డి, జిన్నారం విట్టల్ రెడ్డి ,పద్మనాయక్ ,కొప్పుల విఠల్ రెడ్డి, తిరుమల్ రెడ్డి, భవాని ప్రవీణ్ కుమార్ ,జిట్టా రాజశేఖర్ రెడ్డి ,కటిక అరవింద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ రాణించాలి



స్కూల్ చైర్మెన్ నిరంజన్



నవతెలంగాణ-బడంగ్‌పేట్

నేటి సమాజంలో విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ రాణించి, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని శ్రీ హర్ష టెక్నో ఉన్నత పాఠశాల చైర్మెన్ ఉస్కమూరి నిరంజన్, కరపాండెంట్ ఉస్కమురి శిరీష బాలకృష్ణలు అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం జల్ పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న శ్రీరాం కాలనీలో ని శ్రీ హర్ష టెక్నో పాఠశాల గ్రాడ్యూవేషన్ డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరాం కాలనీలోని పేద, మధ్య తరగతి వారిని దృష్టిలో ఉంచుకొని లాభాపేక్ష లేకుండా సేవా దృక్పథంతో తమ పాఠశాలలో విద్యనందిస్తున్నామన్నారు. 50 మంది పేద విద్యార్థులకు తమ ట్రస్ట్ ద్వారా సహాయం చేస్తున్నామన్నామని తెలిపారు. చిన్నారులకు పెద్దలను గౌరవించడం, మన సంస్కృతి, సంప్రదాయాలను పాటించేలా నేర్పుతున్నమ్మన్నారు.అన్ని వర్గాల పండుగల సమయంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి, ఆ పండుగ ప్రముఖ్యతను తెలియజేస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలలో కూడా శిక్షణ ఇస్తున్నామన్నామని, విద్యార్థులు క్రమశిక్షణతో చదివి తల్లీదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తేవాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మాజీ కౌన్సిలర్ కే.లక్ష్మీనారాయణ, శ్రీధర్ గౌడ్, యంజాల అర్జున్, స్కూల్ వైస్ చైర్మెన్ ఉస్కే మూరి సుజాత, స్కూల్ అకాడమిక్ డీన్ కృష్ణారెడ్డి, స్కూల్ ప్రిన్సిపల్ వి స్వప్న, వి.విష్ణు, డాక్టర్ సంతోష్ , డాక్టర్ అనంతగుప్త, ఆంజనేయులు, ఆదిత్య స్కూల్ డైరెక్టర్ పి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలి

రాపాక సన్నీ కుమార్



నవతెలంగాణ - బడంగ్‌పేట్

ఇటీవల జర్మనీ దేశానికి చెందిన ఓ యువతిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని సామాజిక వేత్త, అక్షిత ఫౌండేషన్ చైర్మెన్ రాపాక సన్నీ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ భారత దేశంలో పర్యాటక ప్రాంతాలను చూడటానికి జర్మనీ దేశం నుండి హైదరాబాద్‌కు వచ్చి మీర్‌పేట్‌లోని తన స్నేహితుల వద్ద ఉంటున్న విదేశస్తురాలిని పర్యాటక ప్రాంతాలు చూపిస్తానని నమ్మించి, నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి లైంగిక దాడికి ఒడిగట్టిన యాకత్‌పూర ఎన్టీఆర్ నగర్ కాలనీకి చెందిన మొహమ్మద్ అబ్దుల్ అస్లాంను, అతనికి సహకరించిన స్నేహితులకు కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ప్రపంచ దేశాల్లో దేశ పరువు, ప్రతిష్టలను మంటగలిపే విధంగా నేరాలకు పాల్పడుతున్న దారుణమైన ఘటనలను అరికట్టాలంటే నేరస్థులకు కఠిన శిక్ష విధించాల్సిందేనన్నారు. విదేశీయులు మన దేశాన్ని భద్రమైన ప్రదేశంగా చూసేలా ప్రభుత్వం, న్యాయ వ్యవస్థ అత్యవసరంగా ఈ ఘటనపై పోలీసులు కఠిన చర్య తీసుకుని నిందితులకు ఉరిశిక్ష విధించేందుకు కఠినమైన, చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో మహిళలపై రోజు రోజుకూ లైంగిక దాడులు, దౌర్జన్యాలు పెరుగుతున్నాయని మండిపడ్డారు. నేటి సమాజంలో మహిళలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు రక్షణ కల్పించాలని, లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

కార్పొరేట్ కంపెనీల్లో పనిచేయాలంటే స్కిల్, విల్, కల్చర్ ఉండాలి

- కస్టమర్లతో కనెక్ట్ అయిపోయే కల్చర్ ఉన్నపుడు రెడ్ కార్పెట్
- గూగుల్ కంపెనీ మాజీ అధికారి కిరణ్ బాబు



నవతెలంగాణ-సిటీబ్యూరో

కార్పొరేట్ కంపెనీలు తమ ఇంటర్వ్యూల సెలక్షన్ కోసం స్కిల్, విల్, కల్చర్‌లను చూస్తారని, యువత వీటిని అలవరచుకుంటే ఉద్యోగాలు పొందడం సులభమని గూగుల్ అండ్ డెల్ కంపెనీలలో సుదీర్ఘకాలం పనిచేసి ప్రస్తుతం 2 ఎక్స్ ఫౌండర్, సీఈఓగా పనిచేస్తున్న కిరణ్ బాబు అన్నారు. ఛాట్ జీపీటీమ్ ప్రమోటర్లలో ఒకరైన కిరణ్ బాబు 2012లోనే తమ టీమ్ గూగుల్‌లో పనిచేస్తున్నప్పుడు టీ అంటే ట్రాన్స్ ఫార్మర్‌గా గుర్తించి డెవలప్ చేసిన ఛాట్ జీపీటీ నేడు కోట్లాది మంది వాడుతున్నారన్నారు. యువతలో పనిచేసే స్కిల్‌తోపాటుగా అంకితభావంతో పనిచేసే విల్ కూడా ఉండాలని, కస్టమర్లతో కనెక్ట్ అయిపోయే కల్చర్ ఉన్నపుడు ప్రపంచం వారికి రెడ్ కార్పెట్ వేస్తుందన్నారు. ఇందుకు ఉదాహరణ ప్రపంచ సాఫ్ట్ వేర్ రంగం దిగ్గజాలైన గూగుల్ కంపెనీకి సుందర్ పిచ్చాయ్ సీఈఓగావుంటే, మైక్రో సాఫ్ట్ కంపెనీకి సత్య నాదెళ్ల చైర్మెన్ అండ్ సీఈఓగా పనిచేస్తున్నారన్నారు. ప్రైమ్ మినిస్టర్ కౌశల్ వికాస్ యోజన, స్కిల్ ఇండియా, మినిస్ట్రీ అఫ్ స్కిల్ డెవలప్ మెంట్, నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సౌజన్యంతో జంటనగరాల్లో గుర్తించిన కాలేజీ విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ మిషన్‌లర్నింగ్ తదితర స్కిల్ డెవలప్ మెంట్ కోర్సులను నిర్వహిస్తున్న గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియా 3వ స్కిల్ స్నాతకోత్సవం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా హాజరైన కిరణ్ బాబు మాట్లాడుతూ, ప్రపంచ ఎకానమీ వంద ట్రిలియన్ డాలర్లుంటే, ఇండియా ఎకానమీ 3. 5 ట్రిలియన్ డాలర్లు ఉందని, 2030 నాటికీ ప్రపంచ ఎకానమీ మరొక 16 ట్రిలియన్ డాలర్లకు పెరిగితే ఇండియా మరొక్క ట్రిలియన్ డాలర్లకు మాత్రమే పెరిగే అవకాశం ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వ ఐటీ సలహాదారుల్లో ఒకరైన డాక్టర్ ఆర్.హఫీజ్ భాషా మాట్లాడుతూ స్టార్ట్ అప్‌లను ప్రారంభించే యువత కోసం ప్రభుత్వం ఎదురు చూస్తున్నదన్నారు. ఒక్క హైదరాబాద్ నగరంలోనే వందకు పైగా ఇంక్యూబేషన్ సెంటర్లున్నాయని, యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి ఇవి ఉపయోగపడతాయన్నారు. అలుమినస్ ఐఐటీ రూర్కీ కో ఫౌండర్ ప్రమోద్ చింతపెంట ఐటీ రంగంలో వస్తున్న నూతనమార్పులపై ప్రెసెంటేషన్ ఇచ్చారు. హెల్త్ కేర్, ఈ -కామర్స్, ఫైనాన్స్, ఈ -గవర్నెన్స్‌లతో పాటుగా వ్యవసాయం, రవాణా తదితర రంగాల్లో ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ చొచ్చుకుపోయిన విధానాన్ని విద్యార్థులకు వివరించారు. టెక్నాలజీపై పట్టు సాధించినప్పుడే యువత ఇతరులకు ఉపాధి చూపించినవారవుతారన్నారు. సెయింట్ జోసెఫ్ కాలేజ్ ప్రిన్సిపాల్ మొహమ్మద్ సిరాజుద్దీన్ మాట్లాడుతూ యువత సమయానికి విలువ ఇవ్వాలన్నారు. ప్రతి క్షణం గొప్ప ఆలోచనలతో ఉండాలన్నారు. ఇంజనీరింగ్ కాలేజ్ అఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జీ. రామేశ్వర్ రావు మాట్లాడుతూ మరొక 4800 మంది విద్యార్థులకు ఒక హైదరాబాద్ నగరంలోనే కాకుండా దేశంలో గుర్తించిన మరికొన్ని నగరాల్లో కూడా తమ కాలేజ్ ద్వారా స్కిల్ డెవలప్ మెంట్ కోర్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ని తమ కాలేజీ ప్రాంగణంలోనే ఏర్పాటు చేసినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. యువతలో అద్భుతమైన ఆలోచనలు దాగివుంటాయని, ప్రపంచానికి ఒక వినూత్న టక్నాలజీ అందించాలంటే వారిలో దాగిన ఆ విజ్ఞాన సంపదను వెలికి తీసినప్పుడు మాత్రమే ప్రయోజనంగా ఉంటుందన్నారు. సమావేశంలో విశ్వేశ్వరయ్య కాలేజ్ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, సెయింట్ జోసెఫ్ పీజీ అండ్ డిగ్రీ కాలేజ్ విద్యార్థులు 107 మందికి స్కిల్ సర్టిఫికెట్స్‌ను ప్రధానం చేశారు. కాలేజ్ చైర్మెన్ లక్ష్మి నారాయణతో పాటుగా పలువురు ఫాకల్టీ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమం మొత్తం ఫాకల్టీ డెవలప్ మెంట్ ప్రోగ్రాం సెల్ హెడ్ అఫ్ ది డిపార్టుమెంట్ పీ.సాయి కిషోర్, జూనియర్ ఫ్యాకల్టీ బీ. మోహన్, సన్వేష్ కుమార్ అధ్వర్యంలో జరిగింది.

ముందస్తు అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం : ఎస్ఎఫ్ఐ



నవతెలంగాణ-హయత్‌నగర్

ఎస్ఎఫ్ఐ నేతల ముందస్తు అరెస్ట్ ను తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఎస్ఎఫ్ఐ హయత్ నగర్ డివిజన్ అధ్యక్షుడు గువ్వల వంశీ మాట్లాడుతూ.. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నిస్తున్న ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఛలో సెక్రెటేరియట్ కార్యక్రమాన్ని వామపక్ష విద్యార్థి సంఘాలు ఆధ్వర్యంలో చేపడుతున్న సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులను ముందస్తుగా అరెస్టులు చేయడం దారుణమని అన్నారు. ఎన్ని నిర్బంధాలు చేసినా విద్యార్థి ఉద్యమాలు ఆపలేరని ప్రభుత్వం పై మండిపడ్డారు.

మదన్నపేట్ రోడ్డు లైన్ వద్ద వాహనాల తనిఖీ



నవతెలంగాణ- చంపాపేట్

యాకుత్ పురా నియోజకవర్గం పరిధిలోని కుర్మగూడ డివిజన్ పరిధిలోని మాదన్నపేట్ రోడ్ లైన్ వద్ద హైదరాబాద్ సీపీ సివి ఆనంద్, సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్, సైదాబాద్ ఏసీపీ వెంకన్న నాయక్ ల ఆదేశానుసారం మాదన్నపేట్ పోలీస్ స్టేషన్ సీఐ బి. శ్రీనివాస్ ఆదేశం మేరకు ఎస్సైలు వెంకటరమణ, శోభ, ఏఎస్ఐ సర్ఫరాజ్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో శుక్రవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. తల్లీదండ్రులు, యజమానులు ఎట్టి పరిస్థితుల్లోనూ మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని అన్నారు. నెంబర్ ప్లేట్ మార్పిడి చేస్తే చట్టరీత్యా నేరమని, హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం అని హెచ్చరించారు. రాంగ్ రూట్, ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదన్నారు. వాహనం ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్సులు, ఇతర పత్రాలు లేని పలువురు వాహనదారులపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ తనీఖీ ల్లో పోలీస్ సిబ్బంది, అజయ్, రోహిత్, ప్రకాష్, లాల్ బాబు పాశ్వాన్, ఎస్ బి హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి.. దోషికి 10 ఏండ్ల జైలు శిక్ష



నవతెలంగాణ-బడంగ్ పేట్

పహాడి షరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితునికి 10 ఏండ్ల జైలు శిక్ష పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహేశ్వరం నియోజకవర్గంలోని పహాడి షరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో స్నేహితుడి కూతురి మీద లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి పోక్సో చట్టం ప్రకారం పదేళ్ళ కఠిన కారాగార శిక్ష విధించారు. పహాడి షరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి తన అనారోగ్య కారణాల వలన తాత్కాలికంగా తన కూతురి సంరక్షణ కోసం కొన్ని రోజులు అతని స్నేహితుడికి అప్పగించాడు. సదరు స్నేహితుడు ద్రోహ బుద్ధితో ఆ బాలికకు మాయ మాటలు చెప్పి, ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి, లైంగిక దాడికి పాల్పడ్డాడు. నిందితుడు సయ్యద్ హాజీ అలీ.. వృత్తి ఆటో డ్రైవర్. షహీన్ నగర్, బాలాపూర్, రంగారెడ్డి జిల్లా వాసి. నిందితుడిని పోక్సో చట్టం ప్రకారం ఎల్బీనగర్ లోని రంగారెడ్డి జిల్లా గౌరవ ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక న్యాయమూర్తి శుక్రవారం దోషిగా నిర్ధారించారు. ఈ కేసులో నిందితుడికి పదేళ్ళ కఠిన కారాగార శిక్షతో పాటు రూ.15,000 జరిమానా విధించారు. బాధితురాలికి రూ.5,00,000 పరిహారం అందజేశారు. ఈ కేసులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సునీత డి.రఘు వాదనలు వినిపించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నవతెలంగాణ-హయత్ నగర్

వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా చేపడుతున్న విద్యుత్ మరమ్మత్తుల కారణంగా పలు చోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని సరూర్ నగర్ విద్యుత్ డీ ఈ రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటన లో పేర్కొన్నారు. 11కేవీ సౌత్ అండ్ పార్క్ ఫీడర్.. సౌత్ అండ్ పార్క్, సూర్యోదయ కాలనీ, సెంట్రల్ బ్యాంక్ కాలనీ పరిసర ప్రాంతాల్లో శనివారం ఉదయం 10గంటల నుండి 11గంటల వరకు. 11కేవీ విశాలాంధ్ర ప్రెస్ ఫీడర్.. ఫతుళ్ళ గూడ, బ్లైండ్స్ కాలనీ, హనుమాన్ నగర్,విశాలాంధ్ర, వెంకటేశ్వర కాలనీ పరిసర ప్రాంతాల్లో సాయంత్రం 3గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు. 11కేవీ లెక్చరర్స్ కాలనీ ఫీడర్..లెక్చరర్స్ కాలనీ, వినాయక నగర్,పాత హయత్ నగర్,ఎల్ ఐ సి కాలనీ పరిసర ప్రాంతాల్లో సాయంత్రం 4గంటల నుండి 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఆయన తెలిపారు.

రిటైర్డ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సీఐటీయూ నాయకుల డిమాండ్

నవతెలంగాణ-హయత్ నగర్

ఆర్టీసీ సంస్థలో దశాబ్దాల కాలం సమస్త అభివృద్ధి కోసం రక్తాన్ని చెమటగా మార్చి పనిచేసి, వయసు పరిమితుల రిత్యా సమస్త నుండి ఉద్యోగ విరమణ చేసి జీవనం సాగిస్తున్న వారు తెలంగాణ రాష్ట్రంలో సుమారు 24 వేల మంది ఉన్నారు. వారి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం హయత్ నగర్ డిపో ఎదుట సీఐటీయు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు కీసరి నర్సిరెడ్డి మాట్లాడుతూ పనిచేసిన కాలంలో చాలీచాలని జీతాలతో సమస్త అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేశారని చెప్పారు. కానీ వారు ఉద్యోగ విరమణ చేసిన అనంతరం ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వ పెన్షన్ స్కీం లేదన్నారు. ఈపీఎస్ ద్వారానే పెన్షన్ పొందాలి, వారికి వెయ్యి రూపాయల పెన్షన్ ఇచ్చి కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కనీస పెన్షన్ 9000 రూపాయలు ఇవ్వాలని, దానికి డి ఏ కలపాలని విజ్ఞప్తి చేశారు.2022లో నవంబర్ నాలుగున సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించి అర్హులైన అందరికీ అయ్యర్ పెన్షన్ చెల్లించాలని కోరారు.

చట్ట విరుద్ధంగా అమలు చేస్తున్న అయ్యర్ పెన్షన్ లో దామాషా పద్ధతిని రద్దు చేయాలని, చట్టం ప్రకారం రావాల్సిన పెన్షన్ చెల్లించాలని అన్నారు. అయ్యర్ పెన్షన్ కోసం రికవరీ చేసి రిజెక్ట్ చేయబడ్డ 16,37 మందికి రావాల్సిన డబ్బులు చక్రవడ్డీతో చెల్లించాలని అన్నారు. 2017 పే స్కేలును అమలు చేసి ఏ రియర్స్ ని వెంటనే చెల్లించాలని కోరారు. 2013 -2017 పే స్కేల్ కు సంబంధించి ఈపీఎస్ కంట్రిబ్యూషన్ చెల్లించి రివైజ్ పి పి ఓ లు కోసం కృషి చేయాలని అన్నారు. 2021 పే స్కేల్ ప్రకటించి ఏరియర్స్ తో సహా వెంటనే చెల్లించాలని పేర్కొన్నారు. రిటైర్ ఉద్యోగులకు వైద్య సదుపాయాల కల్పించాలన్నారు. రిటైర్డ్ ఎంప్లాయిస్ మెడికల్ ఫెసిలిటీ స్కీమ్ ఉద్యోగి రూ.10 లక్షలు పెంచాలని, ఉమ్మడిగా (20 లక్షలు) ఇవ్వాలని కోరారు. ఈ ధర్నాలో బి జె యం రెడ్డి, దానయ్యపిఎస్ నారాయణ, జనార్దన్, జయరాం, సామెల్, సౌరయ్యరాజ్యం, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

సంతోష్ నగర్ ఏసీపీ మహమ్మద్ గౌస్



నవతెలంగాణ-చంపాపేట్

శ్రీరామనవమి, హనుమాన్ జయంతి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సంతోష్ నగర్ ఏసీపీ మహమ్మద్ గౌస్ అన్నారు. హైదరాబాద్ సీపీ సివి ఆనంద్, సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్ ఐపీఎస్ ఆదేశం మేరకు హైదరాబాద్ జిల్లా యాకుత్ పురా నియోజకవర్గం సంతోష్ నగర్, ఐఎస్ సదన్, చంపాపేట్ డివిజన్ పరిధిలోని హైదరాబాద్ సిటీ పోలీస్ పీస్ కమిటీ మీటింగ్ సౌత్ ఈస్ట్ జోన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఐ ఎస్ సదన్ పోలీస్ స్టేషన్ లో సీఐలు కే. సత్యనారాయణ, జి. నాగరాజు, డీ ఐ సైదయ్య, పీస్ కమిటీ సభ్యుల పోలీస్ సిబ్బందులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మహమ్మద్ గౌస్ మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా శాంతియుత వాతావరణంలో పండుగలు నిర్వహించుకోవాలన్నారు. శ్రీరామనవమి, హనుమాన్ జయంతి కమిటీ సభ్యులు,ముస్లిం సోదరులు అన్నదమ్ముల ఐక్యతతో ముందుండాలని కోరారు. ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా సంబంధిత పోలీసు అధికారుల దృష్టికి తీసు కురావాలని సూచించారు. శాంతి భద్రత పరిరక్షణలో భాగంగా ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. డివిజన్ పరిధిలో సీసీ టీవీలను ఏర్పాటు చేయాలన్నారు. ఆలయం వద్ద గట్టి బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు ఉమారాణి, బ్రహ్మాచారి, విజయకుమార్, మధుసూదన్, గాయత్రి, డివిజన్ పీస్ కమిటీ సభ్యులు ఎస్.నరసింహ చారి, పి.ఎల్ కృష్ణ, నర్సింగ్ రావు, వై.నంద, శ్రీనివాస్, శివగోపాల్, రమేష్, సత్యనారాయణ, నర్సింగ్ రావు, రామ్, లక్ష్మణ్, సయ్యద్ అబ్దుల్, అజాం, శ్రీను గుప్త, డివిజన్ అధ్యక్షులు కమిటీ సభ్యులు చింతల శ్రీనివాస్, అజాం, శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
శనివారం | ఏప్రిల్ 05, 2025 | www.navatelangana.com

వావ్ కిడ్స్ అండ్ ఇంటెల్లిటాట్స్ ప్లే స్కూల్ ప్రారంభం



నవతెలంగాణ-కాప్రా

మల్లాపూర్‌లోని న్యూ భవానీ నగర్‌లో మదర్ థెరిస్సా హైస్కూల్ దగ్గర స్థాపించిన వావ్ కిడ్స్ అండ్ ఇంటెల్లిటాట్స్ ప్లే స్కూల్‌ను శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు జెర్రిపోతుల ప్రభుదాస్, పన్నాల దేవేందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారిని స్కూల్ ప్రిన్సిపాల్ శాలువాతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రిన్సిపాల్ ప్రియాంకరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు

గ్రూప్-1 ర్యాంకర్ శాంతన్ కుమార్ రెడ్డికి సన్మానం



నవతెలంగాణ-కాప్రా

ఇటీవల ప్రకటించిన గ్రూప్-1 ఫలితాలలో రాచకొండ స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ బుసిరెడ్డి రవీందర్ రెడ్డి కుమారుడు శాంతన్ కుమార్ రెడ్డి 30వ ర్యాంక్ సాధించడంతో శుక్రవారం కమలానగర్ లైయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రాఘవరెడ్డి పలువురితో కలిసి సన్మానించారు. రాష్ట్రస్థాయిలో 30వ ర్యాంక్, మల్టీజన్‌లో 12వ ర్యాంక్ సాధించడంతో పలువురు సంతోషం వ్యక్తం చేస్తూ శాంతన్ కుమార్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అతడి తల్లిదండ్రులు గీత, రవీందర్ రెడ్డిని అభినందించారు. సందర్భంగా శాంతన్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. సమాజానికి సేవ చేయాలని లక్ష్యంతో బీటెక్ ఉద్యోగాన్ని వదులుకొని పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యాయని తెలిపారు. కాగా శాంతన్ కుమార్‌రెడ్డి ఎన్ఐటీ సూరత్‌లో బీటెక్ పూర్తి చేశారు. ఆయన సోదరి బి.కృతిక ఐఐటీ ఖరకపూర్ వెస్ట్ బెంగాల్‌లో ఫైనలియర్ చదువుతోంది.

షీ టీమ్స్ సిబ్బందికి ఎలక్ట్రానిక్ పరికరాలు పంపిణీ



- సీపీ సుధీర్ బాబు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ఆకతాయిల వేధింపులను నియంత్రించడానికి, ప్రజల్లో అవగహన కల్పించడానికి షీ టీమ్స్ సిబ్బందికి శుక్రవారం నేరేడ్‌మెట్‌లోని రాచకొండ కమిషనరేట్‌లో ఎలక్ట్రానిక్ పరికరాలు (లాప్టాప్స్, పెన్ కెమెరాలు, ప్రొజెక్టర్స్, ప్రింటర్స్, సెల్ ఫోన్స్)ను సీపీ సుధీర్ బాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షీ టీమ్స్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో మహిళల రక్షణకు మరింత పకడ్బందీగా, వేగవంతంగా పని చేసేలా ఉపయోగపడుతుందని తెలిపారు. మహిళా భద్రత కోసం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, ఈ నూతన సాంకేతిక పరికరాలతో మరింత సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ ఉమెన్స్ సేఫ్టీవింగ్ ఉషా విశ్వనాథ్, ఇన్‌స్పెక్టర్ మునీ, ఇన్‌స్పెక్టర్ అంజయ్య, అడ్మిన్ ఎస్ఐ రాజు, షీ టీమ్స్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రూ.27లక్షలతో సీసీ రోడ్డు ప్రారంభం



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మౌలాలి డివిజన్‌లోని ద్వారకామై కాలనీలో జీహెచ్ఎంసీ నిధులు రూ.27లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం మౌలాలి కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..రోడ్డులో రెండేండ్ల క్రితం యూజీడీ పనులను తామే వేశామని తెలిపారు. అనంతరం రోడ్డు అంతా గుంతలమయంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారనీ ద్వారకామై కాలనీ ప్రెసిడెంట్ సుబ్బయ్య తన దృష్టికి తెచ్చారని తెలిపారు. సమస్యను అధికారులకు తెలపడంతో పనులకు నిధులు మంజూరు చేశారని చెప్పారు. కార్యక్రమంలో కాలనీవాసులు నరసింహారెడ్డి, భరత్ సింగ్, డివిజన్ అధ్యక్షులు శివ గౌడ్, సాయిబాబా, పూలపల్లి జగదీష్ యాదవ్, లింగరావు, మురళి, రమణ, తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు సమితి ఉప్పల్ నియోజకవర్గం మెంబర్‌గా డేవిడ్ ఫ్రాన్సిస్



నవతెలంగాణ-కాప్రా

కాప్రాలోని ఎల్లారెడ్డి గూడకు చెందిన డేవిడ్ ఫ్రాన్సిస్ ఉప్పల్ నియోజకవర్గం సమాచార హక్కు సమితి మెంబర్‌గా నియామకం అయ్యారు. ఆయనకు సమాచార హక్కు సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వై. మాద కృష్ణారెడ్డి ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా డేవిడ్ ఫ్రాన్సిస్ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ గతంలో అనేక సమస్యలను సమాచార హక్కు చట్టం ద్వారా పరిష్కరించానని తెలిపారు. అవినీతి, అక్రమాలు ఎక్కడ జరిగినా సమాచార చట్టం ఉపయోగించుకోవాలని కోరారు. సమాచార హక్కు చట్టం గురించి పౌరులలో అవగాహన కల్పించేందకు కృషి చేస్తానని తెలిపారు.

ఆలయ కమిటీలతో ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి సమావేశం



నవతెలంగాణ-కాప్రా

శ్రీరామనవమి సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ రెడ్డి కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆలయ కమిటీలు, ఊరేగింపు కమిటీలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆదివారం నిర్వహించే శ్రీరామనవమి సందర్భంగా ఆలయ కమిటీలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎస్సైలు సుధాకర్‌రెడ్డి, వెంకన్న, శ్రీనివాస్, హనుమాన్ నాయక్, రాములు ఉన్నారు.

డ్రయినేజీ సమస్య పరిష్కారానికి చర్యలు



- కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

రైల్వే ట్రాక్ సమీపంలో పొంగిపొర్లుతున్న డ్రయినేజీ సమస్యకు శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ అన్నారు. శుక్రవారం జలమండలి, జీహెచ్ఎంసీ రైల్వే అధికారులతో కలిసి డ్రయినేజీ పొంగుతున్న ఏరియాను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..రాకపోకలు సాగించే ప్రజలకు ఇబ్బంది కలగకుండా డ్రయినేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా పైపుల నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల రాముయాదవ్, జలమండలి ఏఈ నవీన్, జీహెచ్ఎంసీ ఏఈ దివ్య జ్యోతి, రైల్వే అధికారులు, నాయకులు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులు ఇంకెప్పుడు..?

- కులగణనలో వచ్చిన అర్జీలే పరిశీలన
- ఎక్కడికక్కడే ప్రజా పాలన దరఖాస్తులు..!
- కొత్త కార్డుల కోసం ఎదురు చూపులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తుదారులకు ఎదురు చూపులు తప్పడం లేదు. అర్జీలు పెట్టుకుని నెలలు గడుస్తున్నా.. కార్డుల జారీలో మాత్రం సాగదీత కొనసాగుతోంది. రేషన్ కార్డుల్లేక ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందలేకపోతున్నామని దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. కులగణన సర్వేలో వచ్చిన దరఖాస్తులనే పరిశీలించగా.. ప్రజా పాలన దరఖాస్తులను ఇంకా పెండింగ్‌లోనే ఉంచినట్టు సమాచారం. రేషన్ కార్డుల జారీ ఆలస్యమవుతుండటంతో డిజిటల్ కార్డులు ఇస్తారా..? సాధారణ కార్డులే జారీ చేస్తారా..? అని దరఖాస్తులుదారులు ఎదురు చూస్తున్నారు.

అర్హుల ఎంపిక పూర్తి.. జారీ కాని కార్డులు..

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ లేని జిల్లాల్లో మార్చి 1వ తేదీ నుంచే కొత్త కార్డులు ఇవ్వాలన్న ప్రభుత్వ నిర్ణయం అమల్లోకి రాలేదు. దరఖాస్తుల పరిశీలన, అర్హుల ఎంపిక పూర్తయినా.. కార్డులు ఎందుకు జారీ చేయలేదన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కులగణన సర్వేలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో తమకు రేషన్ కార్డులు కావాలని 34,719 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో అర్హులను గుర్తించి మార్చి 1న కొత్త కార్డులు ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం అయ్యాయి. కోడ్ లేని జిల్లాల్లో కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలని ఉన్నతాధికారులు సైతం ఆదేశించినా అమల్లోకి రాలేదు.



ప్రజాపాలనలో 33వేల పైనే దరఖాస్తులు

కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజాపాలనలో 33,435 దరఖాస్తులు అందాయి. ఇక ప్రజావాణి, మీ-సేవా వెబ్‌సైట్, కులగణన (సామాజిక, ఆర్థిక సర్వే)లోనూ మరిన్ని ఆర్జీలు వచ్చాయి. పౌరసరఫరాలశాఖ ప్రస్తుతం పరిశీలిస్తున్నవి కులగణన దరఖాస్తులు మాత్రమే అని సమాచారం. ప్రజాపాలన కార్యక్రమంలో కొత్త రేషన్‌కార్డుల కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలన ఇంకా మొదలు కానట్టు తెలుస్తోంది. దరఖాస్తు చేసుకుని ఏడాది దాటిపోతున్నా.. దరఖాస్తుల పరిశీలనలో కదలిక లేకపోవడంతో దరఖాస్తుదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

రేషన్ కార్డుల్లేక పరేషాన్

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు రేషన్ కార్డులనే అర్హతగా తీసుకుంటున్నారు. ఆరోగ్యశ్రీ, 200 యూనిట్ల వరకు ఉచితంగా గృహ విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలను పొందాలంటే రేషన్‌కార్డు తప్పనిసరి. రేషన్ కార్డుల్లో పేర్లున్నా.. కొన్ని కుటుంబాల్లో పెండ్లయిన తర్వాత విడిగా ఉంటున్న కుమారులు, కోడళ్లకు ఈ పథకాల ప్రయోజనం అందడం లేదు. జనవరి 26న జిల్లాలో దాదాపు 7 వేల మందికి మాత్రమే కొత్త కార్డులు జారీ చేసిన విషయం తెలిసిందే.

సాధారణ కార్డులా..? డిజిటల్ కార్డులా..?

సాధారణ కార్డులిస్తారా..? లేక డిజిటల్ రేషన్ కార్డులు జారీ చేస్తారా..? అని దరఖాస్తుదారులు కాస్త అయోమయంలో ఉన్నారు. కాగా ఏటీఎం కార్డు తరహాలో ప్రత్యేకంగా చిప్ ఉండేలా కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం గతేడాది భావించింది. వివిధ రాష్ట్రాల్లో అధికారులు అధ్యయనం సైతం చేశారు. అయినా ఏ నిర్ణయమూ తీసుకోలేదు. దీంతో కొత్త రేషన్ కార్డుల్ని సాధారణ పద్ధతిలోనే ఇవ్వాలని సర్కార్ ఆదేశించినా.. అడుగులు ముందుకు పడటం లేదు.

'సుప్రీం' తీర్పు భూముల పరిరక్షణకు ఆయుధం

- విద్యార్థులపై కేసులు ఉపసంహరించుకోవాలి
- నగర అభివృద్ధి, పర్యావరణ సమతుల్యతను విస్మరించరాదు
- భవనాలే కాదు.. జ్ఞానాన్ని వెదజల్లే కేంద్రాలను పరిరక్షించాలి
- 'నవతెలంగాణ'తో మేడ్చల్ జిల్లా సీపీఐ(ఎం) కార్యదర్శవర్గ సభ్యులు కోమటి రవి

నవతెలంగాణ - చర్లపల్లి

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా కార్యదర్శవర్గ సభ్యులు కోమటి రవి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన నవతెలంగాణతో మాట్లాడారు. ఈ తీర్పు యూనివర్సిటీ భూములను కాపాడే ముఖ్యమైన ముందడుగు అని ఆయన అభిప్రాయపడ్డారు. సుప్రీంకోర్టు తెలంగాణ ప్రభుత్వానికి భూమి విక్రయంపై తాత్కాలికంగా నిలుపుదల విధిస్తూ, భూస్వామ్య హక్కులపై సమగ్ర విచారణ జరిపించాలని ఆదేశించిందని తెలిపారు. కోర్టు యూనివర్సిటీ భూముల పరిరక్షణకు చట్టపరమైన మార్గాలను పరిశీలించాలని సూచించిందన్నారు. ఈ తీర్పుతో భవిష్యత్తులో విద్యా సంస్థల భూముల పరిరక్షణకు మార్గదర్శకంగా నిలుస్తుందని, ప్రభుత్వ భూవినియోగ విధానంపై విస్తృత చర్చ మొదలైందని అభిప్రాయపడ్డారు.



శాంతియుత నిరసన ప్రాథమిక హక్కు..

యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం పోరాడిన విద్యార్థులపై పోలీసులు నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించాలని కోమటి రవి డిమాండ్ చేశారు. యూనివర్సిటీలోని 400 ఎకరాల భూమిని విక్రయించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా విద్యార్థులు శాంతియుత నిరసనలు చేపడితే వారిని పోలీసులు నిర్బంధించడమే కాకుండా, వారిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేయడం దుర్మార్గం అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో విద్యార్థులు, యూనివర్సిటీ హక్కుల పరిరక్షణ కోసమే పోరాడారని, వారిపై కేసులు ఉపసంహరించుకోవాలిని కోరారు. శాంతియుతంగా నిరసన తెలిపే ప్రాథమిక హక్కు ఉందని గుర్తు చేశారు. విద్యార్థులపై ఉన్న కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలిని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వర్సిటీలు అభివృద్ధి వనరులు..

హైదరాబాద్ వంటి మెట్రో నగరం సమగ్రంగా అభివృద్ధి చెందాలంటే విద్యా పరిశోధన పర్యావరణ పరిరక్షణ అవసరం అన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములు భవిష్యత్తు విద్యార్థులకు శాస్త్రవేత్తలకు ప్రధానమైన వనరు అని తెలిపారు. ఈ భూములను వాణిజ్య ప్రయోజనాల కోసం విక్రయించడం కంటే, వాటిని విద్యా, పరిశోధన అభివృద్ధికి కేటాయించడం సముచితం అని చెప్పారు. విశ్వవిద్యాలయాలు కేవలం విద్యా కేంద్రాలే కాదు, పరిశోధనలకు ముఖ్యమైన ప్రదేశాలు అని తెలిపారు. నూతన శాస్త్ర సాంకేతికతలు, ఆవిష్కరణలకు అవసరమైన వాతావరణాన్ని అందిస్తాయని వెల్లడించారు. కాంక్రీట్ జంగిల్‌లా మారుతున్న నగరాల్లో విశ్వవిద్యాలయ ప్రాంగణాలు పచ్చదనం, జీవవైద్యం కాపాడే కేంద్రాలు, అవి పర్యావరణ సమతుల్యతను తీసుకొస్తాయన్నారు.

నగర పురోగతికి స్థిరమైన పునాదు..

విద్యా సంస్థల అభివృద్ధితోనే నగర అభివృద్ధికి స్థిరమైన పునాదులు ఉంటాయని తెలిపారు. ఐటీ కంపెనీలు, పరిశ్రమలకు మేధస్సును అందించేది విశ్వవిద్యాలయాలే అన్నారు. ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు యూనివర్సిటీ భూములను పూర్తిగా విద్యా పరిశోధన కోసమే కేటాయించాలని తెలిపారు. భూములు వాణిజ్య రియల్ ఎస్టేట్ ప్రయోజనాలకు కాకుండా, భవిష్యత్తు విద్యార్థుల అవసరం దృష్టిలో పెట్టుకోవాలని సూచించా రు. అభివృద్ధి అనేది భవనాలు కట్టడం కాదు, జ్ఞానాన్ని పెంపొందించడం.. నగరం నిజమైన అభివృద్ధి సాధించాలంటే విద్యా సంస్థలను బలోపేతం చేయాలని, విశ్వవిద్యా లయ భూములను పరిరక్షించాలని కోమటి రవి అభిప్రాయపడ్డారు.

మున్సిపల్ కార్మికులకు రూ.26 వేల వేతనమివ్వాలి

- 8 గంటల పని కల్పించాలి
- తెలంగాణ ఆదర్శ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఐఎఫ్‌టీయూ నాయకులు

నవతెలంగాణ - జవహర్ నగర్

మున్సిపల్ కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, 8 గంటల పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఆదర్శ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ - ఐఎఫ్ టీయు నాయకులు అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్మికులు జీతం తగ్గించి ఇవ్వాలనే అధికారుల వైఖరిని విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ జవహర్ నగర్ మున్సిపల్ కార్యాలయంలో కార్మికులకు కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం కార్మిక నాయకులు మాట్లాడుతూ ఉదయం 5 గం. నుండి మధ్యాహ్నం1 గంట వరకు పని చేపించాలని, కానీ అధికారులు 12 గంటలు పని చేయాలని వత్తిడి చేస్తున్నారని అన్నారు. తమకు వేతనం కేటగిరీల వారీగా పెంచి ఇవ్వకుండా వేతనం తగ్గిస్తూ ఆదేశాలు జారీ చేయడం సరికాదన్నారు. ఐడీ కార్డ్స్ ఇచ్చి, ఈఎస్ఐ, పీఎఫ్, అమలు చేయాలని, వారానికి ఒక రోజు సెలవు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు శివ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ యాదయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్. రాములు, కార్మికులు పాల్గొన్నారు.



హెచ్‌సీయూ భూములపై ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి

- ఐద్వా మల్కాజిగిరి మండల కార్యదర్శి పి.మంగ

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

హెచ్‌సీయూ భూముల వేలంపై ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని ఐద్వా మల్కాజిగిరి మండల కార్యదర్శి పి. మంగ శుక్రవారం పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. యూనివర్సిటీ భూములు అమ్మడం సరైన నిర్ణయం కాదని నిరసనలు తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులతో విచక్షణ రహితంగా కొట్టించి పోలీస్ స్టేషన్ లో బంధించడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. విద్యార్థులపై అనేక కేసులు మోపిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం తక్షణమే విద్యార్థి నాయకులను విడుదల చేసి, వారిపై పెట్టిన కేసులు తొలగించాలని డిమాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం భూముల అమ్మకం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని తెలిపారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబించి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి పరిపాలి స్తామంటే, రాష్ట్ర ప్రజల చేతిలో ఈ ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.




హెచ్‌సీయూ భూములను కార్పొరేట్ సంస్థలకు కట్టబెటొద్దు

- సీపీఐ(ఎం) మల్కాజిగిరి మండల కార్యదర్శి గుంటూరు లక్ష్మణ్

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని 400 ఎకరాల భూమిని బడా పెట్టుబడిదారులకు, కార్పొరేట్ సంస్థలకు కట్టపెట్టే ప్రయత్నాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని సీపీఐ(ఎం) మల్కాజిగిరి మండల కార్యదర్శి గుంటి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన నవతెలంగాణతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు పేదలకు అనేక వసతులు కల్పిస్తామని, పథకాలు ఇస్తామని చెప్పి ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిందన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక ప్రజల ఆశలు అడియాశలు చేశారని తెలిపారు. ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కిన కాంగ్రెస్ తీరును ఖండిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం ఇదే విధంగా ఇతర యూనివర్సిటీలలో అక్రమ ప్రయత్నాలు చేస్తే విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీలు నిరసనలతో తిప్పికొట్టాయని తెలిపారు. రాష్ట్రంలోని దేవాదాయ భూములు అన్యాక్రాంతం గురవుతున్నా వాటిని పట్టించుకోకుండా విద్యార్థులకు ఉపయోగపడే యూనివర్సిటీ భూములను అమ్మడాన్ని సీపీఐ(ఎం) తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. విద్యార్థులపై పెట్టిన కేసులు తొలగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థులతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



పెండింగ్‌లో ఉన్న కల్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేయాలి

- కీసర ఆర్డీవోకు వినతి పత్రం అందజేసిన నాగారం మున్సిపాలిటీ మాజీ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపాలిటీలో పెండింగ్‌లో ఉన్న కల్యాణ లక్ష్మీ చెక్కులను పంపిణీ చేయాలని కీసర ఆర్డీవో ఉపేందర్ రెడ్డికి నాగారం మున్సిపాలిటీ మాజీ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ.. నాగారం మున్సిపాలిటీ పరిధిలో 80 చెక్కులు, కీసర ఆర్డీవో డివిజన్ పరిధిలో సుమారు 2000 చెక్కులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండడం, స్థానిక మేడ్చల్ ఎమ్మెల్యే బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యే కావడంతో ఇరు పార్టీల సమన్వయలోపంతో చెక్కుల పంపిణీ సమయానికి మంజూరు కావడం లేదన్నారు. దీంతో ప్రజలు అయోమయ పరిస్థితిలో ఉన్నారని తెలిపారు. దీనిపై ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న చెక్కులను వెంటనే పంపిణీ చేయాలని ఆర్డీవోకు తెలిపినట్టు వివరించారు. ఈ విషయంపై ఆర్డీవో వెంకట ఉపేందర్ రెడ్డి స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటామని, సంబంధిత ఎమ్మార్వోలకు వెంటనే ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు బిజ్జా శ్రీనివాస్ గౌడ్, బుద్దవరం లక్ష్మీ, నాగారం మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు కొండబోయిన నాగరాజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

- బాలాజీ నగర్ ఏఈ సాంబశివ రావు

నవతెలంగాణ - జవహర్ నగర్


మరమ్మతుల కారణంగా 33/11 కేవీ బాలాజీ నగర్ సబ్ స్టేషన్ నుండి వెలువడే 11 కేవీ లక్ష్మి నర్సింహ ఫీడర్, 11 కేవీ సాయి బాబా ఫీడర్‌లో శనివారం మధ్యా హ్నం మూడు గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని బాలాజీ నగర్ ఏఈ సాంబశివ రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిటిజెన్ కాలనీ, బీరప్ప గడ్డ, లక్ష్మి నర్సింహ కాలనీ, వికలాంగుల కాలనీ, ఆదర్శ నగర్, రేణుకా నగర్, సీపీఐ కాలనీ, సుష్మిత నగర్, చెన్నాపురం, చిలుకళ భవన ం ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగు తుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.



11 కేవీ చెన్నాపూర్ ఫీడర్ లో

33కేవీ సీఆర్పీఎఫ్ సబ్ స్టేషన్ నుండి వెలువడే 11కేవీ చెన్నాపూర్ పిడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుండి 11గంటల వరకు సీఆర్పీఎఫ్, అరుంధతి నగర్, ఫరా నగర్, గోశాల, మల్లెలగూడ, మల్కారం ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు.

సీతారాం రెడ్డికి జన్మదిన శుభాకాంక్షల వెల్లువ..



నవతెలంగాణ - చర్లపల్లి

కాంగ్రెస్ నాయకుడు సీతారాం రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. రాజకీయ, సామాజిక రంగాల్లో ఆయన సేవలను గుర్తు చేసుకుంటూ కార్యకర్తలు, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీతారాం రెడ్డి పార్టీ కోసం చేసిన సేవలు ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి డివిజన్ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

శ్రీరామనవమికి ఆహ్వానం..

శ్రీరామనవమి వేడుకల సందర్భంగా చర్లపల్లి డివిజన్ కుషాయిగూడలోని హనుమాన్ నగర్ శ్రీ శివాంజనేయస్వామి దేవాలయంలో నిర్వహించే సీతారామ స్వామి కల్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికను సీతారామరెడ్డికి అందజేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీరామనవమి ఉత్సవ కమిటీ అధ్యక్షులు గురుంచి అశోక చారి, ప్రధాన కార్యదర్శి వరగంటి హనుమంతు, రామిని తిరుమలేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతల సన్నాహక సమావేశం



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభ నేపథ్యంలో అధినేత కేసీఆర్ అధ్యక్షతన హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల పార్టీ ముఖ్య నేతలతో శుక్రవారం ఎర్రవెల్లి లోని ఆయన నివాసంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణా రావు పాల్గొన్నారు.



మాజీ కేంద్ర మంత్రి సత్యనారాయణ జన్మదిన వేడుకలు అయన నివాసంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా యువజన కాంగ్రెస్ కార్యదర్శి చిటకోరు కృష్ణ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గం ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జిల్లా శివ, బాలానగర్ డివిజన్ ఉపాధ్యక్షుడు ముప్పురి బాలరాజ్, కూకట్‌పల్లి కాంగ్రెస్ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ గజనంద్ శేఖర్, చందు, అనిల్ తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-బాలానగర్

సన్నబియ్యం పంపిణీలో ఆలస్యం జరగొద్దు



- సరుకులను సకాలంలో గోడౌన్‌కు చేర్చాలి
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్
- సన్నబియ్యం పంపిణీపై సమీక్షా సమావేశం

నవతెలంగాణ-సిటీబ్యూరో

సన్నబియ్యం పంపిణీలో ఎలాంటి అలస్యం జరగకుండా జిల్లా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పౌరసరఫరాల జిల్లా మేనేజర్ సుగుణ బాయి, స్టేజీ కాంట్రాక్టర్స్‌తో సన్నబియ్యం పంపిణీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు సన్నబియ్యం రేషన్ షాప్స్‌కి ఎంత పంపిణీ జరిగింది..? ఇంకా ఎంత జరగాల్సి ఉంది..? అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో గల గోదాముల్లో సన్నబియ్యం నిల్వలపై ఆరా తీయడంతో పాటు, సమీక్ష నిర్వహణలో కొన్ని సూచనలు జారీ చేశారు. సకాలంలో సరుకులు గోడౌన్‌కి చేరేందుకు తగు ఏర్పాట్లు చేసుకోవాలని స్టేజీ-7 ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్‌కి అదనంగా వెహికల్స్ పెట్టాలని సూచనలు చేశారు. ఇతర జిల్లాల నుంచి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు పేజీ-1 మూమెంట్ ద్వారా వచ్చే సన్నబియ్యం సకాలంలో రావడానికి డిప్యూటీ తహశీల్దార్లకు అదనపు బాధ్యతలను అప్పగించినట్టు తెలిపారు. రేషన్ షాప్ డీలర్స్‌కి ప్రజా పంపిణీలో ఏదైనా అవకతవకల గమనిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా మేనేజర్ పౌరసరఫరాల అధికారికి ఆదేశాలు జారీ చేశారు. అందరూ సంబదిత అధికారులు సమిష్టిగా పనిచేసి సకాలంలో సన్నబియ్యం పంపిణీ అయ్యేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూవిజయేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆఫ్‌లైన్‌లోనూ 'రాజీవ్ యువ వికాసం' దరఖాస్తులు

- సెలవు రోజుల్లోనూ అందుబాటులో ప్రజాపాలన కేంద్రాలు
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగ యువత స్వయం ఉపాధి అవకాశాల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చేందాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన ప్రకటించిన 'రాజీవ్ యువ వికాసం' పథకానికి ఆఫ్ లైన్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా తెలిపారు. ఇందుకు సెలవు రోజుల్లోనూ ప్రజాపాలన కేంద్రాలు పని చేస్తాయని తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకాన్ని ఎక్కువ మంది నిరుద్యోగులు ఉపయోగించుకోవాలనే సదుద్దేశంతో ప్రభుత్వం ఈ నెల 14వ తేదీ వరకు ధరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించిందన్నారు. ప్రజాపాలన కేంద్రాల వద్ద అన్‌లైన్‌లోనే కాకుండా ఆఫ్ లైన్ లోనూ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. సెలవు రోజుల్లోనూ ఈ కేంద్రాలు పని చేస్తాయనీ, ఈ విషయాన్ని ప్రజలు గమనించి ఎక్కువ సంఖ్యలో దరఖాస్తు చేసుకో వాలని సూచించారు. ఆఫ్ లైన్‌లో స్వీకరించిన ధరఖాస్తు లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి జాగ్రత్తగా భద్రపర్చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొన్ని మున్సిపాల్టీల్లో మైనారిటీ దరఖాస్తులేమీ రానందున, మైనార్టీ వర్గాల్లో ఎక్కువ మందికి ఈ పథకం ద్వారా లబ్ది చేకూరాలనీ, ఈ విషయమై మైనార్టీ వర్గ ప్రజలకు అవగాహన కల్పించేందుకుగాను మతపెద్దలు, మసీదులలు, చర్చిల్లో ఈ పథకం గురించి ప్రచారం చేయాలని సూచించారు. మున్సిపల్, ఎంపీడీఓ కార్యా లయ స్థాయిల్లో ప్రచారం చేసి అధిక సంఖ్యలో ధరఖా స్తులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 25 శాతం సింగిల్ ఉమెన్, వితంతులకు 5 శాతం, వికలాం గులకు కూడా ఈ పథ కంలో కల్పించాల్సి ఉన్నందున వారు కూడా దరఖాస్తు చేసుకునేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.

ఎమ్మెల్సీ డాక్టర్ అద్దంకి దయాకర్‌కు ఐఎన్‌టీయూసీ అధ్యక్షులు కర్క నాగరాజు జన్మదిన శుభాకాంక్ష లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం కూకట్‌పల్లి నియోజకవర్గం అధ్యక్షులు కూతడి కృష్ణ, వద్దే నాగార్జున, పిల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-బాలానగర్



"సత్యవాణి విద్యానికేతన్"లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ఎస్ఆర్ నాయక్ నగర్‌లోని సత్యవాణి విద్యానికేతన్‌లో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ టి.వంశీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా విచ్చేసిన తల్లిదండ్రులతో జ్యోతి ప్రజ్వలన గావించి... వెల్కమ్ డాన్సులతో ప్రారంభించారు. చిన్నారులు చేసిన సంస్కృతిక కార్యక్రమాలు చూపులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రీ ప్రైమరీ విద్యార్థులు యూకేజీ పూర్తి చేసుకుని ప్రైమరీ సెక్షన్ 1వ తరగతిలోకి ప్రమోట్ చేస్తూ... పట్టాలు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ టి.వంశీకృష్ణారెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులకు చిన్నతనం నుంచే నైతిక విలువలు, క్రమశిక్షణ , శ్రద్ధ వంటి లక్షణాలను నేర్పుతూ ఉత్తమ పిల్లలుగా తీర్చిదిద్దవలసిన బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి ఆరోపణలు..!



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన అవినీతి, మోసాలపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. డాక్యుమెంట్ నెంబర్ 4062/2023, "అగ్రిమెంట్ ఆఫ్ సేల్ కమ్ జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ విత్ పొసెషన్" అనే పత్రం అనుమానాస్పదంగా ఉందని.. దీనిలో ఆధార్, పాన్ కార్డులు తప్పుగా మార్చబడినట్టు గుర్తించామని ఫిర్యాదుదారులు తెలిపారు. ఈ డాక్యుమెంట్ భాగ్యలక్ష్మీ కాలనీ, ప్లాట్ నంబర్ 215, 300 చదరపు యార్డుల స్థలానికి సంబంధించినట్టు పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే బంధువులు ఈ మోసంలో భాగమైనట్లు ఆరోపణలు ఉన్నట్టు చెప్పారు గతం ఇక్కడ పని చేసిన సబ్-రిజిస్ట్రార్ జ్యోతి పై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఈ డాక్యు మెంట్‌ను రద్దు చేయాలని, క్రిమినల్ కేసు నమోదు చేసి పూర్తి విచారణ జరపాలని ఫిర్యాదుదారులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అకులా సతీష్, నల్ల జయశంకర్ గౌడ్, రవి, అరుణ్ రావు, శ్రీనివాస్ గౌడ్, చందు తదితరులు ఈ ఫిర్యాదులో పాల్గొన్నారు.

పేదల గుండె చప్పుడు కాంగ్రెస్

- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

రాష్ట్రంలోని పేద ప్రజల గుండెచప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు శుక్రవారం జగద్గిరిగుట్ట డివిజన్, పరిధి పలు ప్రాంతాలలో జై బాపు జై భీమ్ జై సంవిధన్ కార్యక్రమంలో నిర్వహించారు. అందులో భాగంగా స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పాదయాత్ర చేశారు. అనంతరం ఒక బస్తీ నుంచి మరొక బస్తీకి మహాత్మ గాంధీ, బాబాసాహెబ్ అంబేద్కర్‌ల చిత్ర పటాలతో పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కూన మాట్లాడుతూ ఇటీవలే బీజేపీ ప్రభుత్వం మహాత్మగాంధీ వారసత్వాన్ని, భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్‌లను అవమానించడం చాలా బాధాకరం అన్నారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ, ప్రజాసౌమ్య విలువలను కాలరాస్తూ రాజకీయ మనుగడ కోసం విద్వేషాలను రెచ్చగొడుతుందన్నారు. జై బాపు జై భీమ్ జై సంవిధన్ కార్యక్రమం క్షేత్ర స్థాయిలో 26 జనవరి 2026 సంవత్సరం పాటు జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయిలలో సన్నాహక సమావేశాలు, పాదయాత్రలు నిరంతరాయంగా కార్యక్ర మాలు నిర్వహించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు వి.గణేష్, సీనియర్ నాయకులు ఓరుగంటి కృష్ణ గౌడ్, రషీద్, ఐలయ్య గౌడ్, మాజీ కౌన్సిలర్ గూడ వరమ్మ, స్వాతి, నరేష్ గౌడ్, నరేందర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

విద్యతో విశ్వాన్ని జయించవచ్చు..



- బాలానగర్ జోన్ డీసీపీ కొల్లు సురేష్ కుమార్
- ఉల్లాసంగా ఉత్సాహంగా ఠాగూర్స్ హై స్కూల్ వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

విద్యతో విశ్వాన్ని జయించవచ్చునని ఆ దిశగా విద్యార్థులు చిన్ననాటి నుంచే పట్టుదల కనబరచాలని బాలానగర్ జోన్ డీసీపీ.కొల్లు సురేష్ కుమార్ సూచించారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి, గాంధీనగర్‌లో గల ఠాగూర్స్ హై స్కూల్ వార్షికోత్సవ వేడుకలు స్థానిక స్ప్రైటన్ ఫంక్షన్ హాలులో విద్యార్థుల కేరింతల నడుమ ఉల్లాసంగా ఉత్సాహంగా..కొనసాగాయి. ఈ కార్యక్రమానికి ఆయన తోపాటు జీడిమెట్ల సిఐ.గడ్డం మల్లేష్, ప్రముఖ చేతిరాత నిపుణులు ఇజాజ్ అహ్మద్, ఆగర్ సైబర్ ఎక్స్ సంస్థ అధినేత సుమన్, పాఠశాల చైర్మెన్, కరస్పాండెంట్ బండారు సాయికుమార్, డైరెక్టర్ బండారు నేహాలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే విద్య క్రీడల తోపాటు వారు ఎంచుకున్న రంగాలలో ప్రతిభ కనబరిస్తే ఉన్నత శిఖరాలధిరోహించడం ఖాయమని ఆకాంక్షించారు. సిఐ.గడ్డం మల్లేష్ మాట్లాడుతూ నేటి విద్యార్థులు రాబోవు భావి తరాలకు మార్గదర్శకులుగా ఉండాలని పట్టుదలతో చదివి ఎదగాలని తెలిపారు. పాఠశాల చైర్మెన్, కరస్పాండెంట్ బండారు సాయి కుమార్ మాట్లాడుతూ గత మూడున్నర దశాబ్దాల క్రితం ఈ ప్రాంతంలో తమ ఠాగూర్స్ పాఠశాల ఏర్పాటు చేసి, రవీంద్రనాథ్ ఠాగూర్ ఆశయాలతో పేద, మధ్యతరగతి, విద్యార్థులకు వారి వారి మనోభావాలకు అనుగుణంగా విద్యనందించి ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దామని సగర్వంగా తెలిపారు. తమ పాఠశాలలో చదివిన విద్యార్థులు క్యాంపస్ సెలక్షన్లలో రూ.25 లక్షల,18 లక్షల వార్షిక ఆదాయంతో ఉద్యోగాలు సంపాదించి ఢిల్లీలో జరిగిన పరేడ్ ఉత్సవాల్లో తమ విద్యార్థులు రెండు సార్లు పాల్గొనడం జరిగిందన్నారు. 2024 లో పదవ తరగతిలో జీపీఏ.10/10.సాధించిన విద్యార్థులకు అతిథులు బహుమతులు ప్రధానం చేస్తూ అభినందించారు. ఈ వార్షికోత్సవ వేడుకలలో ప్రఖ్యాత, చేతిరాత నిపుణులు ఇజాజ్ అహ్మద్ వ్యాఖ్యానం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో సామాజికవేత్త, సంఘ సేవకులు ఇక్కుర్తి నారాయణరావు,పాఠశాల ఇన్‌చార్జి చైతన్య, స్థానిక నాయకులు జల్దా లక్ష్మీనాథ్, గరిగె శేఖర్, పున్నా రెడ్డి, ఆంజనేయులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



వామ్మో కంపు.. కంపు..

- గాంధీనగర్ బస్ స్టాప్ వద్ద పొంగిపోతున్న డ్రయినేజీ నీరు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లోపం ప్రయాణికుల, పాదాచారుల పాలిట శాపంగా మారింది. ఐడీపీఎల్ చౌరస్తా నుంచి రంగారెడ్డి నగర్ బస్ స్టాప్ మధ్యలో గల గాంధీ నగర్ బస్ స్టాప్ చౌరస్తా వద్ద మ్యాన్ హెూల్ పగిలిపోయి గత రెండు రోజులుగా డ్రయినేజీ నీరు రోడ్లపై స్తంభించడంతోపాటు,ప్రధాన రోడ్డు పైకి కిలోమీటర్ల మేర పొంగిపొర్లుతుండడంతో పాదాచారులు, వాహనదారులు పడరాని పాట్లుపడుతున్నారు. ముక్కు పుటలదిరే దుర్గంధం రావడంతో బస్ స్టాప్‌లో క్షణం కూడా నిలబడకుండా స్థలం లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ప్రధాన రహదారి కావడంతో వాహనాల స్పీడ్ కు డ్రయినేజీ నీరు చిల్లుతుండడంతో ఘర్షణలు చోటు చేసు కున్న సంఘటనలు ఉన్నాయి... పారిశ్రామిక వాడ ప్రాం తం కావడంతో మహిళా కార్మికులు ఎక్కువగా ఈ రోడ్డు గుండా నడుచుకుంటూ వెళ్తూ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు త్వరిత గతిన మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

సమాజా సేవలో రాందేవ్ ఆస్పత్రి మరో ముందడుగు

- ప్రభుత్వ పాఠశాల విద్యార్థినీలకు ఉచితంగా సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్ అందజేత



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

సమాజానికి సేవ చేయడంలో రాందేవ్ ఆస్పత్రి మరో ముందడుగు వేసింది. రాందేవ్ ఆసుపత్రి" "కార్నర్ స్టోన్" అనే సాఫ్ట్ వేర్ సంస్థ సంయుక్తంగా శుక్రవారం రిక్షా పుల్లర్స్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థినిలకు ఉచితంగా సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది పాల్గొని ఈ సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్‌ను తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వాహకులు విక్రం దేవ్ మాట్లాడుతూ నేటి బాలికలను ఆరోగ్యవంతంగా పెంచితే భవిష్యత్ తరాలు, సమాజం ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడుపుతారన్నారు. మీరా రావు మాట్లాడుతూ సమాజం లోని పేద మహిళలు స్త్రీ సాధికారతను సాధించాలని సూచించారు. సాఫ్ట్ వేర్ సంస్థ నిర్వాహకులు అభిషేక్ గుప్త మాట్లాడుతూ రాందేవ్ రావు ఆస్పత్రి యాజమాన్యం చేస్తున్న అనేక వైద్య, సామాజిక సేవలకు అభినందిస్తున్నా మన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి నిర్వాహకులను అబి షేక్ గుప్తా ఘనంగా సన్మానించారు. ఆస్పత్రి ఎండి డాక్టర్ కమలాకర్ మాట్లాడుతూ సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్ ప్రోగ్రామ్‌ను ప్రతి బుధ, శని వారాలలో ఆస్పత్రిలో నిర్వహిస్తున్నామన్నారు. సర్వైకల్ క్యాన్సర్‌ను నివారిం చడంలో రాందేవ్ ఆస్పత్రి గత రెండు సంవత్సరాలుగా కృషి చేస్తుందన్నారు. వ్యాక్సినేషన్ అనేది ప్రాథమిక నివారణ అని, హెచ్‌పీవి కోర్టేస్ట్ అనేది రెండో నివారణ వీటి మీద కూడా అతి తక్కువ రుసుముతో అందరికీ అందుబాటులోకి తీసుకు వచ్చామన్నారు. రాందేవ్ రావ్ ఆస్పత్రిలో ఇలాంటి మంచి కార్యక్రమం జరగడం చాలా ఆనందంగా ఉందని ప్రశాంత్ రెడ్డి, అపర్ణ రావులు అన్నారు. ఉషశ్రీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్నర్ స్టోన్ సాఫ్ట్ వేర్ సంస్థ నిర్వాహకులు అభిషేక్ గుప్తా, కిరణ్ తనికెళ్ళ, భార్గవి, కె నిశిల్, పవన్,కోర్ కమిటీ సభ్యులు హర్ష పీటర్ జై కార్య, సాయి మహేష్, ప్రణీత కిరణ్ వెంకటేష్ సందీప్ హరీష్, దేవేంద్ర నికిత, హరి చైతన్య మనోహర్, నందినితో పాటు టీం సభ్యులు పాల్గొన్నారు.

భాగ్యనగర భద్రాద్రి కూకట్‌పల్లి రామాలయం

బలూరి వంశస్థులు లింగం బట్టు రామాలయానికి జీవం పోస్తే... మరో భక్త రామదాసులా మాధవరం కృష్ణారావు ఆలయ పునర్నిర్మాణానికి జీర్ణోద్ధరణ చేసి చరిత్రలోనిలిచిపోయారు. నాలుగున్నర దశాబ్దాల చరిత్ర గల రామాలయంపై ప్రత్యేక కథనం..
సీతా రాముల కళ్యాణం చూద్దము రారండి







నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఈ నెల 6న(రేపు) శ్రీరామ నవమిని పురస్కరించుకుని నాలుగున్నర దశాబ్దాల చరిత్ర కలిగిన కూకట్‌పల్లి గ్రామంలోని రామాలయంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వార్ల కళ్యాణ మహోత్సవము స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో అంగ రంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ కల్యాణోత్సవమునకు కూకట్‌పల్లి ప్రాంత వాసులే కాకుండా పరిసర కాలనీలు,బస్తీల వాసులు అధిక సంఖ్యలో పాల్గొని కళ్యానమహోత్సవముని తిలకించి సీతా రామచంద్రుల కృపకు పాత్రులవుతారు. స్థానిక ఎమ్మెల్యే మాధవరం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కళ్యాణమ్మహోత్సవం కోసం దేవాదాయ శాఖ ఈఓ ఆంజనేయులు పర్యవేక్షణలో,ఆలయ కమిటీ తులసి రావు సభ్యుల నిర్వహణలో, ఆకాశమంత పందిరితో, ఆలయ ప్రాంగణం పరిసరాలు పూర్తిగా విద్యుత్ వెలుగుల ధగ ధగలతో భక్తులు చూసేందుకు కళ్ళు చాలవన్నట్టుగా కమనీయంగా ఆలయ పరిసరాలు అలంకరిస్తారు. ఆలయ ప్రాంగణంలో ముత్యాల పందిరిలో, శ్రీ సీతారాముల కళ్యాణం చూసేందుకు, రెండు కండ్లు చాలవు అనేంత కన్నుల పండువగా జరిగే కళ్యాణ మహోత్సవానికి అశేష భక్త జనవాహిని హాజరవుతారు.


శ్రీ పట్టాభి సీతారామ చంద్రస్వామి కూకట్‌పల్లి ఆలయ చరిత్ర..

భాగ్యనగర భద్రాద్రిగా విలసిల్లుతున్నది నాలుగున్నర దశాబ్దాల చరిత్ర కలిగిన కూకట్ పల్లి రామాలయం శ్రీశ్రీశ్రీ పట్టాభి సీతారామచంద్ర స్వామి దేవాలయం. ఒకప్పుడు చిన్న గ్రామమైన కూకట్‌పల్లి నిర్మలమైన మనసు గల జనాలతో, జల సమృద్ధి కలిగిన చెరువులు, బావులు, పాడిపంటలు, పశు సంవృద్ధితో కళకళలాడుతూ ఆనందమయమైన జీవనముతో, ఆదర్శవంతంగా ఉండేది. ఈ గ్రామంలో పౌరోహిత్యులైన బలూరి వంశస్థులైన బ్రహ్మశ్రీ లింగం బట్టు తన చిన్నతనంలోనే శ్రీరామ మంత్రోపదేశవు పొందడంతో ఆయనకు తమ ఇంట్లో శ్రీరామ నవరాత్రులు నిర్వహించాలనే ధృఢ సంకల్పం కలిగి ఉండేది. ఇంట్లో శ్రీరామ దీక్ష చేపట్టగా పలు మార్లు అవాంతరాలు ఏర్పడ్డాయి. అందుకు నిరుత్సాహానికి గురైన లింగం బట్టు మరుసటి ఏడాది, శ్రీరామ నవరాత్రోత్సవములు గ్రామంలో ఒక నిర్మలమైన ప్రదేశంలో గుడిసె వేసుకొని, అక్కడే కలశ స్థాపన చేసి దీక్షకు పూనుకున్నారు. అప్పుడు ఎలాంటి అవాంతరము రాలేదు. దాంతో ఆనంద పరవశుడైన భట్టు ఆదే స్థలములో తన దీక్ష కొనసాగించారు. నాలుగైదేండ్ల తర్వాత ఆ గుడిసె స్థానంలో రామ మందిరాన్ని నిర్మించాలనే ఆలోచనతో కొన్ని రోజులకు కార్యరూపం దాల్చడంతో ఒకే పీఠంపై, సీతా లక్ష్మణ భరత శత్రుఘ్న హనుమత్ సేవిత రామచంద్ర స్వామి విగ్రహాలతో ఆలయం నిర్మాణం చేపట్టారు. ప్రతి సంవత్సరం ఆ మందిరంలోనే శ్రీరామ నవరాత్రోత్సవాలను, శ్రీ సీతారామ కళ్యాణములను జరిపిస్తూ ఉండేవారు. గ్రామస్తుల సహకారంతో, ఆలయ ముఖ మండపము నిర్మించారు, రథము, రథశాలను నిర్మించి, గ్రామస్తుల సహకారంతో, శ్రీ సీతారాముల కళ్యాణము రథోత్సవములను అత్యంత వైభవంగా నిర్వహింప జేసేవారు. ఆయన హయాంలో ఆలయ ఖ్యాతి దశదిశలా వ్యాపించి, రాముల వారి జాతరను చూడడానికి చుట్టు పక్క గ్రామాల నుంచి, సుదూర ప్రాంతాల నుండి భక్తులు వచ్చేవారని, ఆ సమయంలోనే గోల్కొండ సంస్థానంలో కుతుబ్‌షాహి వంశానికి చెందిన, తానిషా పరిపాలనలో మంత్రులుగా పనిచేసిన అక్కన్న, మాదన్నలు సైతం ఈ ఆలయాన్ని దర్శించుకోవడం జరిగిందని చరిత్ర. వారి హయాంలోనే ఈ ఆలయం నిర్మాణం జరిగిందనేది ప్రశస్తి. రామ లింగం బట్టు తదనంతరం శాస్త్రులు, కృష్ణం బట్టు, రామన్న పంతులు, ఒకరి తదనంతరం ఒకరు పరంపరగా వారసులు ఆలయ ఉత్సవాలు నిర్వహించారు.

భద్రాద్రిలో భక్త రామదాసు.. కూకట్‌పల్లిలో మాధవరం కృష్ణారావు.

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆయన తండ్రి నారాయణ రావు పరమపదోత్సవం పూర్తయిన తరువాత కులాచారం ప్రకారం ఆ రోజు రాత్రి ఆలయంలో నిద్ర చేయడం కోసం వెళ్ళగా అప్పటి ఆలయ పరిస్థితిని చూసి చలించిపోయారు. రామ మందిరం జీర్ణోదరణకై మనఃసంకల్పం చేసుకుని, ఇంత పెద్ద నగరంలో ఇంతటి భవ్యమైన చరిత్ర కలిగిన ఆలయం ఇలాంటి దీనావస్థలో ఉండటం సరైంది కాదనుకున్నారు. గ్రామస్తులను, భక్తులను, భాగస్వాములను చేసుకుంటూ అత్యంత కష్టమైన, సాహసోపేతమైన ఆలయ జీర్ణోదారణకు నడుంబిగించారు. అందులో భాగంగానే ఆలయ రాజగోపురం, ప్రాకారం నిర్మించడానికి ఎమ్మెల్యే పూజా కార్యక్రమాలు చేశారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, గ్రామ పెద్దలు, స్థానికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ తరువాత ప్రాకార రాజగోపురం పూర్తయిన తర్వాత, గర్భాలయం, కిందకు అవడం నచ్చక, శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారి మంగళా శాసనములతో, జూన్ 6 వ తేది 2019 రోజున, గ్రామ పెద్దల సమక్షంలో గర్భాలయ జీర్ణోదరణకు శంకుస్థాపన చేశారు. గర్భాలయం ముఖ మండపము ప్రాకారము, రాజగోపురములతో అత్యంత సుందరంగా, నయన మనోహరముగా నిర్మాణం పూర్తి చేసిన తరువాత, స్వస్తిశ్రీ చాంద్రమాన శుభకృత్ నామ సంవత్సర చైత్ర బహుళ దశమి 25 వ తేదీ ఏప్రిల్ 2022 సోమవారం ఉదయం గం. 10:25 ని.లకు ధనిష్టా నక్షత్ర యుక్త మిధున లగ్న పుష్కరాంశ సుముహూర్తమున శ్రీ సీతా లక్ష్మణ భరత శత్రుఘ్న హనుమత్ సేవిత పట్టాభి రామచంద్రస్వామి, శ్రీ మహాలక్ష్మి, శ్రీ ఆళ్వార్ ఆండాళ్ సన్నిధులు యంత్ర, విగ్రహ, శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ట రామానుజ చిన్నజీయర్ స్వామి వారి కరకమలములచే నిర్వహించారు.

ఘనంగా కళ్యాణ మహోత్సవ వేడుకలు..



రామాలయంలో ఏప్రిల్ 6న సీతారాముల కళ్యాణం,7న సామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహిస్తారని, ఈ బ్రహ్మోత్సవాలు 13 వ తేదీ వరకు జరుగుతాయని అందులో 5 వ తేదీన గరుడ ప్రసాదం,సాయంత్రం ఎదుర్కొళ్ళు, 9 వ తేదీ లక్ష పుష్పార్చన, 12 వ తేదీ రథోత్సవం,13 వ తేదీ చక్రస్నానం, అష్టోత్తర శత కలశాభిషేకం, పూర్ణాహుతి వంటి కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ అర్చకులు శ్రీనివాసా చార్యులు తెలిపారు.

-ఆలయ ప్రధానార్చకులు...శ్రీనివాసా చార్యులు

నేడు విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-దుండిగల్

నేడు విద్యుత్ లైన్ వైర్ల మరమ్మత్ పనుల కారణంగా కట్ట మైసమ్మ ఫీడర్ పరిధిలో ఉదయం 10:00 గం ల నుండి 10:30 ని ల వరకు సూరారం గ్రామం, సూరారం మెయిన్ రోడ్ పరిసర ప్రాణాల లో అలాగే మల్లంపేట్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3.00 గం ల నుండి 3.30 ల వరకు డ్రీమ్ వ్యాలీ కాలనీ, గ్రీన్ పార్క్ కాలనీ, ఆకాష్ లేఅవుట్, మల్లంపేట్ విలేజ్, ఏపి ఆర్ విల్లాలు, జి ఎల్ సి భవన్ విల్లాలు, హై-రైజ్ విల్లాలు అలాగే ఆర్ జి కే -2 ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3-00 గం నుండి సాయంత్రం 5-00గం వరకు రాజీవ్ గృహకల్ప సూరారం,గ్రీన్ హిల్స్, బహదూర్ పల్లి, మారుతీ బస్తీ, ముత్యాల బస్తీ, మొదలైన ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందని,ఈ అంతరానికి ప్రజల సహకరించాలని బౌరంపేట విద్యుత్ శాఖ ఏఈ బి.సాయి కిరణ్ తెలిపారు.



మమత హైస్కూల్లో ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్‌ను శుక్రవారం స్కూల్ యాజమాన్యం నిర్వహించారు. ఈ ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్‌కు ముఖ్యఅతిథిగా ట్రాఫిక్ ట్రైనింగ్ టీటీఐ ఏసీపీ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎంతో భవిష్యత్తు ఉందని చిన్నతనం నుంచే మంచిగా చదివి దేశం గర్వపడేలా విద్యార్థులు ముందుకు సాగాలని ఆయన అన్నారు. మమత హై స్కూల్ ప్రిన్సిపల్ ఇంద్రరాణి మాట్లాడుతూ.. చిన్నతనం నుంచి విద్యార్థులను మంచి భవిష్యత్తులో తీసుకెళ్లడంలో మమతా హైస్కూల్ ముందుంటుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో సిద్ధిక్ సాగర్, విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. నవతెలంగాణ-బేగంపేట్

నిలిచిన వర్షపు నీరు.. అధికారులకు కోట నీలిమ సూచనలు



నవతెలంగాణ-బేగంపేట్

సనత్‌నగర్ నియోజకవర్గంలో నిన్న రాత్రి కురిసిన భారీ వర్షంతో పలు కాలనీలు, లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరింది. వర్షపు నీరు నిలవకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి డా. కోట నీలిమ సూచించడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్, డీఆర్ఎఫ్ సిబ్బందితో కలిసి పలుచోట్ల అధికారులు పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. లోతట్టు ప్రాంతాల్లో నీటి ప్రవాహం నిలిచిపోయిన చోట్ల వెంటనే మోటార్ల ద్వారా నీటిని వెలికితీయడం, డ్రయినేజీ లైన్‌ల క్లీనింగ్, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వంటి చర్యలు చేపట్టారు. అలాగే నీలిమ సూచనల మేరకు ప్రతి డివిజన్‌లోని కాంగ్రెస్ కార్యకర్తలను అలర్ట్ చేసి, వారిని ఫీల్డ్‌లో ఉండేలా చేశారు. స్థానిక కార్యకర్తలు ప్రజలందరిని అప్రమత్తం చేస్తూ.. అవసరమైన సహాయం అందించారు. ఆమె ప్రతిక్షణం అధికారులతో మాట్లాడుతూ.. పరిస్థితిని సమీక్షిస్తూ, ఎక్కడ ఏ సమస్య ఉంటే అక్కడ వెంటనే స్పందించాలని ఆమె తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించాలి



- సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్

నవతెలంగాణ-ఓయూ

ప్రభుత్వ పాఠశాలల్ని అందరు ప్రోత్సాహించాలని, సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. దూద్ బావిలోని చిలకలగుడా ప్రైమరీ స్కూల్‌లో రానున్న విద్యా సంవత్సరానికి ప్రవేశాల కరపత్రాలను ఆయన శుక్రవారం సికింద్రాబాద్‌లోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ స్కూల్‌లలో వివిధ సదుపాయాలను కల్పించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. సికింద్రాబాద్‌లో పేద విద్యార్థులకు ఉపకరించేలా జూనియర్, డిగ్రీ కాలేజీలను సాధించుకున్నామని తెలిపారు. కొత్త భవనాల నిర్మాణానికి సైతం చురుకుగా ఏర్పాట్లు జరుపుతున్నామని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు సైతం తమ స్కూల్‌లలో విద్యార్థుల సంఖ్యను పెంచుకొనేందుకు, మెరుగైన ప్రమాణాలకు కృషి చేయాలని పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా సూచించారు. ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్ పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ పరిధిలో

జీహెచ్ఎంసీ కమిషనర్ పర్యటన



నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో కురిసిన భారీ వర్షానికి నగరం అతలాకుతలమైంది. ఈ క్రమంలో శుక్రవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి కార్వాన్ జూబ్లీహిల్స్ సర్కిల్ పరిధిలో పర్యటించారు. కార్వాన్ సర్కిల్‌లో హకీమ్‌పేట్, జూబ్లీహిల్స్ సర్కిల్‌లో ఎమ్మెల్యే కాలనీలో కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాల్లో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. తక్షణ నివారణ చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అత్యవసర మైతేనే బయటికి రావాలని, రోడ్డుపై నిలిచిన నీటిలో చిన్న పిల్లలు, వద్ధులు వెళ్లకూడదని, మ్యాన్‌హోల్స్ తెరవ వద్దని ప్రజలను కోరారు. అత్యవసరమైతే జీహెచ్ఎంసీ కాల్ సెంటర్‌కు ఫోన్ చేయాలని ప్రజలను కోరారు. కమిషనర్ వెంట జోనల్ కమిషనర్ అనురాగ్ జయంత్, డీసీ శశిరేఖ, ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.

చైర్మెన్‌కు వ్యతిరేకంగా వర్తకుల నిరసన



నవతెలంగాణ-కంటోన్మెంట్

బోయిన్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ ఆనంద్ బాబు గౌడ్ వ్యాపారస్తులపై దురుసుగా ప్రవర్తిస్తున్నాడని ఆరోపిస్తూ మార్కెట్ యార్డు వ్యాపారస్తులు ఉదయం నల్ల బ్యాడ్జీలతో మార్కెట్ యార్డ్‌లో నిరసన చేపట్టారు. గత కొన్నేండ్లుగా బోయిన్‌పల్లి కూరగాయల మార్కెట్‌లో వ్యాపారం నిర్వహిస్తున్న తమ పట్ల చైర్మెన్ వైఖరి నిరసిస్తూ ఆందోళనకు దిగి క్రయ విక్రయాలు నిలిపివేసినట్టు పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ చైర్మెన్ బాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆయన కార్యాలయం ఎదుట శాంతియుత ప్రదర్శన చేపట్టారు. వెంటనే క్షమాపణలు చెప్పాలని లేని పక్షంలో మార్కెట్ యార్డు బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. మూడు రోజుల పాటు నిరసన కార్యక్రమాలు చేపడతామని వర్తకులు తెలిపారు.

సీతారాముల కళ్యాణం.. ఎమ్మెల్యేకు ఆహ్వానం



నవతెలంగాణ-బేగంపేట్

ఈ నెల 6వ తేదీన నిర్వహించే శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవానికి రావాలంటూ.. శుక్రవారం వెస్ట్ మారేడ్‌పల్లి లోని తన కార్యాలయంలో సనత్‌నగర్‌లోని హనుమాన్ దేవాలయ పండితులు కార్పొరేటర్ కొలన్ లక్ష్మీ బాల్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఎమ్మెల్యేను కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు.

విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల పునరుద్ధరణ

- క్షేత్ర స్థాయి సిబ్బంది సేవలు అభినందనీయం
- టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

గురువారం మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి వరకు కురిసిన భారీ వర్షానికి చెట్లు వాటి కొమ్మలు విద్యుత్ తీగలపై పడటంతో స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్స్ నేలకొరిగాయి. ఈ ప్రభావంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో సిబ్బంది రాత్రంతా, తెల్లవారుజాము వరకు నిర్విరామంగా విధులు నిర్వహించి రికార్డు సమయంలో విరిగిన స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో రాత్రికి రాత్రే కొత్తవి ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.



దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లు..

గ్రేటర్ హైదరాబాద్ నగరంలో వర్షం ప్రభావానికి 57 పోల్స్, 44 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్స్ దెబ్బతిన్నాయి. వాటిలో ముఖ్యంగా హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ పరిధిలో 7 డీటీఆర్స్, 23 పోల్స్, హైదరాబాద్ సౌత్ సర్కిల్ పరిధిలో 11 డీటీఆర్స్, 15 పోల్స్, సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో 5 డీటీఆర్స్, సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలో 14 డీటీఆర్స్, 3 పోల్స్, హబ్సిగూడ సర్కిల్ పరిధిలో 7 డీటీఆర్, 7 పోల్స్ దెబ్బతిన్నాయి.

సీఎండీ అభినందనలు



క్షేత్ర స్థాయి సిబ్బంది, అధికారుల పని తీరులో చాలా మార్పు వచ్చిందనీ, అత్యవసర పరిస్థితి ఎదురైనపుడు ఫీల్డ్‌లో అందుబాటులో ఉంటూ, పునరుద్ధరణ పనులను పర్యవేక్షిస్తూ, ఎఫ్ఓసీ, సబ్-స్టేషన్‌ల తనిఖీలు నిర్వహిస్తున్నారని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ తముషారఫ్ ఫరూఖీ తెలిపారు. గురువారం వర్షం, ఈదురు గాలులు పునరుద్ధరణ పనులకు ఆటంకం కల్పిస్తున్నా లెక్కచేయకుండా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించిన సిబ్బంది, అధికారులను సంస్థ సీఎండీ అభినందించారు. రాబోయే రోజుల్లో సైతం విపత్తులు తలెత్తినపుడు ఇదే స్ఫూర్తితో సమన్వయంతో పని చేస్తూ వినియోగదారులకు మెరుగైన సేవలందించాలని సీఎండీ సూచించారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

- ఓయూ వీసీ ప్రొ. కుమార్
- ఘనంగా అంతర్ కళాశాలల సాంస్కృతిక పోటీలు



నవతెలంగాణ-ఓయూ

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి ఓయూ వీసీ ప్రొ. కుమార్ మొలుగరం అన్నారు. శుక్రవారం నాట్యం, సంగీతం, నాటకం, సాహిత్యం సహ ఇతర ఫైన్ ఆర్ట్స్ విభాగాలకు చెందిన విద్యార్థులకు ఠాగూర్ ఆడిటోరియంలో 2024- 2025 విద్యా సంవత్సర ఉస్మానియా విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల సాంస్కృతిక పోటీల్లో పాల్గొనేందుకు ఆయా కళాశాలల విద్యార్థులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ పోటీల్లో ఓయూ పరిధిలోని 188 కళాశాలల నుంచి దాదాపు 900 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అంతర్ కళాశాలల సాంస్కృతిక పోటీలను ఓయూ వీసీ ప్రొ. కుమార్ మొలుగరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమాలను కేవలం సాంస్కృతిక పోటీలుగానే చూడొద్దని, సాంస్కృతిక పోటీలు విద్యార్థుల్లో ఐక్యత, సమయస్ఫూర్తి, జాతీయ భావం, సహనశక్తిని పెంచుతాయని అన్నారు. విద్యార్థుల సమగ్ర వికాసానికి సాంస్కృతిక కార్యక్రమాలు దోహదపడుతాయని వివరించారు. విభిన్న రంగాల్లో విద్యార్థుల నైపుణ్యాలు భవిష్యత్తు నాయకత్వాన్ని పెంపొందిస్తాయని గుర్తు చేశారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృతనాత్మకత, నైపుణ్యాలను వెలికితీసే వేదిక ఓయూగా అభివర్ణించారు. అంతర్ కళాశాలల సాంస్కృతిక పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థులంతా ఠాగూర్ ఆడిటోరియం వేదికగా, తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని, ఓయూ ఔన్నత్యాన్ని దశదిశలా చాటాలని పిలుపునిచ్చారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా విద్యార్థి వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ బి. రాజేంద్ర నాయక్, యూజీసీ వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ బి. లావణ్య, యూత్ వెల్ఫేర్ అధికారులు ప్రొ. ఎస్. కవితా దేవి, ప్రొ. లింగప్ప, సలహా కమిటీ సభ్యులు జి. ప్రభాకర్, ప్రొ. విద్యాసాగర్, ప్రొ. బి. మంజులా, ప్రొ. ఎ. ప్యాట్రిక్, డా.ఎస్. సుశీలా, డా. వి. సమున్నత, ఇతర అధ్యాపకులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి ఉద్యమకారుల సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఓయూ

సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో 16న, జరిగే విద్యార్థి ఉద్యమకారుల సమ్మేళనాన్ని విజయవంతం చేయాల్సిందిగా పలువురు విద్యార్థి నేతలు కోరారు. దానికి సంబంధించిన పోస్టర్‌ను ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ కొండా. నాగేశ్వర్, టీయూ జేఏసీ సెక్రెటరీ జనరల్ ప్రఫుల్ రామ్ రెడ్డి, కోశాధికారి చర్పల చంద్రన్న ప్రసాద్, జస్టిస్ మూమెంట్ ఆఫ్ ఇండియా కన్వీనర్ కొమ్ముల సురేందర్, విద్యార్థి నేతలు, వివిధ సంఘాల ప్రతినిధులు తదితరులు హాజరై పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల సుదీర్ఘ ఆకాంక్ష అయిన ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను ఈ తరం విద్యార్థులే నెరవేర్చారని, అలాంటి విద్యార్థి ఉద్యమ తరానికి నేడు ఎలాంటి న్యాయం జరగలేదని, గత ప్రభుత్వం పదేండ్ల కాలంలో ఉద్యమకారులను గుర్తించడంలో విఫలమైందని, ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వమైన ఉద్యమకారులను గుర్తించి తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయడంతో పాటు వారు ప్రకటించిన ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం తో పాటు ఇతర సంక్షేమ ఫలాలను వెంటనే అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ నాయకులు కంచర్ల బద్రి, కోట శ్రీనివాస్, టీడీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు విజయ్ నాయక్, రవీందర్ నాయక్, వీరస్వామి, జంగిలి దర్శన్, శాగంటి రాములు, ఉదయ్, పీఎస్‌యూ.ఆనంద్, రంజిత్ పుట్ట, నవీన్, పెంచల సతీష్, మోడ్ రవీందర్ సునీల్ శెట్టి, రాణి, ఢోలక్ యాదగిరి, సింగరాయ గౌడ్, రాహుల్ పాల్గొన్నారు.

ప్రెస్ క్లబ్ డైరీని ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం



నవతెలంగాణ-బంజారాహిల్స్

హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్ ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా తీసుకునే డైరీని ఈ ఏడాది నూతన డైరీని రాష్ట్ర ఆర్థిక విద్యుత్ శాఖ, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం విడుదల చేశారు. ప్రెస్ క్లబ్ హైదరాబాద్ అధ్యక్షులు ఎల్.వేణుగోపాలనాయుడు, ప్రధాన కార్యదర్శి ఆర్.రవికాంత్ రెడ్డి, ఉపాధ్యక్షులు కె.శ్రీకాంత్రావు, సంయుక్త కార్యదర్శి చిలుకూరి హరిప్రసాద్, కార్యవర్గ సభ్యులు బ్రహ్మాండభేరి గోపరాజు, పి.బాపురావు, టి.శ్రీనివాస్ తదితరులు డైరీ ఆవిష్కరణలో పాల్గొన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వం లోని కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కాగ్రెస్ ప్రభుత్వమే జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తుందని భట్టి తెలిపారు. ప్రెస్ క్లబ్‌కు స్థలాన్ని కేటాయించాలని అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు, పాలకమండలి ఉపముఖ్యమంత్రిని కోరారు. ప్రభుత్వంనుంచి ప్రెస్ క్లబ్‌కు ముఖ్యంగా జర్నలిస్టులకు పూర్తి సహాయసహకారాలు అందిస్తామని భట్టి హామీనిచ్చారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ పాలకమండలి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు పూల మొక్కను బహూకరించి శాలువాతో సత్కరించారు.

కమీషన్ ఏజెంట్‌పై చైర్మెన్ ఫిర్యాదు



నవతెలంగాణ-కంటోన్మెంట్

బోయిన్‌పల్లి డా. అంబేద్కర్ వ్యవసాయ మార్కెట్ కమీషన్ ఏజెంట్‌ల అసోసియేషన్ అధ్యక్షుడు సోమ దేవేందర్ రెడ్డి మార్కెట్ యార్డులో సెక్యూరిటీ ఏజెన్సీ కాంట్రాక్టర్ చరణ్ తేజ్‌పై దాడి చేశాడని మార్కెట్ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మెన్ ఆనంద్ బాబు గౌడ్ తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. శుక్రవారం కమిటీ సభ్యులతో కలిసి తన చాంబర్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైస్ చైర్మెన్ మాట్లాడుతూ.. కారు పార్కింగ్ విషయంలో చరణ్ తేజ్‌పై దేవేందర్ రెడ్డి దాడి చేసిన విషయం తన దృష్టికి బాధితుడు తీసుకువచ్చినట్టు తెలిపారు. ఈ విషయాన్ని పరిష్కరించే క్రమంలో కూడా దేవేందర్ రెడ్డి తనతో దురుసుగా ప్రవర్తించారని, చరణ్‌పై దాడి చేసిన దేవేందర్ రెడ్డి తప్పించుకునేందుకు బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీకి, వర్తక వ్యాపారుల అసోసియేషన్‌కు ఈ విషయాన్ని అంటగడుతున్నారని అన్నారు. వ్యక్తిగతంగా ఉన్న విషయాలను మార్కెట్ కమిటీకి రుద్దడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మార్కెట్లో జరుగుతున్న అక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించి నోటీసులు జారీ చేసినందుకే తనపై ఇలాంటి గొడవలకు తెర లేపుతున్నారని స్పష్టం చేశారు. మార్కెట్‌లో అక్రమాలకు తావు లేకుండా చర్యలు తీసుకుంటూ తాము మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు తెలిపారు.

బస్ షెల్టర్‌ను ప్రారంభించిన అడిషనల్ డీసీపీ



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని బొల్లారం చెక్ పోస్ట్ వద్ద మార్పు ఫౌండేషన్ నూతనంగా ఏర్పాటు చేసిన బస్ షెల్టర్‌ను శనివారం నార్త్ జోన్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ వేణుగోపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రయాణికులకు బస్ షెల్టర్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రోడ్డుపై ఎండలో నిలబడకుండా షెల్టర్‌లో వెయిట్ చేసి బస్ వచ్చాక వెళ్ళాలని తెలిపారు. సిటీలో ఎన్నో బస్ షెల్టర్‌లు ఉన్నా ప్రయాణికులు వాటిని ఉపయోగించుకోవట్లేదని చెప్పారు. రోడ్డుపై నిల్చుంటున్నారని దాని వల్ల రోడ్డుపై వాహనాలకు ఇబ్బందని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. బస్‌లో ఫుట్ బోర్డ్ ప్రయాణం చేయకూడదని ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. మార్పు ఫౌండేషన్ ప్రతినధులను అభినందించారు. ముందు ముందు ప్రజలకు ఉపయోగపడే ఎన్నో మంచి కార్యక్రమాలు చేయాలని వారిని కోరారు. ఈ కార్యక్రమంలో నార్త్ ఆ పిక్ ఏసీపీ శంకర్ రాజు, సీఐ మధు బాబు, ఎస్ఐ శ్రీకాంత్ హకీంపేట్ బస్ డిపో మేనేజర్ భవ భూతి, మార్పు ఫౌండేషన్ ఫౌండర్ రఘు వంశి, కో ఫౌండర్ రాఘ వైష్ణవి, కిరణ్, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి



- కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్‌నగర్ డివిజన్ రహమత్‌నగర్ క్రాస్ రోడ్డు జంక్షన్ అభివృద్ధిలో భాగంగా చేపట్టాల్సిన రోడ్డు విస్తరణలో ఇండ్లు కోల్పోతున్న వారితో జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ ఏసీపీ ప్రసీధ సమావేశం ఏర్పాటు చేశారు. గురువారం యూసుఫ్‌గూడా జీహెచ్ఎంసీ సర్కిల్-19 కార్యాలయంలో జరిగిన సమావేశంలో రహమత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పాల్గొని జంక్షన్ అభివృద్ధి కోసం అధికారులు, నిర్వాసితులు సమన్వయంతో సహకరించాలని సూచించారు. తద్వారా జంక్షన్ అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ నరేష్ పాల్గొన్నారు.

అధికారం కోసం తహతహలాడుతున్న బీఆర్ఎస్

- కాంగ్రెస్ సనత్‌నగర్ ఇన్‌చార్జి డా. కోటా నీలిమ



నవతెలంగాణ-బేగంపేట్

బీఆర్ఎస్ నాయకులు అధికారం కోసం తహతహలాడుతూ తమల రాజకీయ అపరిపక్వతను బయటపెడుతున్నారని కాంగ్రెస్ సనత్‌నగర్ ఇన్‌చార్జి కోటా నీలిమ అన్నారు. ఏ రాజకీయ పార్టీ అయినా పెట్టుబడిదారులను, సామాన్య ప్రజలను బెదిరించడం, అభివృద్ధిని అడ్డుకోవడమనే సాకుతో భయపెట్టడం తగదు. హెచ్‌సీయూ నిరసనల నేపథ్యంలో ప్రస్తానంలోకి వచ్చిన కంచ గచ్చిబౌలి ప్రాంతంలోని అభివృద్ధి ప్రాజెక్టుల్లో పాలుపంచుకునే పెట్టుబడిదారులు, పౌరులను లక్ష్యంగా చేసుకుంటూ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ చేసిన అసాధారణ ప్రకటనపై ఆమె స్పందించారు. ప్రజాస్వామ్యంలో ఎలాంటి రాజకీయ పార్టీ ఇలాంటి బెదిరింపులు చేస్తుందని ఇవి రాష్ట్ర అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపించే ప్రభావం ఉండని, తెలంగాణ ప్రజలు ఇలాంటి రాజకీయాలను అంగీకరించరన్నారు. కేటీఆర్ రాజకీయ అజ్ఞానం, అధికారం కోసం ఆయన తహతహలను ఈ ప్రకటన బయటపెడుతోందని ఆమె పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ విధానాల నిరంతరతను, అభివృద్ధి ప్రాజెక్టుల కొనసాగింపుని నమ్ముతుందని ఆమె అన్నారు. తెలంగాణలో సాధారణ ప్రజలు, కక్షసాధింపు రాజకీయాలకు బలికావాల్సిన అవసరం లేదు. కానీ కేటీఆర్ మాత్రం ప్రతీ అంశాన్ని అధికారంలోకి తిరిగి రావడం అనుకూలంగా మలచుకునే ప్రయత్నం చేస్తున్నాడు. విద్యార్థి నిరసనలు, అభివృద్ధి ప్రాజెక్టులు, పర్యావరణ సమస్యలు ఇవన్నీ తన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం తప్ప మరొకటి లేదని కోటా నీలిమ విమర్శించారు.

ప్రభుత్వం స్పందించకుంటే ధర్నాకు వెళ్తాం..

- రాష్ట్ర కాంక్రీట్ మిల్లర్ ఓనర్ అండ్ లేబర్ యూనియన్

నవతెలంగాణ-బంజారాహిల్స్

నిత్యవసర ధరలు ఆకాశాన్నంటుతుంటే కాంక్రీట్ మిల్లర్ రేట్లు నేలను చూస్తున్నాయని, చాలామంది మిల్లర్ కార్మికులు మిల్లర్లు అమ్ముకొని గ్రామాల తరలివెళ్లె దౌర్భాగ్యమైన స్థితి నెలకొందని తెలంగాణ కాంక్రీట్ మిల్లర్ ఓనర్ అండ్ లేబర్ యూనియన్ చైర్మెన్ వి. నాగరాజు, అధ్యక్షులు రేపల్లె కృష్ణ వాల్మీకి, స్టేట్ కన్వీనర్లు పి రవి కుమార్ రెడ్డి, బీసం గోపాలు అన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేసిన సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం స్పందిస్తే సరే లేని పక్షంలో తగ్గుతున్న రేట్లకు నిరసనగా ఈ నెల 5వ నుంచి గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాంక్రీట్ మిల్లర్లను బంద్ పాటించనున్నట్టు ప్రకటిస్తూ 10న ధర్నా చౌక వద్ద నిరసన కార్యక్రమాలకూ సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 5 నుంచి కాంక్రీట్ మిల్లర్ బంద్ పాటిస్తున్నామని తెలిపారు. 10 న ధర్నా చౌక్ వద్ద పెద్ద ఎత్తున నిరసన చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. 100 రిస్క్‌తో పని చస్తున్న కాంక్రీట్ మిల్లర్ లేబర్‌కు కనీస రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్డర్లు, మేస్త్రీలు, సెంట్రింగ్ మేస్త్రీలు పోటీ తత్వానికి వెళ్లి తక్కువ రేట్లలో పనులు తీసుకొని కాంక్రీట్ మిల్లర్ లేబర్‌పై తీవ్రస్థాయిలో ఆర్థిక భారాన్ని మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంక్రీట్ మిల్లర్లపై దాదాపు పది లక్షల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని గుర్తు చేశారు. ఈ అసంఘటిత కార్మికుల జీవితాలను మార్చే మార్గం ప్రభుత్వం వద్ద ఉందని వారి బతుకులను ఆర్ఎంసీ పేరుతో పూర్తిగా చిన్నబిన్నం చేస్తున్నారని, దానికి తోడు రేట్ల తగ్గించడం వల్ల ఆర్థికంగా పూర్తిగా ఇబ్బందులు తప్పడం లేదని వాపోయారు. ప్రభుత్వం మంజూరు చేసే సీసీ రోడ్డు పనుల్లో సైతం ఆర్ఎంసీలను వాడడంతో మిల్లర్ అన్నల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైందని అన్నారు. సీసీ రోడ్డు ప్యాచ్ వర్క్ పనిలో 5 వేల ఎస్ఎఫ్‌టీ ఉన్న పనులకు కచ్చితంగా కాంక్రీట్ మిల్లర్నే వాడాలనే నిబంధన ప్రభుత్వం విధించాలని డిమాండ్ చేశారు. అధ్యక్షులు రేపల్లె కృష్ణ వాల్మీకి మాట్లాడుతూ... సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరుతూ, అదేవిధంగా మిల్లర్ పనుల్లో ఏదైనా ప్రమాదవశాత్తు సంఘటనలు చోటు చేసుకుంటే ఆ కుటుంబం రోడ్డున పడకుండా ఉండేలా ప్రభుత్వం 10 లక్షల వరకు నష్టపరిహారం చెల్లించాలని అన్నారు. ఈ సమావేశంలో నార్త్ జూన్ ఎ సత్యనారాయణ, అధ్యక్షులు వెస్ట్ జోన్ అధ్యక్షులు రాములు, ఈస్ట్ జోన్ అధ్యక్షులు, ఈ తిరుపతయ్య, సౌత్ జోన్ అధ్యక్షులు శాంతయ్య, స్టేట్ కో కన్వీనర్లు పీ శ్రీనివాస్ యాదవ్, భగవంతు, భరత్ కుమార్, రామ్ చందర్, సభ్యులు మాధవరెడ్డి, సుల్తాన్, గోవర్ధన్, శ్రీనివాస్ రెడ్డి, జనార్ధన్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



ఎంఎస్ లైఫ్ 600 ప్లెస్ ఉక్కుతో తుప్పునకు చెల్లుచీటి

- ఎంఎస్ అగర్వాల్ ఫౌండ్రీస్

నవతెలంగాణ-బేగంపేట్

ప్రముఖ ఉక్కు ఉత్పాదక సంస్థ ఎంఎస్ అగర్వాల్ ఫౌండ్రీస్ దేశవ్యాప్తంగా 1000కి పైగా డీలర్లతో తమ వ్యాపార పరిధిని విస్తరించేలా ప్రణాళికలు రూపొందించింది. రూ.1200కోట్లకు పైగా పెట్టుబడులతో 1.2 మిలియన్ టీపీఏ ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఆధునాతన సాంకేతిక సాయంతో తుప్పు నిరోధక, బలీయమైన ఉక్కు ఉత్పాదనకు శ్రీకారం చుట్టింది. రాబోయే 18-20 నెలల్లో దేశవ్యాప్తంగా 1,000 ప్లెస్ యాక్టివ్ డీలర్లకు విస్తరించనున్నారు. విస్తరణ ద్వారా 5,000 ప్లెస్ ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఏర్పాటు చేయనుంది. ఎంఎస్ లైఫ్ 2024లో 25,000 ఇండ్ల నిర్మాణానికి వెన్నుముకలాంటి ఉక్కును అందించగా.. 2025-26 నాటికి రెట్టింపు సంఖ్యలో చేరువయ్యేలా కార్యాచరణ రూపొందించింది. ఎంఎస్ లైఫ్ 600 ప్లెస్ సీఆర్ఎస్ అత్యుత్తమ తన్యత బలం, అధిక పొడుపు కలిగి అధునాతన తుప్పు నిరోధకతను కలిగిన ఉక్కును అందిస్తోంది. శుక్రవారం సికింద్రాబాద్ లోని టీ19 టవర్‌లో జరిగిన ప్రత్యేక లాంచ్ ఈవెంట్‌లో అగర్వాల్ ఫౌండ్రీస్ నూతన ఉత్పత్తి ఎంఎస్ లైఫ్ 600 ప్లెస్ సీఆర్ఎస్ తుప్పు నిరోధక స్టీల్ ను ఆవిష్కరించింది. ఈ సంచలనాత్మక ఉత్పత్తి అరంగేట్రంతో పాటు, రాబోయే 3-4 సంవత్సరాలలో ఉత్పత్తి సామర్థ్యాన్ని ఐదు రెట్లు పెంచడానికి రూ 1,200 కోట్ల పెట్టుబడితో మద్దతు ఇచ్చే విస్తరణ ప్రణాళికను కంపెనీ ప్రకటించింది. ఈ వ్యూహాత్మక ప్రక్రియతో ఉత్పత్తి పెంపు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెరుగుతాయని, రాష్ట్ర, దేశ ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేయడంలో ఎంఎస్ అగర్వాల్ ఫౌండ్రీస్ భాగస్వామ్యం కానుంది. ప్రస్తుతం 400కు పైగా డీలర్లతో ఉండగా.. దేశవ్యాప్తంగా 1,000 కంటే ఎక్కువ డీలర్లతో మరింత పటిష్టం కానున్నట్టుగా వెల్లడించింది. దీని ద్వారా దేశమంతటా ప్రీమియం గ్రేడ్ స్టీల్ తమ ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కీలకమైన వాటాదారులు, పరిశ్రమ నాయకులు, కంపెనీ కార్యనిర్వాహకులు సమావేశమై, నిర్మాణ సామగ్రిలో ఆవిష్కరణ. మన్నిక, స్థిరత్వం పట్ల ఎంఎస్ లైఫ్ యొక్క అచంచలమైన నిబద్ధతను ప్రముఖంగా ప్రస్తావించారు.



శాన్వీ శ్రీ మనోహర నృత్యం



నవతెలంగాణ-కల్చరల్

ఏడేండ్ల బాలిక శాన్వీ శ్రీ పరమేశ్వరుణ్ణి స్తుతిస్తూ విరచించిన స్త్రోత్రం కు అభినయ పూర్వకం గా నర్తించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై ప్రముఖ సాంస్కృతిక సాహిత్య సంస్థ రసమయి బాలల ఉగాది పురస్కార ప్రదానోత్సవం లో శాన్వీ శ్రీ లయ తాళాలకు అనుగుణం పద ముద్రలతో శంకరుని పై స్త్రోత్రని నర్తించింది. తండ్రి ఆచార్య ఎస్ సి.వెంకట్ సంగీత గురువు కాగా తల్లి డాక్టర్ మనోజ్ఞ నృత్య గురువు

రేపు శ్రీరామనవమి శోభాయాత్ర

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

శ్రీరామనవమి శోభాయాత్ర రాజకీయ కార్యక్రమం కాదని, సనాతన ధర్మాన్ని కాపాడేందుకు నిర్వహించే శోభాయాత్ర, అందరూ సమిష్టిగా జరుపుకునే ఉత్సవమని భాగ్యనగర్ శ్రీరామనవమి ఉత్సవ సమితి అధ్యక్షుడు డాక్టర్ భగవంతరావు, ప్రధాన కార్యదర్శి గోవింద నారాయణరాఠీ అన్నారు. శుక్రవారం బాహితి భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సీతారాం బాగ్ లోని ఆలయంలో సీతారామ కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ముఖ్యఅతిథిగా పాల్గొంటున్నట్టు చెప్పారు. తెలిపారు. కల్యాణోత్సవం అనంతరం శ్రీరామనవమి శోభాయాత్ర కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. మధ్యాహ్నం ప్రారంభమై బోయిగూడ కమాన్, మంగళ్ హాట్, జాలి హనుమాన్, పురాణాపూల్, జుమ్మ రాత్ బజార్, బేగం బజార్ ఛత్రి, సిద్ధం బర్ బజార్ మీదుగా సుల్తాన్ బజార్ చేరుకుంటుందని తెలిపారు. ఈ శోభాయాత్రకు ముఖ్య అతిథులుగా ఉత్తర ప్రదేశ్ కు చెందిన అనంత శ్రీ విభూతి స్వామి అదోక్షజానానంద్, దేవుడు తీర్థ జీ మహారాజ్, త్రిపుర రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ శ్రీ రామ్ ప్రసాద్ లు శోభాయాత్ర మార్గంలోని పలు ప్రాంతాలలో ప్రసంగిస్తారని తెలిపారు.

వరద నివారణకు సమగ్ర చర్యలు తీసుకోండి

- జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి



నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో కురిసిన వర్షాలకు హకీంపేట్ వరద ప్రవాహం వలన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా శాశ్వత పరిష్కారం చేసేందుకు పూర్తి ప్రణాళికను సిద్ధం చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం జోనల్ కమీషనర్ అనురాగ్ జయంతి, ఎస్ ఈ రత్నాకర్, ఇతర అధికారులతో కలిసి వరద ముంపుకు గురైన ప్రాంతాలను కమిషనర్ పరిశీలించారు.బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీ, లోటస్ ఫాండ్ నుండి వర్షపు వరద ప్రవాహం హకీం పేట్ నుండి బల్కం చెరువులోకి వెళుతున్నట్టు ఇంజినీరింగ్ అధికారులు కమిషనర్ కు వివరించారు. గతంలో వరద రాలేదని హెచ్ ఎండిఏ లే ఔట్ చేయడం మూలంగా వర్షం కురిసినప్పుడు వరద వస్తున్నట్టు స్థానికులు తెలిపారు. గతంలో లే ఔట్ చేయక ముందు చెట్లు ఉండటం మూలంగా ఎక్కువ వరద రాలేదని, ఇటీవల కురిసిన వర్షాలకు హకీంపేట్ కు లే అవుట్ మట్టితో వరద వస్తుందని తెలిపారు. వరదలో వచ్చిన మట్టిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారానికి డీపీఆర్ తయారు చేసి పంపాలని ఇంజినీరింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, ఎస్.ఈ రత్నాకర్, కార్వాన్, జూబ్లీహిల్స్ ఈ.ఈ లు వెంకట శేషాచలం, విజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

శ్రీరామ నవమి వేడుకల్లో మత సామరస్యం కాపాడాలి

- రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు



నవతెలంగాణ-సిటీబ్యూరో

శ్రీ రామ నవమి వేడుకల సమయంలో మత సామరస్యం కాపాడేలా, ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు రాచకొండ సీపీ సుధీర్ బాబు సూచించారు. రానున్న శ్రీ రామ నవమి వేడుకల సందర్భంగా చేపట్టవలసిన భద్రతా ఏర్పాట్లు,తీసుకోవలసిన జాగ్రత్తల గురించి కమిషనర్ డీసీపీలు, ఏసీపీలు, ఇతర అధికారులతో నేరేడ్ మెట్ లోని రాచకొండ కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాచకొండ కమిషనరేట్ పరిధిలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొనే శోభాయాత్ర వంటి కార్యక్రమాల బందోబస్తు సమయాల్లో జాగ్రత్తగా వ్యవహరించాలని ఆదేశించారు. తమ పరిధిలో మతసామరస్యానికి కృషి చేస్తున్న వివిధ వర్గాల మతపెద్దలు, శాంతి కమిటీ సభ్యుల సహకారంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ విభాగపు అధికారులు, సిబ్బంది శోభాయాత్ర ఊరేగింపు సమయంలో అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన ప్రదేశాల్లో బాంబు తనిఖీ బృందాల ద్వారా ముందస్తు తనిఖీలు నిర్వహించాలని, సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీటీవీల పనితీరును పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. ఊరేగింపుల్లో పాల్గొనే సమయంలో మహిళలు ఎటువంటి వేధింపులకు గురికాకుండా షి టీమ్స్ బృందాలు ఎల్లవేళలా విధుల్లో ఉండాలని సూచించారు. ప్రజలు శాంతియుతంగా, సంతోషంగా తమ పండుగలు జరుపుకోవాలని, తమ చర్యల ద్వారా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు పోలీసులతో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా, ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో జరుగుతున్న ఐపీఎల్ క్రికెట్ పోటీల నిర్వహణ భద్రతా ఏర్పాట్లకు సంబంధించి కమిషనర్ పలు సూచనలు చేశారు. స్టేడియం పరిసరాలలో ఉన్న సిసిటీవీల ద్వారా నిరంతర నిఘా ఉండాలని, భారీ స్థాయిలో ప్రేక్షకులు హాజరవుతున్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు విధుల్లో ఉన్న అధికారులు మరియు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిసిపి మల్కాజ్ గిరి పద్మజ ఐపిఎస్, డిసిపి ఎల్బీనగర్ ప్రవీణ్ కుమార్ ఐపిఎస్, డిసిపి స్పెషల్ బ్రాంచ్ జీ నరసింహారెడ్డి, డిసిపి క్రైమ్ అరవింద్ బాబు, డీసీపీ స్పెషల్ బ్రాంచ్ నరసింహా రెడ్డి, డీసీపీ ట్రాఫిక్-1 మల్లారెడ్డి, డీసీపీ ట్రాఫిక్-2 శ్రీనివాసులు, డిసిపి ఉమెన్ సేఫ్టీ ఉషా విశ్వనాథ్, డిసిపి శ్యామ్ సుందర్, అదనపు డీసీపీ అడ్మిన్ శివకుమార్ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

సెలవుల్లో క్లాసులు నిర్వహిస్తున్న కాలేజీలపై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.అశోక్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇంటర్ విద్యార్థులకు సెలవులు ఇవ్వకుండా విద్యార్థులను మానసిక ఆందోళనకు గురిచేస్తున్న ఇంటర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కె.అశోక్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇంటర్మీడియట్ బోర్డు జూన్ ఒకటో తారీకు వరకు సెలవులు ప్రకటించిందని తెలియజేశారు. సమ్మర్ హాలిడేస్‌లో క్లాసులో నిర్వహిస్తే.. సదరు కళాశాలలపై చర్యలు తీసుకుంటామని సర్క్యులర్ ఇచ్చినా కార్పొరేట్, ప్రయివేట్ కాలేజీలు బోర్డు నిబంధనలను పట్టించుకోకుండా.. యథేచ్ఛగా క్లాసులు నిర్వహిస్తున్నాయని మండిపడ్డారు. తక్షణమే ఆ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. క్లాసులు నిర్వహిస్తున్న కాలేజీలపై ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారులకు తెలియజేసిన పట్టించుకోక పోవడం దారుణమనీ, ఇంటర్ అధికారులు డబ్బులకు లొంగి కళాశాలల పై చర్యలు తీసుకోవడం లేదని ఆయన విమర్శించారు. వెంటనే ఆయా కళాశాలల పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ తరపున డిమాండ్ చేస్తున్నామనీ, లేనిపక్షంలో పెద్దఎత్తున ఇంటర్మీడియట్ బోర్డు ముట్టడి చేస్తామని ఆయన హెచ్చరించారు.

'భారత్ ఎలక్ట్రానిక్స్' లిమిటెడ్‌లో శాశ్వత ఉద్యోగావకాశాలు

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.రాధిక



నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలో గల నిరుద్యోగ యువతీ, యువకులకు నవరత్న కంపెనీ, భారతదేశపు ప్రముఖ ప్రొఫెషనల్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ అయిన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, హైదరాబాద్ యూనిట్ ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ నావల్ సిస్టమ్స్ ఎస్‌బీయూ (ఈడబ్ల్యూఎన్ఎస్ ఎస్‌బీయూ) అండ్ ఎలక్ట్రానిక్స్ వార్‌ఫేర్ ల్యాండ్ సిస్టమ్స్ ఎస్‌బీయూ (ఈడబ్ల్యూఎల్ఎస్ ఎస్‌బీయూ) కోసం శాశ్వత ఉద్యోగా వకాశాలు ఉన్నట్టు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.రాధిక తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రాడ్యుయేషన్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన తర్వాత రెగ్యులర్ పే స్కేల్స్‌లో ఉంటారు. ఈ నియామకంలో ఎంపికైన జూనియర్ అసిస్టెంట్లు బీఈఎల్, హైదరాబాద్ యూనిట్‌లో ప్రారంభ శిక్షణ పొందాల్సి ఉంటుంది. వీరు బీఈఎల్ ఇబ్రహీంపట్నం ఫ్యాక్టరీలో పని చేయాల్సి ఉంటుంది.

పలు పోస్టులు ఇలా..

1. ఇంజినీరింగ్ అసిస్టెంట్ ట్రైనీ (ఈఏటీ) ఫర్ ఈడబ్ల్యూఎన్ఎస్ ఎస్‌బీయూలో 8 పోస్టులు ఉన్నాయి. గుర్తింపు ఉన్న ఇనిస్టిట్యూట్ నుంచి ఇంజినీరింగ్‌లో మూడేండ్ల డిప్లొమా చేసిన వారు అర్హులు. డిసిప్లేన్, ట్రేడ్‌లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఉండాలి. రిజర్వేషన్లు యూఆర్-3, ఈడబ్ల్యూఎస్-1, ఓబీసీ-1, ఎస్సీ-1, ఎస్టీ-2 ఉన్నాయి. జీతం డబ్ల్యూజీ-4/సీపీ-4 పే స్కేల్ రూ.24,500-3శాతం-90వేలు ప్లస్ అడ్మినబుల్ అలవెన్స్ ఉంటుంది.

2.టెక్నీషియన్ 'సీ' ఫర్ ఈడబ్ల్యూఎన్ఎస్ ఎస్‌బీయూ కోసం 21 పోస్టులు ఉన్నాయి. ఇందుకు ఎస్ఎస్ఎల్‌సీ ప్లస్ ఐటీఐ ప్లస్ ఏడాది అప్రెంటిషిప్ ఆర్ ఎస్ఎస్ఎల్‌సీ ప్లస్ 3 ఏండ్ల నేషనల్ అప్రెంటిషిప్ సర్టిఫికెట్ కోర్సు చేసి ఉండాలి. డిసిప్లేయిన్/ట్రేడ్ ఎలక్ట్రానిక్-మెకానిక్ ఉండాలి. రిజర్వేషన్ యూఆర్-8, ఈడబ్ల్యూఎస్-3, ఓబీసీ-5, ఎస్సీ-4, ఎస్టీ-1 ఉన్నాయి. జీతం డబ్ల్యూజీ-4/సీపీ-4 పే స్కేల్ రూ.21,500-3శాతం -82వేలు ప్లస్ అడ్మినబుల్ అలవెన్స్ ఉంటుంది.

3. జూనియర్ అసిస్టెంట్ ఫర్ ఈడబ్ల్యూఎల్ఎస్ ఎస్‌బీయూ కోసం 3 పోస్టులు ఉన్నాయి. ఇందుకు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీకాం /బీబీఎం (మూడేండ్ల కోర్సు) ఉండాలి. రిజర్వేషన్లు యూఆర్-1, ఓబీసీ-1, ఎస్టీ-1 ఉన్నాయి. జీతం డబ్ల్యూజీ-4/ సీపీ-4 పే స్కేల్ రూ.21,500-3శాతం -82వేలు ప్లస్ అడ్మినబుల్ అలవెన్స్ ఉంటుంది.

మీరాలంమండిలో రేపు శ్రీ సీతరామ కల్యాణోత్సవం

నవతెలంగాణ - ధూల్ పేట్



పాతబస్తీ మీరాలంమండి శ్రీ మహంకాళేశ్వరి దేవాలయంలో ఈ నెల 6న శ్రీ సీతరామ కల్యాణ మహోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ అధ్యక్షులు గాజుల అంజయ్య తెలిపారు. శ్రీరామ నవమి సందర్భంగా ఆదివారం ఉదయం 11:30 గంటలకు కళ్యాణం ఉంటుందన్నారు. ఈ మహోత్సవంలో ప్రజలు పెద్ద ఎత్తున సమయానికే పాల్గొనాలని పిలుపునిచ్చారు.



గానసభలో అభయ గణపతి ప్రతిష్ట

నవతెలంగాణ-కల్చరల్

దాదాపు ఆరు దశాబ్దాల సాహిత్య సాంస్కృతిక కళా వికాసంతో వర్ధిల్లుతూ వందల, వేల, కవులు, కళకారులు, నాట్యకారిణులు వర్ధిల్లడానికి ముఖ ద్వారంగా నిలిచిన చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభ ప్రాంగణంలో శుక్రవారం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య అత్యద్భుతమైన ప్రకాశంతో శ్రీ అభయ గణపతి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. ప్రముఖ రచయిత, శ్రీశైల దేవస్థానం పూర్వ ప్రత్యేక సలహాదారులు పురాణపండ శ్రీనివాస్ సూచన మేరకు శృంగేరి పండితుల సమక్షంలో ఈ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం జరిగింది. అతి అరుదైన కృష్ణ శిలతో నిర్మితమైన చిన్న ఆలయంలో కృష్ణ శిలతో రూపు దిద్దుకున్న రెండున్నర అడుగుల అభయ గణపతి భగవానుని మంగళ విగ్రహానికి వేదపండితులు ప్రాణప్రతిష్ఠ నిర్వహించారు. అతిథులుగా గానసభ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కళావిఎస్. జనార్ధనమూర్తి, కళాశారద, రసమయి సంస్థ అధినేత ఎం.కె. రాము, హాస్యావధాని శంకర నారాయణ, వంశీ సంస్థల అధ్యక్షుడు వంశీ రామరాజు, రామచంద్రమూర్తి, కళా దత్తాత్రేయ, కళావల్లికా మహేశ్వరి, కళాపద్మజా నీలిమ, సతీష్, ఎస్పి.రామ్, తాళ్ళపల్లి చక్రపాణి, బండి శ్రీనివాస్, గాయకుడు త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వారాహి సిల్క్స్ ప్రారంభం

నవతెలంగాణ-సిటీబ్యూరో



వారాహి సిల్క్స్ ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లెజెండరీ నందమూరి బాలకృష్ణ, మీనాక్షి చౌదరి ముఖ్య అతిథులుగా హాజరై గ్రాండ్‌గా ఓపెనింగ్ చేశారు.

టైమ్‌లెస్ గాంభీర్యం కోసం ఒక గమ్యం!

మణిదీప్ ఏచూరి అండ్ డాక్టర్ స్పందన మద్దుల యాజమాన్యంలో వారాహి సిల్క్స్ మరొక బ్రాంచ్‌ను వేడుకగా నిర్వహించారు. కేపీహెచ్‌బీ రోడ్డు నెంబర్ 1లో నాలుగు అంతస్తుల షోరూమ్‌లో విస్తరించి ఉన్న ఈ స్టోర్ గ్రేస్, గొప్పతనాన్ని నిర్వచించే ప్రత్యేకమైన ఎంపిక చేయబడిన చీరలను అందిస్తుంది. నాణ్యమైన కంజీవరం, బనారసీలు, పోచంపల్లి, అధునాతన డిజైనర్ చీరల కోసం వెతుకుతున్న వారికి ఇది ఒక చక్కని వేదిక.

సరసమైన వీవర్స్ ధరలు రూ.999 నుంచే ప్రారంభం!

ఉత్తమ నేత-ప్రత్యక్ష ధరల వద్ద సంప్రదాయ సౌందర్యాన్ని అనుభవించండి. సేకరణ కేవలం రూ999తో ప్రారంభమవుతుంది. ఇది విలాసవంతమైన, సంప్రదాయాన్ని అందరికీ అందుబాటులో ఉంచుతుంది.

అద్భుతమైన లాంచ్ ఆఫర్!

తమ గొప్ప ప్రారంభోత్సవాన్ని జరుపుకోవడానికి, తమ కస్టమర్‌ల కోసం తాము ప్రత్యేకమైన ఆఫర్‌ని కలిగి ఉన్నామనీ, రూ.15వేలు లేదా అంతకంటే ఎక్కువ విలువైన కొనుగోళ్లపై 22 సీటీ గోల్డ్ కాయిన్‌ను ఉచితంగా పొందండి..! కేపీహెచ్‌బీలోని వారాహి సిల్క్స్‌ను సందర్శించండి అని యాజమాన్యం తెలిపింది.

రక్తదాన శిబిరం పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ ఎం. హుసేని ముజీబ్ ఆధ్వర్యంలో ఈనెల 11న నిర్వహిస్తున్న రక్తదాన శిబిరం పోస్టర్‌ను కింగ్ కోఠి జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రనాథ్, టీఎన్జీవోస్ మెడికల్ అండ్ హెల్త్ హాస్పిటల్ సర్వీసెస్ కింగ్ కోఠి జిల్లా ఆస్పత్రి అధ్యక్షులు ఎం వి నరసింహారెడ్డి, కార్యదర్శి సాహేదా బేగం, డాక్టర్ శశి తదితరులు ఆవిష్కరించారు.


సుప్రీంకోర్టు తీర్పుపై మైలారం సాయిరాం హర్షం



నవతెలంగాణ-అంబర్‌పేట

హెచ్‌సీయూ భూముల్లో చెట్ల తొలగింపు పనులను తక్షణమే నిలిపేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంపై అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన యువ నాయకులు మైలారం సాయిరాం హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 400ఎకరాల భూములను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టాలని బుల్డోజర్లతో చెట్లను తొలగించడం బాధాకరమన్నారు. ఈ క్రమంలో సుప్రీంకోర్టు చెట్ల తొలగింపు పనులను వెంటనే నిలిపివేయాని ఆదేశాలివ్వడం శుభపరిణామని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పుతోనైనా భూముల వేలాన్ని ఆపాలని హితవు పలికారు. ప్రభుత్వ తీరు మారకుంటే విద్యార్థులు, మేధావులు, ప్రజాసంఘాల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు.

బీసీ కుల వృత్తులకు సబ్సిడీ రుణాలివ్వాలి



- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య
- కేంద్ర మంత్రి అమిత్ షాకు వినతి

నవతెలంగాణ - ముషీరాబాద్

కేంద్రంలో ప్రత్యేక మంత్రి శాఖ ఏర్పాటు చేయాలని, జాతీయ బి.సి కార్పొరేషన్ ద్వారా బి.సి కుల వత్తులకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రి అమిత్ షాను వారి కార్యాలయంలో ఆయన కలిసి ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ "ఈ దేశంలో గత కేంద్ర ప్రభుత్వాలు 76 సంవత్సరాలుగా బీసీలకు ఏ రంగంలో కూడా జనాభా ప్రకారం వాటా ఇవ్వలేదు. ఇది ప్రజస్వామ్యదేశం అన్ని కులాలకు, సామాజిక వర్గాలకు వారి, వారి జనాభా ప్రకారం వాటా ఇవ్వాలి. అప్పుడు దేశంలో సమైక్యత, సమగ్రత, శాంతి ఉంటుంది. అందుకోసం బి.సి లకు రావాలసిన వాటా కోసం మరోసారి అధ్యయనం జరగాలి. బి.సి లకు రాజ్యాంగబద్ధమైన హక్కులు-వాటా కల్పించవలసిన సమయం ఆసన్నమైంది. బీసీలకు ఇచ్చేది బిక్షం కాదు. ఇది రాజ్యాంగ బద్ధమైన ప్రజాస్వామ్య హక్కు. స్వాతంత్రం వచ్చినప్పుడు బీసీలకు అసెంబ్లీ - పార్లమ్మెటుల్లో రిజర్వేషన్లు పెట్టకుండా అన్యాయం చేశారు. త్వరలో సేకరించిబోయే జనాభా గణనలో కులాల వారిగా బీసీ జనాభా గణన చేయాలి. బీసీ జనాభా లెక్కలు చేయాలంటే అనేక అభ్యంతరాలు చెబుతు న్నారు. ఈ వైఖరి మార్చుకోకపోతే బీసీలు తిరగబడతారు. సుప్రీం కోర్టు - హై కోర్టు బీసీ జనాభా లెక్కలు సేకరించాలని 40 ఏండ్లు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తున్నాయి. కానీ కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేస్తున్నది. కేంద్ర ప్రభుత్వం బీసీ అనుకూల వైఖరిగా మార్చుకోవాలి. పార్లమెంటులో బి.సి. బిల్లు ప్రవేశపెట్టి, చట్ట సభల్లో బీసీ లకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి.బి.సి ఉద్యోగులకు ప్రమోషన్లను రిజర్వేషన్లు కల్పించాలి, ఇందుకు రాజ్యాంగ సవరణ చేయాలి. కేంద్ర విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లు బి.సి.ల జనాభా ప్రకారం 27శాతం నుండి 56 శాతంకు పెంచాలి" అని కోరారు. ఎస్సీ /ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ మాదిరిగా బి.సి.లకు సామాజిక రక్షణ, భద్రత కల్పించడానికి బి.సి. యాక్ట్‌ను తీసుకురావాలి. ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలి" అని కోరారు. బీసీల డిమాండ్లు న్యాయమైనవి, దశల వారీగా పరిష్కరిస్తామని, అన్నీ రంగాలలో సమాన వాటా ఇచ్చే ప్రక్రియ ప్రారంభమైందని ఇంకా పూర్తి స్థాయి న్యాయం చేయడం కోసం ప్రధానమంత్రి దృష్టికి తీసుకొని వెళ్ళి డిమాండ్లను పరిష్కరిస్తామని అమిత్ షా హామీ ఇచ్చారని తెలిపారు.

జెండర్ సంకెళ్ల ఆంక్షల నుంచి విముక్తి పొందాలి


- తెలంగాణ ట్రాన్స్ జెండర్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి
- జాతీయ ట్రాన్స్ జెండర్ హక్కుల కార్యకర్త, సోషల్ ఆక్టివిస్ట్ రచన ముద్రబోయిన



నవతెలంగాణ-ముషీరాబాద్

జెండర్ సంకెళ్ల ఆంక్షల నుంచి విముక్తి చేసి తెలంగాణ ట్రాన్స్ జెండర్స్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని జాతీయ ట్రాన్స్ జెండర్ హక్కుల కార్యకర్త, సోషల్ ఆక్టివిస్ట్ రచన ముద్రబోయిన, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రంలో భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన హిజ్రా అండబ్ ట్రాన్స్ జెండర్ ల విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన రచన ముద్రబోయిన మాట్లాడుతూ.. ప్రపంచంలో అత్యంత వివక్షకు లైంగిక వేధింపులకు, గురైన వర్గం ట్రాన్స్ జెండర్స్‌కు ప్రభుత్వాలు సానుభూతి బడ్జెట్ కాదు ఆత్మగౌరవాన్ని కాపాడే బడ్జెట్ కేటాయింపులు కావాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత కొన్నేండుగా వివక్షతో ఇస్తున్న అరకొర బడ్జెట్ మాకొద్దు అన్నారు. తెలంగాణ బడ్జెట్‌లో మరి దారుణమైన వివక్ష చూపించారున్నారు 4 లక్షల మంది హిజ్రా అండ్ ట్రాన్స్ జెండర్‌లుంటే కేవలం 2 కోట్లు కేటాయించి అవమానించారన్నారు. రూ.50 కోట్లు కేటాయించాలని, హక్కుల ప్రైడ్ మార్చ్ చేస్తూ రోడ్డెక్కాల్సిందే.. వెంటనే తెలంగాణలో మహిళ శిశు సంక్షేమ శాఖ నుంచి వీడదీసి ప్రత్యేకంగా ట్రాన్స్ జెండర్ హిజ్రా వెల్ఫేర్ బోర్డు చైర్మెన్‌ను డైరెక్టర్స్ ను ఏర్పాటు చేసి నిధులు విధులను మంజూరు చేయాలని కోరారు. భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ. ట్రాన్స్ జెండర్‌కు కమ్యూనిటీ షెల్టర్ , హెల్త్ కేర్ సెంటర్లు ఎర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. టాన్స్ జెండర్ ఆరోగ్య సమస్యలు ప్రభుత్వాలే పట్టించుకోవాలని జెండర్ సమస్యలను లోతుగా అధ్యయనం చేయాలి ఎల్‌జీబీటీ క్యూఐఏ సమూహాలు చేస్తున్న ఆత్మగౌరవ పోరాటాన్ని అర్థం చేసుకోని హక్కులను ఆహ్వానించాలని కోరారు .ఈ సందర్భంగా తీర్మానం చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సర్కారు 32 మందికి మాత్రమే ట్రాఫిక్ కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేసారని అర్హత కలిగిన వారందరికీ అవకాశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశం లో ట్రాన్స్ జెండర్స్ కు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, ట్రాన్స్ జెండర్ రెయిన్ బో కల్చరల్ ఫెస్ట్ 2025 ఉత్సవాలు జరపాలని, ట్రాన్స్ జెండర్ పై ప్రత్యేక సర్వే చేయాలని డిమాండ్ చేశారు. తీర్మానం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,మంత్రి సీతక్కకు అందజేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్ యాక్టివిస్ట్ లిల్లీ, ఉమెన్ ఆక్టివిస్ట్ స్వేచ్ఛ, ఆయుషా తదితరులు పాల్గొన్నారు

'ఎండలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి'



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

ఎండలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్ఎఫ్‌టీసీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్వైజర్ జయంతి అన్నారు. శుక్రవారం కోఠి డీఎంహెచ్ఎస్ ప్రాంగణంలో గల ఆర్ఎఫ్‌టీసీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ..వడదెబ్బకు గురైతే వెంటనే వైద్యుని సంప్రదించాలని కోరారు. తమ ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రజల ఇళ్ల వద్దకు తమ ఆశ కార్యకర్తలు వెళ్లి ఓఆర్ఎస్ పాకెట్లు అందిస్తున్నారని తెలిపారు.జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతం చేస్తున్నామన్నారు. గర్భిణుల నమోదు, మాతా శిశు సంరక్షణ, వ్యాధి నిరోధ టీకాలను తమ ఏఎన్ఎంలు అందిస్తున్నారని చెప్పారు. మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, ఎండాకాలంలో ముఖ్యంగా నీరు కలుషితం వలన టైఫా యిడ్ వస్తుందని ప్రజలను చైతన్య పరుస్తున్నామన్నారు. 30 ఏండ్లు పైబడిన వారికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. లెప్రసీ సర్వే పూర్తయిందని చెప్పారు. ఎన్‌సీడి స్క్రీనింగ్ చేస్తున్నామన్నారు. వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు తెలిపారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు సుహాసిని, ఇందిరా, జయలక్ష్మి ఆశా వర్కర్లు జి లావణ్య, కే వనజ, దేవి, మహానంద తదితరులు పాల్గొన్నారు

ఉచిత వివాహ పరిచయ వేదిక ఆహ్వానం

నవతెలంగాణ - ముషీరాబాద్

జియో వివాహ పరిచయ వేదిక ద్వారా అన్ని కులాల వారికి ఉచితంగా వివాహాలు కుదుర్చునున్నట్టు ఆ సంస్థ సీఈఓ అబ్రహం తెలిపారు. యాభైవేలకు పైగా ప్రొఫైల్స్ మూడు వందలకు పైగా అసోసియేట్‌తో వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రతి శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆదివారం మద్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉండునట్లు తెలిపారు. డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ జియో మ్యాట్రీ మోని డాట్ కామ్లో ప్రొఫైల్ లో పంపవచ్చు అన్నారు. మరిన్ని వివరాలకు 8885073555 ,8885428555 లో సంప్రదించవచ్చని తెలిపారు.

రిజర్వేషన్ బిల్లులను రాజ్యాంగ 9వ షెడ్యూల్‌లో చేర్చాలి

- ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ సలహాదారులు ఆళ్ల రామకృష్ణ



నవతెలంగాణ-హిమాయత్ నగర్

తెలంగాణ రిజర్వేషన్ బిల్లులను రాజ్యాంగ 9వ షెడ్యూల్‌లో చేర్చేలా అన్ని రాజకీయ పార్టీలు, ఓబీసీ సంఘాలు కృషి చేయాలని ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ సలహాదారులు ఆళ్ల రామకృష్ణ కోరారు.శుక్రవారం న్యూఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో 'కుల, జనగణన, ఓబీసీ రిజర్వేషన్లు, రాజ్యాంగ పరిరక్షణలు, సామాజిక న్యాయాన్ని లోతుగా అభివృద్ధి చేసేందుకు చర్యా ప్రణాళిక అనే అంశంపై జాతీయ స్థాయిలో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, రాజ్యసభ సభ్యులు పి.విల్సన్, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రొఫెసర్ సురజ్ మండల్, ప్రొఫెసర్ రతన్ లాల్, మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు జి.కిరణ్ కుమార్ హాజరై మాట్లాడారు విద్యార్థి సంఘాల ఐక్యత ఓబీసీల ఉద్యమాన్ని మరింత బలపరిచేలా చేయాలని, జాతీయ స్థాయిలో కుల జనగణన కోసం నిరసనలు, కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని, అలాగే విద్య, ఉద్యోగాల్లో ఓబీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అందించాలంటూ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచనున్నట్టు తెలిపారు.

పాఠశాలలు రీ ఓపెన్ నాటికి..
యూనిఫాం..!



- మొత్తం 1.03లక్షల మంది విద్యార్థులకు లబ్ది
- మొదటి విడతలో ప్రతి విద్యార్థికీ ఒక్క జత యూనిఫాం
- స్వయం సహాయక సంఘాలకు కుట్టుపని

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం సర్కారు పాఠశాలల్లో చదివే విద్యార్థిని, విద్యార్థులకు ప్రతి సంవత్సరం స్కూల్ యూనిఫాం (ఏకరూప దుస్తులు) అందజేస్తోంది. వీటిని ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ద్వారా విద్యార్థులకు పాఠశాలలు పున:ప్రారంభమయ్యే జూన్ 12 నాటికి అందజేస్తారు. ఈ క్రమంలో జిల్లాలోని సర్కారు బడులకు యూనిఫాం క్లాత్ రావడం ప్రారంభమైంది. ఒకటి రెండు రోజుల్లో మండల పాయింట్లకు వస్త్రం చేరనుండగా.. అక్కడి నుంచి స్కూల్ పాయింట్లకు పంపిస్తారు. దీనిని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల పర్యవేక్షణలో బట్టలు కుట్టించి జూన్ నెల ప్రారంభంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించనున్నారు. జూన్ 12న నూతన విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్ పంపిణీకి అవసరమైన చర్యలను అధికారులు చేపట్టారు. దీనిపై ఇప్పటికే జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి విద్యాశాఖ, జీహెచ్ఎంసీ అధికారులతో సమావేశమై.. జూన్ 2 నాటికి స్టిచ్చింగ్ స్కూల్ యూనిఫాంలు పాఠశాలకు చేరాలనీ, స్కూల్ రీ ఓపెనింగ్ రోజున ప్రతి విద్యార్థి యూనిఫాంతో రావాల్సిందేనని ఆదేశాలు జారీ చేశారు. దీంతో సంబంధిత అధికారులు ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నారు.

హైదరాబాద్ జిల్లాలో 16 మండలాల పరిధిలో మొత్తం 772 ప్రభుత్వ, ఎయిడెడ్, వెల్ఫేర్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 678 ప్రభుత్వ పాఠశాలలుండగా.. 92 ఎయిడెడ్ స్కూల్స్, రెండు వెల్ఫేర్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో మొత్తం 1,03,912 మంది విద్యార్థులకుగాను బాలురు 49,433, బాలికలు 54,479 మంది చదువుతున్నారు. కాగా, సర్కారు బడుల్లో చదివే విద్యార్థులతో పాటు ఎయిడెడ్ పాఠశాలల్లో చదివే వారికి ప్రతియేటా సర్కారు యూనిఫామ్స్‌ను సరఫరా చేస్తోంది. ప్రతి విద్యార్థికి సంవత్సరానికి రెండు జతల స్కూల్ డ్రెస్సులను ఉచితంగా సరఫరా చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటిలాగే ఈ సంవత్సరం కూడా విద్యార్థులకు స్కూల్ డ్రెస్సు అందించాలని నిర్ణయించింది. ఆ మేరకు జిల్లాలో మొత్తం 1.03లక్షల మందికి రెండు జతల చొప్పున 2,07,824 ఫెయిర్స్ అవసరమతుండగా.. ఇందులో బాలురులకు 98,866, బాలికలకు 1,08,958 చొప్పున అందించాల్సి ఉంటుంది. ఇందుకుగాను సుమారు 4లక్షల మీటర్ల వస్త్రం పడుతుంది. ఇందులో ఇప్పటికే అంబర్‌పేట్, అమీర్‌పేట్, ఆసిఫ్‌నగర్, ఆసిఫ్‌నగర్-2, బహదూర్‌పూర, బహదూర్‌పూర-2 మండలాలకు 29,815 మీటర్ల వస్త్రం ఒకటి రెండు రోజుల్లో రానుంది. దానిని ఆయా పాఠశాలల పరిధిలోని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు కుట్టేందుకు ఇవ్వనున్నారు. మిగతా మండలాలకు వచ్చే వారంలో వస్త్రం రానుందని విద్యాశాఖ అధికారులు తెలిపారు. కాగా పాఠశాలలు ప్రారంభానికి ముందే విద్యార్థులకు యూనిఫాం కుట్టించి అందజేయాలి.

నిక్కర్ స్థానంలో 6,7 విద్యార్థులకు ప్యాంట్..!

విద్యాసంవత్సరం(2025-26)లో చదువుతున్న విద్యార్థుల కోసం ఎప్పటిలాగే రాష్ట్ర విద్యాశాఖ మొత్తం అయిదు రకాల డిజైన్లు ఎంపిక చేసింది. రాష్ట్ర చేనేత సహకార సంస్థ (టెస్కో) ప్రత్యేకంగా క్లాత్‌ను విద్యాశాఖకు అందించింది. 6 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థినులకు మెరూన్, యాష్ రంగులో పంజాబీ యూనిఫాం, 4-5వ తరగతి చదువుతున్న విద్యార్థినులకు స్కర్ట్, షర్ట్ యూనిఫాం(పట్టీలు లేకుండా), 1 నుంచి 3వ తరగతి చదువుతున్న విద్యార్థినుల యూనిఫాం కుడివైపు ప్యాకెట్‌తో ఫ్రాక్, సూటింగ్ క్లాత్‌తో కుట్టిన బెల్ట్ రింగులతో మెరూన్, యాష్ కలర్ గీతలతో చొక్కా, 1వ నుంచి 5వ తరగతి చదువుతున్న బాలురకు నిక్కర్, షర్టు, 6 నుంచి 12వ తరగతి చదువుతున్న బాలురకు ప్యాంట్, చొక్కా అందనున్నాయి. మొత్తంగా ఈ ఏడాది స్వల్ప మార్పులతో పాటు 6, 7వ తరగతి విద్యార్థులకు నిక్కర్ స్థానంలో ప్యాంట్ అందించడం పట్ల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుంటే ఒక్క జత యూనిఫామ్ కుట్టినందుకు రూ.75 చొప్పున రెండు జతలకు 150 రూపాయలు చెల్లించనున్నారు.

కింగ్ కోఠి జిల్లా ఆస్పత్రిలో అరుదైన ఆపరేషన్...

రోగి కడుపులోనుంచి సూది బయటకు తీసిన వైద్యులు.. సర్జన్ డాక్టర్ వెంకటేష్ బృందానికి అభినందన





నవతెలంగాణ -సుల్తాన్ బజార్

తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్న యువకుడికి కింగ్ కోఠి జిల్లా ఆస్పత్రి వైద్యులు చికిత్స అందించి ప్రాణాలు కాపాడారు. వివరాల్లోకెళ్తే.. దేవరకొండ ప్రాంతానికి చెందిన మురళి కొంతకాలంగా నగరంలోని నల్లకుంటలో నివాసం ఉంటున్నాడు. గత కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. మూడు రోజుల క్రితం తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతున్న మురళీని కుటుంబ సభ్యులు కింగ్ కోఠి జిల్లా ఆస్పత్రికి తీసుకొచ్చారు. సర్జన్ ఇన్‌చార్జి డాక్టర్ బాలరాజ్, జనరల్ సర్జన్ డాక్టర్ వెంకటేష్ మురళిని పరీక్షించి కడుపులో బట్టలు కుట్టే సూది ఉన్నట్టు గుర్తించారు. వెంటనే అతనికి అన్ని రకాల రక్త పరీక్షలు నిర్వహించారు. శుక్రవారం జనరల్ సర్జన్ ఇన్‌చార్జి డాక్టర్ బాలరాజ్, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ చందన, మత్తు డాక్టర్ శ్రీమంత్, డాక్టర్ మనిషాలు మురళికి అరుదైన ఆపరేషన్ ద్వారా తీవ్రంగా శ్రమించి అతని కడుపులో ఉన్న బట్టలు కుట్టే సూదిని బయటికీ తీశారు. రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్టు చెప్పారు. ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. ఆపరేషన్ నిర్వహించిన జనరల్ సర్జన్ డాక్టర్ వెంకటేష్ బృందాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రనాథ్, ఆర్ఎంఓ డాక్టర్ సాధన అభినందించారు.

రోడ్ల పై వర్షపు నీరు నిలవకుండా చూడాలి

- అధికారులకు సూచించిన కార్పొరేటర్



నవతెలంగాణ - ముషీరాబాద్

గత రాత్రి కురిసిన భారీ వర్షానికి గాంధీనగర్ డివిజన్ లోని పలు చోట్ల వర్షపు నీరు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడ్డారన్న ఫిర్యాదు మేరకు శుక్రవారం కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ జీహెచ్ఎంసీ సిబ్బందితో కలిసి వర్షపు నీరు నిలవకుండా ఉండేందుకు చర్యలు చేపట్టారు. ఆర్‌టీసీ క్రాస్ రోడ్స్ లోని శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయం వీధి జవహర్ నగర్ స్కూల్ మెయిన్ రోడ్డు వద్ద వర్షపు నీరు నిలవకుండా ఉండేందుకు పనులు జరిపించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో కూడా ముందస్తు జాగ్రత్తలు తీసుకుని, వరదనీటి ముంపు సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ , డివిజన్ అధ్యక్షులు వి.నవీన్ కుమార్, సీనియర్ నాయకులు రత్న సాయి చంద్,ఆనంద్ రావు,సాయి తరుణ్, స్థానికులు నర్సింగ్ రావు, పున్న సత్యనారాయణ, బాబ్జీ,జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

వీజేఐఎంలో సెమినార్ విజయవంతం



నవతెలంగాణ -సిటీబ్యూరో

హైదరాబాద్ బాచుపల్లి లోని విజ్ఞాన జ్యోతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ (వీజేఐఎం)లో "మొదటి ప్రయత్నం లో సివిల్ సర్వీసెస్ సాధించడం ఎలా-యూపీఎస్సీ మాస్టర్ క్లాస్" సెమినార్ ను విజయవంతంగా నిర్వహించారు. ఈ సెమినార్‌ను Vings మీడియా అండ్ జీ5 మీడియా గ్రూప్ సంయుక్తంగా, 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమీ సహకారంతో నిర్వహించారు. అకాడమీ చీఫ్ మెంటార్ అండ్ డైరెక్టర్ డా. భావని శంకర్ విద్యార్థులతో మాట్లాడుతూ యూపీఎస్సీ పరీక్షలో ఉత్తీర్ణులు అవటానికి చుట్టూ ఉన్న అపోహలను తొలగిస్తూ, సాధారణ డిగ్రీ, పీజీ చదివిన విద్యార్థులు కూడా ఇందులో ఉత్తీర్ణులు అవుతారని చెప్పారు. యూపీఎస్సీ ప్రశ్నలు చాలా వరకి పాఠశాలలో నేర్పించిన ప్రాథమిక సూత్రాల ఆధారంగా ఉంటాయని, సివిల్ సర్వీసెస్ ని సామాజిక మార్పు తీసుకురావడానికి ఒక అవకాశం గా చూడాలని అభ్యర్థులకు సూచించారు.

వీజేఐఎం డైరెక్టర్ ప్రొ. డా. భారత భూషణ సింగ్ మాట్లాడుతూ హైదరాబాద్‌ను ఒక ప్రముఖ యూపీఎస్సీ కోచింగ్ హబ్ గా గుర్తించి, డిల్లీ ఆధిపత్యాన్ని తగ్గించినట్టు తెలిపారు. విద్యార్థులు ఇలాంటి సెమినార్‌లను సద్వినియోగం చేసుకుని, సివిల్ సర్వీసెస్ లో కెరీర్ సాధనకు ధైర్యంగా ఆసక్తి చూపాలని ప్రోత్సహించారు. వీజేఐఎంఅకాడమిక్ డీన్ డా. డి. రవినాథ్, అకాడ మిక్స్ హెడ్ డా.ఎస్.పద్మజ, పీఆర్‌ఓ కె. గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా వసంతోత్సవ వేడుకలు



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

ఉగాది పండుగను పురస్కరించుకొని సంచలన స్కూల్ ఆఫ్ డ్యాన్స్ ఆధ్వర్యంలో వారం రోజులపాటు కళ్యాణ్ హంపి థియేటర్‌లో వసంతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సంస్కార భారతి, రాష్ట్ర సంఘటన మంత్రి నిరంజన్ పాల్గొని సంస్థ అధ్యక్షురాలు పద్మ కళ్యాణి తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పద్మ కళ్యాణి ఆధ్వర్యంలో ఉగాది పండుగ సందర్భంగా వసంతోత్సవం పేరిట వారం రోజులపాటు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కళలతో పాటు కళాకారులను ప్రోత్సహించడం సంతోషదాయకమని పేర్కొన్నారు. సభకు ముందు ప్రముఖ వయోలిన్ విద్వంసుడు మధుసూధన్ శిష్యులచే వాయిలిన్, కర్ణాటక సంగీత కచేరీతో పాటు సంచలనా స్కూల్ ఆఫ్ డ్యాన్స్, స్వర గంగా మ్యూజిక్ అకాడమీ గురువులు సుజారిత, సుప్రజ ప్రదర్శించిన కూచిపూడి నత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



6న వికాలంగుల సంక్షేమానికి ఉచిత శిబిరం

- నారాయణ్ సేవా సంస్థాన్

నవతెలంగాణ-హిమాయత్ నగర్

తెలంగాణలో వికలాంగుల సంక్షేమం కోసం నారాయణ్ సేవా సంస్థాన్ ఒక గొప్ప ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది. ఈ నెల 6న హైదరాబాద్, చంపాపేటలోని మినర్వా గార్డెన్స్‌లో ఉచిత దివ్యాంగ్ నిర్ధారణ, శస్త్రచికిత్స ఎంపిక నారాయణ్ లింబ్ కొలత శిబిరాన్ని నిర్వహిస్తోందని నారాయణ్ సేవా సంస్థాన్ తెలిపింది.ఈ మేరకు శుక్రవారం హైదర్ గూడలోని ఎన్ఎస్ఎస్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వాల్ పోస్టర్‌ను సంస్థాన్ హైదరాబాద్ ప్రతినిధులు అల్కా చౌదరి, భగవాన్ ప్రసాద్, యస్వంత్ పటేల్, మహేందర్ సింగ్, రితీష్ జాగీర్దార్ లు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ దివ్యాంగుల సాధికారత, స్వావలంబనకు సంస్థ కట్టుబడి ఉందన్నారు. సంస్థ నుంచి అనుభవజ్ఞులైన ఆర్థోటిస్టులు, ప్రోస్థటిక్ వైద్యుల బందం లబ్ధిదారులను పరీక్షించి, అధిక నాణ్యత, తేలికైన, మన్నికైన నారాయ ణ్ కత్రిమ అవయవాల కోసం ఖచ్చితమైన కొలతలు తీసుకుంటుందని వారు వివరించారు.ఈ కస్టమ్-మేడ్ కత్రిమ అవయవాలను సుమారు రెండు నెలల తర్వాత నిర్వహించబడే ఫిట్‌మెంట్ శిబిరంలో ఉచితంగా అందిస్తామని తెలిపారు.ఈ శిబిరానికి మంత్రులను ఆహ్వానించామన్నారు.పాల్గొనాలనుకునే వారు తమ ఆధార్ కార్డు, వికలాంగ ధవీకరణ పత్రం, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు తమ వైకల్యానికి రుజువుగా తీసుకురావాలన్నారు.శిబిరానికి సంబంధించిన మరిన్ని వివరాల కోసం, సంస్థ హెల్ప్‌లైన్ నెంబర్: 7023509999ను సంప్రదించగలరని తెలిపారు.



వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం అప్రజాస్వామికం

- ఆవాజ్ జిల్లా కార్యదర్శి అబ్దుల్ సత్తార్

నవతెలంగాణ - ధూల్ పేట్

వక్ఫ్ సవరణ బిల్లు సుప్రీం కోర్టులో ఆమోదం అప్రజాస్వామికమని ఆవాజ్ జిల్లా కార్యదర్శి అబ్దుల్ సత్తార్ అన్నారు. ఈ బిల్లు ను వ్యతిరేకిస్తూ ఆవాజ్ హైదరాబాద్ సౌత్ కమిటీ ఆధ్వర్యంలో చార్మినార్ బస్టాండ్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేశ ప్రజాస్వామిక వాదులదరూ ఈ బిల్లును వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను బీజేపీ కాల రాసిందన్నారు. ముస్లిం పేదలకి న్యాయం చేయడానికి ఈ చట్టం తీసుకువచ్చామని చెప్తున్న బీజేపీ నాయకులు అమిత్ షా ఆర్థికంగా మైనారిటీ ముస్లింలకి ఇంకా ఆర్థికంగా బలహీన పరచడానికి తీసుకొచ్చారని ఆరోపించారు. ఇప్పుడు ఈ చట్టం పాస్ అయితే మొత్తం అధికారాలు కలెక్టర్ ఇష్టపూర్వకంగా చేసుకోవడానికి ఉపయోగపడుతుం దన్నారు. దీంతో ముస్లిం గోడు ఎవరు వినే నాధుడు ఉండరన్నారు. ముస్లింలకు ప్రయోజనం లేని ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.



విద్యార్థులకు కంటి అద్దాలు అందజేత

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

గత నెలలో కింగ్ కోఠి ఆస్పత్రిలో కేశవ మెమోరియల్ స్కూల్‌లోని 350 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. శుక్రవారం వక్రీభవన లోపాలతో బాధపడుతున్న 18 మంది విద్యార్థులకు ఉచితంగా కళ్ల జోడు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేట్.మహాలక్ష్మి, బొగ్గులకుంట మెడికల్ ఆఫీసర్‌డాక్టర్ పి.లక్ష్మీ ప్రసన్న, ఆర్‌బీఎస్ కేడాక్టర్ రమేష్, పి హెచ్ ఎస్ యేసు

స్త్రీ-పురుషుల కలయిక అనేది మానవజాతి తన గమనాన్ని కొనసాగించడానికి ప్రకృతి ఇచ్చిన అద్భుతం. ఇద్దరి వ్యక్తుల మధ్య బంధాన్ని బలోపేతం చేస్తుంది. ఇక భార్యా భర్తల మధ్య ప్రేమ, అనురాగం, అప్యాయత పెరిగేందుకు చక్కని మార్గం. అంతేకాదు శారీరక, మానసిక ఆరోగ్యానికి కూడా ఇది ఎంతో సహాయం చేస్తుంది. మనుషులకే కాదు ప్రతి జీవిలో పుట్టే అత్యంత సహజమైన కోరిక ఇది. అయితే భార్యా భర్తలైనా సరే ఇద్దరూ మనస్ఫూర్తిగా ఇందుకు సిద్ధంగా ఉండాలి. అలా కాకుండా కొందరు భర్తలు నా భార్యే కదా అని ఇష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తుంటారు. దీని వల్ల జరిగే పరిణామాలు అత్యంత దారుణంగా ఉంటాయి. అలాంటి ఓ సమస్యే ఈవారం ఐద్వా అదాలత్‌తో...

ఇద్దరికీ ఇష్టమైతేనే...



దేవికి సుమారు 28 ఏండ్లు ఉంటాయి. ఆమెకు వంశీతో మూడేండ్ల కిందట పెండ్లి జరిగింది. ఇద్దరూ ఉద్యోగస్తులే. ఉదయం ఆఫీసుకు వెళితే సాయంత్రానికి ఇంటికి చేరుకుంటారు. పిల్లలు లేరు. వంశీ 'ఇప్పుడే పిల్లలు ఎందుకు, ఇంకొంచెం టైం తీసుకుందాం' అంటాడు. దేవి కూడా సరే అంది. అత్తమామలు ఊరిలో ఉంటారు. అప్పుడప్పుడు వచ్చిపోతుంటారు. ఎప్పుడైనా వీళ్లు కూడా వెళ్లి వస్తుంటారు.

అత్తమామలతో దేవికి ఎలాంటి సమస్యా లేదు. ఇప్పుడు ఆమె సమస్య మొత్తం వంశీతోనే. మంచి వాడే కానీ విపరీతమైన కోరికలు ఉన్నాయి. ఎప్పుడూ అదే ఆలోచనతో ఉంటాడు. అంతేకాకుండా ఫోన్లో సినిమాలు చూసి 'మనం కూడా అలాగే చేద్దాం' అంటాడు. ఆ సమయంలో దేవికి ఇష్టం లేకపోయినా ఆమె మాటలు పట్టించుకోడు. ఆమె నిద్రపోతున్నా సరే బలవంతంగా లేపి తన కోరిక తీర్చుకుంటాడు. ఈ ఆలోచనలతోనే పిల్లలు కూడా వద్దంటున్నాడని దేవికి తర్వాత తెలిసింది. ఊరికి వెళ్ళినా వెంటనే తీసుకొచ్చేస్తాడు. ఇటువంటి పరిస్థితుల్లో ఆఫీస్‌కి సెలవు వస్తే దేవికి ఇంట్లో ఉండాలంటేనే భయం పట్టుకుంది.

చెప్పుకోవడానికి కూడా ఇబ్బంది పడేలా ఆమెతో ప్రవర్తిస్తాడు. పెండ్లయిన కొత్తలో అయితే తనపై ప్రేమతోనే ఇలా చేస్తున్నాడని ఆమె పెద్దగా పట్టించుకోలేదు. కానీ రాను రాను అతను క్రూరంగా ప్రవర్తించడం మొదలుపెట్టాడు. తన కోరికల కోసం శారీరకంగా హింసించేవాడు. తర్వాతి రోజు ఆఫీస్‌కి వెళ్లడానికి కూడా దేవి ఇబ్బంది పడేది. ఈ విషయం ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోడు. ఆమె గట్టిగా మాట్లాడితే 'నేను కాకుండా నీకు ఇంకెవరైనా ఉన్నారా, అందుకే నన్ను వద్దంటున్నావా. నేను చెప్పినట్టు చెయ్యకపోతే నన్ను దగ్గరకు రానివ్వడం లేదని, అందుకే మనకు పిల్లలు పుట్టడం లేదని మీ అమ్మ వాళ్లకు చెబుతాను' అంటూ బెదిరిస్తాడు.

దేవి ఒంటి నిండా గాయాల మచ్చలే. భర్త ప్రవర్తనతో పెండ్లయిన మూడేండ్లకే సంసార జీవితమంటేనే ఆమెకు విరక్తి పుట్టుకొచ్చింది. ఇలాంటి పరిస్థితుల్లో ఐద్వా ఆఫీస్‌కు వచ్చి 'నా భర్త నాతో జంతువు కంటే దారుణంగా ప్రవర్తిస్తున్నాడు. అతనితో ప్రతి రాత్రి నరకం అనుభవిస్తున్నాను. పెండ్లి తర్వాత ప్రతి జంట చేసేదే అయినా నాకు మాత్రం ఎందుకు ఇంత బాధగా అనిపిస్తుంది. మిగిలిన వాళ్లంతా హాయిగా, సంతోషంగా ఉంటున్నారు. నేనేమైనా ఎక్కువగా ఊహించుకుంటున్నానా? ఈ విషయం ఇంట్లో వాళ్లకు చెప్పినా నాదే తప్పంటున్నారు. వంశీకి సర్ది చెప్పే ప్రయత్నం చేయడం లేదు. 'వాడు మగాడు, అలాగే వుంటాడు, కోరికలు ఉంటాయి. అతని కోరిక తీర్చడం భార్యగా నీ ధర్మం' అంటుంది వంశీ అక్క. 'అన్నీ ఓర్చుకోవాలి కానీ ఈ విషయం గురించి గొడవలు పడడం ఏంటీ. నాకూ భరించలేని బాధలు ఉన్నాయి. అయినా నేను ఓపిగ్గా ఉండడం లేదా' అంటుంది.

> పెండ్లయిన కొత్తలో అయితే తనపై ప్రేమతోనే ఇలా చేస్తున్నాడని ఆమె పెద్దగా పట్టించుకోలేదు. కానీ రాను రాను అతను క్రూరంగా ప్రవర్తించడం మొదలుపెట్టాడు. తన కోరికల కోసం శారీరకంగా హింసించేవాడు. తర్వాతి రోజు ఆఫీస్‌కి వెళ్లడానికి కూడా దేవి ఇబ్బంది పడేది. ఈ విషయం ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోడు.

ఆమె ఉన్నంత ఓపిగ్గా నేను ఉండలేకపోతున్నాను. ఆయన్ని భరించడం నా వల్ల కావడం లేదు. ఎలాగైనా మీరే నా సమస్యకు పరిష్కారం చూపండీ' అంటూ కన్నీళ్లు పెట్టుకుంది.

అంతా విన్న తర్వాత మేము వంశీని పిలిచి మాట్లాడితే 'నా భార్యను నేను చాలా బాగా చూసుకుంటున్నాను. ఆమె అడగక ముందే అన్నీ తెచ్చిపెడతాను. ఆమే ఉద్యోగం చేస్తుంది. అయినా తన దగ్గర ఒక్క పైసా కూడా తీసుకోను. అయినా ఆమె మీ దగ్గరకు ఎందుకు వచ్చిందో అర్థం కావడం లేదు' అన్నాడు.

'ప్రతి రోజూ మీ కోర్కెలు తీర్చమని ఆమెను ఇబ్బంది పెట్టడం లేదా?' అని అడిగితే 'ప్రతి భార్యా భర్త చేసేదే కదా అది. అందులో తప్పేముంది. నేనేమీ వేరే ఆడవాళ్లతో సంబంధం పెట్టుకోలేదు. నా భార్యతోనే కదా ఉంటున్నాను. ఇక పెండ్లి చేసుకోవడం ఎందుకు, చేసుకోకుండా ఉంటే సరిపోయేది' అన్నాడు. దానికి మేము 'అందరిలా మీరూ మీ భార్యపై ప్రేమతోనో, ఇష్టంతోనో ఉంటే ఇలాంటి సమస్య ఉండేది కాదు. ఆమే మిమ్మల్ని తప్పుగా అనుకునేది కాదు. కానీ మీరు మీ ఇష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తున్నారు. ఆమెకు నరకం చూపిస్తున్నారు. ఆమె ఇష్టాఇష్టాలతో సంబంధం లేకుండా మీ కోరికలు తీర్చుకుంటున్నారు. ఆ బాధ భరించలేకే ఆమె ఇక్కడి వరకు రావల్సి వచ్చింది. మీరు పెడుతున్న ఇబ్బందులకు ఆమెకు మీ నుండి విడిపోయే హక్కు ఉంటుంది. అది చట్టం మహిళలకు ఇచ్చిన హక్కు. పైగా మీ భార్య బాధపడుతూ అర్థం చేసుకొమ్మని అడిగితే మీరు ఆమె గురించే తప్పుగా చెబుతానని బెదిరిస్తున్నారు. ఇదంతా చూస్తే మీరు ఆమె నుండి ఏం కోరుకుంటున్నారో అందరికీ అర్థం అవుతుంది. మీకు ప్రేమను పంచే భార్య కన్నా ఆమె శరీరం ఉంటే చాలు. ఆమె ఒంటి నిండా మీరు చేసిన గాయాలే ఉన్నాయి. వాటిని ఎప్పుడైనా చూశారా? మీరూ మనిషే కదా! అంత క్రూరంగా ఎలా ప్రవర్తించగలుగుతున్నారు. దేనికైనా ఓ పరిమితి ఉంటుంది. ఫోనుల్లో, సినిమాలల్లో చూసి మీ ఇష్టం వచ్చినట్టు చేస్తున్నారు. ఇప్పటికైనా మీరు మారకపోతే మీకే నష్టం. ఇష్టం లేకుండా భార్యను అనుభవించినా అది చట్ట ప్రకారం అత్యాచారం కిందకే వస్తుంది. మీ ఇష్టం మారిటల్ రేప్ కింద మీపై కేసు పెట్టాల్సి వస్తుంది.

కానీ దేవీ మీరు మారాలనీ, తనను ప్రేమగా చూసుకోవాలని కోరుకుంటుంది. కాబట్టి మీకు రెండు నెలలు టైం ఇస్తున్నాము. ఈ లోపు మీ ప్రవర్తన మార్చుకోండి. మీ భార్యతో ప్రేమగా ఉండండి. ఆమె ఇష్టాలను గౌరవించండి. లేదంటే మీ ఇష్టం' అన్నాము.

దాంతో వంశీ భయపడ్డాడు. 'మీరు చెప్పినట్టే వింటాను. దేవిని ప్రేమగా చూసుకుంటాను. ఇకపై ఆమెను ఇబ్బంది పెట్టను' అన్నాడు. 'మాటల్లో చెప్పడం కాదు. మళ్ళీ నెల రోజుల తర్వాత మా దగ్గరకు రావాలి. ఆమెతో ప్రేమగా ఉండి చూడండి. మీకూ ఎంత ఆనందంగా ఉంటుందో అర్థమవుతుంది' అని చెప్పి పంపించాము. ఆరు నెలల నుండి ప్రతి నెల ఐద్వా ఆఫీస్‌కు వచ్చి ఇద్దరూ ఎలా ఉన్నారో చెప్పి వెళుతున్నారు. ప్రస్తుతం వంశీలో చాలా మార్పు వచ్చింది. దేవి కూడా అతనితో చాలా సంతోషంగా ఉంటుంది.

- వై వరలక్ష్మి, 9948794051

నిమ్మలో ఔషధగుణాలు

నిమ్మకాయను మనం ఎన్నో విధాలుగా వాడతాం. ఆరోగ్యానికి మాత్రమే కాదు.. చర్మ సమస్యలు తొలగించడానికి కూడా ఇది బాగా ఉపయోగపడుతుంది. నిమ్మకాయలో యాంటీ ఆక్సిడెంట్స్ గుణాలు సమృద్ధిగా ఉంటాయి. ఇది మన చర్మ రక్షణలో, సౌందర్య పోషణలో ఏ విధంగా ఉపయోగపడుతుందో చూద్దాం..

ముఖ కాంతికి!

నిమ్మలో సహజసిద్ధమైన క్లెన్సింగ్ గుణాలు ఉంటాయి. వీటివల్ల చర్మం శుభ్రపడి ప్రకాశవంతంగా కనిపిస్తుంది. ఇందుకోసం నిమ్మకాయను రెండు ముక్కలుగా కోసి ఒక దాంతో ముఖం, మెడ మీద 5



నిమిషాల పాటు బాగా రుద్దాలి. తర్వాత చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల చర్మ రంధ్రాల్లో పేరుకుపోయిన మురికి కూడా తొలగిపోయి ముఖం కాంతివంతంగా మారుతుంది. అలాగే ముఖం మీద వచ్చే మొటిమలు, వాటి వల్ల ఏర్పడే మచ్చలకు కూడా నిమ్మరసంతో చెక్ పెట్టచ్చంటున్నారు నిపుణులు.

జిడ్డు మాయం!

సాధారణ చర్మతత్వం ఉన్న వారితో పోల్చితే జిడ్డు చర్మతత్వం ఉన్న వారిలో సమస్యలు కాస్త ఎక్కువే అని చెప్పాలి. ఇందుకు నిమ్మరసం చక్కగా ఉపయోగపడుతుంది. చర్మంలో సీబమ్ ఉత్పత్తిని బ్యాలన్స్ చేసి తద్వారా జిడ్డుదనం తగ్గించడంలో ఇది ముఖ్య పాత్ర పోషిస్తుంది. ఇందుకోసం నీళ్లలో కొద్దిగా నిమ్మరసం కలిపి దూదితో ముఖానికి పట్టించి.. కాసేపయ్యాక కడిగేసుకోవాలి. ఇలా తరచూ చేస్తుంటే ఫలితం ఉంటుంది.

ఇవి ప్రయత్నించండి!

కొందరికి గోళ్లు పొడవుగా, అందంగా పెరుగుతాయి. మరికొందరికి కొంచెం పొడవు పెరిగిన వెంటనే విరిగిపోతుంటాయి. ఈ సమస్య ఉన్న వారు ఒక గిన్నెలో కొద్దిగా నిమ్మరసం తీసుకుని దానిలో తగినన్ని నీళ్లు కలిపి బాగా మిక్స్ చేయాలి. ఇందులో కాసేపు గోళ్లను ముంచి ఉంచడం వల్ల అవి దృఢంగా మారతాయి.

కొందరికి దంతాలు పసుపు పచ్చగా కనిపిస్తుంటాయి. ఇలాంటి వారు చిటికెడు ఉప్పు, కొద్దిగా బేకింగ్ సోడా మిశ్రమంలో నిమ్మచెక్కను ముంచి దాంతో పళ్ల మీద రుద్దాలి. ఈ చిట్కా నోటి దుర్వాసనను కూడా దూరం చేస్తుంది.

అన్నదాతకు అండగా ఉంటాం

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి సీతక్క శుక్రవారం పరిశీలించారు. అకస్మాత్తుగా కురిసిన వడగండ్ల వర్షానికి కోతకు వచ్చిన వరి ధాన్యం రాలిపోయి నీటి పాలు అయిందని, వెంటనే పంట నష్టాన్ని అంచనా వేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. వెంటనే వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకి ఫోన్ చేసి జరిగిన పంట నష్టాన్ని వివరించి నష్టపరిహారం ఇవ్వాలని కోరగా మంత్రి స్పందించి నష్ట పరిహారం ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. నిన్న కురిసిన అకాల వర్షం వల్ల గోవిందరావుపేట మండలం లోని అమృతండా, లక్ష్మీపూర్, కర్లపల్లి, చంద్రుతండా గ్రామాల్లో కోతకు వచ్చిన వరి పంట వడగండ్ల వానకు ధాన్యం రాలిపోయి నీటిపాలైందని తెలిపారు. రైతులందరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని, నష్టపోయిన ప్రతి రైతుకూ నష్ట పరిహారం అందిస్తామని, తడిసిన ప్రతి ధాన్యపు గింజనూ కొనుగోలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ బానోత్ రవిచందర్, టీపీసీసీ సభ్యులు మల్లాది రాంరెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, కార్మిక శాఖ జిల్లా అధ్యక్షులు కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఇస్సార్‌ఖాన్ పాల్గొన్నారు.

ముగిసిన ఎమ్మెల్సీ నామినేషన్ ప్రక్రియ

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నిక నామినేషన్ ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. గత నెల 28 నుంచి ఈనెల 4 వరకు నామినేషన్లు జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంత్ స్వీకరించారు. బీజేపీ, ఎంఐఎం తమ అభ్యర్థులను ప్రకటించగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పోటీకి దూరంగా ఉన్నాయి. బీజేపీ నుంచి ఎన్.గౌతమ్‌రావు, ఎంఐఎం నుంచి మీర్జారియాజ్ ఉల్ అసన్ ఎఫెండి నామినేషన్ దాఖలు చేశారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పోటీలో లేకపోవడంతో బీజేపీ, ఎంఐఎం మధ్యే పోటీ కొనసాగనుంది. వీరితోపాటు ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు చంద్రశేఖర్ చాలిక, కంటే సాయన్న నామినేషన్ దాఖలు చేశారు. ఈనెల 9వ తేదీ వరకు నామినేషన్ల విత్ డ్రాకు అవకాశం ఉండగా, 23న పోలింగ్, 25న కౌంటింగ్ జరగనున్నది. మొత్తం 110 మంది ఓటర్లు ఉండగా, ఎంఐఎంకు 49, బీఆర్‌ఎస్‌కు 25, బీజేపీకి 22, కాంగ్రెస్‌కు 14 ఓట్లు ఉన్నాయి.

సమగ్ర విద్యావిధానం రూపొందించండి

(మొదటిపేజీ తరువాయి)

విద్యార్థులు మరింత మెరుగ్గా రాణించగలరని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. అంగన్‌వాడీలు, ప్రాథమిక పాఠశాల స్థాయిలో తీసుకురావాల్సిన మార్పులపై సమాజంలోని వివిధ సంఘాలు, ప్రముఖులతో చర్చించి మెరుగైన విధాన పత్రం రూపొందించాలని సూచించారు. రాష్ట్రంలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలనీ, విద్యా వ్యవస్థలో తెలంగాణ అగ్రగామిగా ఉండేందుకు దోహదపడేలా సూచనలు, సలహాలు ఉండాలని కోరారు.వివిధ రాష్ట్రాల్లోని పర్యటనలు, ఆయా రాష్ట్రాలు, ఇతర దేశాల్లో ప్రాథమిక విద్యలో అనుసరిస్తున్న విధానాలను విద్యా కమిషన్ చైర్మెన్ ఆకునూరి మురళి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. 1960 దశకం నుంచి ప్రస్తుతం వరకు విద్యా వ్యవస్థలో తీసుకొచ్చిన పలు సంస్కరణలు క్రమేణా విద్యార్థుల సృజనాత్మక శక్తి, ఆలోచనాధోరణిని ఎలా హరించి వేశాయో ఫౌండేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ ప్రధాన కార్యదర్శి జయప్రకాశ్ నారాయణ వివరించారు. విద్యా వ్యవస్థలో మార్పులకు పరీక్షల విధానం, పాఠశాలల్లో తనిఖీలు, జీవన నైపుణ్యాల పెంపునకు తీసుకోవాల్సిన చర్యలను ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కె కేశవరావు, శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్‌రాజ్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి, ఉన్నత, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య, విద్యా కమిషన్ సభ్యులు పిఎల్ విశ్వేశ్వర్‌రావు, చారకొండ వెంకటేష్, కె జ్యోత్స్న శివారెడ్డితోపాటు పలు ఎన్జీవోల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సమానత్వమే..న్యాయ సమ్మతం

(మొదటిపేజీ తరువాయి)

తీర్మానంలో పేర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజనపై ఆంక్షలు 1976లో ఎమర్జెన్సీ సమయంలో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా అమలులోకి వచ్చాయి. వీటి ఉద్దేశం జనాభా నియంత్రణ విధానాలను ప్రోత్సహిం చడమే. తరువాత వాజ్‌పేయి ప్రభుత్వం కూడా ఈ విధానాలను 2026 వరకు పొడిగించింది.' అని తీర్మానంలో వివరించారు. తాజా పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, ఒడిశా, పశ్చిమ బెంగాల్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాలకు ప్రతికూలంగా మారే అవకాశం ఉందని, ఈ రాష్ట్రాలు విజయవంతంగా జనాభా నియంత్రణ విధానా లను పాటించడమే దీనికి కారణమని, జనాభా పెరుగుదల అధికంగా ఉన్న రాష్ట్రాలకు (ఉదా: ఉత్తరప్రదేశ్) ఎక్కువ ప్రాతినిధ్యం లభించే అవకాశం ఉందని, ఇది అన్యాయం' అని తీర్మానం పేర్కొంది. ఈ తీర్మానాన్ని పొలిట్‌బ్యూరో సభ్యులు జి.రామకృష్ణన్ ప్రతిపాదించగా, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి సంజయ్ చౌహాన్ బలపరిచారు.

జనగణనతో పాటే కుల గణన

2021లో జరగాల్సిన జనగణన ఇప్పటివరకు నిర్వహించకపోవడం పట్ల సీపీఐ(ఎం) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సాధ్యమైనంత త్వరగా జనగణనతో పాటే కుల గణనను కూడా నిర్వహించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆమోదించిన తీర్మానంలో జిల్లా, తాలూకా, బ్లాక్ లేదా గ్రామ స్థాయిల వంటి పాలనా సరిహద్దుల ఆధారంగా జనగణనను నిర్వహించడానికి జూన్ 2024 వరకూ గడువు ఉందని, కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఆ గడువును పొడిగించలేదని పేర్కొంది. 2021లో జరగాల్సిన జనగణనను కోవిడ్ కారణంగా వాయిదా వేసినట్టు ప్రభుత్వం ప్రకటించిందని, ఆ తరువాత ఇప్పటి వరకు దానిని నిర్వహించే సూచనలు కనిపించడం లేదని తెలిపింది. వెనుకబడిన వర్గాల గణాంకాలను సేకరిస్తే విద్య, అభివద్ధి మధ్య ఉన్న సంబంధాలను అర్థం చేసుకోవచ్చని, వెనుకబడిన వర్గాల సంక్షేమానికి రూపొందించిన పాలకుల విధానాల ప్రభావాన్ని అంచనా వేయవచ్చని తెలిపింది. వీటిని దృష్టిలో ఉంచుకుని కుల ఆధారిత జనగణన కోసం ఉన్న డిమాండ్‌ను సమర్థిస్తున్నట్టు సీపీఐ(ఎం) పేర్కొంది. సమాజంలోని పీడిత వర్గాలకు న్యాయం జరగాలంటే, 2021 నుంచి వాయిదా పడుతున్న జనగణనతో పాటే కులగణన కూడా నిర్వహించాలని డిమాండ్ చేసింది. ఈ తీర్మానాన్ని కేంద్ర కమిటీ సభ్యులు అవదేశ్‌కుమార్ ప్రతిపాదించగా, టి.జ్యోతి



బలపర్చారు.

కేరళ ఎల్‌డీఎఫ్ ప్రభుత్వానికి అండగా...

కేరళను అభివృద్ధి బాటలో నడిపిస్తూ, పెద్ద ఎత్తున ప్రజా అనుకూల నిర్ణయాలు తీసుకుంటున్న వామపక్ష, ప్రజాతంత్ర ప్రభుత్వాని(ఎల్‌డీఎఫ్)కి అండగా నిలవాలని సభ్యులు సానుభూతిపరులతో పాటు ప్రజాతంత్ర, అభ్యుదయ శక్తులకు సీపీఐ(ఎం) మహాసభ పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆమోదించిన తీర్మానంలో హిందూత్వ విధానాలను వ్యతిరేకిస్తూ, సెక్యులర్ విలువలను కాపాడుతూ, కేంద్ర ప్రభుత్వ నూతన ఉదారవాద ఆర్థిక విధానాలకు ప్రత్యామ్నాయాలను కేరళ ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొంది. దీంతో కేంద్రంలోని బీజేపీ-ఎన్డీఏ ప్రభుత్వం కక్షపూరిత విధానాలను అమలు చేస్తోందని, ఆర్థికంగా అనేక ఆంక్షలు పెడుతోందని తెలిపింది. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కూడా ఈ కుట్రలో భాగస్వామిగా మారిందని పేర్కొంది. ఈ నేపథ్యంలో దేశంలోని ప్రజాస్వామ్యవాదులు, కేరళ ఎల్‌డీఎఫ్ ప్రభుత్వానికి అండగా నిలిచేందుకు సంఘటితం కావాలని మహాసభ పిలుపునిచ్చింది. కేరళలో వరుసగా అధికారంలోకి వచ్చిన వామపక్ష ప్రభుత్వాలు, అభివద్ధిని లక్ష్యంగా చేసుకుని ప్రత్యామ్నాయ విధానాలను అమలు చేశాయని, ఫలితంగా 2025-26 నాటికి సంపూర్ణ పేదరిక నిర్మూలన సాధ్యం కానుందని తెలిపింది. సామాజిక సంక్షేమ రంగాలతో పాటు , గడిచిన మూడు దశాబ్దాలుగా జీడీపీ వద్ధిలోనూ కేరళ దేశానికి మించి ముందంజలో ఉంది. నూరుశాతం అక్షరాస్యత పెరగడం, అందరూ ఉన్నత చదువులు చదువుతుండటంతో నిరుద్యోగిత సమస్య ప్రస్తుతం ముందుకు వచ్చిందని, దీనికి పరిష్కారంగా, ఆర్థిక వ్యవస్థను ఆధునిక శాస్త్రీయ విజ్ఞానం, అధిక ఉత్పాదకత ఆధారితంగా పునర్నిర్మించాల్సిన అవసరం ఉందని తెలిపింది. ఇందుకోసం, నైపుణ్య ఆధారిత పరిశ్రమలు, స్టార్టప్‌లు పెరిగేందుకు పెట్టుబడుల ఆకర్షణకు కేంద్రంగా మారాలని, కేరళను ఒక "నాలెడ్జ్ ఎకానమీ"గా మార్చాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపింది. ఈ చర్యల కారణంగా ప్రత్యామ్నాయ మార్గాన్ని త్యజించడం ఎట్టి పరిస్థితుల్లోనూ జరగదని పేర్కొంది. 'ప్రభుత్వ రంగ సంస్థలు, పబ్లిక్ విద్యా వ్యవస్థ, పబ్లిక్ హెల్త్ వ్యవస్థలు మరింత బలపడతాయి. ప్రజాస్వామ్య హక్కులు, కార్మిక హక్కులకు విఘాతం కలగదు. సామాజిక రంగం, చిన్న స్థాయి పరిశ్రమల్లో ప్రజల పాత్ర పెరుగుతుంది. కుల, లింగ వివక్షకు వ్యతిరేకంగా, లౌకిక, శాస్త్రీయ విలువల కోసం పోరాటం కొనసాగుతుందని తీర్మానంలో సీపీఐ(ఎం) పేర్కొంది.

'ఇటువంటి ప్రజాపాలిత, అభివృద్ధి సాధించిన ప్రభుత్వాన్ని బీజేపీ-ఎన్డీఏ కూటమి అణిచివేయాలనుకుంటోంది. గవర్నర్‌పై ఒత్తిడి చేస్తూ, బిల్లులకు అనుమతి నిరాకరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక స్వాతంత్ర్యాన్ని దురుద్దేశపూరితంగా కుదిస్తున్నారు' అని వివరించారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ వివక్షను బహిర్గతం చేయాలని, కేరళ సాధించిన ప్రజాస్వామ్య విజయాలను ప్రచారం చేయాలని, ఎల్‌డీఎఫ్ ప్రభుత్వాన్ని బలోపేతం చేసి అండగా నిలవాలని ప్రజాతంత్ర శక్తులకు సీపీఐ(ఎం) పిలుపునిచ్చింది. ఈ తీర్మానాన్ని ఎండీ సలీం ప్రతిపాదించగా, త్రిపుర రాష్ట్ర కార్యదర్శి, కేంద్ర కమిటీ సభ్యులు జితేంద్ర చౌదరి బలపర్చారు.

ఎన్నికల కమిషన్‌పై

ఎన్నికల కమిషన్ స్వతంత్రత, సమగ్రత, పారదర్శకతలను కాపాడాలని, ఎన్నికల ప్రక్రియలో అన్ని పార్టీలకు సమాన అవకాశాలు ఉండాలని డిమాండ్ చేస్తూ మరో తీర్మానాన్ని సీపీఐ(ఎం) మహాసభ ఆమోదించింది. గత దశాబ్ద కాలంగా భారత ఎన్నికల సంఘం తీరుపై తీవ్ర ఆందోళన, ఆవేదనలను ఈ తీర్మానంలో సీపీఐ(ఎం) వ్యక్తం చేసింది. ఈ కాలంలో ఎన్నికల విధానం పూర్తిగా పారదర్శకత కోల్పోయిందని, రాజ్యాంగ విరుద్ధంగా మలచబడిందని, స్వతంత్రతను కోల్పోవడం, ప్రతిపక్ష పార్టీలను తక్కువచేసే ధోరణితో ఎన్నికల చట్టాలు, నియమాలు, మాన్యువళ్లను నామమాత్రంగా మార్చడంతో ఎన్నికలు డబ్బు ఉన్న పార్టీలకు లాభదాయకమైనవిగా మారాయని తీర్మానం పేర్కొంది. 2023 నవంబర్‌లో భారత సుప్రీంకోర్టు, ఎన్నికల కమిషనర్లను నియమించే ప్రక్రియ స్వతంత్రంగా ఉండాలంటూ ఇచ్చిన ఆదేశాలను తీర్మానం ప్రస్తావించింది. అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అత్యవసరంగా చట్టాన్ని మార్చి, నియామక సంఘం నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని తొలగించి, ముగ్గురు సభ్యుల్లో ఇద్దరిని కేంద్ర మంత్రివర్గ సభ్యులను నియమించిందని ఇది రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. ఎన్నికల కమిషన్‌పై ప్రజల విశ్వాసం క్షీణించిందంటూ 2024 ఏప్రిల్‌లో సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్ చేసిన సర్వేను ప్రస్తావించింది. ఇటీవల కాలంలో నకిలీ ఓటరు కార్డులు వెలుగులోకి రావడం, ఎన్నికల ప్రక్రియపై అనుమానాలు పెరుగుతుండటాన్ని సీపీఐ(ఎం) తీర్మానం పేర్కొంది. .'2024 లోక్‌సభ ఎన్నికల అనంతరం పౌర సమూహాలు విడుదల చేసిన "వోట్ ఫర్ డెమోక్రసీ" నివేదికలో దేశవ్యాప్తంగా కనీసం 79 పార్లమెంటరీ నియోజకవర్గాల్లో ప్రజా తీర్పు ప్రతిఫలించలేదని స్పష్టమైన సమాచారం ఉంది. 2024 ఎన్నికలలోని అన్ని విడతలలో సాయంత్రం 7-8 గంటలకు ప్రకటించిన ఓటింగ్ శాతం, చివరగా విడుదల చేసిన ఓటింగ్ శాతాన్ని ఆధారంగా గణించినప్పుడు 4,65,46,885 (సుమారు ఐదు కోట్లు) ఓట్లు అదనంగా కనిపించాయి. నిపుణుల విశ్లేషణ ప్రకారం ఈ ఫేక్ ఓట్ల లాభం బీజేపీ-ఎన్డీఏ కూటమికే ఎక్కువగా దక్కిందని తీర్మానం వివరించింది. 'ఇటీవల నిర్వహించిన నియోజకవర్గస్థాయి సర్వేలు ఓ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. బీజేపీకి ఓటేయకపోవచ్చని అంచనా వేసిన మత, కుల సమూహాలున్న ప్రాంతాల్లో ఓటర్లను ఎక్కువగా తొలగించారు. కొత్త ఓటర్ల చేర్పులూ, వాటి నిజాయితీపై మరింత లోతైన పరిశీలన చేయాలి. ఈ నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం ప్రజాస్వామ్యానికి బాధ్యత వహించేలా చేయడానికి ప్రజా ఉద్యమం అవసరం. ఈసీఐ లెక్కలు, డేటా, సమాచారం, ప్రతిపక్ష పార్టీలకు, ప్రజలకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేసింది. 'ఎన్నికల వ్యవస్థలో జరిగే అవకతవకలను బహిర్గతం చేయడంలో మరింతగా కృషి చేయాలి. దేశ ప్రజలందరికీ భయం లేకుండా, స్వేచ్ఛగా ఓటు వేయడం సాధ్యమయ్యేలా చర్యలు తీసుకోవాలి. ఎన్నికల సంఘం స్వతంత్రంగా, పారదర్శకం గా పనిచేయాలి.' అని తీర్మానంలో సీపీఐ(ఎం) కోరింది. దీనిని పొలిట్‌బ్యూరో సభ్యులు నీలోత్పల్ బసు ప్రవేశపెట్ట గా, ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి వి. శ్రీనివాసరావు బలపర్చారు.

'ఒకే దేశం...ఒకే ఎన్నిక'పై...

ఆర్‌ఎస్‌ఎస్- బీజేపీ ప్రతిపాదిస్తున్న 'ఒక దేశం- ఒకే ఎన్నిక' విధానం దేశ ప్రజాస్వామ్యానికి తీవ్రమైన హాని కలిగిస్తుందని సీపీఐ(ఎం) పేర్కొంది. ఈ మేరకు ఆమోదించిన తీర్మానంలో ఈ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు తెలిపింది. ఏక కేంద్రంగా దేశాన్ని నడపాలన్న వారి ఆలోచనకు ఇది నిదర్శనమని పేర్కొంది. వారి ఇతర నినాదమైన "ఒక దేశం, ఒక మతం, ఒక భాష, ఒక సంస్కృతి, ఒక నాయకుడు" అనే విధానం యొక్క పొడిగింపుగానే దీనిని చూడాలని తెలిపింది. హిట్లర్ కాలంలో ఉన్న ఫాసిస్టు నినాదం నుంచి దీనిని తీసుకొని, స్వల్పంగా మార్చినట్టు పేర్కొంది. పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలతో పాటు మున్సిపల్, పంచాయతీ ఎన్నికలను కూడా ఒకేసారి నిర్వహించాలన్న ఆలోచన ప్రజాస్వామ్యానికి మరింత ప్రమాదమని, మరింత తీవ్ర కేంద్రీకరణకు దారి తీస్తుందని వివరించింది. ఈ తీర్మానాన్ని పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్ ధావలే ప్రతిపాదించగా, కేంద్ర కమిటీ సభ్యులు అమ్రారామ్ బలపరిచారు.

మార్కెట్లకు సుంకాల సెగ

ముంబయి : అమెరికా సుంకాల ప్రకంపనలు భారత మార్కెట్లను భారీ నష్టాలకు గురి చేశాయి. ట్రంప్ పన్ను విధానాలు అమెరికా సహా ప్రపంచ దేశాల మార్కెట్లను ఓ కుదుపు కుదిపాయి. ఈ ప్రభావం శుక్రవారం దలాల్ స్ట్రీట్‌పై తీవ్రంగా పడింది. ఒక్క పూటలో మదుపర్ల సంపద రూ.9.5 లక్షల కోట్లు పైనా హరించుకుపోయింది. ఉదయం ప్రతికూలతలో ప్రారంభమైన సెన్సెక్స్ రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. తుదకు 931 పాయింట్లు లేదా 1.22 శాతం నష్టంతో 75,365కు పడిపోయింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 346 పాయింట్లు కోల్పోయి 22,904 వద్ద ముగిసింది. బిఎస్‌ఇ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ కాపిటలైజేషన్ రూ.9.5 లక్షల కోట్లు తుడుచుకుపెట్టుకుపోయి రూ.403.83 లక్షల కోట్లకు పరిమితమయ్యింది.భారత ఫార్మా ఉత్పత్తులపై సుంకాలను వేయబోమని తొలుత ప్రకటించిన డోనాల్డ్ ట్రంప్ మరుసటి రోజే మాట మార్చారు. ఔషధాలపై భారీగానే టారీఫ్‌లు వేస్తామని మీడియాతో ప్రకటించడంతో ఆ రంగం కంపెనీల షేర్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అరబిందో ఫార్మా లారస్ ల్యాబ్స్, లుపిన్, సన్ ఫార్మా షేర్లు 7.2 శాతం వరకు పతనమయ్యాయి. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, టాటా మోటార్స్, ఎల్అండ్‌టి, అదానీ పోర్ట్స్ ఇండస్ ఇండ్ బ్యాంక్ షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. మరోవైపు బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ బ్యాంక్, నెస్లే ఇండియా, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు లాభపడ్డాయి. ఫైనాన్షియల్, ఎఫ్‌ఎంసీజీ షేర్లు మినహా మిగిలిన అన్ని రంగాల షేర్లు ఒత్తిడి ఎదుర్కొన్నాయి.

ప్రధాన కారణాలు..

ప్రపంచ దేశాల నుంచి అమెరికా చేసుకునే దిగుమతులపై భారీగా టారీఫ్‌లు విధించడం ఇన్వెస్టర్లలో తీవ్ర భయాలను నెలకొల్పింది. వాణిజ్య యుద్ధ భయాలు ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీస్తాయన్న నిపుణుల ఆందోళనలు పెరిగాయి. యూఎస్‌కు ధీటుగా చైనా, యూరోపియన్ యూనియన్ దేశాలు ప్రతీకార సుంకాల ప్రణాళికలను సిద్ధం చేస్తోన్నాయనే రిపోర్టులు మార్కెట్లను కుదిపేశాయి. ప్రతీకార సుంకాల మూలంగా యుఎస్ మాంద్యంలోకి వెళుతుందన్న అంచనాలు పెరిగాయి.

సుంకాలతో దెబ్బ : కేర్‌ఎడ్జ్ రేటింగ్స్

అమెరికా సుంకాల విధింపు ఎగుమతి ఆధారిత రంగాలకు దెబ్బేనని కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, చీఫ్ రేటింగ్ ఆఫీసర్ సచిన్ గుప్తా పేర్కొన్నారు. ఈ టారీఫ్‌లతో ఆయా సంస్థల వ్యయాలపై ప్రభావం పడనుందన్నారు. అనిశ్చితితో ప్రయివేటు రంగ మూలధన వ్యయాలు నిలిచిపోవచ్చన్నారు. రూపాయి విలువ తగ్గుదల ఎగుమతిదారులకు కొంత ఉపశమనాన్ని కలిగించొచ్చన్నారు.

కంచ గచ్చిబౌలి భూములపై వివాదరహిత నివేదిక

(మొదటిపేజీ తరువాయి)

అయ్యారు. కోర్టు వ్యాఖ్యాలు, విద్యార్థుల ఆందోళనలు, క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులను ఈ సందర్భంగా ఆమె డిప్యూటీ సీఎంకు వివరించారు. భవిష్యత్‌లో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా నివేదిక అందించేందుకు కసరత్తు చేస్తున్నట్టు తెలిపింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ భూ వివాదాన్ని పరిష్కరించేందుకు ముగ్గురు మంత్రులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) ఎగ్జిక్యూటివ్ కమిటీ, విద్యార్థుల ప్రతినిధులు, జాయింట్ యాక్షన్ కమిటీ, సివిల్ సొసైటీ గ్రూపులు సహా భాగస్వాములైన ప్రతి ఒక్కరితో చర్చిస్తుంది. కమిటీలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సభ్యులుగా ఉన్నారు. ఈ క్రమంలోనే తాజాగా భట్టి విక్రమార్క ఉన్నతాధికారులతో భేటీ అయినట్టు సమాచారం. ఈ భేటీలో సీఎస్‌తో పాటు అటవీ, రెవెన్యూ, హెచ్‌ఎండీఏకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



అలరించిన కళారూపాలు..



సాంస్కృతికోత్సవాల్లో ప్రసంగిస్తున్న ప్రముఖ నటులు, దర్శకులు సముద్రఖని.. వేదికపై దర్శకులు వెట్రీ మారన్, జ్ఞానవేల్(జై భీం ఫేం) సీపీఐ(ఎం) ఎంపీ వెంకటేశన్ తదితరులు.

సాంస్కృతిక కార్యక్రమాలు

అదరహో

ముఖ్య అతిథులుగా విచ్చేసిన సినీ దర్శకులు సముద్రఖని, వెట్రిమారన్, జ్ఞానవేలు

మదురై నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

సీపీఐ (ఎం) 24వ అఖిల భారత మహాసభలను పురస్కరించుకుని మదురై నగరంలోని సీతారాం ఏచూరి నగర్ (తంబుక్కమ్ మైదానం)లో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. శుక్రవారం సాయంత్రం అక్కడ నిర్వహించిన కార్యక్రమాలను వీక్షించేందుకు సీపీఐ (ఎం) నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపరులు, సాధారణ ప్రజలు పోటెత్తారు. పలు రంగాలకు చెందిన మేధావులు, అభ్యుదయవాదులు, సాహితీ వేత్తలు ఆద్యంతం సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి, కళాకారులను కరతాళ ధ్వనులతో అభినందించారు. 'కేరళ మప్లా ముస్లిం మహిళల బృందం' నిర్వహించిన ఓ కార్యక్రమం అదరహో అనిపించింది. గాన విమల నేతృత్వంలో చెన్నై కల్చరల్ ట్రూప్ ఆలపించిన పాటలకు చప్పట్లు మార్మోగాయి. ప్రముఖ సినీ నటుడు, దర్శకుడు సముద్రఖని, దర్శకుడు వెట్రిమారిన్ ముఖ్య అతిథిలుగా విచ్చేశారు. వారి రాకతో సభికుల్లో జోష్ పెరిగింది.











సెల్ఫీ పాయింట్‌లో మార్క్స్‌తో సముద్రఖని, వెట్రీ మారన్, జ్ఞానవేల్, సీపీఐ ఎంపీ వెంకటేశన్



పాలస్తీనాకు సంఘీభావం తెలుపుతున్న మహాసభ




కళారూపాలను సెల్‌లో బంధిస్తున్న సినీ ప్రముఖులు

మహాసభలో పాటలు పాడుతున్న జూలకంటి రంగారెడ్డి, సాదుల శ్రీనివాస్, ప్రభావతి, తెలంగాణ ప్రతినిధుల బృందం





ఇజ్రాయిల్ దాడులకు వ్యతిరేకంగా నినదిస్తున్న సుభాషిణి అలీ



మహాసభ చర్చల్లో అబ్బాస్






రాఘవులుతో అరుణ్‌కుమార్



తీర్మానంపై మాట్లాడుతున్న జ్యోతి





మహాసభ చర్చల్లో మమత

ముచ్చటిస్తున్న బృందాకరత్ పినరయ్ విజయన్

అడుగడుగునా పోరాట ఘట్టాలు..

- అమరవీరుల చిరస్మరణీయ త్యాగాలు... • నాటి నుంచి నేటి వరకు కమ్యూనిస్టు పార్టీ 'మధుర' స్మృతులు
- ఉద్యమాల్లో మహిళామణుల వీరోచిత సాహసాలు • గాజాపై ఇజ్రాయిల్ దారుణ మారణకాండలు
- కండ్లకు కట్టిన ఛాయాచిత్ర ప్రదర్శన • యువతరానికి స్ఫూర్తినిస్తున్న ఫొటో ఎగ్జిబిషన్

మదురై నుంచి బి.వి.యన్.పద్మరాజు

ఎవరన్నారో తెలియదుగానీ..నిజంగానే 'భావోద్వేగాలను అర్థం చేసుకోవటానికి భాషతో పని లేదు...'. ప్రజల కష్టాలు, కన్నీళ్లు, పాలకుల నిర్బంధాలు, నియంతృత్వ పోకడలు.. లాఠీఛార్జీలు, కోర్టు కేసులు..జైలు జీవితాలు.. నిర్బంధాలు..వెరసి భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర పడిలేచిన కడలి తరంగం. అందులో ఎంతోమంది త్యాగధనులు, విప్లవ పోరాట యోధులు. వారు దేశం కోసం, ప్రజల హక్కుల కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా వదలిపెట్టారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా.. రాజస్థాన్ నుంచి నాగాలాండ్ దాకా భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి నుంచి విముక్తి కోసం ప్రభువులు, పాలకులను ఎదిరించి, తాడితులు, పీడితులకు అండగా నిలిచారు. తెలంగాణలో జరిగిన మహత్తర సాయుధ రైతాంగ పోరాటం, మహారాష్ట్రలో నిర్వహించిన వర్లీ ఆదివాసీల పోరాటం, రైల్వే సమ్మెలు, ఎమర్జెన్సీ రోజులు... ఇలా ఒకటేమిటి, 1908లో దేశంలోనే మొట్టమొదటి కార్మిక సంఘం ప్రారంభం నుంచి నేటి వరకు కమ్యూనిస్టు ఉద్యమంలో కొనసాగిన అనేక పరిణామ క్రమాలను వివరిస్తూ రూపొందించిన ఛాయాచిత్ర ప్రదర్శన వీక్షకులను, ముఖ్యంగా ఆనాటి చరిత్ర తెలియని నేటి యువతీ యువకులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఒక్కో నాయకుడి పోరాట చరిత వింటేనే రోమాలు నిక్కబొడిచేలా ఉన్న ఆ ఫొటో ఎగ్జిబిషన్ వారిలో స్ఫూర్తినింపుతూ, కార్యోన్ముఖులను చేస్తుందనటంలో ఎలాంటి సందేహం లేదు. ఆ ప్రదర్శనలోని ఫొటోలపై తమిళంలో రాసిన పదాలు, వాక్యాలు, వివరాలు అర్థం కాకపోయినా.. ఆ చిత్రాల్లోని భావాలు, భావోద్వేగాలు మాత్రం ఏ భాష వారికైనా సులభంగా అర్థమవుతాయి.



స్ఫూర్తి దాయకంగా ఫొటో ఎగ్జిబిషన్

సీపీఐ (ఎం) 24వ అఖిల భారత మహాసభ కొలువుదీరిన తమిళనాడులోని మదురైలోగల సీతారాం ఏచూరి నగర్‌లో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శన...ఆద్యంతం విప్లవ స్ఫూర్తిని నింపుతోంది. దేశానికి స్వాతంత్ర్యం రాకముందు 1908తో మొదలుపెట్టి...కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావం, దేశంలోనే తొలిసారి నిర్వహించిన సార్వత్రిక సమ్మె (1908), రష్యన్ విప్లవంపై సుబ్రమణ్య భారతి కవితలు (1917), దేశంలో తొలిసారిగా మేడే నిర్వహణ (1923), కమ్యూనిస్టు మ్యానిఫెస్టోను తమిళంలోకి అనువదించటం (1931-32), ఏఐటీయూసీ ఆవిర్భావం (1936), ఆలిండియా ఫార్మర్స్ యూనియన్ ఏర్పాటు (1936), ఏఐఎస్ఎఫ్ ఏర్పాటు (1936) తదితర తొలి ఘట్టాలను ఆ ఎగ్జిబిషన్‌లో ప్రస్తావించారు. వీటితోపాటు 1952లో జరిగిన తొలి పార్లమెంటు ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ ప్రధాన ప్రతిపక్షంగా అవతరించగా, ఏకే గోపాలన్ అపోజిషన్ లీడర్‌గా వ్యవహరించారు. 1957లో ప్రపంచంలోనే తొలిసారిగా బూర్జువా ప్రజాస్వామ్య ఎన్నికల పద్ధతుల్లో కేరళలో కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి వచ్చింది. 1964లో సీపీఐ నుంచి విడిపోయి భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఏర్పడింది. దానికి పుచ్చలపల్లి సుందరయ్య తొలి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1967లో కేరళలో ఈఎంఎస్ నంబూద్రిపాద్ నాయకత్వంలో, బెంగాల్‌లో అజయ్ ఘోష్ నేతృత్వంలో లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. 1978లో నృపేన్ చక్రవర్తి సారథ్యంలో, ఆ తర్వాత మాణిక్ సర్కార్ నాయకత్వంలో త్రిపురలో వామపక్ష ప్రభుత్వాలే ర్పడ్డాయి. కేరళలో 2015 నుంచి వరసగా రెండుసార్లు ఎల్డీఎఫ్ జయకేతనం ఎగరేసింది. ఈ రకంగా దేశ చరిత్రలో పార్టీ సువర్ణ అధ్యాయాన్ని లిఖించిన రోజులను ఫొటో ఎగ్జిబిషన్ కండ్లకు కట్టింది. వీటితోపాటు తెలంగాణలో నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల దాష్టీకాలు, తమిళనాడులోని వెణ్మణి గ్రామంలో రామయ్య గుడిసెలో 44 మందిని సజీవ దహనం చేసిన దారుణ ఘటన, భారత్-పాకిస్తాన్ విభజన, బెంగాల్, కేరళలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన వామపక్ష ప్రభుత్వాలను పాలకులు కూల్చివేసిన వైనాలు, 1975లో ఇందిరాగాంధీ హయాంలోని ఎమర్జెన్సీ రోజులు, ఆ సందర్భంగా పార్టీ నేతలపై బనాయించిన కేసులు, జైళ్లలో మగ్గిన నేతలు, దేశంలోని అనేక ప్రాంతాల్లో కమ్యూనిస్టు నాయకులపై పెట్టిన కుట్ర కేసులు తదితర కీలక ఘటనలను ఛాయాచిత్ర ప్రదర్శన సాక్షాత్కరింపజేసింది. వాటిని వీక్షించిన పాతతరం నాయకులు చెమ్మగిల్లిన కండ్లతో బయటకొస్తే...యువతరం మాత్రం 'అమరవీరులారా వందనం.. మీ ఆశయాలను సాధిం చేందుకు మేమున్నాం...' అంటూ ప్రతినబూనుతున్నారు.



మహాసభలో తమ్మినేని



చర్చల్లో తెలంగాణా ప్రతినిధులు

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

చైనా స్టార్టప్‌ల తరహాలో ఆలోచించాలి

మంత్రి పియూష్ గోయల్



న్యూఢిల్లీ : భారత స్టార్టప్ సంస్థలు ఆలోచనలు మారాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ అన్నారు. చైనా తరహాలో డీప్ టెక్ స్టార్టప్‌లపై దృష్టి పెట్టాలని సూచించారు. స్టార్టప్ మహాకుంబ్ కార్యక్రమంలో పియూష్ గోయల్ మాట్లాడుతూ.. దేశంలోని పలు స్టార్టప్ సంస్థలు ఫుడ్ డెలివరీ, బెట్టింగ్, ఫాంటసీ స్పోర్ట్స్ వంటి యాప్‌లపై ఎక్కువగా ఆలోచన చేస్తోన్నాయన్నారు. ఇలాంటి వాటి వల్ల దిగువ శ్రేణి కార్మికులు తయారై సంపన్నులు కాలు బయటపెట్టకుండా ఆహారం పొందగలుతున్నారన్నారు. మరోవైపు చైనా చైనా సంస్థలు ఎఐ, ఇవిలు, సెమీ కండక్టర్ల రంగాలను ఎంచుకుంటున్నాయన్నారు. భారత్‌లో 1000 డీప్ టెక్ స్టార్టప్‌లు మాత్రమే ఉండటం ఆందోళనకం మన్నారు. ఇక్కడి యువతరం రూ.25 లక్షలు, రూ.50 లక్షలకు తమ గొప్ప ఆలోచనలను విదేశీ కంపెనీలకు అమ్మేసుకుంటున్నారన్నారు. మంత్రి పీయూష్ గోయల్ వ్యాఖ్యలపై జెప్టో సిఇఒ అదిత్ పలిచా తీవ్రంగా స్పందించారు. విమర్శించడం తేలిక అంటూ వ్యాఖ్యానించారు. భారత స్టార్టప్‌లను తక్కువ చేయొద్దని, డీప్‌టెక్ సంస్థల వృద్ధి కోసం ప్రభుత్వం ఎలాంటి సహాయం అందిస్తోందని తెలుపాలని ఇన్ఫోసిస్ మాజీ సిఎఫ్ఒ మోహన్‌దాస్ పాయ్ ప్రశ్నించారు.

అవంటెల్‌కు జిఎస్ఎల్ ఆర్డర్

హైదరాబాద్ : గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్ (జిఎస్ఎల్) నుంచి రూ.11.37 కోట్ల విలువ చేసే ఆర్డర్ దక్కిందని అవంటెల్ లిమిటెడ్ తెలిపింది. ఇది భారతదేశ సముద్ర రక్షణ పర్యావరణ వ్యవస్థ అంతటా కమ్యూనికేషన్ మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తుందని అవంటెల్ లిమిటెడ్ డైరెక్టర్ సిద్ధార్థ అబ్బూరి పేర్కొన్నారు. ఇది భారతదేశ సముద్ర అవసరాలకు అనుగుణంగా శాటిలైట్ కమ్యూనికేషన్ సొల్యూషన్స్‌ను అభివృద్ధి చేయడంలో తమ ప్రయత్నాలను నొక్కి చెబుతుందన్నారు. ఈ ప్రాజెక్ట్ ఫిబ్రవరి 2026, మార్చి 2027 మధ్య అమలు చేయబడుతుందన్నారు.

టోన్‌బో ఇమేజింగ్‌కు రూ.175 కోట్ల నిధులు

న్యూఢిల్లీ : ఇన్‌ఫ్రారెడ్ సెన్సార్‌లు, డైరెక్టెడ్ ఎనర్జీ వెపన్ ప్లాట్‌ఫాంలను అభివృద్ధి చేసేందుకు ప్రీ-ఐపిఒలో భాగంగా డి సిరీస్ కింద రూ.175 కోట్ల నిధులు సమీకరించినట్లు టోన్‌బో ఇమేజింగ్ తెలిపింది. ఈ వ్యూహాత్మక డిఫెన్స్ టెక్నాలజీ కంపెనీ ఫ్లోరిన్‌ట్రీ అడ్వైజర్స్, టెనేసిటీ వెంచర్స్, ఎక్స్‌పోర్ట్-ఇంపోర్ట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ నిధులను అందుకున్నట్లు పేర్కొంది. ఆధునిక యుద్ధ రీతుల్లోని ముప్పులను సమర్థవంతంగా ఎదుర్కొనగలిగే కొత్త తరం ఇన్‌ఫ్రారెడ్ సెన్సార్లను అభివృద్ధి చేసేందుకు ఈ నిధులను ఉపయోగించుకోనున్నట్లు తెలిపింది.



అబిడ్స్‌లో మహేష్ బ్యాంక్ అప్‌గ్రేడెడ్7 ఎటిఎం ఏర్పాటు

నవ తెలంగాణ - హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ మహేష్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ అబిడ్స్‌లో ఆధునిక, అప్‌గ్రేడెడ్ ఎటిఎంను ఏర్పాటు చేసింది. దీనిని ఆ బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులతో కలిసి భగ్‌వతి దేవి బల్వా, రామ్‌నారాయణ బోగ లాంచనంగా ప్రారంభించారు. ఖాతాదారులకు అత్యంత భద్రతతో పాటు అనేక ఆధునిక ఫీచర్లను ఈ ఎటిఎంను అందుబాటులోకి తెచ్చామని రామ్ నారాయణ అన్నారు. ఆధునిక టెక్నాలజీని తమ ఖాదారులకు అందించడంలో మహేష్ బ్యాంక్ ఎప్పుడూ ముందుంటుందన్నారు. నాలుగు రాష్ట్రాల్లో 45 బ్యాంక్ శాఖలను కలిగి ఉన్నామన్నారు. ఇప్పటి వరకు దాదాపు రూ.2,682 కోట్ల వ్యాపారాన్ని నమోదు చేశామన్నారు.

కలాశా 'వజ్ర కలశం' స్కీమ్‌తో బోనస్

హైదరాబాద్ : ఆభరణాల రిటైల్ సంస్థ కలాశా తన 8వ వార్షికోత్సవం సందర్భంగా పెళ్లికూతురు కలెక్షన్‌తో పాటు 'వజ్ర కలశం' పేరుతో ప్రత్యేకమైన డైమండ్ జ్యెలరీ సేవింగ్ స్కీమ్‌ను ప్రారంభించినట్లు ఆ సంస్థ తెలిపింది. ఈ సేవింగ్ స్కీమ్ ద్వారా క్లయింట్లు 10 నెలలపాటు పొదుపు చేసి, అదనంగా 1.5 నెలల బోనస్ పొందవచ్చని కలాశా డైరెక్టర్ శ్రీనివాస్ చందా తెలిపారు. ఇది డైమండ్స్‌లో పెట్టుబడి పెట్టే ఒక సులభమైన మార్గాన్ని అందిస్తున్నామన్నారు. ఇది స్మార్ట్, లాభదాయకమైన పెట్టుబడిగా నిలుస్తుందన్నారు. వజ్ర కలశంతో పాటు 'పెళ్లికూతురు కలెక్షన్' బ్రైడల్ జ్యెలరీని కూడా ఆవిష్కరించామన్నారు.

ఆర్.ఎల్.ఐ.సీతో పాటు బంకచర్ల ప్రాజెక్టుపై సుప్రీంకోర్టుకు :

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కృష్ణా, గోదావరి నదులపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టు పాటు బంకచర్ల ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణాలపై సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నట్టు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. నిబంధనలకు భిన్నంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏకపక్షంగా నిర్మించ తలపెట్టిన ఈ రెండు ప్రాజెక్టుల నిర్మాణాలతో తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులతో పాటు ఇక్కడి తాగు నీటికి ముప్పు ఏర్పడే ప్రమాదం ఉన్నందున సుప్రీంకోర్టును ఆశ్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లోని నీటిపారుదల శాఖ ప్రధాన కార్యాలయం జలసౌధలో ఆయన నీటిపారుదల శాఖాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నీటిపారుదల శాఖా రాష్ట్ర ప్రభుత్వ సలహా దారుడు అదిత్యా దాస్ నాథ్, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఆర్ అండ్ ఆర్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, ఈఎన్సీలు అనిల్ కుమార్, విజయ్ భాస్కర్ రెడ్డి, సి.ఇ శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఈ సమీక్ష లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నీటిపారుదల స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులతో పాటు అడ్వకేట్ జనరల్‌తో త్వరలోనే ప్రత్యేక సమావేశం నిర్వహించి గోదావరి, కృష్ణా నదుల్లో తెలంగాణకు న్యాయబద్ధంగా రావాల్సిన వాటాను కాపాడేందుకు సుప్రీంకోర్టులో కేసు వేయనున్నట్టు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి నది నీటితో నిర్మించ తలపెట్టిన బంకచర్ల ఎత్తిపోతల పథకం రూ.80,112 కోట్లు అనీ, ఈ ప్రాజెక్టు ద్వారా పోలవరం వద్ద 200 టీఎంసీల నీటిని బొల్లపల్లి రిజర్వాయర్, బంకచర్ల హెడ్ రెగ్యులేటర్ ద్వారా రాయలసీమకు మళ్లించనున్నారని ఆయన వెల్లడించారు. తద్వారా గోదావరి, కృష్ణా నదులను అనుసంధానం చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూట్ మ్యాప్ రూపొందించుకుందని ఆయన తెలిపారు.

1980లో జి.డబ్ల్యూ.డి.టి ట్రిబ్యునల్ ఉత్తర్వులు, 2014 ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉల్లంఘిస్తోందని ఆయన ఆరోపించారు. కేంద్ర జల వనరుల సంఘం, జీ.ఆర్.యం.బి., కే.ఆర్.యం.బి., ఏపేక్స్ కౌన్సిల్ నుంచి అనుమతులు పొందకుండానే వారు ప్రాజెక్టుల నిర్మాణాలకు పూనుకున్నారని ఆయన విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ పునర్‌వ్యవస్థీకరణ చట్టంలోని 46(2),46(3) ఆధారంగా వెనుకబడిన ప్రాంతాల అభివద్ధి కోసం కేంద్రం నుంచి నిధులు పొందేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందనీ, ఇది పూర్తిగా నిబంధనలకు భిన్నంగా ఉందని చెప్పారు. ఇప్పటికే తెలంగాణా ప్రభుత్వం కృష్ణా నది జలాశయాలతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూపొందించిన రాయలసీమ ఎత్తిపోతల పథకంపై తెలంగాణా ప్రభుత్వం ఆక్షేపించిన విషయాన్ని ఆయన ఉటంకించారు. ఇందుకు స్పందించిన కేంద్ర పర్యావరణ ,అటవీ,వాతావరణ శాఖలకు చెందిన నిపుణుల కమిటీ ఫిబ్రవరి నెలలో రాయలసీమ ప్రాజెక్టును ముందున్న స్థితికి తీసుకు రావాలని ఆదేశించారని ఆయన వివరించారు. పర్యావరణ నిబంధనలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉల్లంఘిస్తున్నదని కమిటీ స్పష్టం చేసిందన్నారు. తెలంగాణా ప్రభుత్వంతో పాటు జాతీయ హరిత ట్రిబ్యునల్, సుప్రీంకోర్టు, సంబంధిత మంత్రిత్వ శాఖలు చేసిన విజ్ఞప్తుల ఫలితమే ఆ ప్రాజెక్టును పూర్వ స్థితిలో ఉంచాలని నిర్ణయం తీసుకుందన్నారు. ఇంత జరిగిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరోక్ష మార్గాల ద్వారా ప్రాజెక్టు నిర్మాణాన్ని కొనసాగిస్తుందని ఆయన తెలిపారు.

తెలంగాణా ప్రభుత్వం ఈ పరిణామాలను చూస్తూ ఉరుకోబోదనీ, తెలంగాణాకు జరుగుతున్న ఇబ్బందులను సుప్రీంకోర్టు ముందుంచడంతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిబంధనల ఉల్లంఘనపై వాదనలు వినిపించి అక్రమ నీటి తరలింపును అడ్డుకుంటామని ఆయన స్పష్టం చేశారు. రాయలసీమకు గోదావరి వరద నీటిని మళ్లింపు అంటూ జరిగితే భద్రాచలం వంటి ప్రాశస్త్యం కలిగిన దేవాలయం ప్రమాదపుటంచున పడే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పదేళ్ళుగా బీఆర్ఎస్ ప్రభుత్వం చూపించిన ఉదాసీనత కారణంగానే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేటశారు. అక్రమంగా నీటిని ఆంధ్రప్రదేశ్ తరలించుకుంటు పోతుంటే బీఆర్ఎస్ ప్రభుత్వం చోద్యంలా చూసిందే తప్ప అడ్డుకోలేదని ఆయన విమర్శించారు.

పూడిక తీత పనులకు త్వరలోనే టెండర్లు

రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ప్రాజెక్టుల పూడికతీత పనులకు త్వరలోనే టెండర్లు పిలువనున్నట్టు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. చెరువుల్లో రిజర్వాయర్లలో నీటి సామర్థ్యం పెంపొందించేందుకు పూడికతీత పనులు చేపట్టినట్టు ఆయన వెల్లడించారు.

ఐదేళ్ల క్లినికల్ ఎక్స్‌పీరియన్స్‌తో క్లినికల్ ఇన్‌స్ట్రక్టర్ గా అనుమతించాలి

తెలంగాణ ఆల్ నర్సెస్ ఫెడరేషన్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీ.యస్సీ నర్సింగ్ విద్యను పూర్తి చేసి, ప్రభుత్వ విభాగంలో ఐదేళ్ల క్లినికల్ ఎక్స్‌పీరియన్స్ ఉన్నవారికి ప్రభుత్వ నర్సింగ్ కాలేజీల్లో క్లినికల్ ఇన్‌స్ట్రక్టర్స్‌గా పని చేసేందుకు అనుమతించాలని తెలంగాణ ఆల్ నర్సెస్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర సలహాదారు భూపాల్, రాష్ట్ర అధ్యక్షులు వి.భూలక్ష్మి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సువర్ణలత, రాష్ట్ర కోశాధికారి బి.స్వరూప శుక్రవారం హైదరాబాద్‌లో వైద్యారోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ డాక్టర్ క్రిస్టీనా జెడ్ చొంగ్తూకు వినతిపత్రం సమర్పించారు. తమ సర్వీసులు 20 ఏళ్లు దాటినా పదోన్నతులు లేవని వారు తెలిపారు. 2021, 2024 సంవత్సరంలో ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన నర్సింగ్ సిబ్బందికి గవర్నమెంట్ నర్సింగ్ కాలేజీల్లో పదోన్నతుల ద్వారా పని చేయడానికి నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఈ అవకాశాన్ని కనీసం 5 సంవత్సరాల నుంచి 20 సంవత్సరాలపైబడి బెడ్ సైడ్ అనుభవమున్న సీనియర్ నర్సింగ్ సిబ్బందికి ఇప్పించాలని కోరారు. ఇన్‌సర్వీస్‌లో ఉన్నత విద్యకు జీతంతో కూడిన ఎడ్యుకేషన్ సెలవులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. నర్సింగ్ పీజీ చేయడానికి రాష్ట్రంలో ఉస్మానియా కాలేజ్ ఆఫ్ నర్సింగ్ తప్ప మరొకటి లేదని గుర్తుచేస్తూ, 10 నర్సింగ్ కాలేజీల్లో పీజీ కోర్సులకు అనుమతించాలని పేర్కొన్నారు. నర్సింగ్ కాలేజీలకు, హాస్టళ్లకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలనీ, నర్సింగ్ డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పదోన్నతులను 50 శాతం క్లినికల్ సైడ్, 50 శాతం ఫీల్డ్ సైడ్ పదోన్నతులు ఇవ్వాలని కోరారు. జిల్లాకు ఒకటి చొప్పున గవర్నమెంట్ స్కూల్ ఆఫ్ నర్సింగ్‌ను ఏర్పాటు చేయాలనీ, బీ.యస్సీ నర్సింగ్, ఎమ్మెస్సీ నర్సింగ్ చేసేందుకు ఇన్ సర్వీస్ ఎడ్యుకేషన్ సీట్లను పెంచాలనీ, నర్సింగ్‌కు సంబంధించిన అన్ని విభాగాల్లో టీచింగ్, నాన్ టీచింగ్ విభాగాల్లో క్యాడర్ స్ట్రెంత్ పెంచాలన్నారు.

ఈడీ చూపు... ఇక నిర్మాతల వైపు

- ఎల్2 : ఎంపురన్ నిర్మాత నివాసం, కార్యాలయంలో కేంద్ర దర్యాప్తు సంస్థ సోదాలు, విచారణ
- చిత్రంలో 2002 గుజరాత్ అల్లర్లను చూపించినందుకేనని విమర్శలు




చెన్నై : కేంద్రంలోని బీజేపీకి వ్యతిరేకంగా స్వరాన్ని వినిపించే వారిపైనా, ప్రతిపక్ష నాయకులు లక్ష్యంగా దాడులు చేసే ఈడీ ఈసారి చిత్ర నిర్మాతలను వేధించడంపై దృష్టి పెట్టింది. 2002 గుజరాత్ హింసాకాండను విస్తృతంగా చూపించిన మళయాళ చిత్రం ఎల్2: ఎంపురన్ నిర్మాతల్లో ఒకరైన గోకులం గోపాలన్ లక్ష్యంగా ఇడి దాడులకు దిగింది. ఇటీవల విడుదలైన ఎల్2: ఎంపురన్ చిత్రంపై బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు ఆరోపణలు చేస్తున్నా ఈ సినిమాను ప్రేక్షకులు విశేషంగా ఆదరిస్తున్నారు. తెలుగు, తమిళం వంటి భాషల్లోనూ ఈ చిత్రం విడుదలయింది. 2002 గుజరాత్ అల్లర్లలో బీజేపీ గుండాలు విధ్వంస కాండపై ఈ సినిమాలో కొన్ని దృశ్యాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే గోకులం గోపాలన్ నివాసం, కార్యాలయంలో శుక్రవారం ఇడి సోదాలు నిర్వహించింది. చెన్నైలోని నీలాంగరై ప్రాంతంలో ఉన్న నివాసం, కొడంబక్కం ప్రాంతంలోని ఆయనకు చెందిన చిట్ ఫండ్ కార్యాలయంలో సోదాలు జరిగాయి. మరోవైపు, కొజికోడ్‌లోని గోపాలన్ కార్పొరేట్ కార్యాలయంలో ఆయన్ను ఇడి విచారించింది. కొచ్చిలోని ఈడీ యూనిట్ నుంచి వచ్చిన అధికారులు ఈ విచారణలో పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం 11:30 గంటలకు ఈ విచారణ ప్రారంభమయింది. విదేశీ మారక ద్రవ్య ఉల్లంఘన కేసు దర్యాప్తులో భాగంగా ఈ విచారణ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. గోపాలన్, ఆయనకు చెందిన శ్రీ గోపాలన్ చిట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌పై విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఎఫ్ఇఎంఎ) నిబంధనల కింద ఇడి అధికారులు కేసు నమోదు చేశారు. కాగా, గోపాలన్‌ను విచారించే ముందు వడకరలోని ఆయన నివాసం, కోజికోడ్‌లోని ఇతర కార్యాలయాల్లో ఈడీ బృందం విస్తృతంగా సోదాలు నిర్వహించింది. చెన్నైలో రెండు ప్రాంతాలతో పాటు మొత్తంగా ఐదు ప్రాంతాల్లో ఈడీ సోదాలు జరిగాయి. గోపాలన్‌పై ఎఫ్ఇఎంఎ నిబంధనలతో పాటు మనీలాండరింగ్ చట్టం కింద నమోదైన మోసం, ఫోర్జరీ ఆరోపణలతో నమోదైన కేసులను కూడా ఇడి పరిశీలిస్తున్నట్లు సమాచారం. బీజేపీకి వ్యతిరేకంగా ఎల్2 :ఎంపురన్‌లో దృశ్యాలు ఉన్న కారణంగానే ఆ చిత్ర నిర్మాత గోపాలన్‌ను ఈడీ లక్ష్యంగా చేసుకుందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎన్నికల బాండ్ల నిధుల జప్తుపై సమీక్షకు సుప్రీం నో

న్యూఢిల్లీ : ఎన్నికల బాండ్ల పథకం ద్వారా అందుకున్న నిధులను జప్తు చేయడానికి వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయాన్ని సమీక్షించేందుకు సుప్రీం కోర్టు తిరస్కరించింది. 2018లో బాండ్ల ద్వారా రాజకీయ పార్టీలు అందుకున్న రూ.16,518 కోట్ల నిధులను జప్తు చేయాలని కోరుతున్న పిటిషన్లపై నిర్ణయాన్ని సమీక్షించాలని కోరుతూ పిటిషన్ దాఖలవగా దాన్ని సుప్రీం కోర్టు తోసిపుచ్చింది. గతేడాది ఆగస్టు 2న సుప్రీం తీసుకున్న నిర్ణయం పై ఖేమ్ సింగ్ భాటి రివ్యూ పిటిషన్ వేశారు. దాన్ని ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా నేతృత్వంలో బెంచ్ తోసిపుచ్చింది. ఈ అంశంపై బహిరంగ కోర్టులో విచారించాలని భటి చేసిన విజ్ఞప్తిని కూడా కోర్టు తిరస్కరించింది. మాజీ ప్రధాన న్యాయమూర్తి డి.వై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం గతేడాది ఫిబ్రవరి 15న ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేసింది. ఈ పథకం కింద అధికారిక ఆర్థిక లావాదేవీలు జరిపే ఎస్‌బిఐ, సుప్రీం తీర్పు నేపథ్యంలో తన వద్ద గల డేటాను ఎన్నికల కమిషన్‌తో పంచుకుంది. తర్వాత కమిషన్ దాన్ని బహిర్గతం చేసింది. 2018 జనవరి 2న బిజెపి ప్రభుత్వం ఈ ఎన్నికల బాండ్ల పథకాన్ని తీసుకువచ్చింది. రాజకీయ నిధుల్లో పారదర్శకతను తీసుకువచ్చే పేరుతో రాజకీయ పార్టీలకు నగదు విరాళాలకు ప్రత్యామ్నాయంగా ఈ బాండ్లను తీసుకువచ్చారు.

అది.. విధానపరమైన నిర్ణయం : సుప్రీం

న్యూఢిల్లీ : 13 ఏండ్ల లోపు చిన్నారులను సోషల్ మీడియా ఉపయోగించకుండా నిషేధించాలని కోరుతూ దాఖలైన ఒక పిల్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం తిరస్కరించింది. ఇది విధానపరమైన అంశమని పేర్కొంది. అయితే సంబంధించిన అధికారులకు ఈ అంశాన్ని నివేదించే స్వేచ్ఛను పిటిషనర్‌కు జస్టిస్ బి.ఆర్.గవై, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం మంజూరు చేసింది. చిన్నారి మనస్సులపై సోషల్ మీడియా చూపే తీవ్రమైన శారీరక, మానసిక ప్రభావాలను ప్రస్తావిస్తూ జెప్ ఫౌండేషన్ ఈ పిటిషన్ దాఖలు చేసింది. 13 ఏండ్ల లోపు చిన్నారులు సోషల్ మీడియా ఉపయోగించకుండా నిషేధం విధించాలని, వినియోగదారుల వయస్సును నిర్ధారించడానికి సోషల్ మీడియా వేదికలు బయోమెట్రిక్ ప్రామాణీకరణ వంటి ధ్రువీకరణ వ్యవస్థలను అమలు చేయడం తప్పనిసరి చేయాలని కూడా పిటిషన్ కోరింది. పిటిషనర్ తరుపున న్యాయవాది మోహిని ప్రియ వాదనలు వినిపించారు. నిబంధనలను పాటించడంలో విఫలమైన సోషల్ మీడియా సంస్థలకు కఠినమైన జరిమానా విధించాలని కూడా న్యాయవాది కోరారు. చిన్నారులు సోషల్ మీడియాను ఉపయోగించడంపై నియంత్రణ అనేది కేవలం తల్లిదండ్రులకు సంబంధించిన అంశం కాదని తెలిపారు. అయితే ఇది విధానపరమైన విషయం అంటూ ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. 'మీరు పార్లమెంట్‌ను చట్టం చేయమని అడుగుతున్నారా..?' అని వ్యాఖ్యానించింది.



తమిళనాడు నీట్ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం పెండింగ్

భవిష్యత్ కార్యాచరణపై చర్చకు 9న అఖిలపక్షం ఏర్పాటు చేసిన సీఎం స్టాలిన్

చెన్నై : ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు నీట్ ప్రాతిపదికగా వుండాలన్న నిబంధనల నుండి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ తమిళనాడు ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదాన్ని నిలుపుచేశారు. కేంద్ర ప్రభుత్వం చేసిన సిఫారసుల ప్రాతిపదికన రాష్ట్రపతి ఈ చర్య తీసుకున్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ శుక్రవారం అసెంబ్లీలో ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వివరణలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా విస్మరించిందని విమర్శించారు. దీనిపై తదుపరి కార్యాచరణ ఏ రీతిలో వుండాలో న్యాయ నిపుణులతో ప్రభుత్వం చర్చిస్తుందని స్టాలిన్ చెప్పారు. తదుపరి చర్యలపై చర్చించేందుకు చెన్నైలో సచివాలయంలో ఈనెల 9న అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాల్సిందిగా ఆయన నేతలను కోరారు. రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.కె.రాజన్ నేతృత్వంలో తమిళనాడు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ సిఫార్సుల ప్రాతిపదికన 2021 సెప్టెంబరు 13న రాష్ట్ర అసెంబ్లీ తమిళనాడు అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ డిగ్రీ కోర్సుల అడ్మిషన్ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించిందని ముఖ్య మంత్రి చెప్పారు. అయితే ఆ బిల్లును పున:పరిశీలించాల్సిందిగా కోరుతూ గవర్నర్ తిప్పి పంపారు. ఆ తర్వాత 2022 ఫిబ్రవరి 5న అఖిల పక్షం పెట్టి, ఫిబ్రవరి 8న అసెంబ్లీ మళ్లీ బిల్లును ఆమోదించింది. ఆ తర్వాత రాష్ట్రపతి ఆమోదం నిమిత్తం కేంద్ర ప్రభుత్వానికి పంపింది. ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంలోని వివిధ విభాగాలకు అవసరమైన వివరణలను తమిళనాడు ప్రభుత్వం అందచేసిందని స్టాలిన్ చెప్పారు. అయిని నీట్ మినహాయింపు బిల్లును ఆమోదించడానికి కేంద్రం తిరస్కరించిం దన్నారు. ఇది తమ విద్యార్థులకు పెద్ద ఎదురు దెబ్బ అన్నారు. సహకార సమాఖ్యవాదం చరిత్రలో కేంద్ర ప్రభుత్వ వైఖరి ఒక చీకటి అధ్యాయమని వ్యాఖ్యానించారు. తమిళనాడు ప్రజల అభిప్రాయాలను, అసెంబ్లీ తీర్మానాలను పూర్తిగా విస్మరించిందన్నారు.

ముస్లింల మత ప్రతిపత్తికి విఘాతం

వక్ఫ్ బిల్లును సవాలు చేస్తూ సుప్రీంలో కాంగ్రెస్ ఎంపి పిటిషన్



న్యూఢిల్లీ : కాంగ్రెస్ ఎంపీ మహ్మద్ జావేద్ వక్ఫ్ (సవరణ) బిల్లు, 2025ను శుక్రవారం సుప్రీం కోర్టులో సవాలు చేశారు. రాజ్యసభలో ఈ బిల్లుపై సుదీర్ఘంగా చర్చ సాగిన అనంతరం పార్లమెంట్ దీనికి ఆమోద ముద్ర వేసిన గంటల వ్యవధిలోనే ఈ పిటిషన్ దాఖలైంది. వక్ఫ్ ఆస్తులు, వాటి నిర్వహణపై ఈ బిల్లు ఏకపక్షంగా ఆంక్షలు విధిస్తోందని తద్వారా ముస్లింల మతపరమైన స్వయంప్రతిపత్తికి విఘాతం కలిగిస్తోందని జావేద్ పేర్కొన్నారు. వక్ఫ్ బిల్లుపై వేసిన సంయుక్త పార్లమెంటరీ కమిటీలో జావేద్ సభ్యుడు.

300ఎ అధికరణ కింద రక్షణ కల్పించబడిన ఆస్తుల హక్కులకు ఈ సవరణలు విఘాతం కలిగిస్తున్నాయి. వక్ఫ్ ఆస్తులపై ప్రభుత్వ నియంత్రణను విస్తరించడం, ఆస్తిని మతపరమైన ప్రయోజనాలకు అంకితం చేసేందుకు వ్యక్తులకు గల సామర్థ్యాన్ని పరిమితం చేయడం, వక్ఫ్ ఆస్తులను ఉన్నత పరిశీలనకు గురి చేయడం వంటి చర్యల ద్వారా ఈ చట్టం మతపరమైన ఆస్తులపై నియంత్రణను లౌకిక అధికారులకు బదిలీ చేయాలన్న సుప్రీం కోర్టు తీర్పుకు వ్యతిరేకంగా వుందని, మత పరమైన, ఆస్తి హక్కులను ఉల్లంఘిస్తోందని పిటిషన్ పేర్కొంది. ఇతర మతపరమైన నిధుల పాలనలో భాగం కాని ఆంక్షలను విధించడం ద్వారా ముస్లింలపై ఈ ప్రతిపాదిత చట్ట నిబంధనలు వివక్షను కనబరుస్తున్నాయని ఆ పిటిషన్ పేర్కొంది. ఉదాహరణకు, హిందూ, సిక్కు మత ట్రస్టులు స్వయం నియంత్రణను కలిగివున్నాయి. కానీ వక్ఫ్ చట్టం, 1995కి సవరణలు చేయడం ద్వారా వక్ఫ్ వ్యవహారాల్లో ప్రభుత్వ జోక్యం పెరుగుతోందని జావేద్ ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రస్తుత రూపంలోని ఈ బిల్లు రాజ్యాంగం మౌలిక అంశమైన సమానత్వపు హక్కు ఆర్టికల్ 14ను ఉల్లంఘిస్తోందన్నారు. ఏ ఏ లక్ష్యాలైతే సాధించాలనుకున్నారో వాటితో ఎలాంటి సహేతుకమైన సంబంధం లేని రీతిలో ఏకపక్ష వర్గీకరణలను ఈ ప్రతిపాదిత బిల్లు ప్రవేశపెట్టిందని జావేద్ పేర్కొన్నారు. మతపరమైన ఆచారాల కాల వ్యవధి ప్రాతిపదికన వక్ఫ్‌ల ఏర్పాటుపై ఆంక్షలను ఈ నిబంధనలు ప్రవేశపెట్టాయన్నారు. కానీ ఇటువంటి కాలపరిమితులు ఇస్లామిక్ చట్టంలో, ఆచారాల్లో లేవన్నారు.

పైగా 25వ అధికరణ కింద మతాన్ని ఆచరించే ప్రాథమిక హక్కును ఉల్లంఘిస్తున్నా యన్నారు. దేశవ్యాప్తంగా విస్తృతంగా చర్చకు దారి తీసిన ఈ వక్ఫ్ సవరణ బిల్లు, 2025పై గురువారం అర్ధరాత్రి దాటేవరకు రాజ్యసభలో చర్చించారు. అనంతరం బిల్లుకు అనుకూలంగా 128 మంది, వ్యతిరేకంగా 95 మంది సభ్యులు ఓటు వేశారు. అంతకుముందు బుధవారం లోక్‌సభలో కూడా సుదీర్ఘ చర్చ అనంతరం ఈ బిల్లుకు ఆమోదం లభించింది.

ముంబయి శివారుల్లో పోషకాహారలేమితో చిన్నారులు

అంగన్‌వాడీ సర్వే వెల్లడి

ముంబయి : మహారాష్ట్ర రాజధాని ముంబయి శివారుల్లో 16,343 మంది చిన్నారులు పోషకాహారలోపంతో బాధపడుతున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించిన ఒక ప్రాథమిక సర్వేలో ఈ విషయం వెల్లడయింది. పోషణ్ ట్రాకర్ యాప్ ప్రకారం ఈ ఏడాది ఫిబ్రవరిలో 2,38,094 మంది చిన్నారులు నమోదయ్యారు. వీరిలో 2,34,896 మంది బరువు, ఎత్తు కొలతలు తీసుకున్నారు. వీరిలో 2,887 మంది చిన్నారులు తీవ్రమైన పోషకాహార లోపంతోనూ, 13,457 మంది మధ్యస్త పోషకాహారలోపంతో బాధపడుతున్నట్లు వర్గీకరించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, కార్యకర్తలు, లబ్ధిదారుల పోషకాహార కార్యక్రమాల పురోగతిని పర్యవేక్షించడానికి, ట్రాక్ చేయడానికి, లోపాలను పరిష్కరించడానికి కేంద్ర మహిళా శిశుసంక్షేమ శాఖ ఈ పోషణ్ ట్రాకర్ యాప్‌ను అభివృద్ధి చేసింది. అభివృద్ధి చెందిన ముంబయి సబర్బన్ వంటి జిల్లాలో పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారుల సంఖ్య ఆందోళన కలిగిస్తోంది. ఈ సమస్యను పరిష్కరించడానికి 10 రోజుల్లో ఒక ప్రణాళికను రూపొందించాలని సంరక్షక మంత్రి ఆశిష్ షెలార్ అధికారులను ఆదేశించారు. ముంబయి సబర్బన్ జిల్లా కలెక్టర్ క్షీర్‌సాగర్, ఇతర అధికారులతో మంత్రి సమావేశం నిర్వహించారు.

చమురు ఉత్పత్తిని పెంచుతున్న ఒపెక్ ప్లస్ దేశాలు

వియన్నా : అంచనాలకు మించి చమురు ఉత్పత్తిని పెంచనున్నట్లు పెట్రోలియం ఎగుమతి దేశాల సమాఖ్య (ఒపెక్), దాని మిత్ర దేశాలు ప్రకటించాయి. మే మాసంలో రోజుకు 4,11,000 బారెళ్ళ చమురు ఉత్పత్తిని పెంచుతున్నట్లు తెలిపింది. ఈ మేరకు ఒపెక్ వెబ్‌సైట్‌లో ప్రకటన వెలువడింది. సౌదీ అరేబియా, రష్యా, ఇరాక్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కువైట్, కజకస్తాన్, అల్జీరియా, ఒమన్‌లతో సహా సభ్య దేశాలు ఆన్‌లైన్‌లో సమావేశమై అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులను సమీక్షించాయని, భవిష్యత్ అవకాశాలను అంచనా వేశాయని ఆ ప్రకటన పేర్కొంది. తొలుత రోజుకు 1,35,000 బారెళ్ళ మేరకు పెంచాలని ఒపెక్ ప్లస్ దేశాలు భావించాయి. ఇటీవలి ఉత్పత్తిలో కోతలను క్రమేపీ తగ్గించడంలో భాగంగా ఉత్పత్తిని ఈ మేరకు పెంచాలని భావించారు. కానీ గ్రూపు తర్వాత తన వ్యూహం మార్చుకుంది. ఆరోగ్యకరమైన మార్కెట్ పరిస్థితులను, సానుకూల మార్కెట్ ధోరణిని ఇందుకు కారణాలుగా పేర్కొంది. తలెత్తే పరిస్థితులకు అనుగుణంగా ఈ పెంపును తగ్గించడమో లేదా కాస్తంత విరామం ఇవ్వడమో జరుగుతుందని కూడా ఆ ప్రకటన తెలిపింది.

హెచ్‌సీయూ గొడవ వెనక కేటీఆర్ హస్తం

- కాంగ్రెస్ నేత గజ్జల కాంతం

నవతెలంగాణబ్యూరో్-హైదరాబాద్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూముల గొడవ వెనక మాజీ మంత్రి కేటీఆర్ హస్తం ఉందని కాంగ్రెస్ నేత గజ్జల కాంతం తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బిల్లిరావుతో కేటీఆర్ వెయ్యి కోట్ల ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. ఆ విషయం వెలుగులోకి వస్తుందనే భయంతోనే లక్షలు ఖర్చు పెట్టి తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అంతేకాకుండా ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొంత మందిని రెచ్చగొట్టి గొడవలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. కంచె గచ్చిబౌలి 400 ఎకరాల భూములకు, విద్యార్థులకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. యూనివర్సిటీ విద్యార్థులకు కేటీఆర్ డబ్బులు ఇచ్చి రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని బదనాం చేస్తున్నారని విమర్శించారు. విద్యార్థులంతా కేటీఆర్, హరీశ్‌రావు మాటలు నమ్మి మోసపోవద్దని ఆయన సూచించారు.

పదమూడేండ్లైనా బీఆర్ఎస్ అధికారంలోకి రాదు

ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మెన్ మెట్టు సాయికుమార్

మూడేండ్ల తర్వాత తామే అధికారంలోకి వస్తామంటూ మాజీ మంత్రి కేటీఆర్ కలలు కంటున్నారని ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మెన్ మెట్టు సాయికుమార్ ఎద్దేవా చేశారు. మూడేండ్లు కాదు...పదమూడేండ్లైయినా బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రాదని స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. పదేండ్లలో బీఆర్ఎస్ చేసిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావని చెప్పారు. 'రాసుకుంటే రామకోటి...చెప్పుకుంటూ పోతే రామాయణం' అన్నారు. కేటీఆర్ పదేపదే అబద్ధాలను చెప్పి నిజాలుగా నమ్మించే దుర్మార్గమైన ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండు ఒకే స్క్రిప్ట్ ఫాలో అవుతున్నాయని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పదేండ్ల దుర్మార్గాన్ని, అక్రమాలను బహిర్గతం చేస్తామన్నారు.

రైతు విత్తన హక్కును కాపాడండి : సీఎస్‌కు రైతు కమిషన్ విజ్ఞప్తి

రైతు విత్తన హక్కులను కాపాడాలంటూ రైతు సంక్షేమ కమిషన్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని కోరింది. ఈమేరకు శుక్రవారం సచివాలయంలో సీఎస్‌కు కమిషన్ చైర్మెన్ కోదండరెడ్డి లేఖ అందజేశారు. విత్తనం, వ్యవసాయ మార్కెట్ చట్టాల్లో వెంటనే సవరణలు చేయాలని కోరారు. ములుగు సంఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలని కోరారు. ఇటీవల ములుగు జిల్లాలో మొక్కజొన్న విత్తనాలతో తీవ్రంగా నష్టపోయిన గిరిజన రైతుల సంఘటన నేపథ్యంలో తీసుకోవాల్సిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ శాఖ పేరును 'వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖ'గా మార్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు భవానీరెడ్డి, భూమి సునీల్, వ్యవసాయ శాస్త్రవేత్త రామాంజనేయులు ఉన్నారు.

మత్స్య సొసైటీ అకౌంట్లలో నగదు జమ చేయండి

- 90 శాతం సబ్సిడీతో మత్స్యకారులకు రుణాలివ్వాలి : ప్రభుత్వానికి టీఎంకేఎంకేఎస్ రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉచిత చేపపిల్లల సరఫరాలో అవినీతిని నిర్మూలించడానికి టెండర్లను రద్దు చేసి, మత్స్య సొసైటీ అకౌంట్లలో నగదు జమ చేయాలని అఖిలభారత మత్స్యకారులు మత్స్య కార్మిక సమాఖ్య డిమాండ్ చేసింది. శుక్రవారం హైదరాబాద్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయం లో రాష్ట్ర కమిటీ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహ్మ అధ్యక్షతన జరిగింది. రాష్ట్రంలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఉచిత చేపపిల్లల పంపిణీ, భవిష్యత్ కార్యచరణ తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా అఖిలభారత మత్స్యకారులు, మత్స్య కార్మిక సమాఖ్య జాతీయ కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ మాట్లాడుతూ గత పదేండ్ల కాలంలో రాష్ట్రంలో చేప, రొయ్య పిల్లల పంపిణీలో జరిగిన అవకతలపై న్యాయవిచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది బడ్జెట్‌ను సవరించి మత్స్య పరిశ్రమ అభివృద్ధికి రూ.ఐదు వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

రియల్ ఎస్టేట్ మాఫియా, బడాబాబుల నుంచి చెరువులు కుంటలను రక్షించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఏప్రిల్, మే మాసాల్లో రాష్ట్ర వ్యాప్తంగా మత్స్య సహకార సంఘాలు, చేపల మార్కెట్లలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేయాలని కమిటీ నిర్ణయించిందని తెలిపారు. సర్వేలో వెల్లడైన సమస్యలపై మండల జిల్లా స్థాయిలో ఆందోళనలతో పాటు అధికారులకు వినతి పత్రాలు ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మురారి మోహన్, కార్యదర్శి మునిగల రమేష్, కమిటీ సభ్యులు గాండ్ల అమరావతి, బక్కి బాలమణి, చెన్న వెంకన్న, బి.మధు, మామిండ్ల జగదీష్, చెన్నబోయిన దర్గయ్య, తదితరులు పాల్గొన్నారు

శాంతి భద్రతలు కాపాడటంలో సర్కార్ విఫలం

- బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడటంలో రేవంత్ సర్కార్ ఘోర వైఫల్యం చెందిందని బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజుల్లోనే నలుగురు మహిళలపై లైంగికదాడి ఘటనలు జరిగాయని గుర్తు చేశారు. మేడ్చల్ ఎంఎంటీఎస్ మహిళా బోగి, సంగారెడ్డి కంది, నాగర్‌కర్నూల్ జిల్లాతో పాటు జర్మనీ మహిళపై పహాడీ షరీఫ్‌లో లైంగిక దాడి జరిగిందని వివరించారు.

వరుసగా జరుగుతున్న ఘటనలతో మహిళలు ఒంటరిగా బయటకు రావడానికి భయపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రే హోం మంత్రిగా ఉన్న ఈ రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. శాంతి భద్రతలను గాలికొదిలేసిన పోలీసులు తెలంగాణ భవన్ చుట్టూ తిరుగుతూ బీఆర్ఎస్ నాయకులు, సోషల్ మీడియా వారియర్లపై కేసులు పెట్టే పనిలో బిజీగా ఉన్నారని ఎద్దేవా చేశారు.

ఆధార్ బేస్డ్ అటెండెన్స్ సిస్టమ్‌ను ఉపసంహరించుకోవాలి

- టీయూఎంహెచ్ఇయూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆధార్ బేస్డ్ అటెండెన్స్ సిస్టమ్‌తో ఇబ్బందులున్నాయనీ, దానిని వెంటనే ఉప సంహరించుకోవాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీయూఎంహెచ్ఇయూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు భూపాల్, రాష్ట్ర అధ్యక్షులు ఎండీ ఫసియొద్దీన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదానాయక్, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.కుమారస్వామి వైద్యారోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ డాక్టర్ క్రిస్టినా జెడ్ చొంగ్తూకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రధానంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, యూపీహెచ్‌సీ, బస్తీ దవాఖానాల ఉద్యోగుల వివరాలు తీసుకుంటున్నట్టు చెప్పారు. దీంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ముఖ్యంగా ఫీల్డ్‌వర్క్ డ్యూటీలు చేస్తున్న వారు ఆచరణలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.

ఆరోగ్య సిబ్బంది దృష్టి ప్రజల ఆరోగ్యంపై కాకుండా బయోమెట్రిక్‌పై దష్టి కేంద్రీకృతమై ఉంటుందన్నారు. ఆరోగ్య సిబ్బంది బుధ, శని వారాల్లో హెడ్ క్వార్టర్స్‌లో అటెండెన్స్ వేసి పీహెచ్‌సీల్లో వ్యాధి నిరోధక టీకాలు తీసుకుని సెంటర్లకు వెళ్లడానికి కష్టమవుతుందని తెలిపారు. మంగళ, శుక్రవారాల్లో ఉదయం 7 గంటలకే డ్రై డే నిర్వహించడానికి ఇబ్బంది అవుతుందని వివరించారు. అనేక పనులు ఆన్‌లైన్ కావడం వల్ల వాటిపై కేంద్రీకరించాల్సి ఉంటుందనీ, ఫోన్ బ్యాలెన్స్, నెట్ సౌకర్యం, మారుమూల ప్రాంతాలకు రవాణా సౌకర్యంలో ఇబ్బందులు, సమయానికి వేయాలనే ఆత్రం వల్ల మహిళా ఉద్యోగులు ఆందోళన చెంది అనారోగ్యానికి గురవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో పని చేసే సిబ్బంది సమస్యలను ప్రధానంగా దృష్టిలో పెట్టుకోవాలని వారు కోరారు. ప్రభుత్వం పునరాలోచించి ఈ వ్యవస్థను ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పెండింగ్‌లో ఉన్న రూ.219 కోట్ల ట్రైకార్ రుణాలివ్వాలి

ఈ నెల 7న ఛలో గిరిజన సంక్షేమ భవన్

గిరిజన సంఘాల జేఏసీ పిలుపు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పెండింగ్‌లో ఉన్న రూ.219 కోట్ల ట్రైకార్ రుణాలను లబ్దిదారులకు వెంటనే ఇవ్వాలని గిరిజన సంఘాల జేఏసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాంనాయక్, తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ అంజయ్య నాయక్, టీజీఎస్ అధ్యక్షులు ఎం ధర్మానాయక్ అధ్యక్షతన విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ట్రైకార్‌లో 2019-21 సంవత్సరాల్లో ట్రైకార్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులను సుమారు 30వేల మందిని గుర్తించి వారికి రుణాలు అందించేందుకు చెక్కులను రెడీ చేసి బ్యాంకులో డబ్బులు వేయకుండా గత ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వాటిని విడుదల చేస్తామనీ, కొత్త రుణాలు కూడా ఇస్తామంటూ వాగ్దానం చేసిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చినంక ఆ ఊసే లేదని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తోవలోనే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా గిరిజనులను మోసం చేయాలని చూస్తే పోరాటం తప్పదని హెచ్చరించారు. ఈ నెల ఏడున చలో గిరిజన సంక్షేమ భవన్ కార్యక్రమాన్ని శాంతి యుతంగా నిర్వహిస్తున్నామని ప్రకటించారు. రాజీవ్ యువ వికాసం పేరుతో నూతన పథకాన్ని రాష్ట్రప్రభుత్వం హడావిడిగా ప్రారంభించటం వల్ల ట్రై కార్ సంస్థ పూర్తిగా నిర్వీర్యమవుతుందనే అనుమానాలున్నాయన్నారు. గత ప్రభుత్వం ట్రైకార్ సంస్థ ద్వారా 2019-2021 సంవత్సరాల్లో గిరిజన యువతీ, యువకుల నుంచి వేలాది దరఖాస్తులను స్వీకరించిందని తెలిపారు. 30 వేల మందికి రుణాలను మంజూరు చేస్తూ లబ్దిదారులుగా గుర్తించిందన్నారు. వీరి బ్యాంకు ఖాతాల్లో జమ చేయటానికి రూ. 219 కోట్లకు చెక్కులను రెడీ చేసి క్లియరెన్స్ కోసం ఆర్థిక శాఖకు పంపిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకొచ్చిన వెంటనే ఇస్తామని హామీ ఇవ్వడంతో లబ్దిదారులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఆ రుణాల మంజూరుకు కాలయాపన చేయటం చూస్తుంటే..లబ్దిదారుల లిస్టునే రద్దు చేయాలనే కుట్ర చేస్తుందనే అనుమానాలున్నాయని చెప్పారు. దీంతో లబ్దిదారుల్లో తీవ్ర ఆందోళన కలుగుతోందని తెలిపారు. వీరందరూ రాజీవ్ యువ వికాసం పథకంలో రుణాల కోసం కొత్తగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి వెళితే ఇప్పటికే రుణాలు తీసుకున్నట్టు చూపిస్తూ ఆన్‌లైన్ దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయని తెలిపారు. దీంతో వేలాది మంది గిరిజన యువత రాజీవ్ యువ వికాసం పథకంలో రుణాలు పొందకుండా అనర్హులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షల మంది యువతకు రుణాలు ఇవ్వడమే లక్ష్యంగా రాజీవ్ యువ వికాసం పేరుతో నూతన పథకాన్ని ప్రారంభించిందనీ, గత 50ఏండ్లుగా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ట్రైకార్ ద్వారా యువతీ, యువకులకు రుణాలు మంజూరు చేస్తున్నారని అటువంటి ట్రైకార్ సంస్థను నిర్వీర్యం చేయడానికే రాజీవ్ యువ వికాసం పథకంలో విలీనం చేసిందని ఆరోపించారు. ట్రై కార్ సంస్థలో యూనిట్ కాస్ట్ 50 వేలనుండి రూ.10 లక్షల వరకు రుణం పొందే అవకాశం ఉండగా రాజీవ్ యువ వికాసంలో రూ.నాలుగు లక్షల వరకే రుణ సౌకర్యాలు కల్పించడం అన్యాయమన్నారు.

రైలులో బాలికపై లైంగిక వేధింపులు

వాష్‌రూమ్‌కు వెళ్లిన బాలికను వీడియో తీసిన నిందితుడు

అరెస్టు చేసిన పోలీసులు

నవతెలంగాణ-బేగంపేట్

ఇటీవల ఎంఎంటీఎస్ రైలులో ఓ యువతితో వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటన మరవకముందే అలాంటి ఘటనే మరొకటి జరిగింది. కదులుతున్న రైలులో ఓ బాలికను దుండగుడు లైంగికంగా వేధించాడు. వాష్‌రూమ్‌కు వెళ్లినప్పుడు సెల్‌ఫోన్ ద్వారా వీడియో చిత్రీకరించాడు. ఈ దారుణ ఘటన ఒడిశా నుంచి సికింద్రాబాద్ వస్తున్న రైలులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఒడిశాకు చెందిన ఓ వ్యక్తి భార్యాపిల్లలతో కలిసి రక్సెల్-సికింద్రాబాద్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో సికింద్రాబాద్‌కు బయలుదేరాడు. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో అతని కుమార్తె (12 ఏండ్ల బాలిక) రైలులో వాష్‌రూమ్‌కు వెళ్లింది. అయితే, అదే బోగీలో తలుపు దగ్గర ఉన్న ఓ వ్యక్తి అది గమనించి బాలిక నోరు నొక్కి బలవంతంగా వాష్‌రూంలోకి లాక్కెళ్లి లోపలి నుంచి గడియపెట్టాడు. అనంతరం ఆమెపై దాదాపు అరగంటపాటు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఆ దుశ్చర్యను వీడియో తీశాడు. ఈ విషయాన్ని బయటకు చెబితే చంపేస్తానంటూ ఆ బాలికను బెదిరించి వదిలేశాడు. బాలిక బయటకు వచ్చిన వెంటనే తల్లిదండ్రులకు చెప్పి ఏడ్చింది. దాంతో బాలిక తండ్రి దుండగున్ని పట్టుకుని అతన్ని సెల్‌ఫోన్‌ను పరిశీలించగా వీడియోలు బయటపడ్డాయి. వెంటనే విషయాన్ని రైలులోని టీసీకి, పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం రైల్వే టోల్ ఫ్రీ నెంబర్ 139కు ఫోన్ చేసి చెప్పారు. గురువారం ఉదయం రైలు సికింద్రాబాద్‌కు చేరుకున్నాక బాలిక తండ్రి రైల్వే పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ ఘటన కేల్జార్ రైల్వే స్టేషన్ దాటుతున్న సమయంలో జరిగినట్టు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు నిందితుడిపై ఫోక్సోతో పాటు పలు సెక్షన్ల కింద జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సికింద్రాబాద్ రైల్వే పోలీసులు ఈ కేసును కేల్జార్‌కు బదిలీ చేయనున్నట్టు తెలిసింది.

రాహుల్ చేతికే హెచ్‌సీయూ రక్తపు మరకలు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో కుక్కల దాడిలో ఓ జింక ప్రాణాలు కోల్పోయిన ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఆ రక్తపు మరకలు కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేతికే అంటాయని కేటీఆర్ పేర్కొన్నారు. "అత్యాశతో కూడిన కాంగ్రెస్ ప్రభుత్వం జింకలకు నెలవైన కంచ గచ్చిబౌలి భూములను ధ్వంసం చేసింది. దీంతో ఆ ప్రాంతంలో కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తూ జింకను చంపాయి. కంచ గచ్చిబౌలి మినీ ఫారెస్ట్‌ను రేవంత్ రెడ్డి సర్కార్ ధ్వంసం చేయడం వల్ల విలువైన వృక్ష, జంతుజాలం నష్టపోయింది" అని కేటీఆర్ పేర్కొన్నారు. వన్యప్రాణుల దారుణ హత్యపై దృష్టి సారించాలని సుప్రీంకోర్టును అభ్యర్థిస్తున్నట్టు కేటీఆర్ తెలిపారు.

చివరి వారంలో టెన్త్ ఫలితాలు!

7 నుంచి 19 కేంద్రాల్లో మూల్యాంకనం ప్రారంభం

ముగిసిన పది పరీక్షలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పదోతరగతి పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. గతనెల 21న ఈ పరీక్షలు ప్రారంభమైన విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా 5,09,403 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఈనెల ఏడో తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా 19 కేంద్రాల్లో జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈనెల 15 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. ఈనెల చివరి వారంలో పదో తరగతి ఫలితాలు విడుదల అయ్యే అవకాశమున్నది.

ముగ్గురు విద్యార్థుల గైర్హాజరు

పదో తరగతి వార్షిక పరీక్షల్లో భాగంగా చివరి రోజు శుక్రవారం ఓఎస్ఎస్‌సీ పేపర్-2 పరీక్షను నిర్వహించామని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 97 మంది విద్యార్థులు దరఖాస్తు చేశారనీ, 94 (96.91 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. ముగ్గురు విద్యార్థులు (3.09 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఒక్క విద్యార్థిపై కూడా మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని తెలిపారు. ఈ పరీక్షను ప్రశాంతంగా నిర్వహించామని పేర్కొన్నారు.

ప్రభుత్వానికి, మావోయిస్టుల మధ్య శాంతి చర్చలు జరగాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ప్రభుత్వానికి, మావోయిస్టులకు మధ్య శాంతి చర్చలు జరగాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. శాంతి చర్చలు జరిగితే పౌర సమాజానికి, దేశానికి మేలు జరుగుతుందన్నారు. పీస్ డైలాగ్ కమిటీ (శాంతి-చర్చల కమిటీ) ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'కేంద్ర ప్రభుత్వానికి, మావోయిస్టు పార్టీకి మధ్య చర్చలు' అనే అంశంపై రిటైర్డ్ జస్టిస్ బి.చంద్రకుమార్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొ.జి.హరగోపాల్ మాట్లాడుతూ.. నాడు రాజ్యం అమాయక పౌరులను కాల్చి చంపి బూటకపు ఎన్‌కౌంటర్లుగా చిత్రీకరించిందని ఆరోపించారు. నేడు ఛత్తీస్‌గఢ్‌లోని ఆదివాసీల ఆధీనంలో ఉన్న ఖనిజ సంపదను దోచుకోవడానికి మావోయిస్టు పేరుతో అమాయకులైన ఆదివాసీలను రాజ్యం హత్యలు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేట్ సంస్థలకు ఖనిజ సంపదను దోచిపెట్టడం కోసమే కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా 2026 నాటికి మావోయిస్టులను నిర్మూలిస్తామని పార్లమెంట్ వేదికగా ప్రకటించారని అన్నారు. నక్సలిజాన్ని నిర్మూలిస్తామనే హక్కు రాజ్యానికి లేదన్నారు. ఛత్తీస్‌గఢ్ సీఎం, కేంద్ర హోం శాఖ మంత్రి కలయిక చర్చలకు ఆమోదిస్తారా అన్న విషయం అనుమానంగా ఉందన్నారు. చర్చలు ప్రభుత్వం చేస్తుందో లేదో తెలియదు కానీ పౌర సమాజం, మేధావులు, కవులు సమాజంలోకి లోతుగా తీసుకువెళ్లినప్పుడే శాంతి చర్చలు జరిగే అవకాశం ఉందన్నారు.

ప్రెస్ అకాడమీ మాజీ చైర్మెన్ అల్లం నారాయణ మాట్లాడుతూ.. ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న పరిణామాలు, తీవ్ర నిర్బంధం నేపథ్యంలో చర్చల ప్రతిపాదన వస్తున్నదని చెప్పారు. దేశంలో ప్రజాస్వామ్య వాతావరణం వస్తుందనే ఒక ప్రయత్నం మాత్రమే చేస్తున్నామని, దీనిని మధ్యవర్తులుగానే చూద్దామని అన్నారు. ప్రభుత్వంతో చర్చలు జరగాలని కోరారు. కాల్పుల విరమణ మాత్రమేనని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రకటించిందని గుర్తు చేశారు. ప్రముఖ పాత్రికేయులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టులతోపాటు ఆదివాసీలు, సామాన్యులు ఎన్‌కౌంటర్లకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివాసీల ప్రాణాలను రక్షించేందుకు శాంతియుత చర్చలు జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో సాధినేని వెంకటేశ్వర్‌రావు, జీవన్, గాదె ఇన్నయ్య, చంద్రశేఖర్, ప్రొఫెసర్ తిరుమల్, బాలకిషన్‌రావు, తిరుపతి, ప్రొఫెసర్ వినాయక్ రెడ్డి, ప్రొఫెసర్ అన్వర్ ఖాన్ తదితరులు మాట్లాడారు.

కొనసాగుతున్న ఫార్మా భూములకు ఫెన్సింగ్

మేడిపల్లిలో అడుగడుగునా చెక్‌పోస్టులు

రైతులు గుమ్మిగూడకుండా చర్యలు

ఫార్మా పనులను అడ్డుకోవాలని మేడిపల్లిలో డప్పు చాటింపు

నవతెలంగాణ-యాచారం

రంగారెడ్డి జిల్లా యాచారం మండల పరిధిలోని ఫార్మాసిటీ గ్రామమైన మేడిపల్లి నక్కర్తలో రెండోవ రోజు ఫార్మా భూములకు టీఎస్ఐఐసీ అధికారులు తమ సిబ్బందితో ఫెన్సింగ్ వేశారు. గ్రామంలో అడుగడుగునా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి పనులు చేపట్టారు. ఈ పనులకు బాధిత రైతుల నుంచి ఎలాంటి ఆటంకం కలగకుండా పోలీసులు పహారా కాస్తున్నారు. మేడిపల్లి నక్కర్తలోని ఫార్మా భూములకు ఫెన్సింగ్ పనులు అధికారులు గురువారం చేపట్టారు. ఆర్డీఓ, తహసీల్దార్ సమక్షంలో రెవెన్యూ సిబ్బంది ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అయితే ఈ పనులను రైతులు అడ్డుకోగా.. వారిని అరెస్టు చేశారు. ఇదిలా ఉంటే శుక్రవారం కూడా ఫెన్సింగ్ పనులు కొనసాగించి ఫార్మాకు తీసుకున్న భూముల్లో హద్దురాళ్లను ఏర్పాటుచేశారు. బాధిత రైతులు, ఆందోళనకారులు ఎవరూ కూడా అడ్డు చెప్పకపోవడంతో పోలీసు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. సరికొండ, నానక్‌నగర్ రోడ్లల్లో పోలీసులు చెక్ పోస్టులు ఏర్పాటు చేసి ఆందోళనకారులపై నిఘా పెంచారు. వ్యవసాయ పొలాలకు వెళ్లే రైతులను చెక్ చేశారు. అయితే ఫార్మా పనులను అడ్డుకోవాలని మేడిపల్లిలో డప్పు చాటింపు వేయించారు. అలాగే ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట సంఘం నాయకులు.. కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్, ఇబ్రహీంపట్నం ఏసీపీని కలిసి మెమోరాండం అందజేసినట్టు సమాచారం. గ్రామంలో ఇబ్రహీంపట్నం ఏసీపీ కేవీపీ రాజు, హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు సమక్షంలో భద్రతను కట్టుదిట్టం చేశారు.

రాష్ట్ర ప్రగతిలో యువత భాగస్వామ్యం కావాలి

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

హనుమకొండ జిల్లా పరకాలలో మెగా జాబ్ మేళా



నవతెలంగాణ-పరకాల

రాష్ట్రప్రగతిలో యువత భాగస్వామ్యం కావాలని ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు యువతకు పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండ జిల్లా పరకాలలోని లలిత కన్వెన్షన్ హాల్‌లో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు మెగా జాబ్‌మేళా నిర్వహించగా మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించ కుండా యువశక్తిని నిర్వీర్యం చేసిందన్నారు. అందుకు భిన్నంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే 57వేల ఉద్యోగావకాశాలు కల్పించినట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు అండగా నిలిచి వారిని స్వశక్తితో తీర్చిదిద్దేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలిపారు. సీఎం దీనిపై దృష్టి పెట్టి నిరుద్యోగ యువతీ యువకులకు నైపుణ్య శిక్షణా విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించి నట్టు చెప్పారు. రాష్ట్రంలోకి పెట్టుబడులు రావాలి, పరిశ్రమలు ఏర్పడాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుంటే బీఆర్ఎస్, బీజేపీ.. హైదరాబాద్ కేంద్రంగా ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటును అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని హెచ్‌సీయూ భూముల వ్యవహారంపై తనదైన శైలిలో స్పందించారు. ఈ జాబ్ మేళా.. యువతకు వేదికలాంటిదని, దీన్ని ఉపయోగించుకొని తమ నైపుణ్యాన్ని పెంచుకోవాలని యువతకు సూచించారు. కాగా, ఈ జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులకు మంత్రి, ఎమ్మెల్యేల చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కె.ఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావిణ్య, సత్య శారద, జీడబ్ల్యూఎంసీ కమీషనర్ అశ్విని తానాజీ వాంకడే, కుడా చైర్మెన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, అదనపు కలెక్టర్లు వెంకటరెడ్డి, సంధ్యారాణి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సెల్ టవర్ నిర్మాణం ఆపాలి

మున్సిపల్ ఎదుట మహిళలు, పిల్లల ఆందోళన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సెల్ టవర్ నిర్మాణం వల్ల అనేక అనార్థాలున్నాయని, దాన్ని తమ కాలనీలో ఏర్పాటు చేయొద్దని ఆదిలాబాద్ పట్టణంలోని జుబ్లిహిల్స్ కాలనీ వాసులు డిమాండ్ చేశారు. సెల్ టవర్ నిర్మాణంపై మున్సిపల్ కమిషనర్ శుక్రవారం పబ్లిక్ హియరింగ్ ఏర్పాటు చేసినా టవర్ ప్రతినిధులు ఎవరూ రాకపోవడంతో కాలనీవాసులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మహిళలతోపాటు పిల్లలూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ, టవర్ నిర్మాణానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జీఓ నెం.5 ప్రకారం స్కూళ్లు, దేవాలయాలు, నివాస ప్రాంతాల సమీపంలో సెల్ టవర్ నిర్మాణం చేయకూడదన్నారు. తమ కాలనీలో టవర్ నిర్మాణాన్ని ఆపాలని కోరారు. గతంలో అధికారులను కలిసి విన్నవించినా ఫలితం లేదని, తాము వ్యతిరేకిస్తున్నా సెల్ టవర్ నిర్మాణం చేయడానికి యత్నిస్తు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కలిసిన ఎలాంటి ఫలితం లేకుండా పోయిం దన్నారు. టవర్ నిర్మాణ అనుమతులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అబ్దుల్లాపూర్‌మెట్‌లో బర్డ్ ఫ్లూ

18 వేల కోళ్లు మృత్యువాత

17 వేలకు పైగా పూడ్చివేత

వెటర్నరీ వైద్యుల పర్యవేక్షణలో పరిశీలన



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

హైదరాబాద్ శివారులోని అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో బర్డ్ ఫ్లూ కలకలం రేపింది. అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలో ఉన్న ఓ పౌల్ట్రీ ఫామ్‌లో ఇటీవల వేల సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడ్డాయి. దాంతో అధికారులు కోళ్ల శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించగా బర్డ్ ఫ్లూ అని తేలింది. పూర్తి వివరాల్లోకెళ్తే.. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, బాటసింగారం గ్రామంలోని ఓ కోళ్ల ఫారంలో ప్రతి రోజూ కోళ్లు మృత్యువాతపడుతున్నాయి. 18 వేల కోళ్లు చనిపోవడంతో అనుమానం వచ్చిన రైతు గత నెల 23న స్థానిక వెటర్నరీ డాక్టర్ సిహెచ్. నర్సింహారావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన రంగారెడ్డి జిల్లా పశువైద్య పశు సంవర్ధక శాఖ అధికారి డా.బాబు భేరికి సమాచారమిచ్చారు. వెంటనే ఆయన ఘటన స్థలానికి చేరుకొని మృత్యువాతపడిన కోళ్ల శరీర భాగాలను హైదరాబాద్ శాంతి నగర్‌లోని వీబీఆర్ఐ (వెటర్నరీ బయోలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్)కు తరలించారు. అనంతరం రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు సమాచారం ఇచ్చి, 24న బర్డ్ ఫ్లూ నిర్ధారణ కోసం భోపాల్‌లోని పరిశోధనా కేంద్రానికి కోళ్ల భాగాలను పంపారు. కోళ్లకు బర్డ్ ఫ్లూ ఉన్నట్టు 29న ఫలితం వచ్చింది. వెంటనే అప్రమత్తమైన హైదరాబాద్‌లోని పశుసంవర్ధక శాఖ అధికారులు బాటసింగారం కోళ్ల ఫామ్‌లో ఉన్న 17,520 కోళ్లను విడతల వారీగా చంపి పూడ్చి పెడుతున్నారు. శనివారం కూడా ఈ ప్రక్రియ కొనసాగనున్నట్టు అధికారులు తెలిపారు. ముందు జాగ్రత్తగా ఫామ్ మొత్తం పూర్తిస్థాయిలో శానిటేషన్ చర్యలు చేపట్టినట్టు తెలిపారు. కోళ్ల ఫామ్ నిర్వహణపై రైతులకు పలు సూచనలు చేశామన్నారు. వెటర్నరీ డాక్టర్ ఆనంద్‌రెడ్డి, డా.శాంతిబాబు, డా. ఉమాకాంత్, డా.విజయ్ కుమార్ రెడ్డి, డా.తిరుపతి రెడ్డి, డా. భాను నాయక్, డా.శేఖర్, రంగారెడ్డి జిల్లా పశువైద్య పశుసంవర్ధక శాఖ సిబ్బంది తదితరులు పరిశీలించారు.

కోళ్లకు మూడు నెలలు బర్డ్ ఫ్లూ టెస్టులు

బర్డ్ ఫ్లూ వైరస్ సోకిన ప్రాంతం నుంచి 10 కిలోమీటర్ల వరకు వివిధ గ్రామాల్లో ఉన్న కోళ్ల ఫారాలపై సుమారుగా మూడు నెలలుపాటు వైరస్ నెగటివ్ వచ్చే వరకు టెస్టులు చేయనున్నట్టు వెటర్నరీ డాక్టర్లు తెలిపారు. మండల పరిధిలో 34 లేయర్ ఫామ్‌లు ఉండగా, అందులో 25 నుంచి 30 లక్షల వరకు కోళ్లు ఉండొచ్చని అంచనా వేశారు. వైరస్ ప్రబలకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకుంటున్నామని చెప్పారు.


అధిక ఉష్ణోగ్రతలో ఉడికించిన తర్వాత చికెన్ తినాలి

వెటర్నరీ డాక్టర్ సిహెచ్.నరసింహారావు

అత్యధిక ఉష్ణోగ్రతలో ఉడికించిన తర్వాత చికెన్ తినాలని వెటర్నరీ డాక్టర్ సిహెచ్.నరసింహారావు సూచించారు. అధికంగా వేడి చేయడం వల్ల బర్డ్ ఫ్లూ వైరస్ పూర్తిగా చనిపోతుందని తెలిపారు. మండలంలో 34 లేయర్ ఫామ్స్‌లో ఎప్పుడికప్పుడూ పర్యవేక్షణ కొనసాగుతుందన్నారు. ఫారంలో అధికంగా కోళ్లు చనిపోతే వెటర్నరీ డాక్టర్ల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

కార్యకర్త ప్రాణాలను కాపాడిన ఎమ్మెల్యే

సీపీఆర్ చేసి పునర్జీవం పోసిన డాక్టర్ తెల్లం



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ప్రజా ప్రతినిధిగా నిరంతరం ప్రజా క్షేత్రంలో పనిచేస్తున్నప్పటికీ తన వైద్య వృత్తిని వీడకుండా అవకాశం ఉన్నప్పుడల్లా వృత్తిలో తన ప్రతిభను చూపిస్తూ ప్రజా వైద్యుడిగా తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. శుక్రవారం కాంగ్రెస్ కార్యకర్త అస్వస్థతకు గురై ప్రాణాపాయ స్థితిలో ఉండగా సీఆర్పీ చేసి పునర్జీవాన్ని కల్పించారు. వివరాల్లోకి వెళితే.. శుక్రవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటన సందర్భంగా స్థానిక నాయకులు రసూల్ ఇంట్లో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి పార్టీ కార్యకర్త తోటమల్ల సుధాకర్ వచ్చాడు. ఈక్రమంలో తీవ్ర అస్వస్థతకు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. వెంటనే స్పందించిన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు తన వైద్య పరిజ్ఞానంతో సీపీఆర్ చేసి కార్యకర్త ప్రాణాలను కాపాడారు. అనంతరం తన సొంత ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్య సేవలు అందించారు. గతంలో సైతం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించి తన వాహనంలో ఆస్పత్రికి తరలించిన సంగతి తెలిసిందే. అత్యవసర పరిస్థితుల్లో గర్భిణులకు వైద్య సేవలు అందించిన విషయం విదితమే.